UNIVERSAL LIBRARY
OU_204851
UNIVERSAL LIBRARY

OUP—881—5-8-74—15,000.

OSMANIA UNIVERSITY LIBRARY

Call No. T81/525V Accession No. T290

Author

Title

This book should be returned on or before the date last marked below.

శ్రీరస్తు.

విక్రమార్క చరిత్రము

జక్కనమహాకవికృతము.

చెన్నపురి :

వావిళ్ల. రామస్వామి శాస్త్రులు అండ్ సన్స్ వారిచే

ప్రకటితము.

పీఠిక.

"విశ్వశ్రేయః కావ్యం త దదోషౌ పరిష్కృతౌ చ వాగర్థౌ,
సా వ్యాఖ్యా రసవ్యుత్పత్తి స్సాధ్యో హి రసో యథాతథం కవిభిః."

మన భరతఖండమున సంస్కృతేతరము లగుభాష లెన్నియో కలవు. సాధారణముగ నాభాష లన్నింటిలోఁ గొంచెముగనో గొప్పగనో సంస్కృతపదములు గలిసియున్నవని మూఁటికి ముమ్మాటికి నిరాఘాటముగ నిరాటంకముగఁ జెప్పవచ్చును. అందుచే గీర్వాణభాషయందుఁ జక్కనిపరిచయము గలవారలకు వారి దేశభాషలోఁ బాండిత్యము గలిగియుండు ననుకొనుటయుఁ గలదు.

సంస్కృతభాషాకోవిదుఁ డయి, కర్ణాటకాదిభాషలయందుఁ బ్రచండపాండిత్యము గలిగి, కవిరాజును, ప్రభువతంసమును, రసికాగ్రేసరుండును నగుశ్రీకృష్ణదేవరాయలవారు

తెలుఁ గదేల యన్న దేశంబు తెలుఁ గేను
దేశభాషలందుఁ దెనుఁగు లెస్స.

అని తన యాముక్తమాల్యదయందుఁ జెప్పియున్నాఁడు. ఆంగ్లేయుల తాత్పర్యముగూడఁ బశ్చిమదేశములయందు వాడఁబడు భాషలలో నిటలీభాషవలె భరతఖండమున వెలయు బాసలలోఁ దెలుంగు బాస ముద్దుల మూటగట్టుచుండు ననియే బహుభాషాభిజ్ఞులయి, ప్రసిడెన్సికాలేజిలో సంస్కృతపండితులు (ప్రొఫెసర్) నయిన మ. రా. శ్రీ ఎమ్. శేషగిరి శాస్త్రులుగారు ఆంధ్రశబ్దతత్త్వ మనుగ్రంథమును వ్రాయుచుఁ బీఠికలో

"తెనుఁగు ద్రావిడభాషలలో మిక్కిలి సుందరమయినది. కావ్యాలంకారపురాణా ద్యనేకవిషయములలోను జ్ఞానప్రదములయిన బహుగ్రంథములు గలిగి విద్యాభ్యాసవ్యవహారములకు మిగుల నుపయోగమయిన దని యందఱకును జక్కఁగాఁ దెలిసియున్నది" అని వ్రాసి

యున్నారు. దీనింబట్టి యీకాలమునందును బహుభాషాభిజ్ఞు లయి సరసమతులును నిష్పక్షపాతులును నగు వారియాశయ మీయాంధ్రభాష సుందర మగునది యనియే యని స్పష్టమగుచుండలేదా!

ఈభాషయందుఁ బురాతనకాలమునుండి నన్నయభట్టారక తిక్కయజ్వ శంభుదాసాదిమహాకవులు పెక్కండ్రు సంస్కృతమునుండి యితిహాసపురాణాదులఁ బరివర్తనముచేసియు, నూతనకథలం గల్పించియుఁ బెక్కు ప్రబంధముల రచించి రాజన్యసభాభూషణులై శాశ్వత కీర్తిని గాంచిరి. వారిగ్రంథములు నేటివఱకును బఠనపాఠనములఁ బ్రఖ్యాతిఁ గాంచి వారిబుద్ధి చమత్కృతిజ్ఞానవిశేషముల వెల్లడిసేయుచు నాబాలగోపాలవిదితము లయి యున్నవి.

అట్టిమహాకవులలోఁ జక్కన యనువిద్వత్కవి ప్రఖ్యాతిఁ గాంచె. జక్కన పేరయామాత్యుని కొడుకు. పెద్దయామాత్య సత్కవి మనుమఁడు. ఇక్కవి విక్రమార్కచరిత్రమును బద్యకావ్యముగా రచించెను. క్రీస్తుశకము 1430 తరువాత 1447 సంవత్సరమునకుఁ బూర్వ మీకావ్యము చేయఁబడినట్లు కవిచరిత్రమునందు వ్రాయఁబడియున్నది, కాఁబట్టి యిమ్మహాకవి నేటికి రమారమి 480 సంవత్సరముల క్రిందట నున్నవాఁ డని స్పష్టమగుచున్నది.

విక్రమార్కచరిత్ర మెనిమిది యాశ్వాసములును 1514 పద్యములును గలిగి విక్రమార్కమహీపాలకలాధరుని నిరుపమాన దివ్యమహిమలను గీర్తించునది యై యున్నది. భారత భాగవత రామాయణాది గాథ లెట్లు సకలజనవిదితములుగ నున్నవో యట్లే విక్రమార్కమహీపాలు కథలు నాబాలగోపాల విదితము లనుట నిర్వివాదాంశము. ఐనను విక్రమార్క మహీజాని రామాయణాదిగ్రంథములలోఁ బేర్కొనఁబడిన మహాపురుషులవలె కేవలపురాణవేద్యుఁడు గాక యిక్కాలపు దేశచరిత్రమునందుఁ బ్రసిద్ధుఁడైనమహాపురుషుఁడు. ఈరాజుకథలు అక్షరాస్యులు గానివారుకూడఁ జెప్పుచుందురు. ఈతన్నృపతి రాజ్యము భరతఖండమునఁ బశ్చిమోత్తరభాగమునం దుండినను వీరిగాథలుమాత్ర మాసేతు

శీతాచలమునఁ బ్రతిగృహమునందును బ్రసిద్ధము లనుట యొకవింత సంగతికాదు.

జక్కన విద్వత్కవిచంద్రుఁడు. ఈతనికవిత్వ మతిప్రౌఢముగనుండును. సంస్కృతాంధ్రపదములను సమానముగ వాడియున్నాఁడు. ఒక్కొక్కచోట గంభీరార్థప్రతిపాదకము లగుసంస్కృతపదములను, ఒక్కొక్కతావున ముద్దులు గులుకుతెనుఁగుపదములను వెదఁజల్లియున్నాఁడు. పద్యము తుదముట్టఁ జదివి వ్యర్థ మిం దేదియైన నుండునా యని వెదకినను దొరకదు. ఒక్కపదమును దీసివైచినఁ బద్యమంతయుఁ బాడగునేమో యను పెనుభీతి సరసమతులకుఁ గలుగకపోదు. పదలాలిత్యము, అర్థగాంభీర్యము గలిగి పద్యములన్నియు నిక్షుదండములంబోలి రసాలవాలములై క్రాలుచున్నవి. ఎట్టిమూర్ఖుని చిత్తమునైన నొక్క నిముసమున నవరింపఁజాలునీతు లొక్కొక్కతావునఁ గ్రిక్కిఱిసియున్నవి. శృంగారమును శ్రుతిహితముగ వర్ణించుటలో నీతఁడు తిక్కయజ్వతో సరిసేయఁదగువాఁ డని త్రికరణశుద్ధిగాఁ జెప్పవచ్చును. ఒక్కొక్కస్థలమున స్వభావవర్ణనము హృదయంగమముగ నుండి కవి విమలమనీషావిశేషమును లోకానుభవమును వెల్లడించును. అతిశయోక్తివర్ణనముగూడ వెగటుగనుండక మనస్తోషజనకముగ నుండు నని చెప్పుటకు వెనుకంజ వేయవలసినపనియే లేదు.

చిన్నిపదమును బెట్టి యెంతయో యర్థము నిమిడించు శక్తి యీతని కుగ్గుతోఁ గలిపిపెట్టినట్లున్నది. మొత్తముమీఁద నీజక్కన కవిత్వము సలక్షణమై సరసజనహృదయంగమమై కథానాయకునిమహిమవలె శ్లాఘాపాత్రముగ నున్నదని చెప్పుట కెవరును సందియ మొందరు.

ఇంక నీతని శైలిఁ దెలుపుటకై కొన్ని పద్యము లుదహరింపఁబడు. ఇక్కవితల్లజునకు సంస్కృతాంధ్రములయం దసమానపాండిత్యము గల దని ముందే వ్రాసియుంటిమి. దాని క్రిందిపద్యములు దృష్టాంతములు.

సీ. శీలవతీనిత్యశృంగారరేఖావ, నాంతరక్రీడావసంతుఁడగుచు
మంజులతరరాగమంజరీవక్షోజ, మంజరీమధుపకుమారుఁడగుచు

సుమతి సీమంతినీ కమనీయశశికాంత, పాంచాలికాశిలభానుఁడగుచు
మదనరేఖావధూమానసాంతరరాజ, హంసావతంస విహారుఁడగుచు
వరుస దక్షిణనాయకత్వమున మించి, యొక్కతెఱఁగున ననురాగ మొందఁజేసి
యుచితరతిరాజ లీలల నోలలార్చెఁ, జంద్రగుప్తమహీతలచక్రవర్తి.
౧ ఆ. ౧౬౩ ప.

మ. జవసత్త్వప్రథమప్రభావభరితా, జానేయవాహంబులన్
శ్రవణోత్సారితచంచరీకమదదం, త ద్వారణవ్రాతమున్
నవరత్నాభరణవ్రజంబు నయనా, నందారవిందాక్షులన్
నవశస్త్రావళులన్ వధూవరులకున్, వైదర్భుఁడిచ్చెం దగన్. ౪ ఆ. ౧౯౦ ప.

జాబిల్లి వెలుంగుఁబోలె హృదయానందసంధాయకము లగు నాంధ్రపదంబులఁ గూర్చు నేర్పు జక్కనకవికిఁ గల దని యీక్రిందిపద్యములు సాక్ష్యమిచ్చును.

చ. పదముల తొట్రుపాటొదవ, బ్రాణసఖీజనభాషణంబులన్
మదిఁ దమకంబు లజ్జయును మచ్చరికింప వణంకుమేనితో
మదవతి పంచమందగతిమార్దవ మొప్పఁగ వచ్చెఁ బైపయిం
బొదలుచు మన్మథాగరసపూరముతో నెదిరించు కైవడిన్. ౪ ఆ. ౨౧౬ ప.

సీ. వెన్నెలఁ జరియిడ్డ వెండితీఁగెలఁబోలు, యజ్ఞోపవీతంబు లఱుత నమరఁ
గన్నె చెంగల్వపూవన్నె మించిననీరు, కావిదోవతిగట్టు కటిఁ దలిర్ప
వెలిదమ్మివిరిమీఁది యెలదేఁటిగతిఁ గంగ, మట్టిపై వేలిమి బొట్టుదనర
నీలకందుకముపై గీలించు ముత్యాల, విధమున సిగఁ గమ్మవిరులు మెఱయ
లలితనవయౌవనారంభకలిత మైన, మేనిమెఱుఁగులు మెఱుఁగుల మెఱుఁగుఁ దెగడఁ
జంద్రధరుకృప బ్రహ్మవర్చసము గన్న, మారుఁడన నొప్పు విప్రకుమారుఁ గాంచె.
౨ ఆ. ౧౪౩ ప.

సీ. చెక్కులందు నివాళి సేయు లేనగవులు, తాటంకరుచికొల్ల కోటుసేయ
జిగిధగద్ధగ యను బిగువుఁజన్నులమీఁదఁ, గ్రొమ్మించుసరులు త్రోద్రోపులాడ
నంటినఁ గందునో యను మేనినునుఁగాంతి, యిరుగెలంకులకు నుప్పరము దాఁటఁ
దొంగలిరెప్పలఁ దూరదుంకనలాడు సోలుఁజూపులు మరుమేలుకొల్పఁ
బట్టుగవు సెనదీసిన భావభవుని, పసిఁడివిలుకమ్మినో నాఁగ ముసుఁగు దిగిచి
పఱపుమీఁదను గూర్చుండఁ బడి కళావ, తీశిరోమణి యారాజు దిక్కుచూచి.
౮ ఆ. ౧౦౧ ప.

భాగవతమునఁ బోతనామాత్యసత్కవివలె నీసత్కవియు నంత్యప్రాసము లుంచి పెక్కుతావుల వర్ణించియున్నాఁడు.

శా. చండస్ఫూర్తి వటుండు గాంచె బహుధా జల్పన్నిశాటంబును
ద్దండాహూతమునీభ్యబిభ్యదమృతాంధస్స్నిగ్ధకూటంబు వే
దండాశ్వధ్వజినీకవాటము మహోద్యద్ధూమసంఛన్నమా
ర్తండస్యందనఘోటముం బలిముఖాంతర్వేదికావాటమున్.

భా ౮. అ ౯. స్కం. ౫౩౧. ప.

ఉ. లోలతఁ గాంచె నాసుగుణలోలుఁడు చారుశిలాగళజ్ఝరీ
జాలతటీప్రవాళఘనసత్తరువాటముఁ బాణ్ఢ్యనగా
ద్రాలహరీవినోదవిహగజ్జలశీకరనిర్గతక్రమో
ద్వేలహరప్రణామనతిదీపితకూటము హేమకూటమున్. విక్ర. ౨ఆ. ౨౧౮ ప.

ఉ. శ్రీలలితుండు దానగుణశీలిపురందరుఁ డంత గాంచె శ్రీ
శైలము రుగ్జరామరణసంక్షయకారణ ఘనౌషధీలతా
జాలము సార్వకాలికవసంతనితాంతలతాంతవిస్ఫుర
త్సాలము సానుసంగతలసన్మణిదీప్తదిగంతరాళమున్. విక్ర. ౨ఆ. ౧౯౭ప.

ఉ. ముందటఁ గాంచె నాశుభసముజ్జ్వలమూర్తి పురందరుండు ని
స్యందకృపాతరంగము బిశంగకపర్దసురంగముం బిని
ష్యందితభక్తలోకహృదపాంగము సుందరగన్నకందరా
మందిర మల్లికార్జునసమాహ్వయుజృంభితలింగముఁ గన్. విక్ర. ౨ఆ. ౨౨౦ ప.

ఉ. ఇక్షుధనుర్విపక్షుని రక్షింద్రకృతాక్షుని సర్వదేవతా
ధ్యక్షుని నాదిభిక్షుని హతప్రతిపక్షుఁ గృతాంతదంతిహ
ర్యక్షు మహాముముక్షు శరణాగతరక్షణదక్షు శ్రీవిరూ
పాక్షుని నానతేంద్రకపలాక్షునిఁ గాంచెఁ గృపాకటాక్షునిన్. విక్ర. ౨ఆ. ౨౨౨ప.

శృంగారరసమును శ్రుతిహితముగ వర్ణించుటలో జక్కనకు మంచి పాండిత్యముగలదు. ఆవిషయము నీక్రిందిపద్యములే సహస్రముఖముల ఘోషించుచున్నవి.

సీ. భామినీమణిమధ్యభాగంబు కృశ మని, కటితటంబున నిల్పె గౌరవంబు
దొయ్యలివలిచన్నుదోయి కర్కశ మని, యడుగుల మార్దవం బలవరించె
గమలలోచనకుంతలములు వక్రము లని, తనువల్లికకుఁ జక్కఁదన మొసంగెఁ
బూఁబోఁడిచూపులు చంచలము లని, మెలఁపు నెన్నడపున మేళవించె
నబలనఖములు క్రూరంబు లని తలంచి, సౌమనస్యంబుగుణమున సంపాదించె
నీరజాసనుఁ డెంతటి నేరఁడనుచు, జగము గొనియాడ నొప్పు నా చిగురుఁబోఁడి.

౪ ఆ ౧౭ ప.

తే. తమ్ములాకొమ్మ సెమ్మోము తమ్ములనఁగ, బింబమాయింతి సెమ్మోవి బింబమనఁగ
జాతియానాతిలేనవ్వు జాతియనఁగ, రామ యొప్పారు లోకాభిరామ యగుచు.

౪ ఆ ౧౮ ప.

ఉ. కన్నులు గంజుమీలుఁ దొలకారుమెఱుంగులుఁ గాముబాణముల్
చన్నులు కుంభికుంభములు సంపెఁగబంతులుఁ జక్రవాకముల్
ప్రన్ననిమేను పుష్పలత, పైఁడిసలాక ప్రసూనసాయకం
బన్నలినాక్షిఁ బాసి విరహవ్యథ నెంటెఁ జరింప వచ్చునే. ౩ ఆ ౪౯ పం.

అతిశయోక్తి వర్ణనము కవులకు స్వభావసిద్ధమైన నందునంగూడ నీకవి యుక్తియుక్తముగఁ జెప్పఁగలశక్తి గలవాఁడని యీక్రిందిపద్యము చాటుచున్నది.

సీ. పాలమున్నీటిలోఁ బవ్వళించినయట్టి, నీలవర్ణుఁడు నిద్ర మేలుకొనియె
వెగడొందిరవిసేరి నొగలఁగట్టినయట్టి, వాహంబు లళుకలు వైచుకొనియె
నదరిపాటునబిట్టు బెదరి పర్వతపుత్రి, కందర్పదమనునిఁ గౌగిలించెఁ
బన్నగంబులకెల్ల భయముమిక్కుటముగాఁ, బాతాళలోకంబు బయ్మరిల్లెఁ
గమలజానివేదపఠనంబు కవలువోయె, నద్రులెల్లను నచలత్వ మపనయించె
దిగ్గజంబులు జిఱజిఱ దిరిగి మొగ్గె, వారిరాసులు పిండిరి వండులయ్యె. ౪ ఆ ౫౦.

స్వభావోక్తి వర్ణనమునం దీకవిచమత్కృతి యీపద్యమువలనఁ దేటపడును.

ఉ. వలభుజమ్ము గపోలమును వంచిమలంచినమోములజ్జయున్
లలితకటాక్షముం బ్రియవిలాసముఁ జిత్తముఁ జిత్తజాతుఁడుం
దలఁపులుఁ గోర్కులుం బెరయఁ దద్దయు నొప్పె విహారశయ్యపై
విలసితలీల బాల బొటవ్రేల నిలాతలమున్ లిఖించుచున్. ౪ ఆ ౨౨౦ పద్యము.

సామెతలు జక్కనకవిత్వమునుండియే పుట్టిన వని చెప్పునట్టి పద్యములు.

క. తనయొడలం గల నెత్తురు, ధనహీనుని విడిచిపోవు దారాదిసుహృ
జ్జనములు విడుచుట యరుదే, మనుపీనుఁగు నిర్ధనుండు మదిఁ బరికింపన్. ౨ ఆ. ౧౭౨

క. సిరియును నాయువుఁ గడు న, స్థిరములు జముఁ డదయుఁ డిది మదిం దెలిసియుఁ జే
యరుధర్మము "ధర్మస్య, త్వరితాగతి"యను పురాణ వచనము వినరే. ౨ ఆ. ౧౮౫ వ.

గీ. ఎందు "గుడి మ్రింగువారికి నంది పిండి, వడియ" మనుపల్కు లుంగరే పుడమిలోన

౨ ఆ. ౨౩౮ ప.

క. జాతులు నాతులకెందుఁ, నీతము లే దన్నిటఁ "గామినీ లోకానాం
జాతిః ప్రకల్పితా" యను, నీతి పురాతనమె కాక నేటిదె యరయన్. ౩ ఆ. ౧౮ ప.

క. ఏమియుఁ గానఁడు పతి కాం, తామణ్యుఁడు గానఁ గాన్యతతి యెట్టిదయా
"కామాంధోపి న పశ్యతి" నా మును వినఁబడిన పలుకు నైజము కాదే. ౩ ఆ. ౨౮ ప.

ఇట్టి వింక నెన్ని యోగలవు. వాని నన్నిఁటిని జేర్చిన నతివిస్తరమగు నని వదలితిని, పాఠకులాయా సందర్భముల నయ్యై చమత్కారములం గని సంతసింతురు గాత మని యాశింపుచు నింతటితో విరమించుచున్నాను. శ్రీ. శ్రీ. శ్రీ.

రాయలఁబోలువారు కవిరాయలనెల్లఁ గారవించి యా
దాయము సేయు గ్రంథసముదాయము దైన్యము నొందఁ గాంచి "యా
హా! యని, ముద్రణాదులుగదా! యిఁక దిక్కని" వారి శక్తి ప్రా
లేయకరుండు ముద్రణబలిష్ఠత నెంతయుఁ జూపి కబ్బముల్
సేయు కవీశ్వరోత్తముల చిన్నెలు వన్నెలు దేశకాలముల్
బాయక పీఠికాముఖము లందఁగ సద్గుణకీర్తిఁ దెల్పుమన్
"వ్రాయవె? దీని కావిత"మ్మను సంగను వ్రాయఁగ నొప్పితీ రగన్.

ఇట్లు,
విన్నవించు విధేయుఁడు,
బొబ్బిలి. బులుసు. సీతారామశాస్త్రి.

శ్రీ ర స్తు.

విక్రమార్క చరిత్రము.

శా. గౌరీకుచనీలమార్తకమనఃక్రీడావిభూతిస్ఫురత్
ప్రాగల్భ్యంబులు కృష్ణపాండురతనుప్రౌఢిం బ్రతిష్ఠింపఁ దే
జోగణ్యుండయి యొప్పు శ్రీహరిహరేశుం డెప్డు రక్షించు వి
ద్యాగంభీరుని జన్నమంత్రి సుతు సిద్ధామాత్యచూడామణిన్. 1

చ. కనకనగంబు బొమ్మరము గా భుజగేంద్రుఁడు జాలెగా నమ
ర్చిన గిరిపుత్రి గాంచి యివి రెండును దేవధనంబు లన్న స
జ్జనహితోపదేశమున సన్మతి వానిఁ బునఃప్రతిష్ఠ చే
సినగణనాయకుండు కృప సేయుత సిద్ధనమంత్రికోరికల్. 2

ఉ. ఆనతులై నుతించు చతురాననముఖ్యులకోర్కె దీర్పఁ బం
చాననదివ్యమూర్తికి షడాననుఁడై జనియించి యాగసం
స్థానను సంస్తవంబులకు నందని కీర్తిధురుండు సానుకం
పాననుఁడై నృపేంద్రసచివాగ్రణిసిద్ధనఁ గాచుఁ గావుతన్. 3

చ. హరిహరసంగమంబున మహాద్భుతభంగిఁ జరించి చేతులం
బరశుపినాకఖడ్గఫణిపాశకపాలవరత్రిశూలముల్
కరమునరక్తిఁ బూని నుతిఁ గాంచిన బెల్లముకొండభైరవుం
డురుమహిమాఢ్యుఁ జేయు సుగుణోన్నతు జన్నయసిద్ధధీమణిన్. 4

శా. రాజు సహోదరుండు, రతిరాజు తనూజుఁడు, తండ్రి వాహినీ
రాజు [1]వరుండు లోకములరాజు గరాజితలీల నొప్పునా

---

1. వరుండు=భర్తయగు విష్ణువు.

రాజముఖీయాన సిరి, రాజ్యరమారమణీయుఁ జేయుతన్
రాజనుతప్రతాపగుణరమ్యుని జన్నయసిద్ధధీమణిన్. 5

క. శ్రీవాఙ్మృతశశిశారద, నీరదనీహారహారనిర్మలశోభా
గౌరవకళావిశారద, శారద సతతంబుఁ బ్రోచు జన్నయసిద్ధున్. 6

చ. హరిహరనీరజాసనసుఖావహమై నిమిషార్ధమాత్రలో
నిరువదిరెండునూఱులకు నెక్కుడు నిర్వదియోజనంబు లే
యరదము లీలవోలెఁ జను నంబరవీథి ననారతంబు నా
సురథము సన్మనోరథము చొప్పడ నీవుత సిద్ధమంత్రికిన్. 7

సీ. మకరందనిష్యందమందారమాలిక కబరీభరంబున సొబగుమీఱ
రమణీయమౌక్తికరత్నహారంబులు కుచకుంభములమీఁదఁ గొమరుమిగులఁ
గాంచనాంచలదివ్యకౌశేయచేలంబు ఘనకటీతటమునఁ గరము మెఱయ
ఘనసారకాశ్మీరగంధసాంద్రాగరుమృగమదపంకంబు మెయిఁ దనర్ప
మఱియు బహువిధశృంగారమహిమ మించి, హాటకోన్నతదివ్యసింహాసనమునఁ
దేజరిల్లెడుపార్వతీదేవి కరుణ, మంత్రిజన్నయసిద్ధుని మనుచుఁ గాత. 8

చ. అచిరములైనయన్యరుచు లన్నియు నావలఁ బోవఁద్రోచి వా
క్చ్ఛచయమనోహరం బయిన నేర్పు త్రికాలముఁ బ్రస్తుతింపఁగా
సుచరిత రామసంస్తవనసూక్తిసుధారస మాను నెవ్వఁ డా
ప్రచురకవిత్వతత్త్వనిధి భక్తి భజించెదఁ బుట్టుపుట్టువున్. 9

ఉ. ఆది ననంతసంఖ్యఁ దనరారుచు నేరికగమ్యమైనయా
వేదము లెల్ల విప్రులుఁ బ్రవీణతతోఁ బఠియించునట్లుగా
శ్రీ దనరార నాలుగుగఁ జేసినపుణ్యుఁ బరాశరాత్మజున్
మోదముతో నుతింతు మునిముఖ్యుని నేకముఖాబ్జసంభవున్. 10

సీ. శ్రీహర్షు శివభద్రుఁ జిత్తపు శివదాసు సౌమిల్లిని సుబంధు సార్వభౌము
కర్ణామృతకవీంద్రుఁ గామందకుఁ గళింగుఁ గవిరాక్షసుని భాసుఁ గాళిదాసు
మల్హణు బిల్హణు మాఘు మయూరుని వామను వరరుచి హేమచంద్రు
భవభూతి భారవి భట్టనారాయణు భట్టగోపాలకుఁ బ్రవరసేను
రాజశేఖరు హర్షు మురారిఁ జోరు, వరగుణునిదండి నాశాతవాహనుని వి
నాయకుని జయదేవుదిఙ్నాగు భద్రు, హరిని భామహుఁ గవిరాజు నాత్మఁ దలఁచి.

ఉ. వేయివిధంబులందుఁ బదివేవురు పెద్దలు సత్ప్రబంధముల్
వ్రాయక చెప్పిరిట్లు రసబంధురవాగ్విభవాభిరామతా

రేయులు శబ్దశాసనవరేణ్యులు నాఁగఁ బ్రశస్తికెక్కు రే
యేయెడ నన్నపార్యుగతి నిద్దర నట్టిమహాత్ముఁ గొల్చెదన్. 12

చ. పరువడి భారతాఖ్య కలశాంబుధి వేదము నాంధ్రభాష సు
స్థిరగతి రచించుచోఁ గృతిపతిత్వముఁ గోరి ప్రసన్నుఁడై నయా
హరిహరనాథుచేఁ బడసె నవ్యయసౌఖ్యపదంబు నెవ్వఁ డా
పురుషవరేణ్యుఁ దిక్కకవిఁ బూని నుతింతుఁ గృతాధ్వరోత్సవున్. 18

ఉ. ఈత్రయిఁ దాఁ బ్రబంధపరమేశ్వరుఁడై రచించె శబ్దవై
చిత్రి నరణ్యపర్వము నశేషము శ్రీనరసింహరాజుచా
రిత్రములన్ బుధప్రజగరిష్ఠత నెఱ్ఱయశంభుదాసుఁ డా
చిత్రకవిత్వవాగ్విభవజృంభితుఁ గొల్చెద భక్తియుక్తిగోన్. 14

మ. నవశబ్దార్థరసానుబంధపదవిన్యాసక్రియాభావగౌ
రవపాకధ్వనిరీతిశయ్యలఁ గవీంద్రశ్రేణి కావ్యాళిఁ జె
ప్ప, వృథామత్సరమూని దుష్కవులుఁ జెప్పంజూతు రశ్లీకనా
శివుహుం గాండవమాడ నాడవె పిశాచీభూతబేతాళముల్. 15

మ. నవనానారసభాస్వరార్థపదవిన్యాసక్రియాలంక్రియా
శ్రవణానందకథాసుధామయమహాసారస్వతాంభోధిలో
నవలీలన్ విహరింతు తజ్జ్ఞులు గతాహంకారులై యుండఁగాఁ
గవితాప్రౌఢిమ లేనియజ్ఞులు వృథా గర్వాంధులే రౌదుగో. 16

క. ప్రతిపద్యముఁ జోద్యముగాఁ, గృతిఁ జెప్పిన నొప్పుఁగాక కృతి నొకపద్యం
బతిమూఢుఁ డైనఁ జిత్రతఁ, బ్రతిపాదింపఁడె ఘుణాక్షరన్యాయమునన్. 17

వ. అని యిట్లిష్టదేవతాప్రార్థనంబును శిష్టకవిజనకీర్తనంబును దుష్టకవినిరసనంబునుం జేసి
యపూర్వకథాబంధురప్రబంధరచనాకౌతుకుండనై యుండునంత. 18

సీ. నవరసోజ్జ్వలకావ్యనాటకాలంకార [1]నికషోపలవివేకసుకవివరులు
శ్రీమహాభారతరామాయణాదిపురాణపారీణపౌరాణికులును
వేదాంతవైశేషికాదిషడ్దర్శనతర్కకర్కశులైనతార్కికులును
దత్తిలభరతమతంగకోహళమత ప్రముఖసంగీతపారంగతులును
మహిమఁ గొలువంగ నాస్థానమండపమున, జనితసాహిత్య[2]సౌహిత్యసరసగోష్ఠిఁ
జిత్త మిగురొత్త నన్నయసిద్ధమంత్రి, కొలువుగూర్చుండి నను వేడ్కఁ బిలువఁబంచి.

---

1 నికషోపలము=సాన. 2 సౌహిత్య=తృప్తి.

సీ. మా. సంస్కృతప్రాకృతశౌరసేన్యాదుల ఘటికలో నొకశతకంబుఁ జెప్పఁ
బ్రహసనప్రకరణభాణాదిబహువిధరూపకంబులయందు రూఢి మెఱయఁ
జక్రచతుర్భద్రవతురుత్తరాధికక్షుద్రకావ్యములు పెక్కులు రచింప
నాంధ్రకవిత్వంబునందుఁ బ్రబంధంబు మేలుగాఁ దజ్జ్ఞులు మెచ్చఁ జెప్ప
నిమ్ముల నేరీతి నేధాతువుల నేమిరసమున నైన వర్ణనము సేయ
నరి యేకసంధాద్విసంధాత్రిసంధలఁ గోడరనఁ బోరిబోరఁ గడకఁ బదువ
నెవ్వఁ డేయవధాన మెఱుఁగు నయ్యవధానమున నాని కించుక ముల్లుసూప
వృత్తికందముఁ గందవృత్తంబునుం జతుష్కందంబు మొదలుగాఁ గలుగుగర్భ
కావ్యసర్గముఁ జెప్పఁగాఁ బ్రబంధంబులు, గ్రొత్తలు పుట్టించుకొని లిఖింపఁ
గా; నక్షరచ్యుతకంబు మాత్రాచ్యుతకంబు బంధచ్యుతకంబు నాను
గోప్యంబులుం గ్రియాగోప్యంబులును భావగోప్యంబులును జెప్ప గోష్ఠియందుఁ
బద్యంబు గీతికార్భటి నొగిఁ బదపంగ నెల్లవిద్యల[1]సంచు లెఱుఁగ నేర్తు
నను చు,నెల్లూరితిరుకాళమనుజవిభుని, సమ్ముఖమ్మున సాహిత్యసరణి మెఱసి
మహిమ గాంచిన పెద్దయామాత్యసుకవి, మనుమఁడవునీవు నీవంశమహిమయొప్ప. 20

క. [2]ఆఁడఁడు మయూరరేఖను, గాఁడం బాఱండు బాణగతి మన మెఱియన్
బ్రోడగు పెద్దయయన్నయ, మాడకు మాడెత్తె యతనిమాటలు జగతిన్. 21

క. అని మీతండ్రిమహత్త్వము, జనవినుతరసప్రసంగసంగతకవితా
ఘనతేజాలు కవిరాజులు, గొనియాడుదు రఖిలరాజకుంజరసభలన్. 22

క. చక్కన నీవైదుష్యము, చక్కన నీకావ్యరచనచాతుర్యంబుల్
చక్కన నీవాగ్వైఖరి, చక్కన నీవంశమహిమ చక్కనసుకవీ. 23

క. స్వాభావికనవకవితా, ప్రాభవముల నుభయభాషఁ బ్రౌఢిమఁ జెప్పన్
భూభువనంబున సరి లే, రాభారతి నీవుఁ జక్కన్నయజక్కా. 24

వ. అనిసంభావించి. 25

తే. వనము నిధియును నల్లిల్లు వరసుతులును, జెఱువు గుడియును ధరఁ బ్రతిష్ఠితము లయ్యెఁ
గృతియుఁ గైకొన్న సప్తసంతతులవలనఁ, గీర్తిసుకృతంబులకును నేఁ గర్త నగుదు. 26

సీ. ప్రతిభాగుణధురీణపౌరాణికత్రాసకలపురాణశాస్త్రములయందుఁ
బరమార్థచరితార్థభారతరామాయణాదిప్రబంధకావ్యములయందుఁ
గల్పాంతరస్థాయిగద్యపద్యప్రాయకమనీయచిత్రకావ్యములయందు
రసికజనానందరససుధానిష్యందవిలసితనాటకావలులయందు

---

1 సంచులు=జాడలు. 2 ఆఁడఁడు=పలుకఁడు, ఆడఁడు=నటింపఁడు

సకలదేశభాషావిశేషములయందు, వరుసఁ బ్రఖ్యాతమునఁగ నుత్పాద్యమునఁగ
మిశ్రమున నొప్పుసత్కథామేళనంబు, లెన్నియన్నియు విన్నాఁడఁ బిన్ననాఁడ. 27

చ. తలఁపఁ దదీయయేకకవితానము కంటెను సాహసక్రియా
కలితవదాన్యతాదిగుణగౌరవరేఖల విక్రమార్కభూ
తలపతి యెక్కుడై నెగడెఁ దచ్చరితంబుఁ బ్రబంధశయ్య గాఁ
దెలుఁగునఁ జెప్పి యాకృతిపతిత్వము మా కొడఁగూర్పు నేర్పునన్. 28

వ. అని సవినయంబుగాఁ గనకమణిభూషణాంబరతాంబూలంబు లొసంగి గారవించినం బ్రమోదించి తత్ప్రబంధంబునకు ముఖాలంకారంబుగా నాప్రథమోత్తమవంశంబుఁ బ్రశంసించెద. 29

ఆ. జలజనాభునాభిజలజంబున జనించె, బ్రహ్మ యాతనివదనపంకజములఁ
జనితమైనవిప్రజాతికిఁ గొడవగా హారితమునివరేణ్యుఁ డవతరించె. 30

మ. ఇనకోటిప్రతిమానతేజుఁ దక్షుం డీశానవక్త్రంబుచేఁ
దనరం దీక్ష యొనర్పఁగా మెఱసె నుద్యద్ధర్మశాస్త్రక్రియన్
మనుకాత్యాయనదక్షగౌతముల సామర్థ్యంబునన్ మించె న
న్మనులెవ్వారును నేర్తురే హారితునిన్ బోలం బ్రభావోన్నతిన్. 31

వ. తదీయగోత్రంబున నూత్నరత్నంబై జనియించి. 32

సీ. వేదశాస్త్రపురాణవిజ్ఞానసరణిమై నధిగతపరమార్థుఁడై తనర్చి
నెద్దనప్రాడిరాజేంద్రచోడకుమారమణిచే నగ్రహారములు వడసెఁ
గనకదండాందోళికాచ్ఛత్రచామరప్రముఖసామ్రాజ్యచిహ్నములు నొప్పె
సర్వతోముఖముఖ్యసవనక్రియావిధి నుభయవంశంబులు నుద్ధరించె
నన్నదానాదిదానవిద్యావనుండు, పరమశైవసదాచారపావనుండు
హారితవంశాంబునిధిసుతుఁ డార్యనుతుఁడు, సుగుణవిభ్రమి సూరనసోమయాజి. 33

క. అమ్మహితాత్మునితనయుఁడు, సమ్మదదయానిధానసౌజన్యరమా
సమ్మోదితబాంధవుఁడై, యిమ్మహిలో సిద్ధమంత్రి యెన్నికకెక్కెన్. 34

మ. శ్రుతులన్ వన్నియకెక్కు శాస్త్రములచే సొంపగ్గలించెన్ మహో
న్నతిఁ బోషించెఁ బురాణకావ్యరసనానానాటకాలంకృతుల్,
క్రతువర్గంబుల సుప్రయోగమహిమన్ గాంచెన్ విరించాన్వయో
ర్జితపుణ్యుం డగుసిద్ధమంత్రి సుగుణశ్రీమించి సేవించినన్. 35

చ. వనరుహనాభు కుద్ధవుఁడు వజ్రికి జీవుఁడు వత్సధారణీ
శునకు యుగంధరుండు దితిసూతికి దైత్యగురుండు విక్రమా

ర్కునకును భట్టిరీతి నధికుం డగునన్నయగంధవారణం
బునకుఁ బ్రధానుఁడై నుతులఁ బొందెను సిద్ధనమంత్రి యుద్ధగన్. 36

వ. అమ్మహాప్రధానోత్తముండు. 37

చ. పరిణతనవ్యకావ్యరసభావవిజృంభణభూరివిక్రమా
స్ఫురితచరిత్రతత్త్వసరసుం డగుపేరయనన్న నార్యసో
దరి యగుసూరమాంబిక ముదం బలరంగఁ బరిగ్రహించె భా
స్వరకమలాజనార్దనవివాహమహోత్సవలీల మీఱఁగన్. 38

క. ఆదంపతులకు సుకృత, ప్రాదుర్భావమున మంత్రిభాస్కరుఁడు దగా
పాదితబాంధవనికరమ, హోదయుఁ డగ జన్నమంత్రియునుఁ గల్గి రాగిన్. 39

వ. అందగ్రజుండు. 40

చ. అమృతగిరీంద్రసంయమిపదాంబుజషట్పదనాయకుండు నా
నమితరవిప్రణామనికరాంచితపుణ్యుఁడు నాఁగ నీశ్వరా
గమపరమార్థవేదియనఁ గంజభవాన్వయవర్ధనుండు నాఁ
బ్రమహితకీర్తిఁ బెంపెసఁగె భాస్కరమంత్రి ప్రతాపధాముఁడై. 41

తే. సుజనమిత్రుఁడాదిత్యుండు సుతుఁడు గాఁగ, ఘనుఁడై నారదీమణిమహిమ మెఱయ
భాగ్యనిధి యైనభాస్కరప్రభువరుండు, పుత్త్రపౌత్త్రాభివృద్ధిచేఁ బొలుపుమిగిలె. 42

వ. తదనుసంభవుండు. 43

సీ. విమలవర్తనమున వేదశాస్త్రపురాణ వాక్యార్థసరణికి వన్నె వెట్టెఁ
బరమహృద్యంబైనపద్యశతంబున దేవకీతనయు విధేయుఁ జేసె
రసికత్వమున దేవరాయమహారాయ కరుణాకటాక్షవీక్షణముఁ గాంచెఁ
గర్ణాటకటకముల్ గలయంతయును మెచ్చ గణకవిద్యాపరీక్ష ఘనత కెక్కె
గురులఁ బోషించె సత్కవివరుల మనిచె, బ్రజలఁ బాలించె భాగ్యసంపద వహించె
హరితమునిముఖ్యవంశరత్నాకరేంద్ర, చంద్రుఁడై యొప్పుసిద్ధయజన్నమంత్రి. 44

మ. అరసెన్ బంధుల వైభవోన్నతులఁ గా నాదిప్రధానావళిన్
దొరసెన్ నీతివివేకవిస్ఫురణచేఁ దోరంపుసత్కీర్తులన్
ఒరసెన్ బార్గవదాస్యవర్గముల నూహా యెందు నేమంత్రులున్
సరియే సిద్ధయజన్నమంత్రికి మనీషాదేవతామంత్రికిన్. 45

వ. అమ్మహామంత్రీశ్వరుని కులపాలికారత్నంబు. 46

సీ. పరమపతివ్రతాగరిమ నీసతి కెన్నఁ బ్రతిలేరు ధర నరుంధతియ దక్కఁ
బుత్త్రులఁ గాంచినపోల్కి నీకాంతకుఁ జింతింప సరిలేరు గొంతి దక్కఁ

దాళిమి పేర్మి నీతరుణీలలామకు నెన లేరు ధారుణీవనిత దక్క
సౌభాగ్యగరిమ నీసాధ్వికి నుపమింప లక్ష్యంబు లేరు శ్రీలక్ష్మి దక్క
రూపమున నీవధూమణిఁ జూపి చెప్ప, జోడు లేరు సురాధిపుసుదతి దక్క
ననఁగఁ బుణ్యపురుముడి మోచి యక్కమాంబ, బంధువులపాలిసురభినాఁ బరఁగె ధరణి.

క. ఆగమశీగముణులకును, శ్రీరంజిల్లంగ నవతరించిరి విభవో
దారుఁడు సిద్ధనమంత్రియు, నారూఢయశుండు భైరవామాత్యుండున్. 48

సీ. సొంబగుమైఁ గనువిచ్చి చూడ నేర్చిననాఁడె సుజనులఁ గరుణతోఁ జూడ నేర్చె
ముదంబు దలకొత్తి నవ్వ నేర్చిననాఁడె నయమార్గహీనుల నవ్వ నేర్చె
నడుగొత్తి యల్లన నడవ నేర్చిననాఁడె సనిచి ధర్మముత్రోవ నడవ నేర్చె
లలిఁ దొక్కుఁబల్కులు పలుక నేర్చిననాఁడె పరికించి సత్యంబు పలుక నేర్చె
వ్రాయ నేర్చిననాఁడె సద్వర్ణసమితి, నర్థి నర్థులు ప్రబల వ్రాయంగ నేర్చె
బాల్యమునయందె బహుకళాప్రౌఢి మించెఁ, జిగయశోహారి జన్నయసిద్ధశౌరి. 49

సీ. చిత్రగుప్తునకైనఁ జింతింప నరుదైన, గణితవిద్యాప్రౌఢి ఘనత కెక్క
నవరసంబులయందు నవ్యకావ్యంబులు, కవిజనంబులు మెచ్చఁగా నొనర్చె
నాసీముత్యములసోయగము మించినవ్రాలు, గమనతో నిడుగేల వ్రాయ నేర్చె
నాత్మీయలిపియట్టు లన్యదేశంబుల, లిపులను జదువంగ నిపుణుఁ డయ్యె
దేవరాయమహారాయధీవిధేయ, మంత్రివల్లభచామునామాత్యదత్త
నామరచ్ఛత్రశిబికాదిసకలభాగ్య, చిహ్నములనొప్పె జన్నయసిద్ధమంత్రి. 50

ఉ. చంద్రుఁడు కాంతి నర్జునుఁడు శౌర్యమునన్ హరి సంపదన్ హరి
శ్చంద్రుఁడు సత్యవాక్యమున శంభుఁడు భూతి గురుండు నీతి దే
వేంద్రుఁడు వైభవంబున ధనేంద్రుఁడు దానమునందు నీ డనన్
సాంద్రయశోవిశాలుఁ డగుజన్నయసిద్ధయ యొప్పు నెప్పుడున్. 51

ఉ. నైజకళావివేకగుణనవ్యవిలాససమగ్రవిత్తవి
భ్రాజితవైభవంబులతరంబుల జన్నయసిద్ధమంత్రికిన్
రాజును భోజరాజు రతిరాజును గిన్నరరాజు దేవతా
రాజును బోల రందుఱి కవిరాజులు రాజసభాంతరంబులన్. 52

క. చందురుఁ గన్న పయోనిధి, చందంబున సిద్ధమంత్రి జనతానయనా
నందనుఁడు తిప్పధీమణి, నందనుఁడుగ నిత్యసేవనస్థితి మించెన్. 53

వ. తదీయానుజుండు.

సీ. చెలిమిచేఁ గలిమిచేఁ జెన్నొందఁగ నొనర్చి, హితుల నిత్యానందయుతులఁ జేసి

శక్తిచే భక్తిచే సేవన మొనరించి, గురుల సమ్మదరసాకరులఁ జేసి
సమతచే మమతచే సంతర్పణ మొనర్చి, జనుల సంపూర్ణజీవనులఁ జేసి
నయముచేఁ బ్రియముచే నానాట నలరించి, కవుల వైభవరమాధవులఁ జేసి
నీతిచేత వినీతిచే నేర్పు మెఱసి, గరిమఁ దనరాజు ధనరాజుగా నొనర్చె
సుగుణచంద్రికానందితసుజనహృదయ, కైరవుం డగుజన్నయభైరవుండు. 55

వ. ఈదృగ్వంశవర్ణనాసముదీర్ణకీర్తినిధానం బైన యమ్మంత్రినిధానంబునకును. 56

షష్ఠ్యంతములు.

క. శ్రీమద్వల్లయవరసుత, చామనదండాధినాథసామ్రాజ్యరమా
సామగ్రిసంపాదక, సామాజికచతురుపాయసంపన్నునకున్. 57

క. సముచితయజనాదివిధి, క్రమనిపుణున కుభయవంశఘనకీర్తిసము
ద్యమనియమాచారునకును, విమలాపస్తంబసూత్రవిఖ్యాతునకున్. 58

క. దినకరదండనమస్కృతి, దినదినసంవర్ధమానతేజోనిధికిన్
వినుతహరితాన్వయాంబుధి, జనితకళానిధికి సుకవిజనవరనిధికిన్. 59

క. జన్నామాత్యునిసుతునకు, సన్నిహితసరస్వతీప్రసాదోదయసం
పన్నచతుష్షష్టికళా, సన్నాహస్ఫురితకీర్తిసౌభాగ్యునకున్. 60

క. అక్కాంబానందనునకు, ధిక్కృతసురరా[illegible]ంత్రిధీవిభవునకున్
దిక్కూలంకషకీర్తికి, జక్కనకవికావ్యకరణసత్ప్రియమతికిన్. 61

ఉ. వెన్నెలకంటిసూర్యుఁడు వివేకగుణాఢ్యుఁడు, వేదశాస్త్రసం
పన్నుఁడు రెడ్డివేమనరపాలకుచేత మహాగ్రహారముల్
గొన్నకవీంద్రకుంజరుఁ డకుంఠితతేజుఁడు పెద్దతండ్రిగా
సన్నుతి గన్న సిద్ధనకు సంతతదానకళావినోదికిన్. 62

వ. అభ్యుదయపరంపరాభివృద్ధిగా నారచియింపం బూనిన నవ్యకావ్యకథాలక్ష్మికి సుధా
సాగరం బయినమధురానగరం బెట్టి దనిన. 63

చ. ధరణికిఁ గోటచక్రగిరి దాని కగడ్తలు వారిరాసులా
పరిఖలు కోటలోనునికి భావ్యము గాదనియబ్జసూతి భా
సురముగఁ జక్రభూధరముచుట్టును వార్ధులు నిల్పె నాఁగ శ్రీ
కరమగుకోటచుట్టును నగడ్తలు చెల్వగు నప్పురంబునన్. 64

తే. అడుగుఁ గెంది భోగావతి యతిశయిల్లఁ, బరిఖ లక్ష్మీశుకరణిఁ జూపట్టె ననియె
దాను బురికోట యాకాశతటిని మోచి, సమధికోన్నతి గౌరీశుచంద మొందె. 65

క. పురివప్రఖచితమణిగణ, సురుచిరదీధితులవలన సొరిదిని దివియల్

పరఁగుఁగాన రట్టిరాత్రులఁ, గరమరు దప్పురముకోటకావలివారల్. 66

చ. పరకనకప్రభాతివిభవంబున మేరుమహీధరంబు లై
నిరుపమవజ్రమౌక్తికవినిర్మలకాంతుల వెండికొండ లై
సురుచిరరత్నదీధితులసొంపునరోహణపర్వతంబు లై
పురమున దేవగేహములు పొల్పెసలారును వైభవోన్నతిన్. 67

క. అప్పురిసౌధములం గల, యొప్పును బొడవును దనర్ప నూహించుచు వా
తప్పఁడె కలరూపెల్లను, జెప్పెడుచో రెండువేలజిహ్వలవాఁడున్. 68

తే. భూమిఁ దనతోడియిరువురుఁ బూజగొనఁగ, ధాత యాచందమునఁ బొందఁ దాను గోరి
వివిధభూసురాకారత వెలసె ననఁగ, బ్రహ్మసంఘంబు వెలయు నప్పట్టణమున. 69

సీ. వేదశాస్త్రపురాణవిద్యానవద్యులు మంత్రతంత్రాగమమర్మవిదులు
నానావిధాధ్వరనైపుణ్యగణ్యులు, సాధుసంరక్షణాచరణపరులు
నిఖిలధర్మాధర్మనిశ్చితహృదయులు, పరమకారుణికత్వభవ్యమతులు
నిజకులాచారైకనిష్ఠాగరిష్ఠులు నిత్యసత్యవ్రతనిరతవచను
లర్కతేజులు సువ్రతు లకుటిలాత్ము, లమలచరితులు దైవజ్ఞు లలఘుయశులు
విప్రు లొప్పుదు రెప్పు డవ్వీటిలోనఁ, జిత్సదానందసంపూర్ణచిత్తులగుచు. 70

చ. దొరఁకొని పూర్వజన్మమున దుర్జనశిక్షయొనర్పఁ గాని సు
స్థిరమతి రాజ్యభోగములు చేకొనఁగాఁ దతిలేమి నాత్మలో
హరి తలపోసి సౌఖ్యముల నందఁగఁ దత్పురిఁ బెక్కురూపులై
సొరిది జనించెనా నృపతిసూనులు వొల్తురు శ్రీసమేతులై. 71

ఉ. ఇంకనివారిగుల్ ధరణి నెవ్వరివేఁడనియింద్రు లెన్నఁడున్
బొంకనిధర్మనందనులు పొంకముగందని చంద్రబింబముల్
శంకరుకింకలోఁబడనిశంబరసూదను లాహవంబునన్
గొంకనిపార్థులై నృపతికుంజరసూనులు పొల్తు రప్పురిన్. 72

చ. కరమున నున్నపుక్కియును గామునిభూతియు నుక్కుఫాలమున్
గిరివరచర్మమున్ దొఱఁగి గ్రక్కున లేమికి బొమ్మగట్టఁడే
హరుఁడు కుబేరుచెల్మెడలి యాదట మాసఖుఁ డైననంచు న
ప్పురమున వైశ్యులాడుదురు పుణ్యముపేర్మిఁ బ్రతాపధాములై. 73

చ. పొడువుగ నెల్లయంగడులఁ బ్రోవులు వోసిననూత్నరత్నముల్,
కడఁక ననేకవేషములు గైకొని వచ్చినయర్థికోటికిన్
బిడికిళులాదిగాఁగ బలివెట్టుదు రెప్పుడు వైశ్యభామిను

ల్కడపక హస్తకంకణకలధ్వను లొప్పఁగ నప్పురంబునన్. 74

ఆ. లెక్కకెక్కు నైనమిక్కిలిసిరి గల్గ, నెన్ని కోట్లపడగ లెత్తరాని
అపరిమితధనంబులను వ్రాలి బడగలు, గట్టు వైశ్యజనము పట్టణమున. 75

చ. చెఱకును రాజనంబుఁ గృషిచేయుచు నుండెడునేర్పుకల్మియుం
దఱుఁగనిధాన్యముల్ పసులదాఁటులు దోఁటలుఁ గట్టుబండులుం
గఱు తిడరాక యుండెడునగోపరవస్తుచయంబుఁ దేజాలం
దఱచుగ నీనుగోడిగలుఁ దత్పురిశూద్రుల కొప్పు నెప్పుడున్. 76

సీ. క్రోల్పులి నైన నుక్కునఁబట్టి మీసాల, నుయ్యెలలూఁగెడునోపికలును
మదహస్తి నయినను నెదిరి కొమ్ములువట్టి చదికిలఁబడఁ ద్రోచుసత్వములును
గంఠీరవము నైనఁ గడిమికిఁ బెడఁబాపి సటలు వెఱికఁజాలు సాహసములు
శరభంబు నైనను సరభసంబునఁ గిట్టి మూటకట్టుగఁ గట్టు మొక్కలములు
గలిగి శస్త్రాస్త్రనిపుణులై కరము మెఱసి, యతిభయంకరాకారత నతిశయిల్లి
ధీరతాసముద్భటులైనవీరభటులు, పరఁగుచుండుదు రప్పురవరమునందు. 77

సీ. మృగరాజమధ్యలై మిక్కిలి మెఱసియు వక్షోజకరికుంభరక్షు సేసి
చంద్రబింబాస్యలై చాల రాగిల్లియు నలకాంధకారంబు వెలయఁ జేసి
పికనాదకంఠలై పెంపువహించియు నధరపల్లవముల ననునయించి
కలహంసగమనలై కడు బెడఁగారియుఁ గరమృణాళంబులఁ గరము మనిచి
నవ్యకౌముదీస్మితలయ్యు నయనపాద, సారసంబుల నెంతయు గారవించి
చిత్రసౌందర్యధుర్యలై చిగురుఁబోఁడు, లప్పురిఁ దనర్తు రెక్కుడునొప్పిదముల. 78

చ. తెలికనుదోయిమించులును దిన్ననినవ్వులు ముద్దుమోములుం
బలుచనిచెక్కులుం జిలుకపల్కులు మెత్తనిమేనుఁదీఁగలుం
గలుగుటు సందియం బయినకౌనులు వట్రువలైనచన్నులుం
గలిగి పురిం జెలంగుదురు కామునిదీవములట్లు కామినుల్. 79

ఉ. భూమిఁ గవీంద్రవాక్యములఁ బొచ్చెము నేయఁగ జెల్లెఁ గాకయా
తామరసాక్షులైనపురితన్వులశాతకటాక్షముల్ విట
స్తోమము మర్మదేశములఁ దూఱి కలంపఁగఁ జాలుపోలికం
గామునిపుష్పబాణములు కాముకుల న్నెటినాఁటఁ జాలునే. 80

క. అసమశరుఁ డించువిల్లును, గుసుమశరంబులును విడిచి కొమ్మలభ్రూనే
త్రసమృద్ధిచేతఁ దత్పురిఁ, బసగలవిలుకాఁ డనంగఁ బరఁగుచు నుండున్. 81

క. యోషిజ్జనసౌందర్యవి, శేషము శేషంబు వాగ్విజృంభణమహిమం

భాషాపతినిర్జరగురు, భాషాశేషులకు గాదు ప్రస్తుతి సేయన్. 82

ఉ. ఎత్తులయొప్పుకంకె పరమెత్తుట యొప్పఁగఁ జొక్కి చిల్వకా
ఱొత్తడిఁ బుష్పముల్ కొసర కూరకె యునికి, నల్లనవ్వుచున్
చిత్తముతోన చిత్తములు వేగ హరింతురు నేర్పుమీఱఁగాఁ
జిత్తజువేఁటదీమములచెల్వునఁ దత్పురిఁ బుష్పలావికల్. 83

చ. చిలుకలతేరుఁ గోయిలలసేనలుఁ దుమ్మెదపిండునారియున్
గలువలయమ్ములుం బ్రసవకార్ముకమున్ మగమీను టెక్కెమున్
మలయసమీరుపాత్రుఁగని మన్మథుఁ డప్పురిలోన ద్రిమ్మరున్
లలనలప్రాణనాథు లెడ లజ్జల నుజ్జగిలంగఁ జేయుచున్. 84

సీ. నడయాడ పర్వతములు వడసి మోదమ్మునఁ, గూడి యాడెడునవగొండ లనఁగ
వర్షధారలు గానవారిదము తోరఁగంగ ధర వసించినయంబుదంబు లనఁగ
నాశాగజాకృతు లలవడ జనులకుఁ జూప వచ్చినబహురూపు లనఁగఁ
దిమురార దోఁచిన దీనత పెంపునఁ దెమలినచీఁకటిగము లనంగ
వాలి చరియించుఁ గరమదవారణములు, దారుణాహవాంభోనిధి తారణములు
కదనవిజయరమాధారకారణములు, పృథులరాజన్యశౌర్యసంప్రేరణములు. 85

వ. సురపతిదాడి నంబునిధిఁ జొచ్చినయద్రులు నిచ్చ లప్పురిన్
దిరుగఁగ నాత్మఁ గోరి శరధిన్ బరిఖాకృతిఁ గాపువెట్టెనా
నిరుదుగ నింద్రసాలజములై నలయేఱులు గానధారలై
తొరఁగుచు నున్న యూడ్కి నతిదుస్సహతం గరులొప్పు నప్పురిన్. 86

సీ. పవమాను నైనను నవమానయుతుఁ జేయుఁ జటులజవోపేతసత్త్వగరిమ
సింహాగ్రజుల నైన జీరికిఁ గొనకుండుఁ బృథులహేషాఘోషభీషణముల
నాంజనేయుని నైన నపహసింపఁగఁ జాలు నతిదూరలంఘనాహంకృతులను
విక్రమార్కుని నైన వెఱఁగొందఁగాఁ జేయుఁ జండతరాభీలసాహసముల
భరతముని నైన నచ్చెంబు పట్టుమండు, వివిధనర్తనచాతుర్యవిక్రమముల
జిత్రరూపము మెచ్చవు చెలువులందు, వలను మీఱినయప్పురివాహనములు. 87

సీ. శుకమంజులాలాపశుభకరస్థితి మించి [1]పల్లవసందోహభాతిఁ దనరి
కలకంఠకూజితవిలసనంబుల నొంది [2]రంభానురేఖలరమణ మెఱసి

---

1. పల్లవసందోహము=చిగురుటాకులగుంపు, విటకాండ్రపిండు. 2. రంభా=అరఁటిచెట్లు.

1 హరిచందనస్ఫూర్తి ననిశంబుఁ దనరారి పుష్పసౌరభములఁ బొలుపుమిగిలి
సరసాలిమాలికాసంసక్తి విలసిల్లి విషమబాణాసనవృత్తిఁ జెంది
లలితమాకందవైభవంబుల దనర్చి, యతిమనోహరాకారత నతిశయిల్లి
యుద్యదుద్యానవాటిక లుల్లసిల్లు, వారవనితలునాఁ బురవరమునందు. 88

సీ. సరసపుష్పపరాగసైకతంబులు దీర్చి తేనియకాలువల్ తెరలిపాఱ
రమ్యమయూరసంభ్రమలీలఁ గల్పించి ఘనతమాలాంబుదకాంతి దనర
లతికావిలాసినీలాస్యంబు ఘటియించి చతురమారుతనటస్వామి వోలెయఁ
జారుపల్లవరాగసంధ్యామహిమఁ జూపి విమలకోరకతారకములు మెఱయ
సతతవిహరణదంపతిచారుదేహ, రత్నభూషారుచిస్తోమరమ్య మగుచుఁ
బొలుచు నారామసమితి తత్పురమునందుఁ, గల్పకావలి భువిమీఁదఁ గలిగె ననఁగ. 89

శా. ఆరామంబులు పెక్కుగల్గను సునాయాసంబుగా నేచి ము
క్కారుం బండును రాజనంబుఁ జెఱకుల్ గప్పారుపూఁదేనియల్,
నీరెల్లప్పుడు నిండియుండుఁ జెఱువుల్ నిర్మించు పెల్లల్ పురం
బౌరశ్రేణికి గోకదంబమునకున్ బాధోవిహారార్థమై. 90

చ. కరిమకరాలయాఢ్యతఁ బ్రకామగభీరత నచ్యుతస్థితిన్
వరకమలోదయస్ఫురణ పొలుపుఁ బన్నగలోకసంగతిన్
ధరఁ గలవారికెల్లఁ బ్రమదంబున నాశ్రయమై తనర్చుటన్
బరఁగుఁ బురంబుటాకములు పాలసముద్రముతో సమంబులై. 91

చ. సరసిజనాభుఁ డట్టె హరి సారసగంధవుఁ డట్టె బ్రహ్మయా
సిరియును నబ్జవాస యటె చిత్తమునం దలపోసి చూడఁగా
దొరయుదె యీప్రసూనములతో నితరప్రసవవ్రజంబు నాఁ
బురమునఁ బద్మషండములు పొల్పెసలారు మనోహరంబులై. 92

సీ. కామశాస్త్రంబులు వేమాఱు నియతిమైఁ జదువకుండినఁ బుష్పశరునియాన
మన్మథాగమములమర్మంబు లెల్లను జూడ కుండిన రమాసుతునియాన
సూనాస్త్రితత్త్వవిజ్ఞానంబు గడముట్టఁ గనుఁగొన కున్న నంగజునియాన
మకరకేతనమంత్రసుకరాక్షరము లనుష్ఠింప కుండిన మనసిజునియాన
యనుచు జనులెల్ల వినఁ జాటునను వు దోఁప, మత్తకోకిలనిస్వన మనుగకీర
భాషణంబులు వీనులపండు వగుచుఁ, దనరుఁ దత్పురి నుపవనాంతరములందు. 93

ఉ. చిత్తజరాజ్యసంపద యశేషము నైకొని సౌఖ్య మందఁగా

---

1. హరిచందనము = పచ్చనిగంధము, నీటిప్రబ్బలిచెట్లు, శ్రీగంధపుఁజెట్లు.

నుత్తులు దారఁ నాఁబుగ వరోపవనంబులు సొచ్చి యిచ్చఁ బూ
గుత్తుల ద్రావి తేనియలు కుత్తుకబంటిగఁ గ్రోలి లీలమై
నొత్తిలి మ్రోయియు చింపుదళుకొత్తుచు నుండు మదాళిదంపతుల్. 94

సీ. విరజాజివిరులపై విహరించు విహరించి సొబగునెత్తావులు చూఱలాడు
బొండుమల్లియలపైఁ బొరలాడుఁ బొరలాడి పుష్పంధయంబులఁ బోవఁజోపుఁ
గన్నెగేదఁగు లొయ్యఁ గదలించుఁ గదలించి చదలఁ బుప్పొడి వెదచల్లియాడు
జలజవనంబులోఁ జరియించుఁ జరియించి దొరఁగుపూఁదేనెలఁ దొప్పఁదోఁగు
సతతబహువిధగతపరిశ్రాంతి నొంది, యున్న వనపాలదంపతు లొడల నున్న
చెమట లల్లనఁ బాయంగఁ జేయుచుండు, నప్పురంబునఁ బ్రమదవనానిలుండు. 95

శా. వేమాఱు న్మలయానిలుం డడరి యావీటం బ్రసూనాన్వితా
రామంబుల్ వెస ముట్టి యందలి యలివ్రాతంబుఁ బోఁ జోపి తా
నామోదంబులు చూఱవట్టి బలియుండై యొప్పి సౌరాంగనా
సీమంతంబులఁ బుప్పరేణు వునుచున్ సిందూరరేఖాకృతిన్. 96

సీ. కమలాగృహకవాటకలితకుంచిక నాఁగ జలజకోరకరాజిఁ గలయఁ దెఱచి
మనుకరాకర్షణమంత్రసిద్ధుఁడు నాఁగఁ గుసుమరజోభూతి దెసలఁ జల్లి
సుభగలతానటీసూత్రధారుఁడు నాఁగ నృత్యవిద్యాప్రౌఢి నెఱయ నేర్పి
సకలజీవోన్మేషసంజీవని యనంగఁ బ్రకటనిద్రాముద్రఁ బాయఁజేసి
మందిరోద్యానవాటికలందుఁ బొలసి, వేఁగుబోఁకలఁ దత్పురి విభ్రమించు
శైత్యమాంద్యకసౌరభ్యసహితమైన, మలయపర్వతసంజాతమారుతంబు. 97

చ. సిరి యుదయంబు నొందినవిశేషమున న్నవదుగ్ధవార్ధియై,
కర మరుదైనముత్యములు గల్గుట నూతనతామ్రపర్ణియై,
వెరవున సత్పథస్థితి నవీనవియన్నదియై తనర్చ యా
పురి బహుజీవనంబులఁ బ్రపూర్ణత నొందె జగన్నుతంబుగన్, 93

ఉ. భామిను లెల్లఁ బద్మినులు, బ్రాహ్మణు లెల్లఁ గృతాధ్వరోత్సవుల్,
భూమిపసూను లెల్లఁ బటుభూరిభుజాబలవిక్రముల్, విట
గ్రామణు లెల్లఁ గామరసకావ్యకళాకలనావిశారదుల్,
కోమటు లెల్ల నర్థపులు, గుఱ్ఱము లెల్లను దేజు లప్పురిన్. 99

తే. సకలకళలకు సుఖగోష్ఠి సలుపునెలవు, మగతనంబుల కేకాంతమందిరంబు
పచ్చవిల్తుని కాయుధాభ్యాసశాల, యనఁగ నొప్పారు నెప్పుడు నప్పురంబు. 100

వ. మఱియు నప్పురవరంబు సరోవరంబునుం బోలె బహుజీవనపరిపూర్ణంబును గమలా

వాసవిలసితంబును గంకణాగణకలితంబును రాజహంససేవ్యంబును గువలయానందభవ్యంబును నై, వసంతసమయంబునుంబోలెఁ బల్లవోల్లాసహృద్యంబును మదనవిహారానవద్యంబును సుమనోవికాసమహనీయంబును శుకశారికాలాపరమణీయంబును సకలజనమనఃప్రసాదంబును గలకంఠమృదులగానసంపాదంబును నై, రామాయణంబునుం బోలె రామాభిరామంబును భరతగోష్ఠిసమంబును సుమిత్రాత్మజజనకతనయానందగమ్యంబును శత్రుఘ్నవ్యాపారరమ్యంబును నంగదకటకాలంకారకీర్తనంబును మహాబలకుమారోదారవర్తనంబును నై, మహాభారతంబునుం బోలె ధర్మనందనాచారప్రకారంబును శిఖండివిహారస్ఫారంబును భీమబలోద్దామంబును నర్జునకీర్తిస్తోమంబును జాపాచార్యహస్తలాఘవప్రశస్తిభరితంబును గృపానూనచరితంబును నై, పయఃపారావారంబునుంబోలెఁ బురుషోత్తమవాసయోగ్యంబును లక్ష్మీజనిసౌభాగ్యంబును ననంతభోగిపరివృతకులగోత్రాలవాలంబును సకలరత్నోద్భవమూలంబును నై మెఱసి; మాతంగవాగం బయ్యును మాతంగనివారం బై, పుండరీకమండనం బయ్యును బుండరీకఖండనం బై, పుణ్యజనభయంకరం బయ్యును బుణ్యజనశివంకరం బై, మధుపకులనిరసనం బయ్యును మధుపకులవిలసనం బై, యనంగవిహారసహితం బయ్యును ననంగవిహారగహితం బై, తనరె; తనుకృశత్వంబు మానినీమధ్యంబులయందు, చంచలత్వంబు మృగేక్షణాకటాక్షంబులయందు, కుటిలస్వభావంబు కాంతాకుంతలంబులయందు, అన్యోన్యసంఘర్షణంబు ప్రమదాపయోధరంబులయందు, ఆలస్యంబు నితంబినీగమనంబులయందు, క్రూరత్వంబు సుముఖీనఖముఖంబులయందు, కలహంబు మానినీప్రణయప్రసంగంబులయందు, రాగాతిశయంబు బింబాధరామధురాధరంబులయందు, వర్ణసంకరంబు బాలికాకపోలచిత్రపత్త్రికలయందు, మదోద్రేకంబు తరళనయనాతారుణ్యంబులయందు కాఁ దనయందుఁ బోనగం బొరయఁజాలి; శంకరాకారంబునుం బోలె సర్వమంగళాలంకృతం బయ్యును మహాభూతసమాశ్రయంబు గాక సురభిహారినానాముఖభోగిభూషితంబును, పూర్ణశశిమండలంబునుం బోలెఁ గువలయానందకరం బయ్యును గళంకాంకితంబు గాక సకలకళాలాలితంబును, అంబరతలంబునుం బోలెఁ జంద్రతారాభిశోభితం బయ్యును సర్వజ్ఞవిగ్రహంబు గాక బుధగురుకవిప్రకాశబంధురంబును, అమరావతీపురంబునుం బోలె రమణీయాప్సరోరంజితం బయ్యును బుణ్యజనవిరహితంబు గాక సురభిహరిచందనసురమణీసదనంబును, అలకాపురంబునుంబోలెఁ దురగముఖబలవిక్రమోద్భటం బయ్యును గుబేరాస్పదంబు గాక యభినవోద్యానపుష్పకాంతంబు నై; నరసింహప్రభావపరిణతం బయ్యును బ్రహ్లాదజనకసముత్సాహదోహలంబును, వీరభద్రవిహారాస్పదం బయ్యును దక్షయజ్ఞమనోజ్ఞంబును, ద్విజరాజతేజోవిరాజితం బయ్యును గమలాభి

రామంబును, విజయవీరాలాపవిలసితం బయ్యును సైంధవోల్లాసబంధురంబును, రా
మాభిరామం బయ్యును విభీషణోల్లాసవిలసితంబును, దానవారిసమాక్రాంతం బయ్యు
ను హిరణ్యకశిపువిలసితంబును నై మెఱసి; దానంబునకు నిదానంబును, ధర్మంబునకు
మర్మంబును, విభవంబునకుఁ బ్రభవంబును, విక్రమంబునకు ననుక్రమంబును, సౌఖ్యం
బునకు ముఖ్యంబును నై యొప్పునప్పురంబునకు నధీశ్వరుండు. 101

సీ. తనభుజాస్తంభంబు ధరణీవిలాసినీసాలభంజికకు నాస్పదము గాఁగఁ
దనకీర్తినర్తకి దశదిశామండలీరంగమధ్యమున నర్తనము సేయఁ
దనఖడ్గభుజగేంద్రుఁ డనతరాజన్యకప్రాణానిలంబుల నాహరింపఁ
దనప్రతాపాగ్ని యుద్దామదిగ్గజకర్ణతాలవృంతముల వర్ధనము నొంద
సురభిసురరత్నసురభూజశరధిచంద్ర, సాంద్రలజ్జానుసంధానచతురవితర
ణప్రకీర్తితబుధజనానందుఁ డగుచుఁ, దనరె శృంగారశేఖరధరణివిభుఁడు. 102

క. శోభాగణనీయయశో, లాభాగమనాభిలాషలంపటుఁ డగుచున్
భూభాగ మేలె నాతఁడు, నాభాగ దిలీప రంతి నహుషుల మాడ్కిన్. 103

క. ఆ రాజు రాజ్యమున ధర, నారూఢివహించెఁ జిరతరాయురనేక
శ్రీరుచిరపుత్త్రపౌత్త్రస, దారోగ్యసుభాగ్యసంతతానందంబుల్. 104

వ. అమ్మహీశ్వరుం డొక్కనాఁడు. 105

సీ. సకలభాషాకావ్యసత్కవిరాజులు నుభయపార్శ్వంబుల నల్లసిల్ల
సంగీతవిద్యాప్రసంగపారంగతగాయకేంద్రులు సమ్ముఖమున మెఱయఁ
జరమభాగమునందుఁ జామరగ్రాహిణీకంకణఝుంఝుంత్కార మెసఁగఁ
బదపీఠి చెంగటఁ బ్రణతరాజకిరీటనవరత్ననీరాజనములు నిగుడ
సహజకరుణాకటాక్షవీక్షణవిశేష, దీపితాశేషధనకృతార్థీకృతార్థి
కలితచాటుసుధాపూర్ణకర్ణుఁ డగుచు, నిండువేడుకతోఁ గొలువుండె నపుడు. 106

ఉ. క్రొన్ననవింటివాఁడో నలకూబరుఁడో నలుఁడో జయంతుఁడో
యున్నరమూర్తి యంచుఁ గొలు వెల్లను నచ్చెరువొంది చూడఁగా
విన్నను వొప్ప నొక్కరుఁడు విప్రకుమారకుఁ డేఁగుదేర, న
త్యున్నతరత్నపీఠమున నుంచి నృపాలకుఁ డిచ్చె నర్చనల్. 107

ఆ. ఇచ్చి యాదరించి, యెయ్యది నీనామ, మెచట నుండి యిచటి కేటి కిప్పు
డేఁగుదెంచినాఁడ? వెఱిఁగింపు మనుటయు, నిట్టులనియె భూసురేశ్వరుండు. 108

క. నాపేరు చంద్రగుప్తుఁడు, భూపాలక సకలకళలఁ బొగడొందినవృ
ద్ధోపాధ్యాయులశిష్యుఁడ, నాపుణ్యాత్ముల కృపాకటాక్షమువలనన్. 109

మ. చతురామ్నాయములున్ దదంగములుఁ మూచా తప్పకుండ గ్రహిం

చితి వేదార్థరహస్యముల్ దెలిసితిం జేకొంటి న్యాయక్రమో
న్నతి శీలించితి ధర్మశాస్త్రముఁ బురాణప్రౌఢిమన్ గాంచితిన్
మతిలో నీపదునాల్గువిద్యలును సమ్యఙ్మానంబునం బూనితిన్. 110

క. గారవమున సకలకళా, పారీణుఁడ నైతిఁ బసిఁడిపళ్లెర మైనన్
జేరుపఁగఁ జోటు వలె నని, చేరితి నిను నాదుకోర్కెఁ జింతింపు మదిన్. 111

తే. అనుచుఁ దత్కాలయోగ్యంబు లైనయట్టి, భాషణంబుల బహుకళాప్రౌఢి దోఁపఁ
జంద్రగుప్తుండు గావించె సరసగోష్ఠి, వట్టిమ్రాఁకులఁ జిగురులు పుట్టునట్లు. 112

ఉ. ఆలలితప్రసంగమున కాత్మఁ దలిర్చిన ఛత్రచామరాం
దోళిక లాదిగాఁ గలుగుతోరపుసంపద లిచ్చి యమ్మహీ
పాలుఁడు సత్కరించె ద్విజబాలకముఖ్యు ననేకభంగి ను
న్మీలితబంధుపంకజవనీకమలాప్తునిఁ జంద్రగుప్తునిన్. 113

మ. చిరకీర్తిప్రథమానదానకలనాశృంగారశృంగారశే
ఖరధాత్రీరమణుండు నిత్యమును వేడ్కన్ దన్ను మన్నింప సు
స్థిరలక్ష్మీరతి నుల్లసిల్లె ధరణీదేవోత్తముండుం బురిన్
వరశిష్యప్రకరప్రబోధనకళావ్యాఖ్యానసౌఖ్యాత్ముఁడై. 114

క. అంతట నొకనాఁడు జర, త్కాంతామణి యొర్తు గదిసి ఘనతరవినయా
నంతభయభక్తి నతనికి, నెంతయుఁ బ్రియ మొదవ మ్రొక్కి యిట్లని పల్కెన్. 115

సీ. శ్రీరమ్యగుణధాము శృంగారనిస్సీము తోయజభవవంశతుహినధాము
యీమధురాపురాధీశుఁడై విలసిల్లుశృంగారశేఖరక్షితిపుపాల
వృషలోత్తముం డైనవీరవర్మం డనుదండనాయకుఁ డాత్మజుండు నాకు
నతని గాదిలిపట్టి యభినవతారుణ్యమహనీయతాస్పద మదనరేఖ
రాగమంజరి యన నొప్పు రాజసుతయుఁ, దాను నొకయీడు గాఁగ నెంతయును వేడ్క
నమ్మహీపతి యక్కన బొమ్మనందుఁ, బెట్టుకొని యెక్కలాగునఁ బెనుపఁ బెరిఁగి.

క. కామితఫలదము లనఁ దగు, నోములు సర్వమును నోఁచి నుతదానకళా
శ్రీమించె బహుస్యందన, సామజహయరోహణప్రశస్తి వహించెన్. 117

క. ఆరమణి రూపరేఖా, చారువిలాసము లనన్యసాధారణముల్
శ్రీరమణీతనయరమా, ధారణములు ప్రథమరసకథాకారణముల్. 118

సీ. అతివతిన్ననిమాట లమృతంపుఁదేటలు హరినీలమణులమై నలరుకురులు
వనజాక్షిచూపులు వలరాజుతూపులు క్రొత్తవెన్నెలలోని క్రొవ్వు నవ్వు
మెలఁత మేనిమెఱుంగు మెఱయుకారుమెఱుంగు చిగురుకెంపులక్రోవి చిన్నిమోవి
కోమలిచనుదోయి కోదండజక్కవదోయి శృంగారవీచులు చెలువవళులు

గంధసింధురశుండాప్రకాండకరభ, కదళీకాకాండకాంతవర్గములతోడి
పెందొడలు కాంత పెందొడ లెందు నరయ, మదనరేఖకు సరియైనమగువ గలదె. 119

క. ఆన్నెలఁత నిన్ను నున్నత, సన్నుతమణిచంద్రసౌధశాలలలోనన్
గ్రొన్ననవిలుతుని నోముచు, వెన్నెల నెచ్చెలులుఁ దాను విహరించుతఱిన్ 120

క. చిలుకలతేరును గోకిల, బలములు లేఁజెఱకువిల్లుఁ బ్రసవాస్త్రములున్
దొలఁగించినమరుఁడో యన, విలసితగతి నీవు రాజవీథిఁ జరింపన్. 121

సీ. ఎలమితోఁ గోరిక లీరిక లెత్తినసరణి మేఁ బులకలు జాదుకొనఁగ
నలువులువాఱెడునను రాగరసలీల నానందబాష్పంబు లగ్గలింప
మఱుఁగువెట్టక డెంద మెఱిఁగించుకైవడి గొబ్బునఁ బయ్యెదకొంగు సడలఁ
గనుఁగొన్నమాత్రానఁ గరఁగుగతి దోఁపఁ జెమటచిత్తడిసోన చిప్పతిలఁగఁ
దమకమును సిగ్గుఁ దమలోనఁ దడఁబడంగ, మఱపుఁ జెయ్వులుఁ దమలోనమాఱుమలయ
పొలపుఁజూపులుఁ దమలోన సూడుపట్ట, సహజశృంగారచేష్టలు సందడింప. 122

క. లీలాతరంగితం బగు, లాలితభవదీయరూపలావణ్యరసం
బాలోలనయన నలినీ, నాళంబులఁ గ్రోలుచుండె నలినాక్షీ తగన్. 123

వ. అంత. 124

క. తరుణారుణారుణాంబుజ, శరమిక్షుశరాసనమున సంధించి మరుం
డరవిందనయన డెందము, కరమరుదుగ నుచ్చిపోవఁగా నేసె వెసన్. 125

క. అగ్గజగామిని కాముని, యగ్గలికకు బెగ్గడిల్లి యాళిజనములన్
దిగ్గనఁ గను మొఱఁగి కడున్, సిగ్గున నేకాంతసదనసీమకుఁ జనియెన్. 126

వ. అట్లు చనుటయు. 127

ఆ. సకియ లత్తెఱంగు సకలంబు నూహించి, కార్యగతిఁ దలంచి కడుఁ జలించి
యిందువదన యున్నకంచువ కేతెంచి, పొంచి నిలిచి యాలకించునపుడు. 128

సీ. తల్లిదండ్రులమాట చెల్లనిచ్చెద నన్నఁ దగు లుజ్జగింప నాతరముగాదు
మాటిమాటికిఁ గూర్మి మాటుసేసెద నన్నఁ బైకొన్నవలవంత బయలువఱుపఁ
జెలులతో నింతయుఁ జెప్పి చూచెద నన్న సిగ్గు నాచనవులు చెల్లనీదు
చక్కనిమానంబు చిక్కఁబట్టెద నన్నఁ బంచబాణుఁడు గడుఁ బ్రల్లదీఁడు
కమలనయనాచకోరరాకాసుధాంశుఁ, డైనయతఁ డేడ నే నేడ ననితలంప
కకట యుందనిపంటికి నబ్బుసాఁచెఁ, జిత్త మిటమీఁద నే నేమి సేయుదాన. 129

క. అని చింతాసంతాపము, లనితరసాధారణంబులై మదిలోనన్
బెనఁగొనఁగ నున్నకన్నియ, ననుగుణవతిఁ జేరి యిట్లు లనిరి వయస్యల్. 130

మ. తరుణీ ! చిత్తము భూసురోత్తమునిమీఁదం జేర్చి లజ్జాతిర

స్ఫురిణీగుప్తముగా నొనర్చి, యిటు లేకాంతంబు దుర్దాంతదు
ర్భరచింతం బడఁ బంతమమ్మ! మును వాక్ప్రౌఢిన్ విడంబింతు గా
విరహోత్కంఠితకామినీదళదశావిర్భావభావవ్యథల్. 131

వ. అంతఁ జతురికాజనంబులు తదీయదశాపనోదనం బొనరింపం దలంచి, యభిరామ
గృహారామంబున కెలయించిన. 132

సీ. బాలరసాలంబుపైఁ గేలు సాఁపదు తిలకించి చూడదు తిలకతరువు
సంపంగె ముఖరాగసంపద నలరింప దను నశోకమునకై యడుగనీదు
పాట వెంపార్పఁ జూపదు ప్రియాళువుఁ జేరి కుచవీథిఁ గూర్పదు కురవకంబు
కర్ణికారముఁ బొడగన్న మాటాడదు సిందువారముమీఁదఁ జేర్పదూర్పు
నను చుసురపొన్నఁ గనుఁగొన్న నవ్వ దెపుడు, పొగడఁ బుక్కిటిమధువునఁ బ్రోదిసేయ
దిందుముఖి దోహదక్రీడ లీడ విడిచె, నలరువిలుకానిములుకుల కాత్మ నులికి. 133

వ. అప్పుడు. 134

క. పొదలినయారామములోఁ, గదలీతరుమధ్యదీర్ఘికాతటభూమిన్
బొదలినగురువిందలఁగో, విదితం బగుచంద్రకాంతవేదికమీఁదన్. 135

చ. దల మగుపచ్చకప్పురపుఁదావులు పైపయిసోఁడుముట్టఁ దైం
కలువలపాన్పుపై నునిచి కాంతకు గొజ్జఁగినీటితేటచే
జలకము లార్చి మైఁ గలయఁ జందనపంక మలంది, యంతయుం
బలుచనిసన్నగావివలిపంబులు గట్టఁగ నిచ్చి నెచ్చెలుల్. 136

వ. వెండియు. 137

క. చల్లనిమం దని పైపైఁ, జల్లనిమం దొకటి లేదు సతిడెందమునన్
జల్లఁదన మంద దయ్యెను, జల్లనిమందులను దాపసంపద మించెన్. 138

సీ. అటుతఁ దగిల్చినయాణిముత్తైపుఁబేర్లు హరినీలహారంబులై తనర్చెఁ
దనువల్లి నంటినధవళచందనచర్చ లీలఁ గాలాగరులేప మయ్యెఁ
గరముల మెత్తినకర్పూరరేణువుల్ కస్తూరికాగురుకణము లయ్యెఁ
సెజ్జపైఁ బఱచిన చేమంతిరేకులు కలయ నిందీవరదళము లయ్యెఁ
జిత్తజాతుండు కనుమాయ చేసినాఁడొ, మనమునంబుల విభ్రాంతి మట్టుకొనెనొ
కమలలోచనపరితాపగౌరవంబొ, యనుచు వెఱఁగంది మదిఁ గుంది యబ్జముఖులు. 139

క. ఇంతకు మిన్నకయుండుట, పంతము గాదనుచు, వీరవర్మనితోడన్
గాంతామణిసంతాపముఁ, గంతుప్రతాపంబు లులియఁగాఁ జెప్పుటయున్. 140

క. విని భయము ప్రియము మనమున, నెనయఁగ, నవ్విభుఁడు వినయ మెసక మెసంగన్
నను నీపాలికిఁ జను మని, పనిచినఁ బనివింటిఁ గార్యభంగి ఘటింపన్. 141

క. చాలింపు మితరముల మదిఁ, బాలింపుము శూద్రవర్మఁ బ్రమదాత్మునిఁగా.
నాలింపుము నావిన్నప, మేలింపు మనోజరాజ్య మెంతయు నింతిన్. 142

వ. అనిన నమ్మహీసురముఖ్యుం డమ్మగువ కిట్లనియె. 143

క. అతివా! ముదియఁగ ముదియఁగ, మతిదప్పెనొ కాక నీకు మనమున నియమ
వ్రతపరుల శూద్రరమణీ, రతికై బోధింప వత్తురా యిది తగవా. 144

చ. అనవుడు నింతి యీయెడఁ బ్రయాసపడం బనియేమి యంచు వే
గన ములు ముంటఁ బుచ్చుటయె కార్యముగాఁ దలపోసి చంద్రగు
ప్తునిఁ దగురీతి వీడుకొని భూపతిపాలికిఁ బోయి పూసగ్రు
చ్చినగతిఁ గార్యనిర్ణయ మశేషము తిన్నగ విన్నవించినన్. 145

స. విని కడుసంభ్రమించి యతివేగమ కంచుకిఁ బంచి చంద్రగు
ప్తునిఁ బిలిపించి యాదరముతోడ సమున్నతనూత్నరత్నకాం
చనమయరమ్యపీఠ మిడి సారగభీరవచోనిరూఢి నొ
య్యన వినయంబు తేటపడ నమ్మనుజేంద్రకులేంద్రుఁ డిట్లనున్. 146

ఆ. నిరుపమాన మైననీమోహనాకార, రేఖ మాచె మదనరేఖ యనుచు
నదియు తప్పుచేసి యలరంపగము శేసి, యలఁతఁబెట్టఁ దొణఁగె నంగభవుఁడు. 147

క. మరుచేఁ దొడిఁబడకుండఁగఁ, గరుణింపు సరోజనేత్రఁ గావు మహింసా
పరమోధర్మయనం గల, పరమార్థనిరూపణంబు భావించి మదిన్. 148

వ. అనవుడు నబ్బ్రాహ్మణుండు. 149

మ. సచ్చరితానువర్తనము సాధుజనంబులు సమ్మతింపఁగా
నచ్చపుబ్రహ్మచర్యము ప్రయత్నమునం జరియించుచుండి నేఁ
డో చెలి! శూద్రభామినికి నువ్విళులూరి పథంబు దప్పఁగా
వచ్చునె? లెద్దునాకి యుపవాసము మాన్పికొనంగ నేటికిన్. 150

క. వర్ణాశ్రమధర్మంబుల, నిర్ణయములు దొఱఁగకుండ నియమించుయశః
పూర్ణులు మీరలె యీయది, నిర్ణయ మని పలుకఁ దగునె నిండినసభలోన్. 151

వ. అనిన నమ్మహీశ్వరుం డిట్లనియె. 152

క. పారాశర్యప్రముఖు ల, పారకృపామహిమ తేటపడ నింతులదౌ
కోరిక దీర్చుట వినమే, వారిసదాచారగౌరవం బెడలెనొకో. 153

క. నావుడు భూసురుఁ డిట్లను, దేవరయానతియు నస్మదీయనియమముఁ
భావించి సయుభయమ్మతి, గావించునుపాయ మొకటి గాంచితి వినుఁడీ. 154

చ. వరుసను బ్రాహ్మణోత్తముఁడు వర్ణచతుష్టయజాతకన్యలన్
బరిణయమౌట ధర్మమని పల్కుదు రాదిమునీంద్రముఖ్యుల

వ్వేర వాఁడఁగాఁడు నేనిఁ బృథివీవర! యీవరవర్ణినీమణిన్
గరమనురాగలీలఁ బ్రియకామిని గాఁగఁ బరిగ్రహించెదన్. 155

వ. అనిన నమ్మహీపాలుండు తదనులాపానురూపప్రవర్తితకార్యుండగుటయుఁ దద్వృ
త్తాంతం బంతయు మదనరేఖ కాంతాజనంబులవలన నెఱింగి. 156

క. కాదంబినీసముద్గత, నాదంబున నీపలతిక ననిచినభంగిన్
జాదుకొనఁ బులకకలికా, శ్రీ దనువల్లికకుఁ జాలఁ జెన్నొదవింపన్. 157

సీ. చెదరినయలకలచిక్కు చక్కఁగఁ దీర్చి, జాఱినకనయంబు సవదరించి
తనువునఁ బైకొన్నతాప ముజ్జనచేసి తొరఁగెడికన్నీరు తొలఁగఁ ద్రోచి
చెక్కుటద్దములపైఁ జిఱునవ్వు చిలికించి చిన్నవోయినమోము సేద దీర్చి
తలఁకు డెందముతోడఁ దాలిమి గీలించి పయ్యెదఁ జనుదోయిఁ బదిలపఱిచి
పంచబాణుండు కరసానఁ బట్టినట్టి, రత్నపుత్త్రికవోలె వినూత్నరత్న
కాంతి నెంతయు మోదించి కమలవదన, సఖులకెల్లను లోచనోత్సవము చేసె. 158

తే. అంత నిజపురి శృంగార మాచరింపఁ, బనిచె శృంగారశేఖరమనుజవిభుఁడు
హితపురోహితమంత్రిసమ్మతిము గాఁగఁ, దత్తదనుకూలశుభముహూర్తములయందు.

సీ. తనపురోహితుఁడు నాఁ దగువిష్ణుశర్మునివరపుత్త్రి యగుశీలవతి లతాంగిఁ
దనతనూజాతయై తారుణ్యమున నొప్పు రాగమంజరి యను రాజవదనఁ
దనదుభాండాగారమున కధీశ్వరుఁడైన ధనగుప్తుఁ డను వైశ్యుతనయ సుమతిఁ
దనదండనాయకోత్తముని గాదిలికూఁతు మదవతీమణి యైనమదనరేఖఁ
గ్రమము దప్పకయుండ నా రాజవరుఁడు, సకలలౌకికవైదికాచారసరణిఁ
బ్రియముతో విప్రవరునకుఁ బెండ్లిసేసె, వేఱుసేయక వారికి వేఱువేఱ. 160

క. నానామణిగణకాంచన, చీనాంబరబహుసుగంధశృంగారవతీ
దానానేకపరథతుర, గానేకగ్రామసమితి నరణం బిచ్చెన్. 161

క. ఆవివిధవినుతవిభవ, శ్రీవిలసనభాగ్యరసవిశేషస్ఫురణన్
దేవేంద్రునిగతి ధరణీ, దేవేంద్రుఁడు సకలభోగదీపితుఁ డగుచున్. 162

సీ. శీలవతీనిత్యశృంగారశేఖావనాంతరక్రీడావసంతుఁ డగుచు
మంజులతరరాగమంజరీవక్షోజమంజరీమధుపకుమారుఁ డగుచు
సుమతిసీమంతినీకమనీయశశికాంతపాంచాలికాశీతభానుఁ డగుచు
మదనరేఖావధూమానసాంతరరాజహంసావతంసవిహారుఁ డగుచు
వరుసదక్షిణనాయకత్వమున మించి, యొక్కతెఱఁగున ననురాగ మొదవఁ జేసి
యుచితరతిరాజలీలల నోలలార్చెఁ, జంద్రగుప్తమహీసురచక్రవర్తి. 163

క. ఇత్తెఱఁగున నన్నలువురు, మత్తచకోరాక్షులకుఁ గ్రమక్రమము మెయిన్

జిత్తజకేళినిపుణతఁ, జిత్తానందంబు లొదవఁ జేయుచు నుండెన్. 164

వ. అంతఁ గొంతకాలంబునకును. 165

సీ. చూపుల నిగురొత్తుసోలంబుతోడన సోలంబు తనువున మేళవింప
విలసిల్లుత్రివళులవిరివితోఁ గూడంగ విరివి నెమ్మనముల విస్తరిల్ల
జడిగొన్న చెయ్వులజడనుతోడను గూడ జడను నెన్నడలను జాదుకొనఁగఁ
బొలుపారునారులనలుపుతోడనుగూడ నలుపు చన్మొనలందు నాటుకొనఁగఁ
గమనములఁ జాల నలసత గానఁబడఁగ, నెమ్మనంబులు మృత్స్నారథమ్ము గోర
మిగులవేఁకనితోడవులమెచ్చు సడల, గర్భసంపద నొప్పి రక్కమలముఖులు. 166

సీ. వేదవేదాంగాదివిద్యలు శీలింప శీలవతీకాంత చింత సేయు
ధరణి నేకాతపత్రముగ నేలుకొనంగ సతతంబు రాగమంజరి తలంచు
రాజరంజనరీతి రసికతామహిమల సుమతియై వెలుఁగంగ సుమతి గోరు
సగుణనిర్గుణములసంబోధనాపేక్ష మదిలోన భావించు మదనరేఖ
యాత్మగర్భాంతరాళంబులందు నున్న, యర్భకులయందు నందమై యతిశయిల్లు
గుణము లన్నియు నిచ్ఛనుగుణము లగుచు, నాఁటినాఁటికిఁ దమయందు నాటుకొనఁగ.

చ. లలితకపోలమండలములన్ మణికుండలముల్ నటింప వి
చ్చలవిడిగా వినూత్నపురుషాయిత కేళికి నగ్గలించున
గ్గలికలు చెల్లకున్న నధికవ్యథ నొయ్యన మాటిమాటి కూ
ర్పులు నిగిడింపఁ జొచ్చిరి సరోరుహనేత్రలు గర్భఖిన్నతన్. 168

చ. కనుఁగొని నెమ్మనం బలరఁగాఁ, బులిజున్నును నేఁదుకన్న దె
మ్మనినను దెచ్చువాఁడఁ బ్రియ మైనవి యెల్లను జెప్పఁడంచు నొ
ప్పున హృదయానువర్తి యయి పల్కుసు బంతము నొక్కభంగి గాఁ
దనియఁగ నిచ్చు నవ్విభుఁడు తామరసాక్షులు గోరుకోరికల్. 169

క. అంత నవమాసము లతి, క్రాంతము లగుటయును గమలకైరవహితసి
ద్ధాంతమతి వెలుఁగు తేజో, వంతుం డగుసుతుఁడు శీలవతి కుదయించెన్. 170

తే. తత్సుతోదయవార్తా మహోత్సవమునఁ, జంద్రగుప్తుండు పూర్ణిమాచంద్రుఁ గనిన
సంద్రమునుబోలె నానందసాంద్రుఁ డగుచు, మఱి యథావిధి జాతకర్మంబొనర్చె.

చ. అరు దగుచున్న జన్మసమయగ్రహయోగబలంబు పెంపునన్
వరరుచియై దిగంతముల వాలుఁ జతుర్దశసంఖ్యవిద్యలన్
వరరుచి యైనమూర్తి నవవారిజమిత్రునిఁ బోలునంచుఁ దా
వరరుచినామవిస్ఫురణవంతునిఁగా నొనరించెఁ బుత్త్రునిన్. 172

వ. ఒనరించి తోడ్తోన నిరతిశయ లీలాలోకనరిరంసామాంగల్యమిళిత మనోహరాంగుండై

యుండె, నంతఁ గొన్ని దినంబులకును. 173

మ. దినకృత్స్వాంపరచైత్రశుక్లనవమిం దిష్యం ధృతీయాంశ సం
జననం బొందెను రాగమంజరికి రాజద్భాగ్యసౌభాగ్యసూ
చనలగ్నంబున బుత్త్రిరత్నము నిజోచ్చక్షేత్రసందీప్తులై
1 యినమందారసురాసురేజ్యబుధు లాయిందు న్విలోకింపఁగన్. 174

వ. అమ్ముహూర్తంబు మౌహూర్తికోత్తములు నిరూపించి. 175

శ్లో. కుముదగహనబంధౌ వీక్ష్యమాణే సమస్తైరగనగగృహవాస్త్రైర్దీర్ఘజీవీ సతుస్యాత్
యదసదశుభజన్యంయచ్చకీదృగ్విమోదం సభవతినరనాథస్సార్వభౌమోజితారిః. 176

వ. అని హోరాస్కంధబంధురం బైనయీపద్యంబు నుపన్యసించి యిక్కుమారుండు దీర్ఘాయురుపేతుండును జితారిసంఘాతుండును జక్రవర్తిపదఖ్యాతుండును నగునని విన్నవించిన. 177

క. ఆవార్త లమృతలహరీ, భావంబునఁ గర్ణవీథిఁ బ్రవహించి తను
ప్లావనము చేసి, ధరణీ, దేవకులాగ్రణిమనంబుఁ దెప్పలఁదేల్చెన్. 178

వ. అయ్యవసరంబున. 179

మ. కురిసెం గల్పతరుప్రసూనములు దిక్కూలంకషప్రాయమై
మొఱసెం దివ్యమృదంగనిస్వనము సమ్మోదానుసంపాదియై
పొరసెం జందనశైలమారుతము గంభీరాప్సరోనృత్యముల్
దొరసెం గన్నులపండువై జనులు సంతోషించి ఘోషింపఁగన్. 180

క. ఆజగతీసురుఁ డప్పుడు, రాజోచితబహుతురంగరథధేనుమహీ
రాజముఖీధనధాన్యస,మాజమహాదానగుణసమగ్రత మెఱయన్. 181

వ. జాతకర్మంబు యథోచితక్రమంబున నిర్వర్తించి యనంతరంబ. 182

తే. విక్రమంబున నాదిత్యువిధము దోఁప, సుప్రతాపానురూపతేజోవిశేష
కలితుఁ డగునని తజ్జన్మఫల మెఱింగి, తనయు విక్రమాదిత్యాభిధానుఁ జేసె. 183

తే. అంత సుమతికి సంజాతుఁ డైనయట్టి, పట్టికిని భట్టియని పేరువెట్టి పిదప
మదనరేఖావిలాసిని కుదయమైన, తనయునకు భర్తృహరినామ మొనరఁ జేసె. 184

వ. ఇత్తెఱంగునఁ బుత్త్రోదయోత్సవానందంబునం దృప్తుండై చంద్రగుప్తుండు. 185

క. సముచితకర్మక్రియలను, సముచితసంవర్ధనముల సముచితవిద్యా
సముదయసంశిక్షణములఁ, గ్రమమున నందనుల ఘనులఁగాఁ జేయుటయున్. 186

క. లోకహితకావ్యరచనా, సాకల్యప్రౌఢి వేదశాస్త్రపురాణ

---

1 ఇనమందా...ధులు=సూర్యశన్యంగారక గురుశుక్రబుధులు.

వ్యాకరణసరణివరరుచి, యేకముఖబ్రహ్మయనఁగ నెన్నికకెక్కెన్. 187

సీ. వచియించెఁ బ్రాకృతవ్యాకరణాగమం బభినవంబుగ భోజవిభుఁడు మెచ్చ
సకలవర్ణాశ్రమాచారనిర్ణయ మొప్ప ధర్మశాస్త్ర మొనర్చెఁ దక్షు లలర
ధీయుక్తి మెఱయ జ్యోతిశ్శాస్త్ర మొనరించె సకలలోకోపకారకము గాఁగఁ
గాళిదాసునినవ్యకావ్యవిద్యాప్రౌఢి వరకవీశ్వరచక్రవర్తిఁ జేసె
భవ్యనారాయణీయ ప్రపంచసార, శారదాతిలకాదిప్రశస్తమంత్ర
శాస్త్రసర్వాంకషజ్ఞానసరణి మించె, శీలవతిపట్టి సర్వజ్ఞశేఖరుండు. 188

శా. శ్రౌతస్మార్తరహస్యవేదులు గురుస్థానంబు గాఁ జూడ వి
ఖ్యాతప్రౌఢి మహాకవీశ్వరులు సాక్షాద్భారతీమూర్తి గాఁ
జేతోవీథిఁ దలంపఁగా నతఁడు మించెన్ ధర్మమర్మజ్ఞతా
చాతుర్యోన్నతులైన రాజులకుఁ బూజాలింగమై యెంపునన్. 189

సీ. వేదశాస్త్రపురాణవివిధాగమంబులు కరతలామలకంబుగా నెఱింగె
నవరసోజ్జ్వలకావ్యనాటకాలంకారసమితి నామూలచూడముగఁ జూచె
ధర్మార్థకామశాస్త్రప్రపంచంబులు * పల్లవిపాటగాఁ బరిచయించె
వారణస్యందనవాహనారోహణక్రమమున మర్మకర్మములు దెలిసె
నృత్యగీతవిద్యాప్రౌఢి నిర్వహించె, సకలదివ్యాస్త్రశస్త్రప్రశస్తి మించెఁ
దేజమున నొప్పి భట్టిద్వితీయుఁడగుచు, విక్రమాదిత్యుఁ డసమానవిక్రముండు. 190

క. మరువము మొలవఁగఁ దోఁడనె, పరిమళ ముదయించినట్లు పరమజ్ఞాన
స్ఫురణము బాల్యమునప్పుడె, పరిణతమై భర్తృహరికిఁ బ్రభవించుటయున్. 191

ఉ. ఎంతయు వేడ్కతోఁ బరిచయించినవిద్యలయట్ల వేదవే
దాంతరహస్యమర్మములు నమ్మహితాత్ముని కాత్మఁ దోఁచె న
త్యంతము చోద్యమై మెఱయునంజన మబ్బినవానికిన్ ధరా
క్రాంతము లైన పెన్నిధులు కన్నులకుం బొడచూపుకైవడిన్. 192

ఉ. అందఱు నన్నివిద్యల మహామహులై విలసిల్లుచుండఁగా
నందనులం గనుంగొని మనంబునఁ బొంగుచుఁ జంద్రగుప్తుఁ డా
నందమహాంబుధిన్ దినదినంబును దెప్పలఁ దేలుచుండె సం
క్రందనుకంటె వైభవపరంపర మించి యనేకకాలమున్. 193

శా. తారుణ్యంబున నమ్మహీసురుఁ డొగిన్ ధర్మార్థ కామక్రియా
చారంబుల్ సరిగాఁ జరించి తుదమోక్షశ్రీ నపేక్షించి సం

* వల్లెపాఠంబుగాఁ బరిచయించెఁ. అనిపాఠాంతరము.

సారాంభోనిధియానపాత్ర మగు శ్రీశైలంబుమీఁదం దపం
బారంభింపఁ దలంచి సంపనుల డాయం బిల్చి తా నిట్లనున్. 194

తే. గయ సహస్రయుగంబులు కాశియందు, యుగసహస్రంబు వింశతియుగము లధిక
నిష్ఠఁ గేదారమున నున్న నియతఫలము, నొక్కదినము శ్రీనగమున నున్నఁ గలుగు. 195

సీ. శ్రీశైలమాత్మలోఁ జింతించినంతన జాతిస్మరత్వంబు సంభవించు
వేడ్కఁ దచ్ఛిఖరంబు వీక్షింపఁగోరిన సప్తజన్మాఘనాశంబు చేయు
నాత్రోవ రెండుమూఁడడుగు లేగినమాత్ర సకలజన్మములదోషములు పాయు
నత్యంతనియతిమై నగ్గిరి కేగినఁ బరమసాయుజ్యంబుఁ బడయవచ్చు
నెన్నిభంగుల శ్రీగిరి కేగువాఁడు, ధన్యుఁ డగు నశ్వమేధంబుఫలము
నట్టి శ్రీగిరి కర్థిమై నరుగలేని, గుణవిహీనుండు పిచ్చుకకుంటు గాఁడె. 196

సీ. ఏకొండశిఖరాగ్ర మీక్షించినంతన భవబంధములఁ బెడఁబాపఁ గల్గు
నేకొండ యిల్లుగా నీశానుఁ డేప్రొద్దుఁ బార్వతీసహితుఁడై పాయకుండు
నేకొండసన్నిధి నెల్లతీర్థంబులు పాతాళగంగాఖ్యఁ బరఁగుచుండు
నేకొండమీఁద బ్రహ్మేంద్రాదిదివిజులు శబరవేషంబుల సంచరింతు
రట్టి శ్రీపర్వతము చూచినట్టివారు, గట్టిపుణ్యంబు చేసినయట్టివారు
ఘనతపఃఫలసిద్ధులు గన్నవారు, హరునికత్యంతనిజభక్తులైనవారు. 197

క. ఏపాపము లొనరించిన, నాపాపము లణఁచుచుండు నటమీఁదన్నరయం
జోపికమీఱంగాఁ జని, శ్రీపర్వతదర్శనంబు చేసినయేనిన్. 198

చ. శిల లఖిలంబు లింగములు చెట్లు సమస్తము కల్పభూజముల్
జలములు దేవతానదిజలంబులు మానవులెల్ల సంయముల్
పలికినపల్కులెల్లను జపంబు చరించుట సత్ప్రదక్షిణం
బులు నిదురల్ సమాధి తలపోయఁగ శ్రీగిరిమీఁదఁ జోద్యముల్. 199

ఉ. వారణసీపురంబున నవారణ మేను దొఱంగ నేల కే
దారజలంబు లర్థిమెయిఁ ద్రావి శరీరము కోరవోవఁగా
నారడి పొంద నేల యొకయప్పుడు జన్మము లేకయుంటకై
యారయ శ్రీనగంబుశిఖరాగ్రము చూచినఁ జాలు నెమ్మదిన్. 200

మ. క్రతువిధ్వంసము బ్రహ్మహత్యయును ధర్మద్వేషముల్ సోదరీ
సుతసంహారము నాదిమైనదురితస్తోమంబులం బాసి శా
శ్వతపుణ్యోదయుఁ డయ్యె నగ్గిరి నివాసంబొట రుద్రుండు దు
ష్కృతముల్ వాయుట లేమిచోద్యము జనుల్ శ్రీపర్వతం బెక్కినన్. 201

క. కావున శ్రీనగమున కేఁ, బోవఁగ నూహించి మిమ్ము బోధించుటకై

రావించితి, నావాక్యము, భావింపఁగ వలయు నిపుడు పరమార్థముగన్. 202

చ. బ్రదుకుము విక్రమార్కనరపాలక దిగ్విజయంబుచేసి, య
భ్యుదయముఁ బొందు భట్టి నిజబుద్ధినియోగితనంబునందు స
మ్మదమున మించు భర్తృహరి, మాధవ మెల్లను నీకు నిచ్చితిన్
హృదయ మెలర్పఁగా వరరుచీ సుఖియింపుము వంశకర్తవై. 203

తే. అనుచు నొడఁబడ వారికి నానతిచ్చి, యాత్మరమణీసమేతుఁడై యాక్షణంబ
శ్రీనగస్వామి పదపద్మసేవ సేయఁ, జంద్రగుప్తమహీసురచంద్రుఁ డరిగె. 204

వ. ఇట్లు చతుర్థపురుషార్థ తత్త్వజ్ఞానగురుం డైననిజగురుం డరిగిన యనంతరంబ. 205

చ. పరిచితనవ్యకావ్యరసభావవిచక్షణ పుణ్యవీక్షణా
పరమహితాశ్రితప్రకరబాంధవపోషణ సత్యభాషణా
తరళవిలోచనాజనవితానమనోభవ నిత్యవైభవా
నిరవధికప్రభావనృపనీతియుగంధర కీర్తిబంధురా. 206

క. చతురావధానభాషా, చతుర జనస్తూయమాన సహజమనీషా
యతులితగుణమణిభూషా, ప్రతివాసరవర్ధమాన భవ్యవిశేషా. 207

మాలినీ. తరుణకమలనేత్రా దర్పకజైత్రయాత్రా
పరహితసుచరిత్రా భాగ్యలక్ష్మీకళత్రా
సరసుకవిమిత్రా సజ్జనారామచైత్రా
హరితకులపవిత్రా, యక్కమాంబాసుపుత్రా. 208

గద్య. ఇది శ్రీమదఖిలకవిమిత్త్ర పెదయ్యన్నయామాత్యపుత్త్ర
శారదాదయావిధేయ జక్కననామధేయ ప్రణీతంబైన
విక్రమార్కచరిత్రం బను కావ్యంబునందుఁ
బ్రథమాశ్వాసము.

శ్రీరస్తు.

విక్రమార్కచరిత్రము.

ద్వితీయాశ్వాసము.

నాథచరణయుగళ
ధ్యానాధీనాంతరంగ తరుణీజనచే
తోనందన నిజమూర్తి
శ్రీనందన జన్న నార్యసిద్ధనమంత్రీ. 1

చ. అరుదుగ విక్రమార్కవసుధాధిపచంద్రుఁడు కీర్తిచంద్రికల్
ధరఁ బరఁగింప దిగ్విజయతత్పరుఁడై యొకరుండు వింధ్యభూ
ధరమున కేఁగి యందుఁ బ్రమదంబు మది న్విలసిల్లఁ గాంచె నీ
శ్వరవరవామభాగసహవాసవిలాసిని వింధ్యవాసినిన్. 2

వ. కాంచి లలాటాంబకకుటుంబినీపదాంభోరుహాలంబకదంబాయితచికురనికురుంబలాం
ఛనలపనచంద్రమండలుండై యమ్మండలాధీశ్వరుండు తదీయమందిరద్వారంబు నిర్గ
మించితత్ప్రదేశంబున. 3

క. ప్రబలాసురవరసూనులు, సుబలమహాబలులు వాలిసుగ్రీవులు నా
నిబిడాంగరక్తధారా, శబలితభూభాగ మయినసమర మొనర్పన్. 4

వ. కాంచి తత్కలహంబు వారించి తత్కారణం బడుగుటయు వార లిట్లనిరి. 5

చ. హరునిగుఱించి వత్సరసహస్రము ఘోరతపంబుచేసి త
త్కరుణ దుకూలకంథయును దండముఁ బావలు రత్నపాత్రముల్
వరమునఁ గాంచె మద్గురుఁ డవారణమైఁ బ్రబలాభిధానుఁ డీ
యురువిడిచేత నయ్యెడుప్రయోజన మెల్లను జిత్తగింపుమా. 6

శా. ఈలాతంబున వ్రాయఁ బట్టణములౌ నీపాదుకల్ మెట్టఁగా
నేలోకంబున కైన నేగ సులభం బీపాత్ర దివ్యాన్నముల్
చాలంగా సమకూర్చుఁ గోరినతఱిన్ సంధిల్లు నీకంథచే
వేలతుల్ కనకంబు రాలు విదుపన్ విశ్వంభరాధీశ్వరా. 7

తే. తండ్రిపిన్నటనివి యేము తగినభంగిఁ, బంచుకొననేరకిట్టుయిఁ బ్రతిదినంబుఁ
బోరుచున్నార మిట నీవు పొందు వొసఁగఁ, బంచి పెట్టి రక్షింపుమీ పార్థివేంద్ర. 9
వ. అనవుడు.
క. జనపతులకుఁ బాపాత్ముల, ధన మెమ్మెయి నైనఁ గొనుట ధర్మం బనఁగా
విని యున్నవాఁడు గావున, ధనసంగ్రహణంబునందుఁ దత్పరమతియై. 10
చ. అనఘుఁడు విక్రమార్కవసుధాధిపచంద్రుఁడు మందహాస మా
ననము నలంకరింపఁ గుహనాచతురుండయి బుజ్జగించి నా
పనుపున మీఱుచేసెఁజుచిపాటుఁడు మీఱినయట్టివాఁడె యీ
ధనమునకెల్లఁ గర్త యగుఁ దప్పదు పొమ్మని యానతిచ్చినన్. 11
చ. పనివడి యొండొరుం గడవఁ బాఱెడియాసను వారు దవ్వుగాఁ
జనుట యెఱింగి కంథయును సన్మణిపాత్రయు యోగదండమున్
గొని వెసఁ బాదుకల్ దొడిగికొంచు వియచ్చరవాహినీక
త్కనకసరోజగంధవహకౌతుకుఁడై వినువీథి కేగుచున్. 12
చ. కనియె నతండు శంకరశిఖాశశిరంజితచంద్రకాంతసం
జనితజలార్ద్రకల్పతరుజాలముఁ గిన్నరకన్యకాప్రమో
దనమణిశృంగసంగతలతావనజాలము దివ్యవాహినీ
వనజవనీతలద్రుహిణవాహమరాళము మేరుశైలమున్.
వ. కనుఁగొని ప్రమోదభరితమానసుండై. 14
సీ. ఈకొండ మణికాంచనాకారరుచి గాంచెఁ గొండలెల్లను దనుఁ గొండెఁజేయ
నీకొండఁ గాఁపుండి యింద్రాదిసురముఖ్యు లెల్లభాగ్యములకు నెల్లలైరి
యీకొండ దండగా నీరేడుజగములు సుప్రతిష్ఠితములై సొంపుమిగిలె
నీకొండ కోదండమై కాలకంఠున కసమానజయలక్ష్మి నావహించె
నిర్జరాపగ యీకొండనిర్ఝరంబు, పద్మబాంధవుఁ డీకొండపారికాఁపు
కొండయల్లునికొండ యీకొండశిఖర, మని సుమేరుప్రభావంబు లభినుతించి. 15
ఉ. అందొకదివ్యరత్నశిఖరాగ్రతలంబున రాగమంజరీ
నందనుఁ డబ్జినీతటమునన్ సురభూజమునీడ నిల్చి లీ
లం దన నెమ్మనంబునఁ దలంచినమాత్రనె పాత్రయందు నా
నందకరంబుగాఁ బొడమె నవ్యసుధామధురాన్నపానముల్. 16
శా. ఆయిష్టాన్నము లారగించి యతఁ డాహ్లాదంబుతో మేరువున్
డాయం దక్షిణదిక్కునందు నొకచోటన్ యోగదండంబునన్
వ్రాయం గంధగజాశ్వసాధసదనప్రాకారదేవాలయ

ప్రాయంబై యొకపట్టణం బరుదుగాఁ బ్రాదుర్భవించె న్వేసన్. 17

చ. జనపతి యాపురంబునకుఁ జంద్రపురం బని పేరువెట్టి యం
దనుపమరాజ్యవైభవమహామహిమన్ జెలువొంది కంథ గ్ర
క్కున విదిలించి యందుఁ బదికోటులు మాడలు రాలఁ బ్రోవుగా
నవయము సెల్లయర్థులకు నన్నరపాలకుఁ డిచ్చు నిచ్చలున్. 18

క. కనుఁగొనిన వేయి మాటా, డినఁ బదివే ల్గుడువ లక్ష డెందము ప్రమదం
బునఁ బొందినఁ గోటిధనం, బనయము నర్థులకు విక్రమార్కుం డొసఁగున్. 19

వ. ఇవ్విధంబున ననన్యసామాన్యవదాన్యుం డైనయారాజన్యుండు పేరోలగంబున రత్నసింహాసనాసీనుం డై యున్నయవసరంబున వైహాయసమార్గంబున ననర్ఘ్యమణిమరీచిమాలికాదేదీప్యమానంబు లైనదివ్యవిమానంబుల నవలోకించి యాత్మీయమిత్రుం డైనచిత్రరథుండను గంధర్వపతి నివి యెందుఁ జనుచున్న వని యడుగుటయు నతం డాతని కిట్లనియె. 20

ఆ. సకలజీవలోకసజ్జనానందన, ప్రౌఢుఁ డైనపద్మభవునిఁ గొల్వ
ననుదినంబు నరుగునమరేంద్రముఖ్యుల, మణివిమానము లివి మనుజనాథ. 21

వ. అనవుడు, 22

మ. జగదుత్పత్తివిశారదుం డయినభ పాజానియాస్థానిసో
యగ మీక్షించునపేక్ష నాత్మ నవు భృత్యామాత్యులంగీకరిం
పగ నాలోలుఁడు సాహసాంకధరణీపాలుండు లీలాగతిన్
గగనాభోగ మలంకరించె మణిరంగత్పాదుకాపాదుఁ డై. 23

వ. ఇవ్విధంబునం జని యమ్మహామహుండు పితామహాలోకాలోకనోత్సవం బంగీకరించి తదాస్థానమండపంబు ప్రవేశించి. 24

సీ. మౌద్గల్య మాతంగ మౌంజాయన మరీచి మైత్రేయ మాండవ్య మందపాల
కపిల కశ్యప కౌత్స కామంద క ణ్వాత్రి కౌశిక కౌండిన్య కలహభోజ
వాత్స్యాయన వ్యాస వాల్మీకి వరతంతు వాలఖిల్య వసిష్ఠ వామదేవ
శరభంగ శుక శక్తి శార్ఙ్గ శారద్వత శౌనక శాండిల్య శాలిహోత్ర
జడభరత జహ్ను జాబాలి జామదగ్న్య, పులహ పిప్పల పర్వత పుండరీక
గార్గ్య గౌతమ గాలవ గణక ముఖ్య, లైనయాసంయమీశ్వరు లర్థిఁ గొలువ. 25

క. యాగములు యాగకర్తలు, యోగములును యోగివరులు నుచితాచార
ప్రాగుణ్యవిధులు నదులును, సాగరములు గిరులు దరులు సంసేవింపన్. 26

సీ. తనతనుప్రభలతో నెనవచ్చుపటికంపుజపమాల యొకకేల సవదరించి
తనముద్దుమోము నందమున నందము నొందునరవింద మొకకేల నలవరించి

తనమంజులాలాపతతిఁ గూడి భాషించుకీరంబు నొకకేల గారవించి
తనగాననినదంబు వినయఁ జాలువిపంచి కేలి నొకకేలఁ గీలుకొల్పి
ప్రణతదిక్పాలబాలికాఫాలఫలక, తిలకమృగనాభిచిహ్న దేదీప్యమాన
చరణనఖచంద్రయై, పూర్ణచంద్రవిమల, కమలకర్ణిక నుండి వాగ్రమణి కొలువ. 27

క. కొలువున నెలవువహించిన, నలువకు సాష్టాంగ మెరఁగి నరవరుఁడు రసా
కలితమృదుసారసౌరభ, సలలితవాక్పుష్పపూజ సమ్మతిఁ జేసెన్. 28

వ. అప్పుడు ప్రసన్నతాచతురాననుం డైనచతురాననుం డిట్లనియె. 29

క. ఎయ్యది కుల మెయ్యది నెల, వెయ్యది నీనామ మిప్పు డేచందమునన్
ఇయ్యెడకు వచ్చి తనవుడు, నయ్యంబుజసూతికోడ నతఁ డిట్లనియెన్. 30

ఆ. చంద్రగుప్తసుతుఁడ, చంద్రపురీశుండ, విక్రమార్కుఁడనఁగ వెలయువాఁడ
దివ్యపాదుకాగతిఁ బ్రోషివచ్చితి, నిచ్చ మిమ్ముఁ జూడ నిష్టమగుట 31

క. నావుడు నతనిమహత్త్వము, భావించి విరించి చోద్యపడి సదయుండై
భూవర! యేవరమడిగిన, నావర మే నిత్తు నీకు నని పలుకుటయున్. 32

ఉ. ఫాలతలాగ్రచర్మము కృపాణమునం గొని నీకు మెత్తి యీ
వ్రాలకు మీఁద నెక్కుడగువ్రాల్ లొకకొన్ని లిఖింప నోపుదో
యీలిపితోడఁ గొన్ని వెర వేర్పడ నిప్పుడ చక్కఁబెట్టఁగాఁ
జాలుదొ యానతిమ్మనిన సారసగర్భుఁడు విస్మితాత్ముఁడై. 33

ఉ. ఆర్వురు చక్రవర్తులు పదార్వురు రాజులు విశ్వధారిణీ
నిర్వహణప్రభావమున నేర్పరు లైనను వీనిసాటిరే.
సర్వఫలప్రదానమున సాహసికత్వరమాసమగ్రతన్
గర్వితవీరవైరిచయఖండనమండనవిక్రమక్రియన్. ! 34

క. ఇచ్చెద నొకవర మనినను, చెచ్చెర నామాట నుఱుపు సేసెను సభ నీ
పొచ్చెము వాయుట కొఱకై, యిచ్చెద బ్రహ్మాస్త్ర మైన నీతని కనుచున్. 35

సీ. సిద్ధాదులగుకోష్ఠసీమలు పరికించి నామానుగుణము నిర్ణయము చేసి
యుచితదీక్షాకాల మూహించి యభిషిక్తుఁ జేసి జితస్థానసిద్ధి దెలిపి
కూర్మాసనాదులమర్మంబు లెఱిఁగించి యష్టాంగవివరణం బాచరించి
భూతశుద్ధి తెఱంగు బోధించి మాతృకావిన్యాససరణి యుపన్యసించి
యావరణశక్తిబీజాధిదైవతములు, బలులు జపహోమతర్పణావళులు సెప్పి,
సప్రయోగోపసంహారణప్రవీణుఁ, జేసి బ్రహ్మాస్త్ర మిచ్చె నబ్జాసనుండు. 36

వ. ఇచ్చి మఱియు నిట్లనియె. 37

క. మానుషశక్తి జయింపఁగ, రానిమహావీరు లైనగణశూరుల్పై

దీనిఁ బ్రయోగింపుము, బల, హీనులపై మఱచి యైన నేయకు మధిపా. 38

క. అని బ్రహ్మ యానతిచ్చిన, జనపతి సాష్టాంగ మెరఁగి సంభావితుఁడై
తనపురికి నరిగి, జగతీ, జనరక్షణ చేయుచుండె [1]సత్పరమతియై. 39

వ. అంత నా చంద్రపురంబునఁ జంద్రగుప్తాన్వయవార్ధి చంద్రుం డైన రాజేంద్రుఁడు కీర్తి
చంద్రికాసాంద్రుం డై యుల్లసిల్లు చెలంగి, త్రిజగదాశ్చర్యచాతుర్యసకలకళాసంవిధా
నుం డైన సుమతిసూనుండు చనుదెంచి యుచితప్రకారంబునం బ్రవేశించి దండప్రణా
మంబు లాచరించిన నుచితోపచారంబుల సంభావించి మధురానిర్గమనం బాదిగాఁ గల
యాత్మీయప్రయోజనంబు లఖిలంబులు నెఱింగించి యిట్లనియె. 40

సీ. చెలువొందు నేపురి శృంగారముగఁ గాలకంఠుఁ డెప్పుడు మహాకాలసంజ్ఞఁ
గోటిలింగంబులు గొమరారు నేవీట సంధ్యాత్రయమహోపచారగరిమ
పిలయాంబునిధిపూరములయందు డింపక నెనుపొందు నేపుటభేదనంబు
యుగయుగంబునయందు నొక్కొక్కదివ్యాభిధానంబు నేరాజధాని పూను
నంబికాదేవి యేపట్టణంబునందు, శ్రీమహాకాళినా నుతిశ్రీవహించు
నట్టియుజ్జని యోగపీఠాభిరామ, మైహికాముష్మికప్రదానాద్యసీమ. 41

ఆ. ద్వారవతి యవంతి వారాణసి యయోధ్య, మధుర పుణ్యకోటి మాయ యనఁగ
నలఘుముక్తిదమ్ము లగుపట్టణములందు, నగ్రగణ్య యుజ్జయినిపురంబు. 42

వ. అని పురాణప్రోక్తంబు లగునూక్తంబు లుపన్యసించి వెండియు. 43

సీ. *సర్వసర్వంసహాచక్రావతంసమై జయలక్ష్మి వెలయు నుజ్జయినియందు
శ్రీమన్మహాకాళికామందిరాంగణస్థలి నగాధం బైనకొలనికెలన
నర్ధాంకపాభోగ మగుముఱ్ఱికొమ్మను గట్టిన వ్రేలెడునుట్టియొక్క
చిత్రంబుగఁ దదీయసూత్రంబు లైదును ఘోరాసిచేఁ ద్రెవ్వఁ గోసి వైచి
యాజలాశయమధ్యంబునందు నున్న, యుగ్రశూలాగ్రమునఁ బడనోపువాఁడు
సకలసామ్రాజ్యవైభవోత్సవము నొంది, తత్పురం బేలు నిది దేవతావరంబు. 44

క. ఇది శిలవ్రాసినయది యని, చతురత విప్రుం డొకఁడు ప్రసంగవశమునం
జదివెను నొగి నీపద్యము, లదియెఱుఁగఁగ వలయు నచటి కరిగెద భట్టీ. 45

తే. ఉట్టిచేరులు గోయంగ నుత్సహించి, యొకటి దెగఁగోసి వెండియు నొకటిఁ గోయ
మునుపుగోసినయది యంటుకొను చునుండు, ననుచు విస్తార మిట్టిచోద్యములు గలవె.

క. అన సుమతిసూనుఁ డిట్లను, జననాయక! దీనికై విచారం బేలా
విను ముట్టిచేరు లొక్కటఁ, బెనుపాతముగఁ గోయరాదె ప్రిదులక యుండన్. 47

వ. అనినం దత్ప్రతిభావిశేషమున కత్యాశ్చర్యముం బొంది, యు

1 సత్పరమతి = సత్పురుషులయందాసక్తిగలబుద్ధిగలవాఁడు.

మ్మనుజాధీశుఁడు భట్టిఁ జంద్రపురిసామ్రాజ్యంబున న్నిల్పి భూ
జనసంరక్షణమార్గసమ్యగుపదేశం బిచ్చి, తా నేగ ను
జ్జనికిన్ సమ్మతిఁ బాదుకంబువలనన్ సంతోషితస్వాంతుఁడై. 48

వ. అరిగి యనేకప్రసూనసుగంధవహగంధవహబంధురోపవనాపాదితముత్కారం బయిన యన్నగరోపకంఠంబున. 49

ఉ. మోహనమూర్తి యా నృపతిముఖ్యుఁడు గాంచె, సువర్ణకుంభస
న్నాహముఁ దుంగశృంగపరిణాహము, దర్పణరత్నతోరణో
త్సాహము, చంద్రికాధవళసౌధసమూహము, శ్రీమదంబికా
గేహము గోపురాగ్రతలఖేదవినోదిదినేంద్రవాహమున్. 50

వ. కని తదీయరామణీయకంబునకు నాశ్చర్యధుర్యుండై యక్కుమారవర్యుండు, వందారుబృందారకసుందరీసందోహసీమంతసిందూరపరాగపాటలితస్ఫటికమణికుట్టిమంబులవలనను, నటనఘటనారంభరంభాపదాంభోజవిగళదలక్తసంధ్యారాగరంజితరంగస్థలీనభోంతరాళతారకాయితముక్తాఫలోపహారంబులవలనను, సఖీజనసమాందోళితడోలాసమారూఢగంధర్వకామినీజేగీయమానమధురగీతికాతిస్వనంబులవలనను, ప్రసిద్ధసిద్ధజనకథితనవనాథచిత్రచరిత్రవర్ణనప్రమోదహృదయసామాజికవిరాజమానమణిమండపంబులవలనను, విటంకవిహరణపారావతకీరశారికాపఠితదేవస్తుతికథాగాథశ్రవణప్రహృష్టహృదయజనసముదయంబులవలనను, ప్రాకారసమీపసంజాతకరంజనికుంజగంజామంజుమంజరీకుంభసంభృతమకరందమధురసాస్వాదమత్తమధుకరీగానతానానుకూలశాలిపాలికాబాలికానవరాగగీతప్రసంగంబులవలనను, నిరవలంబనాంబరచరద్రథనారమణీసురతశ్రమసంజాతఘర్మాంబుబిందుప్రమోదనచతురశీతలసమీరణసంజననకారణపత్రాకానికాయంబులవలనను, చపలకపికంపితరసాలశాఖాపతితపరిపక్వఫలవాంఛాసంచరణపౌరభామినీనివహంబులవలనను, నానాభివాంఛితశయితశాతోదరీసంపాద్యమానజలధరోపమవిశాలనీలమణికుట్టిమప్రదేశంబులవలనను, నిరవధికభక్తిరసాతిశయప్రాణోపహారసమర్పణమహావీరవరశిలాప్రతిరూపంబులవలనను, గామితామితఫలోదయానందకందళితమనోమనోహరమానవానీతమహారంభగుంభితకుంభాంచితకర్షణవ్యథానీయమానస్వర్ణకోటికల్పనాఫల్గుశోభాకరపురోభాగంబులవలనను, నతిమనోహరంబై, సార్వకాలికసమర్పితానేకపుష్పగంధబంధురంబై, యగురుగుగ్గులుప్రముఖధూపవాసనావాసితదశదిశాభాగంబై, శాతకుంభస్తంభసంభృతానేకనూతనరత్నప్రదీపికాదేదీప్యమానంబై, మహోపహారసమయసముచితపంచమహాశబ్దసంభావ్యమానం బయినయాదివ్యమందిరంబు ప్రవేశించి. 51

సీ. నిర్జరవరవధూనేత్రకైరవములు చిఱునవ్వువెన్నెలచేత నలర
గోపతిసుతసతీ కుంతలభ్రమరంబు లమగంధమ్ములఁ జెంది యతిశయిల్ల
వరుణాంగనామనోవల్లీవితానంబు పలుకుఁదెమ్మలచేతఁ బల్లవింప
ధనదకాంతాహృత్తటినీనికాయంబు విశదకృపారసవృష్టిఁ బెరుగ
హరికిన్నరకన్యకాహస్తజలజ, కలితచామరపవమాన కంప్యమాన
చికురనికురుంబయై యొప్పు సకలజనని, కర్థి దండప్రణామంబు లాచరించి. 52

వ. నిర్గమించి తదాలయపురోభాగంబున. 53

సీ. సికతాతలంబున శివలింగపూజనపరులైన సన్మునివరులవలనఁ
బరిసరసహకారపాదపచ్ఛాయల గోష్ఠి సల్పెడిసిద్ధకోటివలన
నంతర్జలంబుల ననుమర్షణస్నాన మాచరించుచు నున్న యతులవలన
సిరులు నిండారంగఁ దరుల నోములు నోముమానవతీలలామములవలన
సుకృతముల కెల్ల నెల్లయై సొంపు మీఱి, యపరమణికర్ణిక యనంగ నతిశయిల్లి
కమలకైరవమకరంద కలితలలిత, వైభవాకర మగుసరోవరము గాంచి. 54

ఈ. ఆసరసీతటాంతిక శిలాతలపంక్తిఁ జరించి చూచి యీ
వ్రాసినవ్రాఁత యుజ్జయిని రాజ్యముచేరుటఁ జాటిచెప్ప సం
త్రాసముఁ బొందనేల యని తత్తరమ్మాత్మన యుట్టికిముక్కి బా
హాసిఁ దదీయసూత్రముల నన్నిటి నొక్కటఁ గోసె వ్రేల్మిడిన్. 55

వ. తదీయసాహసోత్కర్షంబునకు హర్షించి. 56

సీ. వికచనీరజపత్త్రనికరంబసభాతిఁ బసనిచూపులఁ గృపారసము దొలఁకఁ
జంద్రమండలసాంద్ర చంద్రికాద్యుతిభంగి నాననంబున మందహాస మొప్పఁ
గనకకుంభవినూత్న ఘనరత్నరుచిలీలఁ బాలిండ్లఁ గుంకుమపంకమలరఁ
గాంచనపాంచాలికాకీర్ణహిమలీల లలితాంగవల్లి దువ్వలువ దనర
నొప్పులకు నెల్ల నెల్లయై యుల్లసిల్లు, నమ్మహాకాళి ప్రత్యక్షమై నరేంద్రు
శూలముఖమునఁ బడకుండఁ గేలఁ బట్టి, నిజచరణపీఠిచెంగట నిలుపుటయును. 57

వ. రాగరంజితుండై యారాగరంజనీనందనుండు కృతాభివందనుండై, యంజలిపుటంబు
నిటలతటంబున ఘటియించి నిష్యందమానానంద బాష్పకణికా ప్రసారుండును, రోమాం
చకంచుకితాకారుండును, సముద్గతగద్గదవ్యాహారుండును నై యిట్లని స్తుతియించె. 58

దండకము. జయజయ జగదంతరానందమూర్తే శతానంద సంస్తుత్యకీర్తే నమద్దివ్యసీమంతి
నీకాంతసీమంతసంక్రాంతసిందూరబాలాతప ప్రస్ఫురత్పాదపంకేరుహే, హేమకుంభీల
సత్కుంభవక్షోరుహే నూత్నరత్నప్రభామండలీమండితానేకభూషావిశేషాప్రతీపప్రతీ
కే కృపాజాగరూకేక్షణారంభసంరంభశుంభన్నిశుంభాదితేయారిదుర్వారగర్వాంధకార

చ్చిదానందమార్తాండరూపే సుధాసుప్రలాపే కిరీటాగ్రజాగ్రత్సుధాభానుఖండద్వితీ
యార్ధశంకాసమాసాదిఫాలస్థలన్యస్తకస్తూరికాపట్టభాస్వల్లలామే మహాసింహయంత్రా
భిరామే సుధాసాగరాంతర్మణిద్వీపనీపాటవీపాటలీవాటికాకల్ప కల్పద్రుమస్రాం
తచింతామణి శ్రేణికాగేహసీమా శివాకార పంచాగ్రభాస్వత్పర బ్రహ్మశయ్యాంతరంగే
ప్రభాసాంద్రచంద్రావతంసే నవీనేక్షుకోదండనానాప్రసూనాస్త్రపాశాంకుశోల్లాస
హస్తారవిందే సదాసేవనాసన్న సన్మౌనిబృందే నవాశోకబంధూకసౌగంధికాలక్తక
స్యంద సిందూరరేణు ప్రవాళప్రతీకాశమూర్తిప్రకాశే పినీలాలినీకేశపాశే సముద్దా
మసౌదామనీధామ బాలార్కకోటిప్రతీకాశ బీజత్రయీవిశ్వమానాఖిలైశ్వర్య చిం
తామణే లోకరక్షామణే నిర్మలజ్ఞానవిద్యామహాయోగవిద్వన్మహాభాగ్య సౌభాగ్య
విద్యే ప్రభావానవద్యే నమస్తే నమస్తే నమస్తే నమః. 59

శా. ఓసర్వేశ్వరి యోమహేశ్వరసతీ యోదివ్యమూర్తిత్రయీ
యోసిద్ధాంబిక యోకదంబవనలీలోద్యానహృద్యా శివా
యోసంసారరుజాపహారనిపుణా యోమంత్రతంత్రాత్మికా
నాసంసేవను జిత్తగించి దయతో నన్నుం గటాక్షింపవే. 60

వ. అనిస్తుతియింప నమ్మహీపతిపై నపారకృపారసతరంగం బగునపాంగంబు నిగిడించి యమ్మహాదేవి యిట్లని యానతిచ్చె. 61

ఉ. తొల్లి యనేకభూపతులు దుర్లభమంచు నుపక్రమింప భీ
తిల్లినయట్టికార్య మిది తెంపున నీవొనరింపఁ జూచి యే
నుల్లములోన మెచ్చి యిపు డుజ్జయినీ పురరాజ్యవైభవం
బెల్ల సహస్రవత్సరము లేలఁగ నిచ్చితి నీకుఁ బుత్త్రికా. 62

క. అనితరసాధారణ మగు. ఘనతరసాహసము నీవు గావించుట నో
మనుజేంద్ర! సాహసాంకుం, డనఁగాఁ జిరకీర్తిఁ బొందు మాకల్పముగాన్. 63

ఉ. ఈయిల ధర్మరక్ష వెలయింప జనించినయట్టియాదినా
రాయణమూర్తి వీవు, భవదంఘ్రిసరోరుహసేవ యర్థమైఁ
జేయఁగ నాత్మఁగోరి సరసీరుహగర్భుఁడు పుట్టె భట్టియై,
పాయక తోడుగూడి యిలఁ బాలనసేయుట మీకు నైజమా. 64

చ. వదలక మీచరిత్రములు వర్ణనచేసిన సంస్మరించినం
జదివిన వ్రాసినన్ విని ప్రసంగవశంబునఁ జేరుకొన్నఁ బె
ల్లొదవు మనుష్యకోటికి సముజ్జ్వలరాజ్యరమాసమృద్ధియున్
సదమలధర్మబుద్ధియును సంవిదుదంచితమోక్షసిద్ధియున్. 65

మ. అని సర్వేశ్వరి యానతిచ్చినఁ బ్రియం బారంగ సాష్టాంగదం

దనముసాక్షరముఖోపచారములు నానాభంగులం జేసి య
జ్జననాథాన్వయచక్రవర్తి తదనుజ్ఞాసిద్ధిపూర్వంబుగాఁ
దనయిచ్చం జరియించుచుండె నికటోద్యానాంతరాళంబునన్. 66

ఉ. అట్టియెడన్ బ్రసేనుఁ డనునప్పురమేలెడురాజు చన్న నా
పట్టపుదంతి మంత్రులయుపాయమునం జనుదెంచి కీర్తికిం
గట్టనుఁ గైనహారలతఁ గంఠమునం బిడ రాజ్యలక్ష్మికిం
బట్టముగట్టి రాప్తులును బంధులు భృత్యులు నన్నరేంద్రునిన్. 67

వ. ఇత్తెఱంగున నుజ్జయినీ రాజ్యసింహాసనాసీనుండై. 68

సీ. భరతునిలాగునఁ బరశురాముని భాతి రంతిదేవునిభంగి రాముగరిమ
నంగునిరేఖ యయాతిభావంబునఁ బృథువిధంబున భగీరథునిమాడ్కి
గయునిలీల మాంధాతకైవడి నంబరీషునిరీతి శశబిందుసోయగమున
శిబిపోలిక మరుత్తుచెల్వునను దిలీపుకరణి సుహోత్రునిగారవమున
సగరువెరవునఁ బురుకుత్ససరణి నలుని, రమణ నర్జునుక్రియఁ బురూరవునిచంద
మున హరిశ్చంద్రుతెఱంగున వినుతికెక్కి, సాహసాంకుండు వసుమతీచక్ర మేలె. 69

చ. కుదురుకొనెన్ గిరీంద్రములు కూర్మకులాగ్రణి జీవనస్థితిం
బొదలె ఫణీశ్వరుండు బహుభోగసమున్నతి నుల్లసిల్లె స
మ్మదము వహించె దిక్కరిసమాజము క్రోడము చాలఁ గ్రొవ్వె ను
ప్పిదముగ నన్నరేంద్రుభుజపీఠిక యుర్వర నిర్వహించినన్. 70

చ. అరిజనపాలకాననతృణాంకురవృద్ధియొనర్చు విద్విష
త్సరసిజలోచనాస్యజలధారలవర్ధన మొందు నెప్పుడుం
జరణసమీపవర్తులకుఁ జల్లఁదనంబొదవించు నమ్మహీ
వరునిప్రతాపవహ్ని జనవర్ణితచిత్రచరిత్రలీలలన్. 71

ఉ. పాదుక లాదటం జరణపద్మములం దిడి ముజ్జగంబులన్
మోదముతోడ నాన్నృపతిముఖ్యుఁడు త్రిమ్మర, ముఖ్యకాంతయున్
నూదిపిఱింది త్రాటిక్రియఁ జొచ్చినచోటులు సొచ్చు, నెన్నఁడేఁ
బైదలి ప్రాణవల్లభునిపజ్జఁ జరింపక పాయనేర్చునే. ? 72

సీ. ప్రకటప్రతాపాతపముచేత వైరులకన్నులఁ జీఁకట్లుగ్రమ్మఁజేసి
ఖడ్గహాలాహలగరిమచే నహితుల నవ్రుతాశనులుగాఁగ నలవరించి
సలలితకీర్తిచంద్రికఁ బగతురమనములతాపంబు మట్టుకొల్పి
సముదగ్రధారాళశరవృష్టి విమతులతనువులఁ జెమటలు దలముకొలిపి
చిత్రచారిత్రవిక్రమశ్రీ వహించి, సాహసాంకమహీపాలచక్రవర్తి

జలధివలయితవసుమతీచక్రవహన, చండభుజదండకలితుఁడై యుండునంత. 73

వ. పాకశాసనుశాసనంబునం దదీయసూతుం డగుమాతలి దివ్యరథంబుతోడం జనుదెంచి
కృతాంజలి యగుటయు. 74

చ. అతనికి సాహసాంకవిభుఁ డాసనపాద్యము లాదిగ్గానస
త్కృతు లొనరించి నేఁడిచటికిం దనదివ్యరథంబుతోడ సా
కతమునఁ బంపె నెంతపని గల్గెనుగాక శచీవిభుండు ని
న్నితరములైనకార్యముల కిమ్మెయిఁ బంచుట మున్న యెంటిమే. 75

వ. అనినవిని మాతలి సాహసాంకమహీపాలునితో నిట్లనియె. 76

క. జంభాహితుఁ డూర్వశిపై, గంభపయిం గరుణకలిమి గరపెఁ దన్నటనా
జృంభణలతారలవ్యము, సంభావించుటయ కాని చాలఁడు తెగడన్. 77

క. కావున వారలనటనా, ప్రావీణ్యము నెమ్మెఁ గొందుఁ బ్రకటించుటకై
దేవరఁ దోడ్కొని రమ్మని, దేవేంద్రుఁడు పనిచె వసుమతీశ్వర నన్నున్. 78

క. పాయక యెన్ని క్రతువులు, సేయుతపోధనుల కైనఁ జేర నశక్యం
బీయరద మెక్కి విజయం, చేయుము జగతీశ తడవు సేయక యనినన్. 79

సీ. నిజతపోమహిమచే నిరుపమానంబుగా విరచించె నే తేరు విశ్వకర్మ
జంభాదిదనుజేంద్రసంగరాంగణముల శక్రున కే తేరు జయ మొసంగెఁ
గోరి ముప్పదిమూఁడుకోటులదివిజులు కొలుపంగ నే తేరు కొమరుమిగిలెఁ
బటుజవస్ఫురణమై పదివేలహయములు పూనంగ నే తేరు పొలుపు మిగిలె
నట్టిదివ్యరథంబు నెయ్యమున నెక్కి, సాహసాంకమహీపాలచంద్రుఁ డరిగె
గరుడపవమానమానసాక్రమణనిపుణ, బహుగతిప్రౌఢి కుల్లంబు పల్లవింప. 80

వ. ఇట్లు చనిచని. 81

ఉ. నాకముఁ గాంచె నట్టియెడ, నందనమందచరన్నితంబినీ
లోకము, సంయమీంద్రధృతిలోపకలోలవిలాసమేనకా
లోకము, హాసవైభవదలోలుపచంచలచంచరీకముం
స్వీకృతసత్తపఃఫలవిశేషవిపాకముఁ బుణ్యలోకమున్. 82

వ. కని తదీయవిలాసోత్కర్షంబునకు హర్షించుచు, సకలజగన్నయనపర్వం బగుసుపర్వా
ధీశ్వరునగరంబు చొచ్చి, రథావతరణంబు చేసి, దివ్యసభామండపంబు ప్రవేశించి. 83

చ. కనియె నతండు దివ్యగణికాజననేత్రచకోరికానురం
జనహాసచంద్రికాలపనచంద్రుని, జారుపులోమజాఘన
స్తనపరిరంభసంభ్రమవశస్ఫుటకుంకుమపంకసౌరభాం

జనతను 1కాంతిరుంద్రుని, భుజాబలసాంద్రుని నిర్జరేంద్రుడనిన్. 84

క. కని వందనము మొనరించిన, జననాథున కెదురు వచ్చి, సరసాశ్లేషం
బొనరించి, యతని గద్దియ, నునిచికొనె దివిజనాథుఁ డుచితప్రౌఢిన్. 85

వ. ఇట్లియ్యిరువురు నేకాసనాసీనులై, సముచితసంభాషణంబు లొనరించుసమయంబున సమయజ్ఞతావిశారదుం డగు నారదుం డన్నరేంద్రున కిట్లనియె. 86

క. నటనాహంకృతిఁ దమలోఁ, జిటిపొటిజగడంబు లూర్వశీరంభలకుం
బొటమిన, మేలేర్పఱుపఁగ, నిటనిను రప్పించె నిర్జరేశ్వరుఁ డధిపా. 87

వ. అని యుజేఁగించి యమరపతి యనుమతి నమ్మదవతీమణుల రప్పించి, నర్తనపరివర్తనంబునకు నియోగించుటయు, నంకాల్యలింగోర్ధ్వకాద్యవయవంబు లగు చతుర్విధవాద్యంబులకు ననువుగాను, గానంబునకు ననుతానంబుగాను నుపక్రమించె. 88

సీ. కలికికన్నుల సోయగము మించుఁదళుకులు చెలఁగ ముమ్మగమీలచెలువు నొంద
నభినవస్ఫురణమై నభినయించుకరంబు లలరుఁగెందమ్ముల ననుకరింప
నిటలంబున నటించుకుటిలకుంతలకాంతి కోదమ్ముతుమ్మెదలయొప్పిదము చూప
వలిపకంచెలలోని వలిచనుంగవ మించి జక్కవకవభంగి సంభ్రమింప
మంజుమంజరకంకణశింజితములు, సముదకలహంసకలనినాదముల దొరయ
సరసిగతిఁ బూఁచి సరసులు సరి యనంగ, రంభ సురరాజుమ్రోల నర్తన మొనర్చె.

వ. అంత. 90

సీ. శృంగార మేపార నంగవల్లికయందు గీతసామగ్రి యంగీకరించి
కరతలామలకంబు గాఁ గరాంబుజముల నర్థమాద్యంతంబు నభినయించి
భావింప నరుదైనభావమర్మంబులు మెఱుఁగుఁజూపులలోన మేళవించి
తానమానములతోఁ దాళనిర్ణయలీలఁ జరణపల్లవముల సంగ్రహించి
యఖిలమును మెచ్చ బ్రత్యక్షమైనయట్టి, నాట్యవిద్యాధిదేవత నాఁ దనర్చి
భరతశాస్త్రమర్మజ్ఞతాప్రౌఢి మెఱసె, నూర్వశీకాంత వేల్పుఁబేరోలగమున. 91

వ. ఇట్లిరువురుం బ్రవర్తించిననర్తనంబులు గనుంగొని విక్రమార్కుం డిట్లనియె. 92

ఉ. సర్వజగంబుల న్నటనచాతురిఁ దాఁ గడుఁబ్రోడ నంచు, దు
ర్గర్వము పూని శాస్త్రగతిఁ గైకొననొల్లక రంభ యాడె, నీ
యూర్వశి శాస్త్రసమ్మతసముజ్జ్వలమార్గము దప్పకుండఁ గాఁ
బర్వ మొనర్చె, నిచ్చటిసుపర్వుల కెల్లఁగళాప్రవీణతన్. 93

వ. అనిన నమ్మహీనాథునివివేకపరిపాకంబునకుఁ బాకశాసనుండు ప్రముదితాంతఃకరణుండై, దివ్యమణిభూషణాంబరాదు లొసంగి, మఱియును, నిజతపోవిశేషతోషితాంతరంగం బును, సర్వమంగళాస్పదంబును, నృపసింహాసనద్వాత్రింశత్సాలభంజికారంజితంబును, న

1 కాంతిరుంద్రుని = కాంతిచే విస్తరిల్లు వానిని.

గాఁ దివ్యసింహాసనంబు నొసంగి తద్దివ్యపీఠంబుఁ బుగంబునను ధరించికొనిపోవఁ ద్రిదశ
కింకరసహస్రంబు సమర్పించి గారవించి వీడ్కొలిపిన దివ్యమణిపాదుకాప్రభావసుల
భగమనుండై యజ్జనపాలుం డుజ్జయినీపురంబున కరుగుదెంచి. 94

సీ. శ్రుతిమతంబునఁ బురోహితసమ్మతంబునఁ బుణ్యాహవాచనపూర్వకముగ
జలజబాంధవముఖ్యసకలగ్రహంబుల కభిమతం బగుహోమ మాచరించి
యన్నదానాదిసమస్తదానంబుల బ్రాహ్మణప్రతతికిఁ బ్రియ మెసఁగి
యుచితంబు లగుషోడశోపచారంబుల నాగద్దె కతిభక్తి నాచరించి
పౌరవృద్ధపుణ్యాంగనాపాణిపద్మ, ముక్తమౌక్తికశేషాసముజ్జ్వలాంక
తంబునై యొక్క శుభవేళ ధరణినాథుఁ, డమరపతిదత్తదివ్యసింహాసనంబు. 95

వ. ఇట్లు తేజోవిరాజితుండై యఖిలప్రజాపాలనంబు సేయుచున్నంత నొక్కనాఁడు.

సీ. అచ్చవెన్నెలమించు నపహసించువిభూతి యంగరాగంబుగా నలవరించి
యాగమోచితముగా నవయవంబులయందు లలితరుద్రాక్షభూషలు వహించి
పాంబట్టుపుట్టంబు పొట్ట నందంబుగా ఘనజటాజూటంబు గలయఁ బొదివి
యడుగుఁగెందమ్ముల బెడఁగు రెట్టింపఁగాఁ గాంచనమణిపాదుకములు దొడిగి
జమిలిమొలత్రాట నినుపకచ్చడ మమర్చి, * కక్కపాలయుఁ గక్షభాగమునఁ బూని
తరుణశశిమౌళియపరావతార మనఁగ, ధరణిపతిసాలి కేతెంచెఁ దపసి యొకఁడు. 97

క. ఏతెంచి శివునికృప యని, ప్రీతిమెయిన్ భూతి మొసఁగఁ, బృథ్వీరమణుం
డాత్తభక్తిని గైకొని, యాతాపసవరు భజించె నర్ఘ్యాదులన్. 98

వ. ఇత్తెఱంగున నత్తపోధనసత్తమునకు సపర్యాపర్యాయంబునం బ్రమోదం బాపాదించి
యన్నరేంద్రుం డిట్లనియె. 99

క. ఈచక్రవాళపరివృత, భూచక్రమునందు నొకయపూర్వం బేదేఁ
జూచినయది గలిగిన నది, యేచినకృప నాకు నానతిమ్ము మహాత్మా. 100

వ. అనిన యోగీశ్వరుం డిట్లనియె. 101

సీ. సర్వపర్వతకులసార్వభౌముం డనఁ గొమరొందుపడమటికొండదండఁ
గనకగోపురవప్రఘనసౌధసదనమై రాజిల్లుకనకపురంబు కెలన
రోహణమధరప్రరోహణాగతి నొప్పుమార్తాండదేశసద్మంబు చెంత
నఖిలతీర్థస్వామి యగుపాపనాశననామతీర్థమునందు నట్టనడుమ
నగ్రకీలితమణిపీఠ మైనయట్టి, శాతకుంభమనోజ్జ్వలస్తంభ మొకటి
సంభవమునొందువాసరారంభవేళ, కర్ణికోద్దీర్ణసౌవర్ణకమలమునఁగ. 102

తే. అది దినేంద్రునికొలఁదినే యతిశయిల్లి, యామయుగళంబునను నున్నధాముఁ గదియు

---

* పా. ఘనకపాలంబు కక్షభాగమునఁ బూని.

నపరదిశఁ గూర్చి కమలాప్తుఁ డల్ల వ్రాలఁ, గ్రుంకు బంగారుకంబ మాకొలఁదిగాను.

క. వారుణదిగ్వారాకర, వారి నరుణుఁ డస్తమింప, వర్ణితతీర్థో
ద్ధార మఘపాపనాశన, పూరములో మునుఁగుఁ గంబమును దినదినమున్. 104

చ. అన విని యత్తపోధనునియానతికిం దగ సంతసిల్లి, య
త్యనుపమభక్తియుక్తిమెయి నమ్మహితాత్ముని వీడుకొల్పి, గ
బ్బునఁ బతి దివ్యభవ్యమణిపాదుక లంఘ్రుల సంఘటించి, య
క్కనకపురంబు చొచ్చి తమకంబున నన్నిశి పుచ్చి వేకువన్. 105

చ. వెలవెలఁబాఱుదీపములు వింతరుచిం గలిగించు తమ్ము ల
మ్ములు నతిశీతలమ్ము లగుమత్తెపుఁ బేరు లఖర్వపద్మినీ
విలసితగంధవాతములు వేకువఁ దెల్ప నరేంద్రముఖ్యుఁ డు
జ్జ్వలగతిఁ బాపనాశనముసన్నిధికిం జని యుండునంతటన్. 106

సీ. కైరవకాననసూత్కరములు కడుఁ గుందఁ గంజపుంజంబులు కణఁక నొంద
లలిఁ జకోరంబులతలఁపులు గంపింపఁ జక్రవాకంబులు సంతసింప
సాంద్రచంద్రికలయుజ్జ్వలభావములు దిగ నరుణోదయప్రభాస్ఫురణ లెదుగ
జారచోరులమతిసంభ్రమంబులు చిక్క జనులకుఁ జిత్తప్రసాద మెక్కఁ
దారకంబులకాంతి యంతయుఁ దొలంగ, ధరణిదివిజార్ఘ్యబిందు సంతతి సెలంగఁ
బూర్వపర్వత మెక్కె నపూర్వదీప్తి, మండలం బైనమార్తాండమండలంబు. 107

శా. క్షోణీనాథుఁడు తీర్థవారిపయి వక్షోజస్ఫురత్కాంచన
స్థాణుశృంగము గానవచ్చుటయు మెచ్చు లీలఁగాఁ జొచ్చి త
న్మాణిక్యోజ్జ్వలపీఠ మెక్కి మురజిన్నాభీసరోజస్ఫుర
ద్వాణీవల్లభుఁ గ్రేణిసేయుచుఁ బ్రభావస్ఫూర్తమున్మూర్తిమై. 108

వ. తదనంతరంబ. 109

క. అంబరమణి యల్లల్లన, నంబరమధ్యమున కరుగునంతటిలో నక్ష
జాంబూనదకలితం బగు, కంబము నరనాథుతోడ ఖరకరుఁ గవిసెన్. 110

వ. కదిసిన నత్యంతసంతాపకరం బైననిజప్రతాపాటోపంబునకు మిసిమింతుండు గాని య
మ్మహీకాంతునిం జూచి, విస్మితస్వాంతుండై భాస్వంతుం డిట్లనియె. 111

సీ. కల్పాంతదుర్దాంతకలుషాంతకస్వాంత దుర్వారవహ్నికి నోర్వవచ్చు
నిష్ఠురనిర్ఘోషనిర్ఘాతసంఘాత జాతమహావహ్ని సైఁపవచ్చుఁ
బ్రళయకాలాభీలఫాలలోచనఫాల భాగానలస్ఫూర్తి బ్రతుకవచ్చుఁ
గాకోదరేంద్రఫూత్కారసంభవతీవ్ర కాకోలదహనంబు గదియవచ్చుఁ
గాక, సైరింపవచ్చునే లోకదహన, దర్పితం బైనయస్మత్ప్రతాపవహ్నిఁ

దావకోత్సాహసాహసౌదార్యశౌర్య, గతికి మెచ్చితి విక్రమార్కక్షితీంద్ర. 112

క. అనుదినము రెండుబారువు, లనుపమకాంచనము నొసఁగు నాశ్చర్యముగా
నని పద్మరాగరంజిత, ఘనకుండలయుగము ధరణికాంతుని కొసఁగెన్. 113

వ. ఇత్తెఱంగున నమూల్యకుండలప్రభానిధానం బగుబహుమానంబుం గాంచి. 114

మ. చరమాశాంతరవీథిఁ గ్రక్కొని సరోజాతప్రియుం డేఁగఁగా
నిరి నంతంతనుఁ గ్రుంగి క్రుంగి కనకస్తంభంబు చిత్రంబుగా
సరసీపూరనిమగ్నితం బగుటయున్ సర్వంసహాధీశుఁడున్
వేగ వారం దిగి వచ్చి యప్పురిని దా విశ్రాంతచేతస్కుఁడై. 115

వ. అమ్మఱునాఁ డుజ్జయనీపురంబునకు నరుగునప్పుడు తత్పురోపకంఠంబున. 116

సీ. పలితకావృత నేత్రపర్యంతరేఖలు పొదివి క్రవాలిన బొమలతోడ
దంతపాతముల నెంతయుఁ జొక్కినకపోలతలముల నెలకొన్న వలులతోడ
నపగతకేశోత్తమాంగంబు కెలఁకుల దూఁగాడు నరపవెండ్రుకలతోడఁ
గ్రౌంచకంఠోపమాకారతఁ గనుపట్టు నస్థిగమైన దేహంబుతోడ
శతశతచ్ఛిద్రజీర్ణవస్త్రములతోడ, నల్పతరపర్వయుతవంశయష్టితోడ
హరిసహస్రనామోచ్చారణగతితోడ, వచ్చె నొకవృద్ధభూసురవరుఁడు గదిసి. 117

సీ. బ్రహ్మాయురస్తు విప్రప్రసాదోఽస్తు కల్యాణపరంపరావాప్తిరస్తు
దేవేంద్రభోగోఽస్తు దిగ్విజయోఽస్తు సుస్థిరకీర్తిరస్తు వాక్సిద్ధిరస్తు
సౌభాగ్యమస్తు శాశ్వతసమున్నతిరస్తు సంగరవిజయోఽస్తు సౌఖ్యమస్తు
వస్తువాహనసంపదస్తు చింతితమనోరథసిద్ధిరస్తు సామ్రాజ్యమస్తు
సప్తసాగరపరివృతసకలభూమి, మండలైకాధిపత్యసమాగమోఽస్తు
పుత్త్రపౌత్త్రాభివృద్ధివిస్ఫూర్తిరస్తు, మంగళాని భవంతు తే మనుజనాథ. 118

వ. అని యాశీర్వాదంబు చేసి. 119

క. అర్థించిన బ్రాహ్మణునకు, నర్థి నొసఁగెఁ గనకకుండలాభరణము న
త్యర్థమును రెండుబారువు, లర్థము ప్రతిదినము నొసఁగు నని చెప్పి దయన్. 120

వ. ఇవ్విధంబున. 121

మ. అరిభూనాథవరూథినీమదభరాహంకారదుర్వారకో
పరసాటోపపటుప్రతాపపటలప్రధ్వంసకాక్షీణభా
స్వరబాహాబలశాలి సాహససముత్సాహైకసంసేవి యై
ధరణీచక్రము విక్రమార్కవిభుఁ డుద్యల్లీలఁ బాలించుచోన్. 122

సీ. తలపాఁగఁ జెరివినఁ దనరారుచునుఁ డెక్క యవ్వృతాంశురేఖచందమున నమర

1 మిసిమింతుండు = అలసినవాఁడు.

మేదినీరేణువు మెయినిండఁగాఁ బర్వ భసితాంగరాగసంపద వహింప
జుంజుమెంట్రుక లెత్తి చుట్టినలేఁదీఁగ పన్నగాధీశ్వరుపగిది మెఱయఁ
గరమొప్పు నుదుటిపై గైరికతిలకంబు ఫాలలోచన భాతిఁ బరఁగుచుండ
శబరుఁ డొక్కరుఁ డేతెంచె సంభ్రమమున, శంకరుఁడు తొల్లి శబరవేషము వహించె
నంచు మదిలోన నీసుఁ ధరించి తాను, నీశునాకృతిఁ గైకొన్నయెఱుకసంగ. 123

ఉ. వచ్చినచెంచుఁ జూనిఁ గని వాకిటివాఁడు నృపాలుపాలికిం
బొచ్చెములేక తోకొనుచుఁ బోవఁగ వన్యములైనకానుకల్
మెచ్చుగ నిచ్చి యంగములు మేదినిసోఁకఁగ మ్రొక్కి లేచి తా
వచ్చినకార్య మంతయును వావిరిఁ జెప్పఁ ద్రోణంగి యిట్లనున్. 124

సీ. ప్రళయకాలాభీలభైరవోదగ్రత సూకరాకృతిఁ బొడసూపె నొక్క
యత్యంతకుపితాంతకాంతకాకారంబు క్రోడరూపంబుఁ గైకొనియె నొక్క
పటుభయంకరవీరభద్రాతిరేకంబు భూదారవేషంబు పూనె నొక్క
చండభుజాదండదండధరస్ఫూర్తి కిరిఘోరమూర్తిని బరఁగె నొక్క
యనఁగ నతిభీకరాకార మైనయట్టి, యేకలం బెల్లయెడలను నెదురు లేక
ఘోరసత్త్వసమగ్రకాంతారజలధిఁ, దిరుగుచున్నది మందరగిరియుఁ బోలె. 125

క. నరవర తాను భరించిన, ధర నీవు భుజాగ్రపీఠిఁ దాల్పఁగ సుఖియై
తిరిగెడు నాదివరాహము; గరిమం దత్కిటి నటించుఁ గాననసీమన్. 126

క. ధర నాదిశబరుఁ డొకకిటి, శరనిహతిం గూల్చె నను మ శబరుల నెల్లన్
బరిమార్పఁ బట్టెనో యన, నురుకోలము చెంచుకోలము నుడుచు మహీశా 127

వ. ఇట్లు మహామహీధరపరిణాహం బైనయావరాహంబు. 128

చ. మునిజనపర్ణశాలలు సముద్ధతిమైఁ గలగుండు వెట్టుచున్
గునగున వచ్చి లావరులఁ గొమ్ముల వ్రక్కలు వాఱఁ జీఱుచున్
మునుకొని సస్యసంఘముల మోరను గుద్దలిగొంచు నెల్లెడం
దనరుపుమైఁ జరించు నతిదారుణలీల వనాంతరంబునన్. 129

చ. జనవర సాహసాంకుఁ డన సన్నుతికెక్కిననీవు దక్క, నా
ఘనతరకోలముం గదిసి గర్వ మడంపఁగ నన్యభూపతుల్
గొనకొన లేమి దేవరకుఁ గు య్యెఱిఁగింపఁగ వచ్చినాఁడ, వే
గన మృగయావినోదమును గౌతుక మార నొనర్పు నేర్పునన్. 130

తే. అనిన నిష్ఠార్థముల వాని నాదరించి, వలయుసవరణతోడ భూవల్లభుండు
వెడలె వేఁటకు మృగయాప్రవీణు లైన, శబరనాయకు లుభయపార్శ్వములఁ గొలువ.

వ. ఇవ్విధంబున సర్వసన్నాహంబు మెఱయ సాహసాంకుండు కృతపవనజవనవాహనుం

నై చని, శరభశార్దూలప్రముఖనిఖిలమృగపరిశరణ్యం బైనయరణ్యంబుఁ బ్రవేశించి బహు
ప్రకారమృగయావినోదంబు లొనరించుసమయంబున. 132

ఉ. కోలముఁ గాంచె నానృపతిసంజరుఁ డంజనశైలవిగ్రహో
ద్భీలముఁ, బోత్రసాధనవిభేదితభూవివరోరుజాలకో
త్తాలము, ఘుర్ఘురధ్వనివిదారితశైలగుహాంతరాళముం,
లోలవిలోచనాంచలవిలోకితగోపమహాగ్నికీలమున్. 133

వ. కని యతఁడు మున్ను శబరునిచేత విన్నతెఱంగునకు మెఱుంగిడిన యట్లున్న యున్న
తోదారభూదారంబు నిటలవీథికిం గదియుటయును. 134

సీ. అం తంత నగపడినట్లు చేరఁగ నిచ్చుఁ బైకొనఁ జూచినఁ బరువువెట్టుఁ
బటుపరిశ్రాంతి లోఁబడినలాగు నటించు నైదువునేయ డగ్గఱిన సురుఁగుఁ
బొదలమాటున నుండి యదలించుచును లొప్పి కదియంగఁ జూచిన బెదరి తొలఁగు
నవనీతలము మోర నలవోకఁ గోరాడుఁ ద్రోవ గట్టినఁ దప్పుఁ ద్రోవ నుఱుకుఁ
జేరఁ దవ్వుగఁ బొఱను జేరనీక, యుల్లసల్లన నడపాడి నాసగొలుపు
మనుజపతి నిట్టు లెలయించుకొనుచు నరిగి, యమ్మహాకోల మవనిగహ్వరముఁ జొచ్చె.

వ. చొచ్చిన నాదివితేంద్రత్రాటిక్రియ నచ్చోటం జొరం దలంచి, ఘోటకతిలకంబుఁ
దిలకభూజంబునఁ బంధించి. 136

క. చెచ్చెరఁ బతియును దోడన, చొచ్చి రసాతలముఁ దాఁక సూకరమార్గం
బెచ్చో వదలక వెనువెన, నచ్చెరువుగ మాయమయ్యె నది యచ్చోటన్. 137

వ. అత్తం డత్తెఱంగునకు విస్మయతరంగితాంతరంగుండై కొంతదవ్వు చని ముందట ననంత
విభవోదారం బగునొక్కపురంబు గని యాత్మగతంబున. 138

క. ఈపురము నామ మెద్దియొ, యీపట్టణ మేలునృపతి యెంతటివాఁడో,
యీపుటభేదనవిభవము, గోపురమున లేదు వశమె కొనియాడంగన్. 139

మ. అని యటపోవఁ బోవఁ బణిహారి యొకం డరుదెంచి విక్రమా
ర్కునిఁ బొడగాంచి మిమ్ముఁ దోడ్కొనుచు వేసం జనుదేర దైత్యనా
యకునిఁ గిటిమూర్తి గైకొని తగం జనుమన్నను వచ్చి తమ్ముఁ దె
చ్చినవిధ మంతయుం దెలియఁ జెప్పిన ముప్పిరిగొన్న వేడుకన్. 140

క. తలఁచినతలఁపు కొలఁదిన, యలఘు నుదారుని విక్రమార్కవిభు రసా
తలమునకుఁ దెచ్చి తనుచును, బలి మెచ్చెం దనదుభృత్యుఁ బరహితకృత్యున్. 141

క. అని చెప్పి మిమ్ముఁ దోడ్తేఁ, బనిచినఁ జని వింటి ననినఁ బణిహారిబడిన్
దనుజేంద్రుని సన్నిధికిని, మనుజేంద్రుఁడు వచ్చి వినయమహనీయుండై. 142

క. కాంచిన నతఁడును బెన్నిధిఁ, గాంచినగతి నలరి యెదురుగా వచ్చి సమా

సంచితశరీరపినదో, దంచితుఁడై కౌఁగిలించి తాత్పర్యమునన్. 143

క. ఆసాహసాంకు మణిసిం, హాసనమున నిలిపి సముచితార్ఘ్యప్రియపూ
జాసత్కారమున సుఖా, వాసునిఁగాఁ జేసి దనుజవరుఁ డిట్లనియెన్. 144

శా. భూలోకంబున సర్వసంపదలు సంపూర్ణంబులై యుండునా
కాలాతిక్రమణం బొనర్ప కిల మేఘశ్రేణి వర్షించునా
చాలంగాఁ బసిపాఁడిసొంపు గలదా సస్యంబు లేపారునా
వాలాయించి యొనర్తురా జనులు దేవబ్రాహ్మణారాధనల్. 145

క. ఏనును జనవత్సలతన్, మానవలోకప్రసంగవార్తిచేతను గా
కేనిర్విచార మడుగం, గా నేటికి నీవుగలుగఁ గారుణ్యనిధీ! 146

మ. బలము ప్రతాప మింగి దయ ఖ్యాతి విభూతి వినీతి ధర్మని
శ్చలత కళావిశేషము నిజం బవధానము మాన మాదరం
బెలమి యశం బొగడ్త గలయిన్నిగుణంబులఁ గీర్తికెక్కు నీ
విల భరియింపఁగా జనుల కేల విచారము భూతలేశ్వరా. 147

వ. అనిన సాహసాంకమనుజేంద్రుండు బలీంద్రున కిట్లనియె. 148

క. సురపతి పిలువఁగఁ బంపిన, నరిగితి నమరావతికిఁ బ్రియంబున నది నీ
పురికిని రమాసమగ్రత, సరిగా దని కానఁబడియె సౌజన్యనిధీ. 149

క. పదునాలుగులోకంబులు, నుదరస్థములుగఁ జరించుచుండెడులక్ష్మీ
హృదయేశుఁడు నిను వేఁడఁగ, బ్రదికితి, నీబ్రదుకు బ్రదుకు, బలిభూపాలా! 150

క. దేహీ యనువాఁడు పరాత్పరుని, దేహీ యనఁగ నంటువాఁడు తెల్లంబుగ నేఁ
డూహించిన నీరాజ్యము, లో, హాహాకార చిత్రమహిమ లుంటాక బలీ! 151

క. అని మధురవచనరచనల, దనుజేంద్రుని నలరఁ జేసి, తగ సజ్జనభో
జనవినుతుం డతండు వేడ్క, లొనరింపఁగ దృష్టిఁ బొంది యుండెడు వేళన్. 152

ఆ. రసరసాయనాఖ్యరత్నద్వయము దెచ్చి, యందు మొదని నొకటి యపనయించు
నొకటి చాలసిరుల నొందించు నని చెప్పి, యిచ్చి యనుప నిలకు వచ్చె నృపతి. 153

ఉ. వచ్చి రయంబునం దనదువారువముం బ్రియమార నెక్కి, ము
న్నచ్చట నచ్చటం జెదరినట్టిబలంబులు దన్నుఁ గూడి రాఁ
జొచ్చిన, వారితోఁ బురముఁ జొచ్చినలాగును గన్నలాభమున్
జెచ్చెరఁ జెప్పుచున్ బురముఁ జేరఁగఁ బోయెడునంత ముందటన్. 154

మ. పలుకనిమోముఁ దొట్రుపడుపాదములున్ వగరింపుటూర్పులున్
వలవలనైనదంతములు వంగినమేను వణంకుహస్తముల్
నిలుపఁగ రానియుక్కసము నెమ్మెయి నెక్కొనుదప్పిఁ గెంపుఁ జే

వెలుఁగునఁ జూచుచూపుఁ గలవృద్ధమహీసురుఁ డమ్మహీశ్వరున్. 155

వ. కాంచి బహువిధాశీర్వాదంబులఁ బ్రముదితహృదయునిం జేసిన, సాహసాంకనృపోత్తముండు కరుణాయత్తచిత్తుండై, యమ్మహీసురవరుని జరాభార దారిద్ర్యభారంబు లపనయించుతలంపునఁ దత్ప్రయోజనంబు లెఱింగించి రసరసాయనాఖ్యరత్నద్వయంబు నొసంగుటయును. 156

క. రససేవనంబునం దన, ముసలితనం బుడిగి తరుణమూర్తియుతుండై
వసుధామరుఁ డింటికిఁ జని, రసాయనాకరవిభవాఢ్యుం డయ్యెన్. 157

క. మనుజేంద్రుఁడు నిజపురమున, కనురాగము తోడ నరిగె నఖిలజనములుం
దనదానధర్మపరహితత, ఘనసాహసనైపుణములు కడఁక నుతింపన్. 158

వ. మఱియును. 159

తే. భద్రనామాభిధానుఁ డత్యుద్రసంపు, దాఢ్యుఁ డిద్ధగుణనిధి యనఘలోక
విఖ్యాతుం డైనయొకవణిగ్వరుఁడు గలఁడు; అతనికిఁ బురందరుండనుసుతుఁడు గలఁడు.

తే. ఆపురందరుఁ డధికభోగానుభవము, పేర్మి భూతిఁ బురందరు నతిశయించి
భూరివితరణశ్రీఁ గల్పభూజమును, ధీవిభవశక్రాదుల ధిక్కరించె. 161

వ. ఇట్లు వణిక్కుమారుండు మహోదారుండై. 162

క. కట్టక కుడువక యొరులకుఁ, బెట్టక తనతండ్రి కూడఁబెట్టినసిరిఁ దాఁ
గట్టియుఁ గుడిచియు నొరులకుఁ, బెట్టియుఁ దనయిచ్చ వెచ్చపెట్టఁ దలంచెన్. 163

క. ఆడెడువారల కిచ్చును, పాడెడువారలకు నిచ్చు బట్టుల కిచ్చున్
గాడఁబవరులకు నిచ్చును, వేడుకకాండ్రకును నిచ్చు వివిధార్థంబుల్. 164

సీ. 1 భూరిభూమ్యాదిక భూరిదానంబులు సుపరీక్షితుల భూసురుల కిచ్చు
నుక్తదక్షిణలతో నుభయతోముఖిసహస్రములను బ్రాహ్మణోత్తముల కిచ్చుఁ
దిలధేను లాదిగాఁ గలదానదశకంబు విధిపూర్వకముగ సద్ద్విజుల కిచ్చుఁ
గడుఁబెద్దచెఱువులు గట్టించు నిలుపేదవిప్రుల రావించి వృత్తు లొసఁగు
పితృనిర్వంచనక్రియావృత్తిఁ బెక్కు, దానములు సేయుఁ బుణ్యతీర్థములయందు
మఱియు నర్థమూలము లైనమహితపుణ్య, కర్మములు నెమ్మి నొనరించు ధర్మనిరతి.

ఉ. ఇమ్మెయి నర్థ మెల్లను వ్యయింపఁ బురిం గలవైశ్యు లందఱున్
నెమ్మిఁ బురందరుం గదిసి నీవు వణిక్కులవర్తనంబు స
ర్వమ్మును వమ్మునం గలిపి వాలి విశృంఖలవృత్తి దానధ
ర్మమ్ములు త్యాగభోగములు మానక సేయుట నీతిమార్గమే. 166

క. ఈమెయి వెచ్చము సేసిన, నామేరుమహాద్రియంతయర్థం బైనన్

1 భూరిభూమ్యాదిక = భూరి=సువర్ణము.

నే మొదలికి మోసం బగు, మామాటలు విని తదుద్యమం బుడుగు మనా. 167

తే. సరకుగొను మన్న మామాట సరకుగొనవు, జాతినీతివర్తనములజాడఁ బోవు
పాలసుం డగునయ్యర్థపాలుఁ డైన, వలదు మామాట విననన్న వలను విడిచి. 168

తే. అలహరిశ్చంద్రుఁ డనుచితవ్యయ మొనర్చి, యాలుబిడ్డల విడిచి యంత్యజునిఁ గొలిచె
సంచితార్థంబు నిష్ప్రయోజనము గాఁగ, నల వెఱుంగక వెచ్చించునతఁడు చెడఁడె.

తే. పుట్టలిసుమంత లిడనిడఁ బొదలు టెఱిఁగి, పుస్తకంబుస్తకంగఁ గాటుకస్తోకఁ జూచి
విత్తసముపార్జనవ్యయవృత్తులందుఁ, జిత్త మిడినవర్తకునకుఁ జేటు గలదె. 170

ఆ. పిల్లుగట్టు నలకుబేరుండు దానైన, నాయమునకు వెచ్చ మధిక మైనఁ
బేద యైన ధనదుపెన్నుద్దియై చను, నాయమునకు వెచ్చ మల్ప మైన. 171

క. తనయొడలం గలనెత్తురు, ధనహీనుని విడిచిపోవు దారాదిసుహృ
జ్జనములు విడుచుట యరుదే, మనుపేనుఁగు నిర్ధనుం డమదిఁ బరికింపన్. 172

క. పాసినయప్పుడు పాయుదు, రాసలఁ జేరుదురు చేరినప్పుడు చుట్టాల్
డాసినచుట్టము సుమ్మీ, శ్రీసతి యెవ్వారి కైన సిద్ధము జగతిన్. 173

క. ధనమూలము జగ మంతయు, ధనవంతుని కిష్ట మగుపదార్థము లెల్లం
దనచేతిలోని వగుటను, ధన మార్జింపంగ నెవ్విధంబున వలయున్. 174

క. శ్రీమంతుఁడె కులవంతుఁడు, శ్రీమంతుఁడె సుభగరూపజితకంతుఁడు సూ
శ్రీమంతుఁడె గుణవంతుఁడు, శ్రీమంతుఁడె సిద్ధశేముషీమంతుండున్. 175

క. ఒడమి గలవేడుఁగు నైనను, బుడమిం గలవార లెల్ల భూషింతురు శ్రీ
వెడఁబాసిన దూషింతురు, కడుఁ బేదఱికంబుకంటెఁ గష్టము కలదే. 176

వ. కావున నీవు మా బుద్ధులు విని నీతివిరుద్ధవర్తనం బుడిగి కులం బుద్ధరింపు మనిన సుజ్ఞాన సుందరుం డగుపురందరుండు పురాణసిద్ధంబు లగునీతివచనంబుల కార్యంబు లని నిర్దేశించి వణిగ్వంశవర్యుల నుద్దేశించి ప్రియపూర్వకంబుగా నిట్లనియె. 177

క. నేలం బాఁతిన సొమ్ముల, పాలవు ధన మొండె ముద్రిమ్మపాలవు, ధరణీ
పాలునిపా లవుఁ గావున, వాలాయముఁ గుడువ విడువ వలయుఁ ధనమున్. 178

క. నెఱ వగుసంపద గలిగిన, నెఱి దానం గుడువఁ గష్ట నేరనిమనుజుం
డఱిముఱిఁ జేనికిఁ గట్టిన, వెఱబొమ్మయ కాఁడె యన్నివిధములఁ జూడన్. 179

క. కొలఁదికి మీఱినలక్ష్మికి, నలరెడుభోగంబె రక్ష యారసి చూడన్
జలపూర్ణతటాకమునకు, నలవడఁగా వాట మైనయలుఁగుం బోలెన్. 180

క. వరసతులఁ గవయుశక్తియు, సరసాహారములు గుడుచుశక్తియు, సిరికిం
దర మైనదానశక్తియు, నొరులకు లే వధికభాగ్యయుతులకుఁ దక్కన్. 181

క. వే మింటిదాఁకఁ బెరిఁగిన, దీమసమున నతలమునకు దిగఁబడి చనినన్

భూమి గలయంత దిరిగినఁ, దామును పెట్టనిది రిత్త దన కేల లబ్బున్. 182

ఆ. సంపదలు తరంగసంచలంబులు గండు, మూఁడునాళ్లదివసములది ప్రాయ
మాయు వరయ శారదాభ్రపటల మని, యెఱిఁగి సేయుఁడు పరహితము హితము. 183

క. ఏలా దాఁచెద రర్థము, లేలా యర్థులకుఁ బెట్ట రేలా కుడువం
జాలరు నిలువదు సిరి పెను, గాలికిఁ గంపించుదీపకళికయుఁ బోలెన్. 184

క. సిరియును నాయువుఁ గడున, స్థిరములు జముఁ డెవరియుఁ డిది వాదిం దెలిసియుఁ జే
యరు ధర్మము ధర్మస్య, త్వరితా గతి యనుపురాణవచనము వినరే. 185

క. తనచేసినపురుషార్థము, తనసొమ్మగ నెఱిఁగి నరుఁడు దానపరుండై
యనుభవి రైయె మన వలదా, హీనములచే మోసపోక కతిస్థిరంబు గిన్. 186

క. ఇచ్చి చను నర్థ మెల్లను, విచ్చలవిడి నప్రదాత వితరణి గాఁడే
చచ్చియు విడువం డర్థము, నచ్చెరువుగ దాత లోభి యగునో కాఁడో. 187

వ. అని యనేకవిధంబుల దానధర్మపరోపకారంబులు సత్కార్యంబు లగుట దేటపడం బలికి కులవృద్ధు లుపదేశించుబుద్ధులువినక వీటింబుచ్చి విచ్చలవిడి నిచ్చలు వెచ్చంబులు సేయం జేయ నకించనత్వంబు ప్రాపించి క్రమక్రమంబున నఖిలజననింద్యమానంబుగా నిత్యాశనశూన్యం బగుదైన్యంబు వచ్చిన వచ్చినచుట్టంబులు నెవ్వగఁ జెంద, నొవ్వని వారి లవ్వల నివ్వల నవ్వం దల యెత్తుకొని నడవ రామికిం దొలంగఁ ద్రోవ రాని లేమికి నొండొకయుపాయంబు మదిం దోఁపమికిం గొండొక చింతించి ధీరతావధీరిత మందరుం డగుపురందరుండు ధైర్యం బవలంబించి సకలతీర్థదర్శనార్థం బుజ్జయినీపురంబు వెడలి యనేకపురవరగ్రామంబులును గిరివనదుర్గంబులును నిర్గమించి కతిపయదినంబులకుం బ్రతోళికాసముత్సేధసౌధచంద్రశాలావిలసితలీలావతీవిలసనవిస్మయచ్ఛరప్రమోదనం బైనమధురాపుటభేదనంబు చేరి తదీయవిభవవిశేషంబులకుం బరితోషంబు నొంది యనంతరంబ. 188

ఉ. కాశికి నేగి యందు మణికర్ణికలోపలఁ దీర్థమాడి వి
శ్వేశుపదాంబుజంబులకు నెంతయు భక్తి నమస్కరించి, తాఁ
జేసినకర్మబంధముల చిక్కుడలించి విముక్తికన్యకన్
డాసెద నంచు నెమ్మనమునం బ్రమదంబు వహించి వెండియున్. 189

క. చిరనిద్ర యొందుచోటుల, నరయంగా దుఃఖహేతు వగుఁగాఁ బరఁగుం
బరమానందప్రద, మా, చిరనిద్రయ కాశి నిట్టిచిత్రము గలదే! 190

చ. చెలువగు కాశికామహిమ చిత్రము; బెబ్బులి లేడి మ్రింగి యాఁ
కలి చెడ కద్దఁ బట్టఁ, బులికాటున నెద్దును నెద్దపోటునన్
బులియు శరీరమున్ దొరఁగ, బోరన శేషోక లేడిఁ బట్టుటల్

పులి పులితోలు గప్పుటయుఁ బోల్పఁగునె ద్రోకయెద్దు నెక్కుటల్. 191

సీ. రూప మొక్కటి రెండురూపులై చెలువొందు మూఁడుమొనలపోటు ముట్టుఁ బట్టు
బాహుచతుష్కంబుఁ బంచాస్యములుఁ బూను షణ్ముఖుఁ బ్రేమ సలుపుచుండు
సప్తాశ్వచంద్రదు లీక్షణములుగా నొప్పు నెనిమిదిమూర్తుల వినుతి కెక్కు
నవనిధీశసఖుం డనంగఁ గీర్తి వహించుఁ బదికొంగు లైనయంబరము గట్టుఁ
బదునొకండువిధంబులఁ బ్రబలు కెక్కు, వెలయుఁ బండ్రెండుగనుపులవిల్లు పట్టుఁ
గర్మపాశలవిత్రపఖ్యాతి మెఱయుఁ, గాశిలో నేను గొలిచిన ఘనయశుండు. 192

వ. అని యప్పురంబునకుం జని. 193

తే. అర్థి భాగీరథీస్నాన మాచరించి, బహువిధవిశ్వేశపదభక్తి భజన చేసి
శ్రీవిశాలాక్షి దర్శించి చిత్తమలర, వరగోపురభైరవస్వామిఁ గొలిచి. 194

వ. మఱియుఁ దత్తదుచితకరణీయంబు లనుసంధించి యప్పురంబు వెడలి, గయాప్రయాగప్రభృతిపుణ్యభూములం దిరిగి, దక్షిణదిశాభాగభాగధేయంబు లగు పుణ్యతీర్థంబులు నిరీక్షించుచు నపేక్షం దిరిగి శ్రీపర్వతదర్శనంబు సేయం బూని, మహాయుగసహస్రానశ్వరం బగు నేలేశ్వరుఁ బనుతదీయపశ్చిమద్వారంబు చెంగటి యోగిపుంగవహృదయంగమం బగు నివృత్తిసంగమంబునకుం జని. 195

చ. దురంతనివృత్తికై విషయదోహలవృత్తి నివృత్తిసంగమే
శ్వరు నఖిలేశ్వరుం ద్రిపురసంహరు హైమవతీమనోహరుఁ
హరికమలాసనాదివరదాగ్రయపాంశుఁ ద్రిశూలపాణి శం
కరు నసుహృన్మఖాంతకుఁ ద్రికాలముఁ బూజయొనర్చి పిమ్మటన్. 196

వ. అటఁ జని చని. 197

ఉ. శ్రీలలితుండు దానగుణశీలి పురందరుఁ డంతఁ గాంచె శ్రీ
శైలము రుజ్జరామరణశంకయకాంక్షలౌషధీలతా
జాలము, సార్వకాలికవసంతనితాంతలతాంతవిస్ఫుర
త్సాలము, సానుసంగతలసన్మణిదీప్తదిగంతరాళమున్. 198

వ. కని మహోత్కర్షహర్షభరవిగళదశ్రుపూరపరిపూరితలోచనయుగళుండును, సముదీర్ణసంకీర్ణముత్పులకాంకురప్రపంచకంచుకితశరీరుండును నిరంతరానందరసభరితాంతరంగుండును నై నగ్వాంగసంగతమహీతలంబు లగు సాష్టాంగదండప్రణామంబు లాచరించి లేచి యంజలిపుటంబు నిటలతటంబున ఘటియించి, బహువిధంబులఁ బ్రస్తుతించుచు నమ్మహామహీధరంబు నారోహణంబు చేసి, శశిశేఖరదర్శనపూర్వకంబుగా నపూర్వలక్ష్మీసుందరమణికందరమధ్యభాగస్థితమహాదేవమందిరముఖమండపంబుఁ బ్రవేశించి. 199

ఉ. ముందటఁ గాంచె నాశుభసముజ్జ్వలమూర్తి పురందరుండు, ని

ష్యందకృపాతరంగముఁ బెశంగక పర్దసురంగము, న్వని
ష్యందితభక్తలోకహృదపాంగము, సుందరరత్నకందరా
మందిరవల్లికార్జునసమాహ్వయజృంభితసిద్ధలింగమున్. 200

క. కని వినయంబున సాష్టాం, గనమస్కృతు లాచరించి, కరపుటములికం
బునఁ జేరిచి, యిట్లని వా, క్కని వేడ్కనుతించె భక్తిరసతన్మయుఁడై. 201

తే. దేవ శ్రీమన్మహాదేవ దేవదేవ, నాగమణిహార కృష్ణవేణావిహార
సత్కృపాపాంగ శాంభవీసంగతాంగ, పాలితాఖిలజగదీశ పార్వతీశ. 202

క. ఆశాలతాలవిత్రక, యాశాధిపమకుటమణిసమర్చితశో
భాశోభితపదపంకజ, శ్రీశైలగుహావిహార సింహాకిశోరం. 203

క. శరణాగతభయహరణా, పురదానవహరణ భూరిభుజగస్ఫురణా
గురుకరుణాంతఃకరణా, సరసిజభవవినుతచరణ చంద్రాభరణా. 204

క. కైలాససానుసంగత, కేళీవనకేళిలోల కిన్నరనారీ
లీలాగీతరసప్రియ, శైలసుతానందజలధిసంపూర్ణశశీ. 205

వ. అని స్తుతించుచు సవ్యాపసవ్యాంగప్రదక్షిణంబులును సాష్టాంగదండప్రణామంబులు
ననేకంబు లాచరించి, మహోపచారంబులు సమర్పించి యనంతరంబ కోటీశ్వ
రదేవాయతనంబునకుం జని 206

క. సాష్టాంగనమస్కారము, లష్టోత్తరశత మొనర్చి యాదేవునిపై
దృష్టియుఁ జిత్తము నిడి వి, స్పష్టముగా భక్తితోఁ బ్రశంస యొనర్చెన్. 207

గీ. ఒనరిచి యావెన్కనున్న గిరిమీఁద డిగ్గి తాఁ
జని చని ముందటం గనియె సాలరసాలతమాలకుంచచం
దనహరిచందనక్రముకదాడిమనింబకదంబపాటలీ
పనసవనీకృతార్థమును భాస్వదహోబలపుణ్యతీర్థమున్. 208

క. కని దానిమహత్త్వమునకు, మనమున నాశ్చర్యరససమన్వితుఁడై పే
ర్కొనుచుం జని భవనాశిని, గని తజ్జలమజ్జనాపకల్మషుఁ డగుచున్. 209

ఉ. కాంచెఁ బురందరుం డెదురఁ గన్నులపండువుగా సమాధిని
శ్చంచలసత్త్వభావదివిషన్మనిరాజమనస్సరోజలీ
లాంచితరాజహంసు సుజనావనదేవశిఖావతంసునిం
బ్రాంచితఘోరవీరరసభావుని శ్రీనరసింహదేవునిన్. 210

క. కని దండనమస్కారము, లొనరించుచు భక్తిరససముత్సాహమునం
గొనియాడుచుఁ దళుకొత్తెడు, ననురాగము తోడ జయజయధ్వని లెసఁగన్. 211

ఉ. శ్రీమదహోబలేశ్వరుఁ డశేషజగన్నిధి భక్తలోకచిం

తామణి వైరిదానవవిదారణదారుణనారసింహలీ
లామహనీయమూర్తి కమలారమణీరమణీయుఁ డబ్జజేం
ద్రామరబృందవంద్యుఁడు నిజాశ్రితలోకముఁ గాచుఁగావుతన్. 212

వ. అని కీర్తించి పురందరుండు పురాణసిద్ధం బగుసిద్ధపట్టణస్థానంబునకుం జని. 213

క. మున్నొనరించినపాపము, లన్నియుఁ బెనువలుతఁగలయు నవగాహనసం
పన్నుల కని సద్భక్తిని, బెన్ననదిం దీర్థమాడి ప్రీతి దలిర్పన్. 214

వ. సిద్ధేశ్వరునగరుసొచ్చి. 215

క. కని సాష్టాంగనమస్కృతు, లనేక మొనరించి ముకుళితాంజలియై భ
క్తి నుతించెఁ దనమనమ్మున, ననురాగరసంబు నిండి యలువులువాఱన్. 216

వ. ఇవ్విధంబున నప్పరమేశ్వరుం బరితుష్టహృదయునిం గావించి తదీయాయతనశిఖర మహోక్షధ్వజప్రదక్షిణపరిణద్ధమహోత్సవసమయ సమాగతభ్రమరరూపదివ్యసంయమి సముదయంబును నక్షీణపరమతపోధనప్రత్యక్షపరంజ్యోతిస్స్వరూపంబును నద్భుతాయత్తచిత్తుం డయి యవలోకించి దక్షిణకైలాసం బనం బ్రశస్తి వహించినకాళహస్తి మహాస్థానంబును ననంతభోగికటకోత్కటకం బగువేంకటాచలంబును సర్వలోకలోచనసముత్సేధసౌధగోపురం బగుకాంచీపురంబును ననవరతపరిస్ఫుటకావేరీసముత్సంగతం బగుశ్రీరంగంబును నక్షీణదురితాక్షేపణప్రారంభధురీణం బగుకుంభఘోణంబును శ్రీరామప్రతిష్ఠాభిరామం బగురామేశ్వరంబును జననిరీక్షణాపేతదుష్కర్మబంధం బగుసేతుబంధంబును సంవర్వసంచలీకృతజగజ్జననయనం బగునంతశయనంబును జూచి యక్షేశ్వరదిశాభిముఖుండై మోక్షదానదీక్షాసమక్షం బగువిరూపాక్షంబునకుం జని.

ఉ. లోలతఁ గాంచె నాసుగుణలోలుఁడు చారుశిలాగళజ్ఝరీ
జాలతటీప్రవాళఘనసత్తరువాటముఁ బార్శ్వతుంగభ
ద్రాలహరీవినోదవిహరజ్జలశీకరనిర్గతశ్రమో
ద్వేలహరప్రణామమతిదీపితకూటము హేమకూటమున్. 218

వ. కని యటఁజని తదగ్రభాగంబున. 219

ఉ. ఇక్షుధనుర్విపక్షుని రవీందుకృశాక్షుని సర్వదేవతా
ధ్యక్షుని నాదిభిక్షుని హతప్రతిపక్షుఁ గృతాంతదంతిహ
ర్యక్షు మహాముముక్షుశరణాగతరక్షణదక్షు శ్రీవిరూ
పాక్షుని నానతేంద్రకమలాక్షునిఁ గాంచెఁ గృపాకటాక్షునిన్. 220

చ. కని యతిభక్తిపూర్వకముగా ధరఁ జాఁగి నమస్కరించి లే
చి నిలిచి ఫాలభాగమునఁ జేతులు సేరిచి సమ్మదాశ్రువుల్
కనుఁగవఁ దొంగలింపఁ బులకమ్ముల నంగము విస్తరింప న

త్యమపమలీలతోడఁ గొనియాడెను భక్తిరసార్ద్రచిత్తుఁడై. 221

శ్లో. భజతభవభుజఙ్గం పాణిహేలాకురఙ్గం, ప్రమదహృదయసఙ్గం బాలచన్ద్రోత్తమాఙ్గమ్
వరమకుటపిశఙ్గం వాసకైలాసశృఙ్గం, జితమదనదపాఙ్గం శ్రీవిరూపాక్షలిఙ్గమ్. 222

శ్లో. స్మరత సదమలాఙ్గం మౌళిగఙ్గాతరఙ్గం, సదయలసదపాఙ్గం శైలజాత్మాబ్జభృఙ్గమ్
నయనవిధుపతఙ్గం నాగభూషోజ్జ్వలాఙ్గం, త్రిపురదనుజభృఙ్గం శ్రీవిరూపాక్షలిఙ్గమ్.

శ్లో. నమత సుమతిసఙ్గం నాట్యలీలాభిరుఙ్గం, కరధృతశయనాఙ్గం కాలకూటాభిషఙ్గమ్
నిగమతరువిహఙ్గం నిత్యయుక్తాన్తరఙ్గం, సితభసితసురఙ్గం శ్రీవిరూపాక్షలిఙ్గమ్.

వ. అని యిట్లు స్తుతిపూర్వకంబుగాఁ బరమేశ్వరుం బరమానంద భరితాంతఃకరణుం గా
వించి యనంతరంబ స్వదేశగమనచింత యంతరంగంబుపట్టు దవిలిన నప్పట్టు గదలి
పురందరుండు. 225

క. పుట్టిన పెరిగిన దేశం, బెట్టిజనులకైనఁ జూడ నిచ్ఛగుటను నే
పట్టునఁ గాలూఁదక నిజ, పట్టణమున కరుగఁ దెంచి పార్థివుఁ గాంచెన్. 226

తే. కని ప్రణమిల్లి సేమ మడుగంబడి వైశ్యుఁడు తాను బోయి వ
చ్చినకథ యెల్లఁ దెల్లముగఁ జెప్పిన రాజు రసైకలోలుఁడై
విని యట నీవుగన్నవియు విన్నవిఁ జోద్యము లెవ్వి గల్గిన
న్ననఁ మలరంగఁ జెప్పు మనినన్ వినయం బెసఁగంగ నిట్లనున్. 227

క. ధరయెల్లఁ దీర్థసేవా, పరతమెయిఁ బరిభ్రమించి బహువిధవిభవ
స్ఫురణ విలసిల్లుమధురా, పురకేఁ జని యందు నొక్కభూసురునింటన్. 228

వ. కృతశయనుండనై యున్న నిశాసమయంబున నప్పరోపకంఠంబునందు వితతనిర్ఘాత
పాతంబు లగుకశాఘాతంబులకుం గా కాతుర యగు నొక్కకాంతయార్తనాదంబు
కర్ణగోచరం బగుటయు నత్తెఱం గందులగృహమేధిం బ్రబోధించి యడుగుటయు
నతం డిట్లనియె. 229

ఉ. ఏమినిమిత్తమో యెఱుఁగ మీపురంచేరువ బిల్వవాటికా
సీమఁ బ్రతిక్షపంబు సరసీరుహలోచనయోర్తు దానవ
స్తోమకశాభిఘాతములఁ దోరపువేదన సైఁపలేక యు
ద్దామత నార్తనాదపరతం బ్రలపింపఁగ వింద మెప్పుడున్. 230

క. అనియె నని విన్నవించిన, విని యత్తెఱఁగెల్ల నెఱుఁగ వేడుక మదిలో
జనియించి వైశ్యయుతుఁడై, మనుజాధీశుండు చనియె మధురాపురికిన్. 231

క. అందుఁ బురందరదర్శిత, మందిరమున విశ్రమింప మధ్యమనిశయం
దేదుముఖియార్తనాదము, నందంద వినంగఁబడియె నధిపతికంతన్. 232

వ. వినంబడినయాయెలుంగు చక్కటికిం జని. 233

ఆ. కనియ నృపుఁ డఖర్వగర్వాంధదైతేయ, ఘనకశాభిఘాతకాతరాత్మఁ
దీవ్రవేదనాప్రదీపితార్తస్వన, నిబిడితాస్య నొక్క నీరజాస్య. 234

క. కనుఁగొని వెఱవకు వెఱవకు, మని యూఱడఁ బలికి సతికి నభయప్రదుఁడై
మనుజేంద్రుఁడు గర్వితుఁడై, దనుజేంద్రుల కనియె నత్యుదగ్రస్ఫురణన్. 235

ఉ. ఓరి దురాత్ములార! దళితోత్పలలోచన నేల యీక్రియన్
ఘోరకశాభిఘాతములఁ గుందఁగఁజేసెద, రింత కోర్తురే
యూరయఁ బుష్పకోమల; యహంకృతు లిం కిట మాన కున్న మీ
ఘోరకరాసిపత్త్రిమునకున్ బలిసేయుదు నీక్షణంబునన్. 236

వ. అనిన నన్నిశాచరులు సాహసాంకున కిట్లనిరి. 237

సీ. కైకొందు మమరేంద్రుఘనరాజ్యపదరమాధీనత నేకధాటీనిరూఢ
దండింతు మతిదుర్మదస్ఫూర్తి నంతకు నిజభుజాగర్వంబు నిమిషమాత్ర
భంజింతు మపరదిక్పాలకుచతురంగ బలగర్వములు తృణప్రాయములుగ
హరియింతు మే ముత్తరాధీశపాలిత నవనిధానములు ప్రాభవ మెలర్ప
నంత లేసి మహాత్ముల నింత సేయు, మాకు నిను సంహరించుటమాత్ర మెంత
యందు గుడిమిఁద్రిగువారికి నంది పిండి, వడియు మనుప లెక్కయుంగవే పుడమిలోన.

చ. అనవుడు మందహాసరుచి యాననపద్మమునం దలిర్పఁ జ
య్యన నిశితాసిపుత్త్రిక కరాంబురుహంబున సంతరించి య
ద్దనుజబలంబుపై నడచె దారుణవారణసైన్యరోధవ
ర్ధనవిభవాభిరాముఁ డగు రామనృపాలునిఁ గ్రేణిసేయుచున్. 239

క. సురరిపులుఁ బ్రాసపట్టిస, పరిఘక్షురచర్మబాణబాణాసనతో
మరముఖ్యసాధనంబులు, కరముల విలసిల్లఁ గదనకాంక్షితమతులై. 240

వ. మార్కొనుటయుఁ బ్రతాపార్కుండైన విక్రమార్కుండును. 241

ఉ. కొందఱికంఠదేశము లకుంఠితశక్తి మెయిన్ హరించుచుం
గొందఱిరక్తమాంసములు కుంభినికిన్ బలిగా నొనర్చుచుం
గొందఱిగాత్రఖండములు కుప్పలు సేయుచు దైత్యకోటిఁ దా
నందఱి సంహరించె విలయాంతకుభంగి నరేంద్రుఁ డుగ్రతన్. 242

వ. ఇత్తెఱంగున లబ్ధవిజయుండై యక్కామినీరత్నంబు నత్యాదరంబునం గనుఁగొని. 243

క. ఎయ్యది నీవుండెడు నెల, వెయ్యది నీనామ మిప్పు డీయసురులచే
నియ్యలజడిఁ బడఁ గారణ, మెయ్యది! యనవుడు లతాంగి యిట్లని పలికెన్. 244

క. అమరావతిఁ గలవేలుపుఁ, గొమిరెలలో నెల్ల రూపగుణశీలములం
గొమరారుదు నానామము, కమలావతి మీఁదికార్యగతి విను మధిపా. 245

క. అపగతసమాధియుతుఁ డై, భువనత్రయభయదభంగిఁ బూనినయుగ్ర
శ్రవసునితపంబు వృద్ధ, శ్రవసుఁడు మాన్పంగ మదివిచారించి వెసన్. 246

వ. తదీయనియతిప్రతివిధానంబునకు నాజ్ఞాపించినం దదనుజ్ఞ గైకొని తపోవనంబునకుం జని.

సీ. బద్ధసిద్ధాసనపరిణతిఁ గూర్చుండి హృదయసమాధాన మొదవఁ జేసి
మూలాలవాలసమున్నతిఁ గైకొని యనిలు మధ్యమనాడియందు నిలిపి
యంతర్గతము లైనయాఱుదామరలకు నభినవోల్లాసంబు నను నయించి
యాంతరజ్వలనసంక్రాంతిచేఁ గరఁగెడు చంద్రకళాసుధాసారధారఁ
దడిసి యాత్మానుసంధానతన్మయత్వ, నిశ్చలాంతరంగుఁ డయి నిస్తరంగ
నీరనిధియును బోలె నొప్పారుచున్న, మునివరేణ్యునిఁ బొడగంటి మనుజనాథ. 248

వ. కని సభక్తికంబుగా దండనమస్కారంబు లాచరించి పుష్పాపచయవ్యాజంబున సఖీ
జనసమాజంబుతోఁ దత్ప్రదేశంబున. 249

సీ. నవలతాడోలనోత్సవకేళి నెపమున సరససంగీతమాధురి నటించి
చతురచిత్రకథాప్రసంగంబు నెపమునఁ బరిహాసభూషణప్రౌఢి సూపి
ప్రమదనస్తనకేళిబాహాసముల్లాస సరసతఁ జాతుర్యసరణిఁ దెల్పి
పలుమాఱు నేమేనిఁ బరికించు మిషమునఁ గలికిచూపులమించు చిలికి చిలికి
చెలఁగి యిట్లేము చేసినచేఁత లెల్ల, మునితపోభంగ మొనరించు ననువు దక్క
యప్రయోజనచతురంబు లై తనర్చె, వనమహీసాంద్రచంద్రికావలులకరణి. 250

వ. అంత నంతరాత్మధ్యానావసానసమున్మీలితనేత్రుం డై యమ్మహాసంయమీంద్రుండు
తన విజ్ఞానప్రభావంబున నన్నెఱింగి యవలోకించి. 251

మ. వినఁ జూడం గొఱగానిచేష్టలఁ దపోవిఘ్నంబు గావింపఁ బూ
నినదోషంబున భీషణాసురకళానిర్ఘాతపాతవ్యథా
జనితాక్రోశరవంబుతోడ మధురాసామీప్యబిల్వాటవీ
వనికాసీమఁ బ్రతికుపంబు తరుణీ వర్తింపు దీనాస్య వై. 252

క. అనుడును శాపాలాపము, లనుతాపము సేయ మునికి సాష్టాంగముగా
వినతి యొనరించి, యెంతయు, వినయంబున శాపముక్తి విధ మడుగుటయున్. 253

మ. క్షితిసంరక్షణ మాచరించుటకునై శ్రీకామినీనాయకుం
డతులోదారుఁడు విక్రమార్కుఁ డన బ్రహ్మక్షత్త్రతేజోమయా
కృతి నావిష్కృతి నొందువాఁ, డతనియంగీకారగ మీశాపదు
ష్కృతికి న్నిష్కృతి సేయుఁ బొమ్మని కటాక్షించెం బ్రసన్నాత్ముఁ డై. 254

క. ఆమునిశాపానుగ్రహ, సామర్థ్యమువలన నసురజనితవ్యథయున్
భూమీశ యిట్లుపొరలఁగ, నీమహిమ విముక్తి గలిగె నిది విదితముగన్. 255

వ. అని వినిపించి కమలావతీవధూరత్నంబు. 256

క. దానసమగ్రత వేలుపు, మానికముం బోలుననుచు మహనీయమణిం
గానుక యిచ్చి నరేంద్రుని, వేనోళ్లం బ్రస్తుతించి వీడ్కొని చనియెన్. 257

మ. ధరణీశుండును వీడుపట్టునకు నుద్యత్ప్రీతి నేతెంచి య
త్తరుణీరత్నము శాపముక్తికిని జిత్తంబందు హర్షించుచుం
దరుణాదిత్యప్రభన్ వెలుంగుసురకాంతావత్తరత్నంబు స
త్కారుణన్ వైశ్యున కిచ్చెఁ దద్వితరణౌదార్యంబు నగ్గించుచున్. 258

వ. ఇత్తెఱంగున లబ్ధవిజయుండై యమూల్యవస్తుప్రదానవర్ధితపురందరుం డగునన్నరేంద్రపురందరుండు పురందరసహితుండై యుజ్జయనీపురంబునకు వచ్చి, నిరంతరౌదార్యంబును నిరుపమానధైర్యంబును బరోపకారచాతుర్యంబును బరమసాహసకార్యంబును దనకు నియతకార్యంబులుగా సప్తసాగరపరివృతవిశ్వవిశ్వంభరాభరణపరాయణుండై మఱియును. 259

శా. శ్రీమద్బెల్లముకొండభైరవకృపాశ్రీనిత్యసామ్రాజ్యల
క్ష్మీమాధుర్యగృహాంతరాంతరసదాకేళీనటన్నందన
స్తోమాశేషవిశేషరత్నకళికాశుంభద్విభూషావళీ
సామగ్రీకృతలోచనోత్సవలసత్సౌభాగ్యభాగ్యోదయా. 260

క. రామాకరచామీకర, చామరసంజాతవాతచంచలదలక
స్తోమాభిరామసుమహిత, రామాయణసుప్రలాప రసిక కలాపా. 261

ధృతియను వృత్తము.

ప్రతాపగుణభూషణా పరహితార్థసంభాషణా, వితీర్ణిరవినందనా విభవనూత్నసంక్రందనా, శ్రుతిస్మృతివిచక్షణా సుకృతకీర్తిసంరక్షణా, క్షితీంద్రసుతవర్తనా శివపదద్వయీకీర్తనా.

గద్యము. ఇది శ్రీమదఖిలకవిమిత్త్ర పెద్దయన్నయామాత్యపుత్త్ర
శారదాదయావిధేయ జక్కయనామధేయ ప్రణీతంబైన
విక్రమార్కచరిత్రం బనుమహాకావ్యంబునందు
ద్వితీయాశ్వాసము.

శ్రీరస్తు.

విక్రమార్కచరిత్రము.

తృతీయాశ్వాసము.

కంఠకంఠనీల
ప్రాకామ్య ప్రశమనప్రభాసితకీర్తి
శ్రీకాంతాధిపవిద్యా
సాకల్యవివేకనిపుణ జన్నయసిద్ధా. 1

ఆ. మథురనుండి వచ్చి మదనరేఖాసూనుఁ, డన్నరేంద్రుఁ గాంచె నగ్ర్యభంగి
నిరుపమాన మైననిజలతాంగి యనంగ, సేనతోడ నాత్మసేనతోడ. 2

క. ఆభర్తృహరి నపారకృ, పాభావన విక్రమార్కపతి పాలింపం
బ్రాభవమునఁ గార్యరమా, వైభవుఁడై ప్రతిదినప్రవర్ధన మొందెన్.

క. తద్రాజ్యమ్మున నధికద, రిద్రుం డగువిప్రుఁ డొకఁడు శ్రీకాంతు మహేం
ద్రాద్రిపయిఁ దపము సేయఁగ, రుద్రుఁడు ప్రత్యక్షమయ్యె రుచిరాకృతిమై. 4

తే. ఇట్లు ప్రత్యక్షమై నీయభీష్ట మెద్ది, వేఁడు మిచ్చెద ననిన నవ్విప్రవరుఁడు
సచ్చిదానందనిశ్చలస్వాంతుఁడైన, జాయురభివృద్ధి యగువర మడుగుటయును. 5

ఉ. ఒక్కఫలంబు చేత నిడి యుత్తమ మీఫల మేకభక్ష్యమై
మిక్కిలి యాయు విచ్చు నిది మృత్యుహరం బటుగాక తక్కినన్
ఒక్కఫలంబునుం గలుగ కుండుఁ జుమీ యని యానతిచ్చి తా
గ్రక్కున రాజతాద్రిమణికందరమందిరసీమ కేగినన్. 6

ఉ. భూసురవర్యుఁడున్ ఫలముఁ బొంది మహాప్రమదంబు నొంది యా
వాసముఁ గూర్చి వచ్చి నిజవల్లభ కత్తెఱఁ గెల్లఁ జెప్పినన్
గాసిలి భర్తవంకఁ గొఱగాములు పల్కి యిదేమి సిద్ధి యా
భాసున కేల చొప్పడుఁ దపఃఫలసంచితభాగ్యసంపదల్.

ఉ. లేమిఁ దొలంగఁ ద్రోవఁగ నిలింపశిఖామణి నార్తలోకర

క్షామణిఁ గోరి ఘోరతరకాననభూమిఁ దపం బొనర్చి నీ
వేమిఫలంబు వేఁడితి వభీష్టఫలం బిది నిష్ఫలంబు ని
న్నే మనుదాన నింక నెటు లే మనుదాన మహోదరద్రతన్.

వ. అని యత్యంత చింతాక్రాంత యగుననిజకాంతం జూచి యమ్మహీసురోత్తముండు దన
చిత్తంబున. 9

ఉ. నిక్కము యట్ల లేమి గడు; నివ్వెఱ నివ్వగ మేల వేఁడితిం
దక్కక యేను శంకరు నతం డిది యేటికి నిచ్చె నాతలం
పెక్కుడ నమ్మనం గలసె నేమిటికై తపమాచరించితిం
బెక్కుదలంపు లేల నిఱుపేదల కబ్బునె యిష్టసంపదల్. 10

చ. ఇదిగొని పోయి భర్తృహరి కిచ్చెద నిచ్చిన నాతఁ డాయుర
భ్యుదయముఁ బొంది యుండు నది యొప్పదె దాతలు వృద్ధిఁ బొందఁగా
పదిఁ దలపోయు నాశ్రితసమాజము నొందవె యిష్టసంపదల్
హృదయ మెలర్ప నిష్టఫల మిచ్చిన నిచ్చునతం డభీష్టముల్. 11

చ. అని తలపోసి భర్తృహరి సంచితకీర్తినిధానుఁ గాంచి యా
వినుతఫలప్రభావము సవిస్తరతం దగ విన్నవించి యి
చ్చిన నతఁ డిచ్చె విప్రునకు చింత్యము లైనధనంబు లిమ్ములం
1 దనపురి కేగి యాతఁడు ముదంబున నుండె రమాసమగ్రతన్. 12

వ. అమ్మదనరేఖానందనుండును దనసమీపంబున సమాసీన యైనయనంగసేనం గనుంగొని.

క. కూరిమి మీఱఁగఁ జేరం, జేరిచి సర్వజ్ఞుకరుణఁ జేర నటించున్
ధారుణిసురవర్యుఁ డొసఁగె న, పారతపోలబ్ధ మైనఫల మిది మనకున్. 14

2క. నరుఁ డొకఁ డిది సేవించిన, మరణజరాదులు దొలఁగి మను సంపదలన్,
అరు దిట్టిఫలము గన నీ, పరిపక్వఫలంబు భాగ్యఫలము లతాంగీ. 15

క. కావున నాకుఁ బ్రియంబుగ, నీ వీఫల మనుభవింపు మిదె కొమ్మని సం
భావన నిచ్చినఁ గొని చని, యావనితయు నిచ్చెఁ గూర్చుహయపాలునికిన్. 16

క. అమ్మందురకుఁడుఁ దద్గృహ, సమ్మార్జన కిచ్చె సంతసంబున నదియుం
గ్రమ్మన గోపున కిచ్చెఁ బ్రి, యమ్మున వాఁడును గరీషహారిణి కిచ్చెన్. 17

ఆ. ఆలమందనుండి యది మఱునాఁడు ప్ర, త్యూషవేళఁ దాఁ గరీషపూర్ణ
వేణుపాత్రమీఁద వెలయఁ బండిడుకొని, యాత్మగేహమునకు నరుగునపుడు. 18

---

1 దనపురి కేగెఁ గైకొనుచుఁ దద్ధన మంతయు వేడ్కమీఱఁగన్. అనిపాఠాంతరము

2 క. హరుకృపఁ గలిగినయది యిది, ధరణీదేవుండు మనకు దయచేసినవాఁ
డరు దెం దియ్యుత్తమఫల మీ, పరిపక్వఫలంబు భాగ్యఫలము లతాంగీ. అని, పా.

వ. సకలసైన్యసమేతుండై వాహ్యాళివిహారంబున కరుగుచున్న భర్తృహరికిం దత్ఫలంబు దృష్టిగోచరం బగుటయు. 19

ఆ. దానిఁ జేరఁ బిలిచి తత్పాత్రలోనున్న, పండు పుచ్చుకొని యతండు నగుచు
వెండి యొక్కపండు విప్రుఁ డెప్పుడో తెచ్చి, తనకు నీక యమ్ముకొనియె ననుచు. 20

ఉ. అప్పుడు విప్రు రాఁ బనిచి యావిభుఁ డిట్లను రెండుపండ్లు నీ
వప్పరమేశుచేఁ బడసి యందొకఁ డిచ్చి యొకండు దాఁచుకో
నిప్పుడ కానవచ్చెఁ జనునే యిటు వంచనసేయ నన్న వా!
* తప్పక యాఫలంబె వసుధావర దీనికి నెట్లు చేరెనో. 21

వ. అనిన విని యన్నరేంద్రుండు. 22

క. గోమయహారిణిఁ గనుఁగొని, యేమిగతిన్ దొరకె నీకు నీఫల మనుడున్
ఆమగువ దెలుపఁ గ్రమమున, నామర్మము దెలిసెఁ దత్తదంతరసరణిన్. 23

వ. అత్తెఱం గంతయుఁ గరతలామలకంబుగా నెఱింగి. 24

క. తనప్రియకాంత యొనర్చిన, యనుచితకర్మశిఖి యంతరంగము సంగం
బునఁ బరితాపము సేయఁగ, వనజాతేక్షణల గోసి వసుధేశుఁ డనున్. 25

† మ. కరకాబద్ధసురాలయంబులు మహాకాండోపరిం జిత్రతా
స్ఫురణల్ స్వప్నసువస్తులబ్ధనిరతుల్ శుంభత్ఫలాలేపముల్
కరికుంభస్తనిచిత్తవృత్తములు దత్కౌతూహలంబు ల్మదో
ద్ధురదంతిశ్రవణానిలం బని తలంతుం బూర్వవాక్పద్ధతిన్.

క. గురుపాతకములగురువులు, పురుషులనరకములు చేరఁబోయెడుతెరువుల్
పరిభవమునకుఁ గుఁబొరువులు, తరుణులమైసిరులయురులు తగునచ్చెరువుల్. 27

క. జాతులు నాతుల కెందున్, నీతము లేమన్కిఁ గామినీలోకానాం
జాతిః ప్రకల్పితా యను, నీతి పురాతనమె కాక నేఁటిదె యరయన్. 28

ఉ. మక్కువ తీపులుట్టిపడుమాటలుఁ జొక్కుల తేలగింపులుం
ద్రెక్కొనుచూపు లాసతరితీపులు కోరిక లార్తియారికల్
మ్రొక్కులు కూర్మిచిక్కు లతిమోహ మపోహము రూపశీలముల్
తక్కులయాలవాలములు దాయుదురే తరుణీజనంబులన్. 29

---

* తప్పక తత్ఫలం బొకటి తప్పదు లే దితరంబు నావుడున్. అని, పా.

† మ. హరిణీలోలవిలోచనామునుకలీలాలాపరీతుల్ మనో
హరకేళీనవరూపయౌవనమదవ్యాపారముల్ రాగసా
గరనిర్మగ్నులఁ జేయవే మగలఁ దత్కౌతూహలంబు ల్మదో
ద్ధురదంతిశ్రవణానిలం బని తలంతు ల్గాదె మేధానిధుల్. అని, పా. 26

ఆ. అని తలంచి భర్తృహరి విరక్తివహించి, యోగమార్గసంప్రయోగమునకు
ధరణివిభునిచేతఁ దగ ననుజ్ఞాతుఁడై, యేగుచుండి యతని కిట్టు లనియె. 30
క. కృతయుగకలియుగములలోఁ, మతిఁ దలఁపగఁ గలియుగంబ మానితధర్మ
స్థితి నెక్కుడు భవదవన, వ్యతికరమున సాహసాంక వసుధాధీశా. 31
క. తనబుద్ధి యొక్కకన్నును, నొనరినహితమంత్రిబుద్ధి యొకకన్నునుగాఁ
గని సంచరింప నేరని, జననాథుని జగము దెగడు జాత్యంధునిఁ గాన్. 32
తే. సుహితమతిబహుశ్రుతుఁడనుమంత్రియొకఁడు, తనవిభుఁడునందుఁడనఁబడుధరణిపతికి
బ్రహ్మహత్యవచ్చిన నది పరిహరించెఁ, బతికిఁ గడుమంత్రికంటెను హితుఁడు గలఁడె.
క. నావుడు నందమహీపతి, కేవెరవున బ్రహ్మహత్య యేతెంచెఁ దదీ
య శ్రీవిశ్రుతుఁడు బహుశ్రుతుఁ, డేవెరవునఁ బరిహరించె నెఱిఁగింపు తగన్. 34
వ. అనిన నతం డతని కిట్లనియె. 35
క. లాలితమణిమయగోపుర, సాలప్రాసాదసదనసంశోభితమై
భూలోకనాకమనఁగ వి, శాలాపుర మొప్పు విబుధసంభావితమై. 36
క. ఆనగర మేలు నందుఁడు, భానుమతీదేవి తనకుఁ బ్రాణేశ్వరిగా
ధనిధి బహుశ్రుతుండను ప్రి, ధానుఁడు గా గురుఁడు శారదానందుఁడుగన్. 37
క. ఆనందమహీవల్లభుఁ, డానందరసార్ద్రహృదయుఁడై యే ప్రొద్దుం
దా నగరువెడల కుండును, భానుమతీమోహపాశబద్ధుం డగుటన్. 38
క. జక్కవకవ వెక్కవ యగు, మక్కువతో రేయుఁ బగలు మనుజాధీశుం
డక్కాంత దక్క నోర్వక, దక్కటికార్యంబు లెల్లఁ దక్క చరించున్. 39
శా. ఆరామామణితోడఁ గూరిమి నఖండత్యాస్థఁ గ్రీడించు సం
సారస్ఫారసుఖైకసారసురతేచ్ఛాపూరనిర్మగ్నుఁడై
యారామాంతరకేళిపర్వతగుహాహర్మ్యాంతరాళంబులం
గీరాలాపముదాలిగీతవిలసత్క్రీడానివాసంబులన్. 40
సీ. ఆత్మావనీమండలాసక్తిఁ బెడఁబాసి లలనానితంబమండలముఁ బొదువు
భద్రేభకుంభసంస్ఫాలనం బొల్లక భామావక్షోజకుంభములఁ బుణుకు
బాణప్రయోగపారీణత యొల్లక నారీకటాక్షబాణముల సొగయు
నిజరాజ్యతంత్రైకనిష్పత్తి యొల్లక భామినీరతితంత్రపరతఁ బొరలు
శిష్టజనసూక్తు లవి చెడ చెవులఁ బెట్టి, తెరవసురతప్రియోక్తుల తీపి గోరు
నఖిలభూభారవహనకృత్యములఁ దొఱఁగి, నందుఁ డంగనాధీనమనస్కుఁ డగుచు.
వ. అంత బహుశ్రుతుండు తనమనంబున. 42
ఉ. మేదిని దొంటిరాజులు రమింపరె యింతులయందు సక్తులై

యీదశ రాజ్యతంత్రరహితేచ్ఛ రమింపరు గాక యట్లకా
యేదెస నిల్చిన న్నిలిచె నేదెసఁ బాఱినఁ బాఱెఁ గాక యాఁ
గాదని వంకలొత్తఁ దిలకంబులె రాజులచిత్తవృత్తముల్. 43

చ. అని తనయిచ్ఛలో వగచి యన్నరపాలునితో వినీతిగో
పనమతి మంత్రి యిట్లనియె. భానుమతీరతిమోహపాశబం
ధనములఁ జిక్కి యిట్లునికి ధర్మమె కొల్వున కేగుదెంచి ప
న్ననఁ బ్రజవిన్నపంబులు వినంగదవయ్య నృపాల వేఁడెదన్. 44

చ. అమలసమస్తవస్తునిచయాస్పద మైనధరిత్రి రాణివా
సమును సుతుల్ సురత్నములు సాగ్రజనస్తుతుఁ డైనభూవరో
త్తమునకు నాదిరాజచరితల్ జవరాలు వరాలుఁ గూడ నా
ల్గుమఱులటంట సిద్ధ మిది లోకవిరుద్ధము గాదె యయ్యెడన్. 45

ఉ. నావుడు మంత్రివర్యునకు నందమహీపతి ప్రీతి నిట్లనున్
దేవిఁ దొఱంగి యొంటిఁ జనుదెంచి వెలిం గొలువుండ నోప నా
దేవియు నేను గూడఁ జనుదెంచుట యుక్తము గాదె పాసినన్
జీవముఁ బాయువాఁడఁ గటు చిత్తజుబారికి నోర్వవచ్చునే. 46

క. ఒకరే యొక్కమహాయుగ, మొకదిన మొకబ్రహ్మకల్ప మొకగడె యొకయే
డొకనిమిషం బొకదిన మ, వ్వికచాబ్జముఖీవిరహాగ్నివేదన నాకున్. 47

సీ. కైసేసి చెలువ నాకడ నల్ల నిలిచిన సంగజశ్రీఁ జూఁచులాడఁ జూతు
నలవోక నవ్విన నన్నరగంటఁ జూచిన నీరేడుజగముల నేలఁ జూతు
నింతి కౌఁగిట నున్న నిందిరావల్లభుసౌభాగ్య మలంతిగా సంస్మరింతు
కొనమ్మ లేఁజిగురాకుఁ గెమ్మోవి చవిగొని యమృతంబు నీరస మని తలంతు
జలజనేత్రపైఁ గూర్మి సంసారఫలము, చంద్రముఖితోడికూటమి జన్మఫలము
లలనరతిరాజసామ్రాజ్యలక్ష్మితోడ, రాజ్యలక్ష్మీవిలాసగౌరవము సరియె. 48

ఉ. కన్నులు గండుమీలుఁ దొలుకారుమెఱుంగులుఁ గాముబాణముల్
చన్నులు కుంభికుంభములు సంపెఁగబంతులుఁ జక్రవాకముల్
ప్రన్ననిమేను పుష్పలత పైఁడిసలాక ప్రసూనసాయకం
బన్నలినాక్షిఁ బాసి విరహవ్యథ నొంటిఁ జరింపవచ్చునే 49

క ఏనొకనిమిషం బైనను, భానుమతీదేవిఁ బాసి ప్రాణముఁ బట్టఁ
గానోప నీవిచారము, మాను మనిన మంత్రి యనియె మనుజేశ్వరుతోన్. 50

ఉ. విన్నప మాదరింపు పృథివీవర దేవిఁ దొఱంగ నోపవే
నన్నలినాయతాక్షి రుచిరాకృతి చిత్రపటంబునం గడుం

జెన్నెసలార వ్రాసి యది చేరువ నుంచినఁ దద్విలాసరే
ఖోన్నతిఁ జూచుచుం దినము నొక్కముహూర్తము నిల్వ కొల్వునన్. 51

చ. అని నరనాథుసమ్మతి మహామతి మంత్రి బహుశ్రుతుండు న
య్యన నొకచిత్రకారుని మహాలఘుహస్తునిఁ బిల్చి వ్రాయఁగాఁ
బనిచిన వ్రాసె నత్తరుణిభావము కన్నులఁబోసినట్లు పే
ర్కొనఁ దగురూప మైనయనురూపమనోహరచిత్రరూపమున్. 52

తే. ఇట్లు చిత్రకారుఁడు రచియించినట్టి, చిత్రరూప మాలోకించి చిత్రరూప
విభ్రమాసక్తచిత్తుఁడై వెలుఁగుచుండి, తాను జిత్రరూపాకృతిఁ దాల్చె విభుఁడు. 53

ఉ. ఇమ్మెయి విస్మయాకులితహృత్కమలుం డయి చిత్రరూపముం
గ్రమ్మఱఁ జూచి చూచి పులకంబులు దాల్చి చెమర్చి కన్నుల
న్నమ్మదవారి గ్రమ్మ వదనంబున లేనగ వంకురింపఁగా
నెమ్మిఁ దదీయరూపరమణీయత వెండియుఁ జూచు నాదటన్. 54

వ. ఇట్లు చిత్రరూపావలోకనవినోదంబు సలిపి యందుఁ దనడెందంబు పరమానందంబు నొందఁ దనకౌతూహలంబు గురున కెఱింగింపఁ దలంచి తత్పటంబుఁ బంచిన నాచిత్ర సౌందర్యంబుఁ గనుంగొని శారదానందుండు. 54

క. ఈచిత్రరూపరేఖా, వైచిత్రి ప్రశంససేయ వశమే దీనిం
జూచినను భానుమతినిం, జూచినయట్లయ్యె నిట్టిచోద్యము గలదే. 55

వ. అని కొనియాడి దేవిరుచిరాకృతియం దొకమచ్చ పెందొడం
గనుఁగొన నొప్పు నీలమణికాంతి బెడంగయి చిత్రకార యీ
యనుపమచిత్రరూపమునయందు లిఖింపుము దాని నొప్పుగా
ననవుడు నట్లచేసి లఘుహస్తుఁడు కస్తురితోడఁ దూలికన్. 56

తే. శారదానందగురుఁడు సుజ్ఞానపరుడు, వీడుకొలుపఁగ జని నందవిభునిఁ గాంచి
చిత్రకారుఁ డాతెఱఁ గెల్లఁ జెప్ప విభుఁడు, వెలఁదితొడమచ్చ యేకాంతవేళఁ జూచి.

క. నందమహీపతి డెందం, బాందోళము నొంద శారదానందుఁడు మ
చ్చం దగ నిలిపెం గదె మ, త్సుందరితొడ నున్కి యెట్లు చొప్పడ నెఱిఁగెన్. 58

ఆ. అంతిపురములోని కన్యలపేరిటి, పోతుటీఁగనైనఁ బోలయకుండ
నాజ్ఞవెట్టి శారదానందగురునాజ్ఞ, వెట్టనేరనైతి బేలనైతి. 59

క. ఎంతజితేంద్రియు లైనను, నెంతసదాచారు లైన నేకాంతమునం
గాంతలసంగతి నుండినఁ, గంతునికొంతాలపాలు గాకుందురే. 60

క. ఏకాంతంబునఁ గదిసిన, యాకాంతుం డలవసిష్ఠుఁడైనం గానీ
యాకాంత సీత గానీ, నే కరుగదె యగ్గిపొంత వెన్నయుఁ బోలెన్. 61

చ. అని తలపోసి నందవిభుఁ డష్ట బహుశ్రుతుఁ బిల్వఁ బంచి యా
య్యనఘచరిత్రుతోడ హృదయవ్యథ యల్ల నెఱుంగఁ జెప్పి చ
య్యనఁ గొనిపోయి యీ యఘమయాత్ముని ఘోరవిధిన్ వధించి ర
మ్మనవుడుఁ బూరుపార్థముగ నప్పిభుతోడ బహుశ్రుతుం డనున్. 62

తే. ఎంతపాపాత్ముఁ డైన మహీసురుండు, హింస కర్హుండు గాఁడని యెఱిఁగి యెఱిఁగి
మహితచారిత్రు గురుఁ బరామరిక లేక, చంపుమని పంపఁ దగునయ్య సదయహృదయ

తే. అనిన నెయ్యివోసినయగ్గియట్ల మండి, యప్పుడుకలఁచి కోపారుణితాక్షుఁ డగుచు
నుగ్రదృష్టిఁ జూచిన నాబహుశ్రుతుండు, వెఱచి వేగమ గురుఁ బట్టి విఱచి కట్టె.

క. పురజనులెల్లఁ గనుంగొని, పురిపురఁ బొక్కంగ వధ్యభూమిస్థలికిం
ద్వరితగతిం గొనిచని యా, గ్గురు హింసయొనర్ప మనసు గొలుపమిఁ దనలోన్. 65

తే. దేవితోడమున్ను నిజదివ్యదృష్టిఁ జూచి, చిత్రరూపమునం దది చెలువు మిగుల
వ్రాయ బంచిన నీచేటు వచ్చెఁగాక, యితనిసుచరిత్ర మెవ్వరు నెఱుఁగ రిట్లు 66

ఉ. గా జవివేకినై నిరపరాధు మహీసురవర్యునిన్ జగ
త్పూజితుఁ బుణ్యవర్తను విధూతనమజ్జనకల్మషున్ వధూ
వ్యాజమునన్ వృథా కుపితుఁడై వధియింపఁగఁ బంపె దీని నే
రాజుఁ దొలంగఁ ద్రోతు గురు నుత్తము నెమ్మెయిఁ గాతు దైవమా. 67

క. ఏమియుఁ గానఁడు పతి కాం, తామగ్నుఁడు గానఁ గార్యతతి యెట్టిదియో
కామాంధోఽపి నపశ్యతి, నా మును వినఁబడినపలుకు నైజము కాదే. 68

చ. పతి మతిమాలి కానిపనిఁ బంచినఁ జేయఁగ నుత్సహించినన్
హితమతినైన యమాత్యుఁడు సహింపఁ గదించియు నడ్డగించియుం
బతియపకీర్తిదోషములు పాపి చరించుట నీతి గాన నే
నితని నిగూఢవృత్తి భరియించెదఁ గాకని నిశ్చితాత్ముఁడై. 69

ఉ. కట్టినకట్లు లూడ్చి యనుకంప దలిర్పఁగ భూగృహంబునం
బెట్టి ప్రియోక్తులన్ గురు నభీతమనస్కునిఁ జేసి పాప మే
పట్టున లేమిఁ దేటపడఁ బల్కి మనోవ్యథఁ బాపి సర్వముం
గట్టడచేసి సెట్టి నృపకౌశికుఁ డున్నెడ కేగి యిట్లనున్. 70

క. దేవరయానతి జగతీ, దేవనిధానంబు వసుమతీనాథ కృతాం
తావాసవాసుఁ జేసితి, నావుడు విని నందవిభుఁడు నందితుఁ డయ్యెన్. 71

క. ఆలో నొకనాఁడు మహీ, పాలునిప్రియసుతుఁడు విజయపాలుం డనుదు
శ్శీలుఁడు మృగయాలోలత, వ్యాలమృగాభీల మైనవనమున కరిగెన్. 72

తే. ఏగునెడ దుర్నిమిత్తంబు లెన్నియేని, గనియు వినియు నిశ్శంకతఁ జనకు మనుచు

నొరలు నిల్పిన నిల్వక దుర్నిమిత్త, ఫలము ముందటి కెఱిఁగికోవలయు ననుచు. 73

వ. ఇట్లు నీతిదూరుం డగు నాకుమారుండు దురహంకారుండై యపారసత్త్వభయంకరసంచారం బగు కాంతారంబు దఱిసి బహుప్రకారమృగయావిహారంబు లొనరించుచున్న సమయంబున. 74

ఉ. కొండొకవాలముం గుఱుచకొమ్ములు సన్నని వైనవీనులుం
నిండిననీలమేఘరుచి నెక్కొనుచున్న తదీర్ఘదేహముం
జండతరాస్యమండలము సర్వభయంకరలీలఁ గ్రాలఁగాఁ
దొండము లేనిభద్రకరితో నెన యైనవనీవరాహమున్. 75

ఉ. ముందట దవ్వులం గని సముద్ధతి నశ్వముఁ దోలుకొంచు నా
పందిపిఱుందఁ బోవ నది పాఱి లతాగహనంబు చొచ్చినన్
మందపిచారుఁడై నృపకుమారుఁ డొకండును నేగి దాని నం
టం దఱిమెన్ వరాహము కడంకఁ దిరోహిత మయ్యె నయ్యెడన్. 76

ఉ. పంది మొఱంగిపోయిన నృపాలతనూజుఁడు చిన్నవోయి! మా
ధ్యందినవేళ నొక్కసలిలాశయముం గని వాజి డిగ్గి తా
నందుఁ గృతావగాహుఁడయి యాగళపూరితతోయమందుఁ దృ
ప్తిం దురగంబు తాను వడఁ దేఱి మహాతపభీతి నయ్యెడన్. 77

ఉ. కొండొకసేపు నిల్చిఁ చనుకోరిక రాకొమరుండు పద్మినీ
షండసుగంధమారుతవశస్ఫుటశీకరసిక్తమంజరీ
మండితభూరిభూరుహసమావృత మైనవటంబునీడఁ గూ
ర్చుండె ఖలీనరజ్జువున నొక్కెడ నశ్వముఁ గట్టి యిమ్ములన్. 78

వ. అయ్యవసరంబున సర్వజగదాభీలం బగు నొక్కశార్దూలంబు తత్సమీపతరులతాకుంజపుంజంబుననుండి యమ్మనుష్యగంధం బాఘ్రాణించి రౌద్రరసోద్రేకంబునం జనుదెంచి బలువిడి లంఘింప నుంకించుటయు బిట్టు పొడగని యిట్టట్టు నెగసి వెనుకకు నీల్గి కుప్పించి దాఁటిన ఖలీనంబు లూనం బగుటయు హయంబు రయంబునం దనవచ్చిన తెరువునం బడి పరువునం జనియె నంత నక్కుమారుం డతిభీతుండై పరిసరమహీరుహంబు నారోహణంబు చేసె నట్టియెడ. 79

సీ. అమ్మహోగ్రవ్యాఘ్ర మమ్మహీజముక్రింది కుద్వృత్తి నేతెంచి యొడుపుదప్పి
నప్పటిభుజగంబునను వున మ్రోఁగుచు వాల మలార్చుచు వాఁడికోఱ
నదరులువాఱ నోరంతయుఁ దెఱచుచుఁ గన్నులఁ గోపాగ్నికణము లురల
మీఁదు సూచుచు మ్రానిమీఁదికి నుఱుకంగ జంకించు చుగ్రవిస్ఫారఘోర
వజ్రనిర్ఘాతపాతరవమ్ము గొలుపఁ, గాలుద్రవ్వుచు నుండెఁ దత్సాలమూల

మున మొగంబున రౌద్రంబు మునుకొనంగ, విజయపాలునిచిత్తంబు విహ్వలింప. 80

చ. దిగు లడరంగ నిట్లు జగతీవరసూతి కుజంబు నెక్కఁ జోఁ
దగ నొకవృద్ధభల్లుకము తా నటమున్న వసించి యుండెఁ గ
య్యగవిపులాగ్రశాఖ నతఁ డప్పుడు ముందట నుయ్యి వెన్కఁ గ్రోఁ
తగు గొయి యున్నలా గయినఁ దల్లడ మందె వణంకుమేనితోన్. 81

వ. ఇట్లు దిగులువడి యున్న యన్నరేంద్రనందనుం గనుంగొని యాని నుద్దేశించి కారుణ్య
బుద్ధి నావృద్ధభల్లుకంబు మనుష్యభాషణంబుల మెల్లన నిట్లనియె. 82

ఉ. వెఱవకు రాజకుమార పులి వెన్నగులం బఱతెంచి నన్ను నే
డైఱ శరణంబుచొచ్చి తలిదీనత నిట్టిమహోగ్రమూర్తులం
గుఱుకొని యంతనిర్దయులఁ గ్రూరత కోర్చి వధింప నేర్తురే
తొలఁగుము చింత వంత నను దుష్టుఁగఁ జూడకు మన్న నెమ్మదిన్. 83

వ. అని పెక్కుభంగుల నక్కుమారునిభయంబు దీర్చి తనసమీపంబునకుఁ జేర్చి యుచితో
పచారంబు లొనర్చి సారంబు లగు వన్యఫలాహారంబుల నాఁకలి దీర్చి యనునయించి
యున్నంత. 84

సీ. పశ్చిమాంభోనిధిప్రాంతదేశంబున రంజిల్లుద్రుమసంఘ మునఁగఁ
జరమాద్రిశిఖరదేశంబునఁ గనుపట్టు కమనీయఘనరత్నకందమనఁగ
నపరదిక్కామిని యమరంగఁ గనుఁగొను, పద్మరాగంపుదర్పణమనంగ
పశ్చిమదిక్కుంభిపాలభాగంబున బొలుపొందు జేగురుబొట్టనంగఁ
బూర్వకంఠి వేలావనభూమిఁ బండి, కాలశుకతుండపహ్నతిఁ బిట్లఁగదలి యపర
జలధిలోఁ బడుదాడిమీఫల మనంగ, నబ్జినీవనబాంధవుఁ డస్తమించె. 85

క. తదవసరంబునఁ జుక్కలు, చదలం గలయంగ నొప్పెసఁగి నిగిడెఁ దమం
గదిరినగగశ్రీమెయి, నొదవినఘర్మాంబుకణసముత్కర మనఁగన్, 86

క. అంతటఁ జీఁకటి యఖిలది, గంతంబుల నిండఁబర్వ నయ్యెలుఁగు ప్ర
శాంతుఁ డగునతనిభావం, బంతయు వీక్షించి మది దయారస మొదవన్. 87

ఆ. మేను మాఱుపడఁగ మీలితోన్మీలిత, లోచనాంబుజయుగళుం డగుచుఁ
దూఁగ నేల నాదుతొడలపై నెమ్మది, నిదురవోదు గమ్ము నృపకుమార. 88

చ. అని తనయంకపీఠిపయి నాతనిఁ జేరిచి నిద్ర పుచ్చె నం
త నది యెఱిఁగి బెబ్బులి ముదం బెసలారఁగ నెల్గుతోడ ని
ట్లను మది విశ్వసింపఁ జనునయ్య మనుష్యుల నందు రాజనం
దనుల నొకింతయేనియు మనంబున నమ్మదురయ్య యెయ్యెడన్. 89

క. తనకొక యాపద వచ్చినఁ, గనికరమున దానిఁ బాపి కాచినయప్పు

ణ్యునకుం దుడిఁగి డొనరిం, పనె మామం గృతఘ్నుఁ డెన్నిభంగుల నైనన్. 90

ఉ. కావున నిన్నరాధమునిఁ గైకొని నాకహితంబు సేయ నే
లా వనసాహచర్యబహుళంబుగ బాంధవ మెట్లుఁ జూడ వే
లా వధియించి వీనిపలలంబు సమాంశము నీకు నిచ్చెదం
ద్రోవుము నేలఁ గూల నతిధూర్తులతోడిసఖిత్వ మేటికిన్. 91

చ. అన విని వృద్ధభల్లుకము వ్యాఘ్రకులోత్తముతోడ నిట్లనున్
వెనుకొని నీవు నంపఁ దఱివేఁచి వడిం జనుదేర భీతిమై
నను శరణంబు వేఁడిన సనాతనబుద్ధిఁ బరిగ్రహించితిన్
విను మనఘుండు పట్టి మఱి విడ్వఁగ నేర్చునె యెట్టివారలన్. 92

తే. మరణభయమున వచ్చి నామఱువు సొచ్చెఁ, జంప నొప్పింపఁ గోపింపఁ జాల వీని
శరణువొందిన రక్షింపఁజాలియుండి, మనుపకుండినకంటెఁ గల్మషము గలదె. 93

మ. అనినం బెబ్బులి చిన్నవోయి మఱి యొండాలాపము ల్మాని యుం
డె నరేంద్రాత్మజుఁ డంత మేలుకొనియెన్ డెందంబునన్ రాజనం
దనుచొప్పారయ వేఁడి పేరలుఁగు నిద్రన్ మేను తూఁగాడెడున్
నను నీయంకతలంబున న్నిదుర నూనం జేయవే వేఁడెదన్, 94

చ. అనవుడు నిందు రమ్మని ధరాధిపసూతి నిజాంకపీఠియం
దునిచిన నిద్ర వోయినటు లుండెఁ జలింపక భల్లుకంబు శౌ
ర్యనిరతి నంతఁ గ్రోల్పులియు నానృపనందనుతోడ నల్ల ని
ట్లను నిది యేఁ దొలంగి చనునప్పుడు నిన్వధియించు నెమ్మెయిన్. 95

చ. హితవరిమాట లాడి తుది నెగ్గొనరింపనె కాఁచియున్న యీ
కితవపువృద్ధబల్లుకము కృత్రిమమైత్రి నిజంబుగాఁ దలం
చితి నరమాంసభక్షణము జీవికగా మనుకష్టజీవి న
మ్మితి వనుకూలశత్రు లగుమిత్రుల నమ్మదురయ్య యెయ్యెడన్. 96

తే. తొలఁడన్నపై నిద్రవోయెడుదుష్టమృగముఁ, గొంకుకొసరు లే కిటు నేలఁ గూలఁ ద్రోవు
దీనిరక్తమాంసంబులఁ దృప్తిఁ బొంది, తొలఁగిపోయెద నీవుఁ బో దొసఁగు మాలి.

ఆ. అనినఁ జపలబుద్ధి యానృపాలకసూతి, పులిదురుక్తు లాత్మఁ గలఁపఁ గలఁగి
భల్లుకంబుఁ బట్టి పడఁద్రోసె నదియును, బడక యొక్కశాఖఁ బట్టి నిలిచె. 98

చ. పరహితకారి కెంచ ననపాయశుభంబులు వొందుఁ జాల ము
ష్కరు లగుక్రూరకర్ము లపకారము సేయఁ దలంచిరేని న
ప్పురుషవరేణ్యుఁ గీడొకటి వొందునె తేజము దక్కఁ దక్కరుల్
పొరయునె లోకబాంధవు నపూర్వమనోభవు సప్తసైంధవున్. 99

ఆ. అంత విజయపాలుఁ డతిభీతచిత్తుఁడై, వెల్లఁబాఱు మొఱఁగి భల్లుకంబు
కరుణ నిన్ను మున్ను గాఁచితి నింక నీ, వెట్టివాఁడవైన నెగ్గు దలఁప. 100

క. వెఱవకు మెన్నఁడి నుండుము, నెఱవారలబుద్ధు లాత్మఁ బెట్టును యనఘుం
డొఱపిఁడిచాడ్పున నామది, నఱమర లేదొండు నమ్ము మనియె నరేంద్రా. 101

తే. అంతఁ జీకటి బెబ్బులియాసలెల్లఁ, బాసి పోయినకైవడిఁ బాసి పోవ
విజయపాలుని నెమ్మోము విన్నఁబోయి, తెల్లవాఱినకైవడిఁ దెల్లవాఱె. 102

క. అప్పట్టు విడిచి యప్పుడ, చప్పుడు గాకుండఁ బులియుఁ జనె వేగము దా
నెప్పుడు నుండెడునెలవున, కప్పుడె యానృపతిసుతుఁడు హర్షము నొందెన్. 103

వ. అంత. 104

సీ. సకలలోకంబులుఁ జక్రవాకంబులు నుల్లాసవార్ధి నోలలాడ
నంధకారంబులు నలచకోరంబులు సొబగేది గొందులు సొచ్చి డాఁగ
నయనకంజంబులు నలినపుంజంబులు సువికాసనంపద సొంపుమిగుల
రాయంచదాఁటులు మోఱియులేఁదేఁటులు గృహసరోవరములఁ గేలిసలుప
విమలతారకములు వివిధకోరకములు, నచ్చటచట నల్లనల్ల విరియ
హల్లకములు బుధులహస్తముల్ మొగుడంగఁ, బూర్వశిఖరిమీఁదఁ బొలిచె నినుఁడు.

వ. అట్టియెడ నన్నరేంద్రనందనుండు మున్ను గా ఋక్షంబు వృక్షంబు డిగ్గి వానిచేసినయపకారంబునకుఁ దగినశాపం బొసంగి యివ్వనాంతరంబున నిరంతరంబును ససేమిరారావముఖరముఖుండవై పరిభ్రమించుచుండునది యెన్నండే నెవ్వఁడే నేతద్వృత్తాంతంబు బహిర్భావాయత్తంబు గావించు నప్పుడ విగతశాపుండవై యెప్పటియట్ల సుస్థిరత్వంబున వర్తింపఁ గలవాఁడ వని వరం బిచ్చి భల్లుకంబు చనియె. తదనంతరంబ విపినాంతరంబున నక్కుమారుండు ప్రభూతశాపవికారుండై పరిభ్రమించుచుండె నట రాకుమారుని యశ్వరత్నంబు పల్యాణంబుతోడన పఱతెంచినం జూచి పౌరజనం బచ్చెరువడి యేకతంబున నిది యేకతంబున వచ్చెనో నిన్న విజయపాలుండు వేఁట్లవెడలినప్పు డనేక దుర్నిమిత్తంబులు దోఁచెఁ దన్నిమిత్తంబున నిట్లయ్యె నింక నెట్లయ్యెడునొకో యని దిగులుమిగులం జని నందభూమీశ్వరునకుం దగుతెఱంగున నత్తెఱం గెఱింగించిన నతండు ధైర్యంబు వెల్లగిల్ల నుల్లంబు దల్లడిల్లఁ గుమారాన్వేషణతత్పరుండై వాహనారోహణంబు చేసి సముత్సాహసన్నాహవాహినీసమేతుండై పురంబు నిర్గమించి నిసర్గధార్త్యమృగవర్గనిరర్గళస్వనదుర్గమం బగువనదుర్గంబు ప్రవేశించినం దత్సైనికు లందఱు నన్నిమార్గంబుల నరిగి యొండొరులం గడవం బాఱియు నెలుంగెత్తి చేరం జీరియు సీఱంబులు మాఱియుఁ జెట్టుచెట్టును ముచ్చట్టుదిరిగియుఁ దిరిగినచోటులనె తిరిగియు నడవియెల్లను దడవితడవి యొక్కయెడ నక్కుమారుం డొక్కరుండును దిక్కు-

మాలి దీనదశం బిశాచంబు చందంబున సతతంబును ససేమిరా యనుచుం బరిభ్రమించు
చున్నం గని విన్నవించిన నంతభూపాలుండు నిజనందను విజయపాలుం దోడ్కొని
సపరివారంబుగాఁ బురంబునకు నేతెంచి యక్కుమారునియపస్మారంబునకు దేవభూదేవ
తాసమారాధనంబుల మణిమంత్రతంత్రక్రియాసాధనంబుల నానావిధభూతబలివిధానం
బుల మహాదానంబుల నాచరించి యేమిటను డిందుపాటు లేకుండిన నందభూపాలుండు
తన డెందంబునం గొందలం బందుచు నిక్కుమారునికి కారంబునకుఁ బ్రతీకారం బెవ్వం
డు సేయసమర్థుం డతనికి నర్ధరాజ్యం బిచ్చెద నని సర్వదిశల విశదంబుగాఁ జాటంబ
నించి శారదానందగురుం డొక్కరుండు మనంబునం దక్క నిక్కొఅగామి సక్కఁజేయ నెక్క
డివాఁడునుం గొఅగాఁడ. అజ్ఞానంబున నాసుజ్ఞాననిధానంబు గోలుపోయితి నేమి సే
యుదు నని పరితపించుచున్నం గని బహుశ్రుతుండు నేలమాలె నున్నత్రికాలవేదిపాలి
కిం జనుదెంచి నమస్కరించి యామూలచూడంబుగాఁ దద్వృత్తాంతం బంతయు నెఱిం
గించి యిట్లనియె. 106

తే. వేల్పులకు మ్రొక్కి వెజ్జులవెంటఁ దిరిగి, మంత్రవాదుల రప్పించి మందు లరసి
కొడుకు వేఁదు లేమిటఁ దీర్పఁగూడకున్నఁ, బుడుకువేఁదులు గొన్నాఁడు పుడమిఱేఁడు

సీ. నావుడు శారదానందుఁ డూహించి దివ్యజ్ఞానసరణి సర్వంబు నెఱిఁగి
యిది యేను జక్కఁజేసెద నీవు నందభూమీశునికడ కేగి యిట్టులనుము
మనశారదానందుననుఁగునందన సప్తసంవత్సరప్రాప్త సంవిదర్ధ
పరపురుషేక్షణాపరిహృతవ్రతశీల కల దొక్క రతి తిరస్కరిణిలోన
నుండి విజయపాలునితోడ నుచితభంగి, మాటలాడిన వేఁదులు మాన నోపు
నని హితంబుగఁ జెప్పి నీవాన్నృపాలు, నట్లు సేయ నియోగింపు మనసుచరిత. 108

చ. అనిన బహుశ్రుతుండు చని యార్తిఁ గొల్లను విన్నవించి యా
జనపతి యున్నయాకొలువుసాలవెలిం దెరవాటె యగ్గురుక్
గొనిచని యుంచె నందనుఁడు కోరి నిరంతరముక్ ససేమిరా
యని పలవించుచుండఁ గొలువై నృపుఁ డుండె నిజాప్తకోటితోన్. 109

వ. అట్టియెడ శారదానందుం డమందానందకందళితహృదయారవిందుండై నృపనందనునపస్మా
రంబు దిరస్కారంబు సేయం దలంచి హృద్యంబు లయి పూర్వోక్త చతురక్షరాద్యంబు
లై తదీయవిపినవృత్తాంతసూచనాద్యంబు లైన పద్యంబులు నాల్గు నిట్లని పఠియించె.

* తే. సకలలోకోపకారసంచారులైన, సానుజనుల వంచించుట జాణతనమె.
తొడలపై నమ్మి నిద్రవోయెడువయస్యుఁ, బగతుపాలను ద్రోయఁ బాపంబు గాదె.

*క. సజ్జనభావము గల్గుసు, హృజ్జనులను మోసపుచ్చుటిది నేదువె నీ
పజ్జం దొడపైఁ గూర్కిన, యాజ్జంతువుఁ జంపఁజూచుటది పౌరుషమే, పా.

తే. అనిన నాసకారంబు నుజ్జన మ్మునర్చి, యక్కుమారుఁడు "నేమిరా" యనుచు నుండె
నందనృపుఁ డాప్తులైనజనంబు లెల్ల, దాన నద్భుతానందచేతస్కులైరి. 112

వ. తదనంతరంబు. 113

క. సేతువుదర్శింప మహా, పాతకములుఁ బాసిపోవుఁ బ్రాణసఖునకున్
ఘాతుకమతి నొనరించిన, పాతక మేతీర్థసేవఁ బాయునె నరునిన్. 114

క. అన విని సే యనునక్షర, మనుగతముగఁ బలుకు టుడిగి యటమీఁద "మిరా"
యనుచుండె నక్కుమారుఁడు, జనపతి నెమ్మొగము హర్ష జలధిం గేలెన్. 115

వ. శారదానందుండు మఱియును. 116

క. మిత్త్రద్రోహి కృతఘ్నుఁడు, ధాత్రీసురహంత హేమతస్కరుఁడు సురా
పాత్రీభూతుఁడు నిందా, పాత్రులు వీరెల్ల నరకభవనావాసుల్. 117

క. అనిన మివర్ణము నుజ్జన, మొనరించి నరేంద్రసూతి యుడుగక "రా, రా"
యని పలుకఁ జూచి యప్పుడు, మనుజేశ్వరుఁ డుత్సహించె మంత్త్రులుఁ దానున్.

వ. మఱియు శారదానందు డిట్లనియె. 119

†క. రాజులు మెచ్చఁగ దిక్కుల, రాజులను జయించి ధనము రాజులచేతన్
ఓజఁగొని విప్రకోటిం, బూజింపు మనూనదానభోజనవిధులన్. పా. 120

ఆ. అనిన విజయపాలుఁ డపుడ యాశాపవి, కారమానుపూర్వకముగ విడిచి
స్వస్థుఁ డై యరణ్యవాసవర్తన మెల్ల, విభున కెల్లవారు వినఁగఁ జెప్పె. 121

ఉ. చెప్పిన నందభూవిభుఁడు చిత్తమునం గనుఁజోద్య మంది తా
నప్పుడ దిగ్గనన్ యవనికాభిముఖుం డయి యోగహాస్య వి
చొప్పునఁ జెప్ప నెవ్వరికిఁ జొప్పడు? నొప్పుగ నిట్టి దిమ్మెయిం
జెప్పినచొప్పు నా కెటులు చెప్పితి? చెప్పుము నీవు బాలికా. 122

క. వాకిలి వెడలి యెఱుంగవు, గాకోమరునియెలుఁగుపులి యరణ్యాంతర భూ
పాకలనం బెట్లొదవెను, మా కున్ననిజంబుఁ జెప్పుమా గురుపుత్త్రి. 123

వ. అనిన శారదానందుం డన్నరేంద్రున కిట్లనియె. 124

తే. సర్వభూదేవదేవప్రసాదమహిమ, శారదాదేవివరమున సకలలోక
వర్తనంబులు గానంగవచ్చు మాకు, భానుమతిమచ్చఁ గన్నట్టు భావవీథి. 125

తే. అనినఁ బతి శారదానందుఁ డగుట యెఱిఁగి, సరభసము నొంది యత్తిరస్కరిణి దీసి
భయముభక్తియు సిగ్గు విస్మయముఁ దోఁప, లేచి గురునకు వందనం బాచరించె.

తే. అట్లు ప్రణమిల్లి గురుని నత్యాదరమున, గారవించి బహుశ్రుతుఁ జేరఁ బిలిచి

†క. రాజేంద్ర విజయపాలుని, రాజితశుభమూర్తిఁ జేయ రతిగలదేనిన్
బూజార్హుల వీరెల్లరఁ, బూజింపు మనూనదానభోజనవిధులన్.

కరము కరమునఁ గీలించి కరముఁ బ్రీతి, నందుఁ డాతని కలియ నానంద మెసఁగ.

ఉ. నిందకు నోర్చి దోషము గణింపక రిత్తకు రిత్త శారదా
నందునిఁ జంపు మన్న నిది న్యాయము గాదని యెంత చెప్పినన్
మందమతిన్ వినం దెఱఁగుమాలిన నన్ను మొఱంగి కాఁచి య
మ్మందఱ సత్క్రియానిరతి నిప్పుడు గాఁచితి చెప్ప నేటికిన్. 128

తే. దోసమును నపకీర్తియుఁ దొలఁగఁ బెట్టి, నాఁడు గురుఁ గాఁచుకొంటివి నేఁడు నన్ను
సుతునిఁ గాఁచితి త్రిస్థానశుద్ధి గాను, నీఋణం బింక నేమిట నీఁగువాఁడ. 129

క. నీకతమున నిహపరములు, నాకిట సిద్ధించె నీసనాతనబుద్ధి
ప్రాకారముకలిమి నఘా, నీకంబుల గెలుచు టరుదె నృపనయవేదీ. 130

తే. అని యనేకవిధంబుల నాదరించి, మంత్రి కతిసుస్థిరైశ్వర్యమహిమ యొసఁగి
శారదానందగురునకు దారవోసి, యగ్రహారసహస్రంబు నర్థి నిచ్చె. 131

క. ధృతిమంతుఁడు ధీమంతుఁడు, మతిమంతుఁడు నైనమంత్రి మహినెత్తఱి నే
నతిసంపద గోరెడుఁబతి, కతఁడబ్బుట సెన్నిధాన మబ్బు టగాదే. 132

ఆ. వరరథాశ్వసుభటవర్గమెల్లను గల్గి, చాలినంతభూమి యేలఁగల్గి
తగినమంత్రి లేనిధరణీశురాజ్యంబు, గాలిఁ దూలు దీపకళికఁ బోలు. 133

వ. కావున. 134

ఆ. భట్టి నీకు హితుఁడు పరమవిశ్వాసియు, భట్టిబుద్ధి మేలుబంతి నీకు
సకలరాజతంత్ర సర్వాంగరక్షకు, భట్టినీతి వజ్రపంజరంబు. 135

వ. అట్లగుటంజేసి మీరిరువురుం జేరి చరితార్థులరై వాగర్థంబులుంబోలె నభిన్నప్రభావం
బుల వర్తిల్లునది యని హితోపదేశంబు చేసి పరమయోగానంద జితేందిరానందనుం
డై మదనరేఖానందనుండు నిజేచ్ఛం జనుటయు. 136

శా. శ్రీకర్ణాటమహామహీశ్వర సదాసేవాప్రధానోత్తమా
నీకస్తుత్య లిపిక్రియానిపుణపాణిద్వంద్వపంకేరుహా
యాకల్పాంతకనిత్యకీర్తిజలజాస్యాకేళిగేహీభవ
ల్లోకాలోకధరాధరావృతధరాలోకైకరక్షామణీ. 137

క. రాజప్రసాదసముదిత, తేజఃకీర్తిప్రతాపదీపితలక్ష్మీ
రాజితనీతిధురంధర, రాజముఖీపుష్పచాప రసికకలాపా. 138

భుజంగప్రయాతము.

సరోజాననానందసౌందర్యమూర్తీ, సరోజాతసంజాతచాతుర్యపూర్తీ
ధరిత్రీసురాధీనదానానువర్తీ, శరచ్చంద్రికాపూరసారూప్యకీర్తీ.

గద్యము. ఇది శ్రీమదఖిలకవిమిత్త్ర పెద్దయనామాత్యపుత్త్ర
శారదాదయావిధేయ జక్కయనామధేయ ప్రణీతంబైన
విక్రమార్కచరిత్రం బనుమహాకావ్యంబునందు
ద్వితీయాశ్వాసము.

శ్రీ ర స్తు.

వి క్ర మా ర్క చ రి త్ర ము.

చ తు ర్థా శ్వా స ము.

శ్రీమదపారకృపారస
సామగ్రీవర్ధమానసకలార్థిజన
స్తోమబహువిభవ యనితర
సామాన్యగుణాభిరామ జన్నయసిద్ధా. 1

వ. అమ్మహీశ్వరుండు తదుపదిష్టప్రకారంబున వసుంధరాపరిపాలనపరాయణుండై యుండునంత నొక్కనాఁడు. 2

శా. ఆలోలామలదీపవల్లికలతో నాకాశసంచారి యై
కైలాసం బిటవచ్చె నెట్లొకొ యనంగా శోణచంచజ్జటా
జాలం బొప్పఁగఁ బాండురద్యుతులతో సాక్షాత్కరించెన్ మహీ
పాలాగ్రేసరుమ్రోల నారదుఁడు భూభాగంబు భూషింపుచున్. 3

ఉ. అమ్మునినాథశేఖరుని నర్థి నెదుర్కొని భక్తిమైఁ బ్రణా
మ మ్మొనరించి సన్మణిసమంచితకాంచనపీఠి నుంచి నె
య్యమ్మున నర్ఘ్యపాద్యవిధు లాదిగఁ బూజ యొనర్చి యంతయున్
సమ్మద మొందఁజేసి సురసంయమితోడ నరేంద్రుఁ డిట్లనున్. 4

చ. తలకొని యున్న తొంటిసుకృతంబుకతంబున వచ్చి మీఁదటం
గలిగెడుశోభనంబులకుఁ గారణమై మఱి వర్తమానని
శ్చలదురితంబులం దలఁగి సన్మునినాథకులావతంస ని
ర్మలభవదీయదర్శనము మాకొనరించెఁ ద్రికాలయోగ్యతన్.

వ. అనిన నమ్మునీశ్వరుండు సర్వంసహాధీశ్వరున కిట్లనియె.

సీ. పరమధర్మజ్ఞత బ్రాహ్మణప్రవరుల నరసిరక్షింపుదే యనుదినంబుఁ
బ్రజఁ దల్లిదండ్రులపగిదిఁ బాలింపుదే పరులొత్తొరవు లేక బ్రదుకునట్లు
దివిజభూజముఁబోలె దీనార్థిసమితికి నభిమతార్థము లిత్తె యాదరమున

నని బ్రాణ మిచ్చినయట్టివారలవారి కెల్ల తేజంబులు నిచ్చి మనుతె
యాజ్ఞపాత్రిక సంపద లర్థి నిచ్చి, బంధువర్గంబుఁ బోషింతె బహువిధముల
సకలవర్ణాశ్రమాచారసరణి తప్ప, కుండ నియమించెదే మహీమండలమున. 7

క. సప్తాంగ రక్షసేయుదె, సప్తోపాయములఁ బరుల సాధింతె మదిఁ
సప్తవ్యసనము లుడుగుదె, యాప్తుల రక్షింతె సాహసాంకమహీశా. 8

క. మంత్రంబును రక్షింపుదె, తంత్రాచరణంబులందుఁ దత్పరమతివై
మంత్రము పరమంత్రిమున, స్వఁత్రాసకరప్రభావసంపన్నులతోన్. 9

క. ఆజ్ఞ వెలయింతె దిక్కుల, యజ్ఞాదిక్రియలు సురల నలరింతువె నీ
త్రిజ్ఞులఁ బరిపాలింపుదె, సుజ్ఞానపరీక్షచేసి సుకవుల మనుతే 10

*క. అని కుశలప్రశ్నముగతి, ననిమిషముని రాజనీతి యాద్యంతంబుం
దన కెఱుఁగ నానతిచ్చిన, విని వినయముతోడ మనుజవిభుఁ డిట్లనియెన్. 11

చ. పరిచితసర్వశాస్త్రపథపారగులై నవసుంధరేశ్వరుల్
నిరుపమలీలమై నడమనీతిపథంబున సంచరింప నా
తరమె మహాత్మ మీకృపకతంబున నింక నిరంకుశక్రమ
స్ఫురణమహామహీభరణభూరినయోన్నతి నుల్లసిల్లెదన్. 12

వ. అనిన నన్నరేంద్రచంద్రునకు మునికులాగ్రగణ్యుం డిట్లనియె. 13

చ. అలఘువినూత్నరత్నముల కన్నిటికిం గుదురై సరోవాజా
దలపతిరీతి నీవఖిలసద్గుణశాలుల కాలవాలమై
వెలయుట నిన్ను వాసవుఁడు వేయివిధంబులఁ బ్రస్తుతించు ను
జ్జ్వలతరభాగ్యసంపద భవత్ప్రతిమానులె యన్యభూపతుల్. 14

ఉ. ఇట్టి భవన్మహత్త్వ మిది యెల్ల విదర్భవిభుం డెఱింగి నీ
పట్టపుదేవి గాఁదగినపట్టి వరంబునఁ గోరి యీశ్వరుల్
గట్టిగఁ గొల్చి తత్కరుణఁ గాంచె మనోభవరాజ్యలక్ష్మికిం
గట్టముఁగైనమూర్తి గుణగణ్య ననంగవతీకుమారికన్. 15

ఆ. వెలఁదిసోయగంబు వీక్షింప వినుతింప, వేయికన్ను లమరవిభున కిచ్చి
రెండువేలజిహ్వ లంపటాధీశున, కొసఁగెఁ బోలుఁ బంకజోద్భవుండు. 16

సీ. భామినీమణిమధ్యభాగంబు కృశ మని కటితటంబున నిల్పె గౌరవంబుఁ
దొయ్యలివలిచన్నుదోయి కర్కశ మని యడుగుల మార్దవం బలవరించెఁ
గమలలోచనకుంతలములు వక్రము లని తనువల్లికకుఁ జక్కఁదన మొసంగెఁ

---

* పా. క. అన విని మనమున నలరుచు, ననిమిషమునినాథుతోడ నతిగంభీర
స్వనమునఁ బ్రియపూర్వకముగ, వినయముతోఁ దనను మనుజవిభుఁ డిట్లనియెన్.

బూఁదీఁగఁబోఁడిచూపులు చంచలము లని మెలపు నెన్నడపున మేళవించె
నబలనఖములు క్రూరంబు లని తలంచి, సౌమనస్యంబుగుణమున సంతరించె
నీరజాసనుఁ డెంతకు నేరఁ డనుచు, జగము గొనియాడ నొప్పు నాచిగురుఁబోఁడి.
తే. తమ్ము లాకొమ్మ నెమ్మోముతమ్ము లనఁగ, బింబ మాయింతి కెమ్మోవిబింబ మనఁగ
జాతి యానాతి లేనవ్వుజాతి యనఁగ, రాణ యొప్పారు లోకాభిరామ యగుచు.
సీ. తులకు వచ్చియు రాదు తళుకులఁగని గ్రమ్మఁ గోమలికాంతితోఁ గుందనంబు
సరియయ్యుఁ గాదు నిశ్చల మైనజిగి నొప్పుకాంతయూరులతోడఁ గరభయుగము
*ప్రతివచ్చియును రాదు సతతాచ్ఛవిచ్ఛవి తరుణికంధరతోడ దరవరంబు
†జోడయ్యుఁ గాదు మించులనటించుచున్న చానచన్నులతోడఁ జక్రమిథున
మింతినెమ్మోము ప్రతిచేసి యెన్నఁ గోటఁ, జందురుని మేను పూర్వపక్షంబు నొందు
ననఁగ జగమున నావిదర్భభవనీశు, ననుఁగుఁదనయకు నెనయైనయతివ గలదె. 19
శా. ఆనారీమణి తండ్రిసమ్ముఖమునం దశ్రాంతముం గ్రొత్తగా
నానానాయకపాఠకోత్తము లొగిన్ సంగీతసాహిత్యవి
ద్యానైపుణ్యము మీఱ నీగుణవిలాసాకారరేఖాదుల
న్వేనోళ్లన్ గొనియాడఁగా విని రసోన్మేషంబు సంధిల్లఁగన్. 20
వ. పంచశరశరప్రపంచచంచలాయమానమానసయై యుండునంత. 21
తే. సిద్ధపుర మేలురాజు ప్రసిద్ధబలుఁడు, శకమహీనాథచంద్రుఁ డాచంద్రవదన
నడుగఁ బుత్తెంచి యీకున్న నాగ్రహించి, యేపున విదర్భమీఁద దండెత్తఁ దలఁచె.
వ. కావున. 23
క. మారువరమున జనియించిన, వరపుత్త్రిక యగునసంగవతి ననురాగ
స్ఫురణమ్మున వరియింపుమటు, కరణీయము నీకు నిపుడు కరుణాభరణా. 24
క. నావుడు నాకార్యము వసు, ధావల్లభుఁ డెంతయేని తాత్పర్యముతోఁ
గావింప నియ్యకొనుటయు, నావిబుధమునీంద్రముఖ్యుఁ డరిగెను బిదపన్. 25
క. వేసవివేఁడి సహింపక, వేసఱుజీవులకు నెల్ల విశ్రాంతికర
శ్రీసంపాదనకరమై, యాసన్నంబయ్యె నంబుదాగమ మంతన్. 26
సీ. గగనరత్నము కట్టు మొగులలో నుదయించెఁ జరమదిక్కునఁ దోఁచె శక్రధనువు
పూర్వాపరవ్యాప్తిఁ బొలుపారె జలరేఖ లాలోలగతి వీచె మూలగాలి
మెఱుఁగుమొత్తంబులు మెఱసె నుత్తరమునఁ గడఁగె దక్షిణపుమేఘములగములు
ప్రాలేయభానుండు పరివేషగతుఁ డయ్యెఁ జాతకంబులు నింగి సంచరించె

---

* ప్రతియయ్యును గాదు బహువిలాసములకురమణిరూపముతోడ రత్నపుత్త్రి
† సమత నొందియు నొంద దమితశృంగారంబు గలయింతినాసతోఁ గాంచనంబు

నెఱలపెనుపట్టె నేలపైఁ గొఱలఁ జొచ్చె, మొనసి చీమలగమి గ్రుడ్డుమోవఁదొణఁగెఁ
గుజముకొనగొమ్మ డిగి క్రిందికొమ్మమీఁది,నిలువు గైకొనుపులుఁగులయెలుఁగు లెచ్చె.

ఉ. తూనిఁగలాడెఁ దోయనిధిఁ దోరపుమ్రోఁత జనించెఁ బంక్తులై
కానఁబడెన్ బలాకములు కప్పయెలుంగు చెలంగె నిర్జల
స్థానములందుఁ గుంజముతుదం గృకలాసము నిల్చి నింగికై
యానన మెత్తె భూమిరజ మంగములన్ బెరయించెఁ బిచ్చుకల్. 28

క. తదనంతరంబ జనముల, కిది పగ లిది రాత్రి యనుచు నేర్పఱుపంగా
హృదయముల కగోచరమై, చదలం బొదలంగఁ జొచ్చె జలధరవితతుల్. 29

క. ధారణిఁ గలమే లెల్లను, ధారాళకరాళవర్ష ధారలచేతన్
నీరామని గాఁగల దని, పూరాల్చినభంగి ముసురు పొరిఁబొరిఁ గురిసెన్. 30

సీ. ప్రథమోదబిందులఁ బల్లవించె ననంగ నింద్రగోపద్యుతి నిలఁ దనర్చె
భానుచంద్రుల సూడుపట్టి గెల్చె ననంగఁ గంధరపటలాంధకార మడరె
జలదానిలంబునఁ బులకించెనో యనఁ గుటజభూజంబులు కోరగించె
స్తనితమర్దళరవంబునకు నాడె ననంగ వనమయూరములు నర్తనము చేసెఁ
బాంథజనచిత్తచిత్తసంభవమహాగ్ని, ఘనతరజ్వాలజాలానుకరణనిపుణ
వివిధవిద్యుత్పరంపరావిభ్రమంబు, లఖిలహరిదంతరంబుల నతిశయిల్లె. 31

మ. దళితానంతదిగంతమై ఘుమఘుమధ్వానంబు సంధిల్లఁగాఁ
గలయం బాములు వ్రేలఁగట్టినటు లుగ్రవ్యగ్రలీల న్నిర
ర్గళధారాళకరాళమై కురిసె వర్షం బెందు నేయింటివా
రలుఁ బొర్గింటికి నేఁగకుండఁగ నహోరాత్రంబుఁ జిత్రంబుగన్. 32

తే. ధరణియెల్లఁ గదంబపుష్పరచితంబు, దిక్పరికర మెల్ల సరసనర్తితమయూర
మంబరంబెల్ల నీరదాడంబరంబు, విరహిజనచాతకము లెందు విశ్రమించు. 33

మ. రమణీయోన్నతసౌధసీమల విహారప్రౌఢి సంధించుచోఁ
దమకం గర్జితఘోరఘోషములు నిద్రాభంగముం జేసినం
బ్రమదం బందిరి కాముకుల్ సమదశుంభత్కుంభికుంభద్వయ
క్రమవక్షోరుహమండలీమదవతీగాఢోపగూహోన్నతిన్. 34

చ. లలితగతి న్మయూరికలు లాస్య మొనర్పఁగ భేకజంపతీ
కలకలనాదము ల్సెలఁగ గర్జనవాద్యము లుల్లసిల్లఁ గం
దళకుసుమాంజలుల్ వెలయ నర్తనశాలయనం దనర్చె భూ
తలము విచిత్రవారిదవితానతిరస్కరిణీసమేతమై. 35

ఉ. హారిమయూరవిభ్రమము లంచలఁ జెందఁగఁదద్విలాసముల్

తారలఁ జేరఁ బుష్పితకదంబవిజృంభణ సప్తపర్ణనా
నారుచిరప్రసూనభజనం బొనరించె శరత్సమాగమం
బారయ నంబుదాగమ మహామహిమోన్నతి నాక్రమించినన్. 36

చ. శరదుదయప్రభావమునఁ జంద్రదినేంద్రులతేజ మెక్కె త
ద్గరిమలఁ గైరవాంబుజవికాసము మించెఁ దదీయవాసనం
బరఁగ మదాలిమాలికలు భావసముద్భవవర్తనోన్నతిం
బొరసి నిశాహముల్ సిరులఁ బొంది సుఖింతురు మేదినీజనుల్. 37

మ. జలజచ్ఛత్రరుచిం బ్రకాశతరకాశశ్రేణికాచామరం
బుల భద్రాసనకాంతి రాజ్యపద మొప్పన్ మీఱఁ గుంభోద్భవుం
డెలమిన్ దక్షిణదిక్కునం దుదితుఁ డయ్యెం జంద్రతారాబలం
బుల మేలైనదినంబు లెవ్వరికి సమ్మోదంబు సంధింపవే. 38

ఉ. బాలలు లీలతో బలుసుఁబంతులచాయఁ దనర్చి పండి కై
వ్రాలినరాజనంబులకు వచ్చుశుకంబులఁ జేరనీక పోఁ
దోల రవంబుతోఁ జెఱకుఁదోఁటలనీడల నుండి పాడి ర
న్మీలితహావభావరమణీమకరాంకుని సాహసాంకునిన్. 39

వ. ఇవ్విధంబున శరదాగమంబు దనప్రయోజనంబునకు ననువర్తనసూత్రం బగుటయు దండయాత్రాసముత్సుకసేనాసనాథుండై సాహసాంకమహీనాథుండు తగినకాలరూపం బంచుటయు సుమతిసూనుండు లేఖాముఖంబున నంతయు నెఱింగి రాగమంజరీపుత్త్రిమిత్త్రుం డైనచిత్రరథుం డనుగంధర్వపతిని జంద్రపురరాజ్యసింహాసనాసీనుం గావించి యాత్మగాంబ. 40

సీ. రథివిక్రమప్రౌఢరథికలీలారూఢనానావిధస్యందనములతోడ
సహజదానోద్దండచండశుండాదండబంధురసింధురపఙ్క్తితోడఁ
జారుయాత్రికమహాశ్చర్యసంచారణ కమనీయతరతురంగములతోడఁ
బరభూవరవ్యూహభయదోగ్రసన్నాహగర్వితసుభటవర్గములతోడ
మందరాచలమంథానమథ్యమాన, నిరవధికనీరనిధిఘోషనిర్విశేష
పటుపటహముఖ్యవాద్యజృంభణముతోడ, భట్టిచను దెంచి వసుమతీపాలుఁ గాంచె. 41

తే. అర్థి దండప్రణామంబు లాచరింప, నమ్మహామంత్రిముఖ్యుని నానరేంద్రుఁ
డతిముదంబున నాలింగనాదులైన, సముచితోపచారంబుల సత్కరించి. 42

వ. సాదరావలోకంబున నాలోకించి లోకవృత్తాంతంబు నడుగుటయు నతనికి సుమతిసూనుం డిట్లనియె. 43

సీ. ఏరాజునకుఁ జెల్లు నెంతయు నరుదైన మణిపాదుకాదులు మహిమఁ గొనఁగ

నేరాజునకుఁ జెల్లు నింద్రుని మెప్పించి నవరత్నసింహాసనంబు వడయ
నేరాజునకుఁ జెల్లు నీరజాసనుసభ బ్రహ్మాస్త్రలాభసంపద వహింప
నేరాజునకుఁ జెల్లు నితరదుర్లభ మైన యుట్టిచేరులుగోయు దిట్టతనము
దేవపతి యైన శ్రీమహాదేవుదేవి, కాళికాదేవి యేరాజుకడిమి మెచ్చి
లీల నుజ్జని వేయేఁడులేల నిచ్చె, ననుచు నిలయెల్ల దేవగ నభినుతించు. 44

చ. అనిన దరస్మితాస్యుఁ డగునమ్మనుజేంద్రునితోడ భట్టి యి
ట్లను జగదంబ వత్సరసహస్రము రాజ్యము నీకు నిచ్చె నా
యినుమడియేండ్లు లిద్ధరణి యేలునుపాయము సేయువాఁడ నే
ననుటయు నవ్విభుండు మది నచ్చెరువందె వినంగఁ గోరుటన్. 45

వ. అవధరింపు మని మనుజవల్లభునకు భట్టి యిట్లనియె. 46

సీ. జగదంబ భవదీయసాహసోన్నతి మెచ్చి యిచ్చె నుజ్జయిని వేయేఁడులేల
నావరం బెబ్భంగి ననుభావ్య మైనది యటు గాన నొకయుక్తి యవధరింపు
మేఁటేఁట నొనరింపు మితరదేశవిహార మాఱునెలలు రాజ్య మాఱునెలలు
నిమ్మెయి రెండువేలేండ్లులు చెల్లినఁ బురి నున్నయట్టివత్సరము లెల్ల
శాంభవీవరలబ్ధవత్సరసహస్ర, మయ్యె దేశాంతరావాప్తివలనఁ
జనిన వేయేండ్లు మనబుద్ధిసంచితములు, ఘనయశస్సాంద్ర విక్రమార్కక్షితీంద్ర. 47

వ. అనిన నతనిమనీషావిశేషంబునకు సంతోషించి. 48

మ. అతఁడుం దానును గార్యలబ్ధిగతి నేకాంతంబ యూహించి స
మ్మతితో సిద్ధపురీశుపైఁ జనుటకున్ మౌహూర్తికోత్తంస ని
శ్చితవేళన్ మొరయింపఁ బంచుటయు మించెన్ దండయాత్రాసమ
ద్ధత నిస్సాణధణాధణధణధణంధాంధణ ధ్వానముల్. 49

సీ. పాలమున్నీటిలోఁ బవ్వళించినయట్టి నీలవర్ణుఁడు నిద్ర మేలుకొనియె
వెగడొంది రవి తేరినొగలఁ గట్టినయట్టి వాహంబు లూకలు వైచుకొనియె
నదరిపాటున విట్టు బెదరి పర్వతపుత్త్రి కందర్పదమనునిఁ గౌఁగిలించెఁ
బన్నగంబుల కెల్ల భయము మిక్కుటముగాఁ బాతాళలోకంబు బమ్మరిల్లెఁ
గమలజుని వేదపఠనంబు కవలువోయె, నద్రు లెల్లను నచలత్వ మపనయించె
దిగ్గజంబులు జిఱజిఱదిరిగి మ్రొగ్గె, వారిరాసులు పిండిలివండు లయ్యె. 50

వ. అంత. 51

క. సంగరములు గలుగుటఁ జతు, రంగమ్ములు సముద్రాంతరంగము లగుచున్
గరిగాతరంగసంగత, రంగములై బెరసె నెరసి రంగత్క్షోణిన్. 52

ఉ. చుట్టము లైన నాహుతులు సూరెలఁ బేరలమిన్ జవోజ్జ్వలా

రట్టజవాహరోహణవిరాజితులై తనుఁజేరి కొల్వఁగాఁ
బట్టపుదంతి నెక్కి కొని భట్టి నృపాలుని సేన కంతకుం
బెట్టనికోటయై నడచె భీకరసన్నహనాభిలాషుఁడై. 53

మ. జయలక్ష్మీసతితో ననంగవతి నిచ్చం గైకొనం గోరి యు
జ్జయినీనాథుఁడు దివ్యభూషణవిలాసం బొప్ప నాయోధన
ప్రియుఁడై పెండ్లికి నేఁగుభంగి వెడలెం బృథ్వీజనశ్రేణికా
నయనానందదరత్నకాంచననవీనస్యందనారూఢుఁడై. 54

వ. ఇవ్విధంబున రాజమందిరద్వారంబు వెడలి యాంగికంబు లగుశుభసూచకంబులు ననుకూలసమీరసంచారంబులును నానాదర్పాదిమంగళద్రవ్య సందర్శనంబులు నవనీసురాశీర్వాదంబులు నగణ్యపుణ్యాంగనాముక్తమౌక్తిక శేషావిశేషంబులును నభంగతురంగహేషాఘోషంబులు నంగీకరించుచు, నిరర్గళప్రసాదశరణాగతశరణుండై పురంబు నిర్గమించి సకలసేనాసమన్వితుండై కదలి కతిపయప్రయాణంబుల విదర్భానగరంబు చేరంజన యప్పురంబునకుం గ్రోశమాత్రంబున నతిపవిత్రం బై నవేత్రవతీతటంబున నతిమాత్రవిశాలరమణీయంబును నత్యంతమహనీయంబును సమస్థలంబును నైనస్థానంబున నత్యాశ్చర్యకరణప్రచండం బయినయోగదండంబున వ్రాసినం దత్క్షణంబ. 55

సీ. బంధురకాంచనప్రాకారములతోడఁ బరిఖాజలౌఘసంపదలతోడ
మహనీయతరదివ్యమందిరంబులతోడ రమణీయదివ్యసౌధములతోడ
మణిమయబహుసభామండపంబులతోడ నగణితదివ్యగేహములతోడ
వర్ణితశృంగారవనవితానముతోడఁ గమలకైరవవనోత్కరముతోడ
నప్రమేయాతివిస్తరాయామ మగుచు, నొక్కపుర ముద్భవిల్లిన నుచితభంగి
సకలసామంతపరివారసమితితోడ, విక్రమాదిత్యవసుమతీవిభుఁడు విడిసె. 56

చ. తలఁచినమాత్ర బాత్రిక సుధామధురాన్నము లుద్భవింపఁగాఁ
బలుమఱుఁ గంధ రాల్చిన నపారధరంబులు సంభవింపఁగాఁ
గొలఁదికి మీఱుసైన్యములకుం బరితృప్తి యొనర్చె ధారణీ
తలపతి యిష్టభోజనవిధానమునన్ విపులార్థసత్కృతిన్. 57

వ. ఇవ్విధంబున సకలసైనికులను సంతోషితస్వాంతులం గావించి పేరోలగంబున్న సమయంబున శకమహీశ్వరురాయబారి చనుదెంచి సముచితప్రకారంబునం బ్రవేశించి నిశ్శంకంబుగా సాహసాంకనరేంద్రుని కిట్లనియె. 58

ఉ. మున్ను శకకుమారమణిముఖ్యుఁ డనంగవతిన్ వరింప వే
డ్క న్నిజసర్వసైన్యబలగర్వము మీఱ విదర్భమీఁద న
త్యున్నతశక్తిమై విడిసి యుండఁగ నీ వొకపోటుబంటవై

మిన్నక వచ్చి తేల పులిమీసల నుయ్యేలలూఁగ వచ్చునే. 59

సీ. ప్రియతనూజులపేళ్ళు వెట్టి పెంపొందిరి మాళవనేపాళమగధపతులు
పేటేటఁ గప్పంబు లిచ్చి వర్ధిల్లిరి సౌవీరసౌరాష్ట్రసగరనృపులు
పుత్త్రిల గిరవులు పుత్తెంచి బ్రతికిరి కుంతలావంతీశకురువిభులు
కన్యలఁ గొనివచ్చి కానుకఁగా నిచ్చి మనిరి కాశకరూశమద్రపతులు
జగతి నేరాజు మారాజుచరణయుగము, గాంచి కొలువనివాని నేఁ గాన నెందు
1గాదమున మాటుపడియున్నకాయవోలె, నుజ్జయిని డాఁగియున్నసే వొకఁడుదక్క.

తే. కాకతాళీయముగ మహాకాళికరుణ, నుజ్జయినిరాజ్యవైభవ మొనరెఁ గాక
యుట్టిచేరులు గోయుట లెట్టియరిది, యలుక గొఱుకదె యటునంటి వెన్నయైన.

క. ఇప్పుడు శకవిభుఁ జెనకుట, యొప్పదుసూ మున్న బొంత్రయును లాతమునుం
గప్పెరయును బాదుకలును, జొప్పడినవి బ్రతుకుటొప్ప నోగియుఁబోలన్. 62

చ. పలుకులు వేయు నేటికిఁక బ్రాహ్మణసూనుఁడ వీవు నీకు దో
ర్బలమున కేమికారణము బాఁపనపోటును గప్పకాటునుం
గలదె ధరిత్రి భట్టిమొన గట్టిగ నమ్మకు మోసపోకు నీ
కొలఁదులె రాచకార్యములు కోమటి బుద్ధులఁ దీర్పఁదీఱునే. 63

ఆ. శకనరేంద్రచంద్రచరణాబ్జసంసేవ, విడిచి యావిదర్భవిభునిఁ గలసి
వచ్చు టోడ విడిచి వదరు వట్టుట సుమీ, చెప్పఁదగినమాట చెప్పినాఁడ. 64

వ. అనిన విని ప్రహసితముఖారవిందుండై సుమతిసూనుండాక్షేపవాగ్గర్జితంబు గానిట్లనియె.

క. ఇట్టి వివేకమహోన్నతి, యిట్టినయోచితవిహార మేరికిఁ గలదే
యిట్టినిను దూతఁగాఁ జే, పట్టినపతి వేఱె భాగ్యపరుఁ డననేలా. 66

వ. అని మఱియు నిట్లనియె. 67

తే. తొల్లి యొకకాకి రాయంచఁ దొడరినట్లు, శకుఁడు సమరనిశ్శంకుని సాహసాంకుఁ
జెనకఁజూచుట యెన్న నీతనికిఁ దనకు, హస్తిమశకాంతరము గాదె యలవుకలిమి.

క. మాటలు పదివేలాడినఁ, బోటరియై రణములోన భుజబలమెల్లం
దేటపడఁ జూపకుండిన, మేటియశం బేల కలుగు మీరాజునకున్. 69

శా. భూచక్రాఖిలరాజ్యభోగ మొనరుం బోరన్ జయం బందినం
బ్రాచీనాయకలోకలోలనయనాపంచాస్త్రకేళీకళా
వై చతుర్యము సంభవించుఁ గదనవ్యాపారతన్ మాలినన్
"కా చింతా మరణే రణే" యనుట నాకర్ణింపవే యెన్నఁడున్. 70

ఉ. ఇంచుక సూదివేదన సహించినమాత్ర నృపాంగనాకుచో

---

1. గాదము = సస్యములోనున్న గడ్డి.

దంచితసౌఖ్యకేళి సతతంబును 1గంచులి గాంచు నాజి ని
ర్వంచనఁ దీవ్రబాణనికరక్షతదేహుల కబ్బవే మరు
చ్చంచలలోచనాఘనకుచస్తబకద్యుతిసంగసౌఖ్యముల్. 71

క. కావున మీభూవిభునకు, నీవిధ మంతయును దెలియ నెఱిఁగించి గణ
శ్రీవిక్రమంబు నెఱపఁగ, రావింపుము రజ్జులాట రాజోచితమే. 72

వ. అనియె ననంతరంబ విక్రమార్కమహీపాలుండు శకభూపాలుదూతకుఁ గనకమణిభూ
షణాంబరతాంబూలాదిసత్కారంబు లొనరించి వేత్రవతీతటంబు పుణ్యస్థలంబు గావున
నెల్లి యుద్ధంబునకు సిద్ధపురీశ్వరుం డిచ్చటికి సన్నద్ధుండై వచ్చునట్లుగా నెఱింగింపుమని
వీడ్కొలిపి తద్వృత్తాంతం బంతయు వివరభూతీశ్వరునకుం జెప్పి పంపి తదానీతంబులైన
యుపాయనంబు లంగీకరించి నిజభృత్యామాత్యులం దమతమనివాసంబులకుఁ బోవం
బనిచి సముచితప్రకారంబున నుండి మఱునాఁడు ప్రభాతసమయంబున. 73

క. నానామంజులమాగధ, గానధ్వను లెసఁగ మేలుకని సంధ్యాదుల్
పూని యొనరించి బహువిధ, దానానందితవిశిష్టధరణీసురుఁడై. 74

క. కరుణాంగరాగమాల్యా, భరణప్రభ లలర నుదయపర్వతముపయిం
గర మొప్పునరుణుఁడో యన, నరదముపై నెక్కి విక్రమార్కుఁడు వెడలెన్. 75

క. దక్షిణనయనాస్పందము, దక్షిణపవనానుకూలతయు నిజవిజయం
బక్షయముగ నెఱిఁగింపఁగ, నాక్షణమున సాహసాంకుఁ డానందించెన్. 76

క. అటమున్న భట్టియనుమంత్రి, బటుగతిఁ బడవాళ్లు సైన్యపతతుల కెల్లం
జటులతరసమరలీలా, ఘటనకు వెడలుఁడని యఱుఁగఁగాఁ జెప్పుటయున్. 77

సీ. సంగరసన్నాహసమయం బెఱింగించు నిఖలమంగళతూర్యనిస్వనములుఁ
గట్టుమట్టుననుండి కదలించినఁ జెలంగు భీకరశుండాలబృంహితములు
రథములఁ గట్టి సారథులు ముట్టిన మిన్నుదన్నెడి రథ్యవితానములును
బంతంబు లొండొండ ప్రకటించుచును భటులసాహసోచితవాక్యసంకులములుఁ
గలసివిలసిల్లుసాహసాంకక్షితీంద్ర, చంద్రుఁశిబిరాంగణస్థలి సాంద్రరవము
పూర్ణచంద్రోదయోదీర్ణఘూర్ణమాన, ఘనమహార్ణవఘోషంబు ననుకరించె. 78

క. సందీపితరిపుకుంజర, సందళనక్రీడనైకసాహసలీలా
నంద మలర సింగంబుల, మందగతి న్వీరభటసమాజము నడచెన్. 79

మ. విలయారంభవిజృంభణంబున సముద్వేలంబులై కుంభినీ
వలయంబుం గబళింపఁ గైకొనుమహావారాకరానీకవీ
చులభంగిన్ జవసత్త్వవిస్ఫురణలం జూపట్టి యప్పట్టునన్

1 కంచులి—అవిక.

విలసిల్లెం దురగంబు లాశ్వికులకున్ వీర్యం బవార్యంబుగన్. 80

చ. సలలితగండమండలము సన్మదధారల నివ్వటిల్లఁగా
నలఘువినూత్నరత్నకనకాంచితభూషణదీప్తులొప్పఁగా
వెలువడె నున్మదద్విరదబృందము నిర్ఝరదీప్రవల్లికా
కులకలితంబులై ననడగొండలదండముఁ గ్రేణిసేయుచున్. 81

క. దివినుండి భువికి డిగ్గిన, దివిజవిమానము లనంగ దివ్యమణివిభా
నివహము దిశలకు నిగుడఁగ, నవలీలన్ వెడలె నప్పు డరదములగముల్. 82

మ. ప్రతివీరప్రళయాంతకుం డగువిదగ్ధక్షోణిపాలుం డినా
యతతేజుండని సాహసాంకమను జేంద్రాలోకసంభావనో
చితసంభాషణమాధురీమహిమచేఁ జిత్తంబు లార్జించుచుం
జతురంగంబులఁ దోడుసూపె సమరోత్సాహైకసన్నాహుఁడై. 83

ఆ. దేశకాలబలము దెలిసి దైవబలంబు, కలిమి నచ్చి బాహుబలము బెరయ
మూలబలముతోడ మోహరంబుగఁ దీర్చి, సుమతిసుతుఁడు సైన్యసమితి నడపె. 84

క. ద్విరదములకు నరదములును, నరదములకు నశ్వములును నశ్వంబులకున్
వరభటులును వరభటులకు, నరిగెలవారలును బన్ని రగ్రేసరులై. 85

ఉ. అంతకు మున్న సిద్ధనగరావనినాథునిదండనాథుఁ డ
త్యంతబలాభిరాముఁడు మహారథనాముఁడు సర్వసైన్యమున్
సంతనకట్టి బాహుబలసారథనుండు విదేహధారణీ
కాంతుఁడు శాలివాహనుఁడుఁ గయ్యపువేడుకతోడఁ దోడుగన్.

క. ఆరెండు సేనలందును, వీరాగ్రేసరులు సమరవిక్రమకేళీ
ప్రారంభజృంభణాహం, కారత నొండొరులమీటి కనుపట్టి రొగిన్. 87

క. భీకరసంగరలీలా, లోకనకౌతుకదిగీశలోకేశసురా
నీకవిమానంబులచే, నాకాశము నిరవకాశమై విలసిల్లెన్. 88

వ. ఇవ్విధంబునం బ్రతిఘటించి పూర్వాపరసముద్రంబులుం బోలె వీరరసోద్రేకంబున
విజృంభించి. 89

సీ. అరుణదృగ్రుచులును నాయుధప్రభలును మార్తాండదీప్తితో మాఱుమలయ
హుంకారములు భేరిభాంకారరవములు వలయాద్రిఁ బ్రతివిరావముల నినుప
సింహనాదంబులు శింజినీధ్వనులును నాశాకరులగుండె లదరఁజేయ
నట్టహాసంబులు హయహేషితంబులు గగనంబు తోరణకట్టికొనఁగ
నుభయబలములసుభటులు నుగ్రవీర, రసవిజృంభణ మరుదుగా రహిఁ గడంగి
కదియునప్పటిపటుపాదఘట్టనమున, నుర్వి యంతంత నుబ్బాత లూఁగఁదొణఁగె.

ఉ. అత్తఱి సాహసాంకమనుజాధిపుబంధురగంధసింధురో
దాత్తకపోలమండలమదద్రవధారలతావు లెక్కువం
జిత్తము లత్తఱిం జెదరి సిద్ధపురీంద్రచమూగజేంద్రసం
విత్తిమదంబు లింక నరిబృందము డెందము చిన్నవోవఁగన్. 91

వ. అంత. 92

మ. దివిజస్త్రీకుచకుంభకుంకుమముతో దివ్యాంగనావీటికా
నవకర్పూరరజంబుతో నమరకాంతాదేహహారిద్రపం
కవిశాలోన్నతితో సురీనిటలభాగన్యస్తకస్తూరితో
నవనీరేణువు సాటియై పరఁగె నాశాకాశసీమంబులన్. 93

చ. కలయఁగ ధూళి దృగ్రుచులు గప్పిన జోదులు శబ్దవేదులై
వెలుచఁ గడంగి నేమిరవబృంహితహేషితసింహనాదసం
కులముగ నుల్లసిల్లు రథకుంజరఘోటకసద్భటావళిం
గొలఁదికి మీఱఁగా ధరణిఁ గూల్చిరి బాణపరంపరాహతిన్. 94

ఉ. అప్పుడు కుండలీకృతశరాసనులై విలుకాండ్రు తూపులం
గప్పిరి నింగి నాంగికముగాఁ గయిసేసినవన్నె లన్నియుం
జిప్పిలు దట్టపుంజెమటఁ జిందఱవందఱగాఁగఁ జాలనిం
పొప్పఁగఁ దీవ్రభానుకిరణోగ్రత నడ్డముచేసిరో యనన్. 95

ఉ. చాపము లింద్రచాపములచందము చూపఁగ గెంపుసొంపువా
ల్దూపులు క్రొమ్మెఱుంగులకుఁ దోడుగఁ దర్జనగర్జ లొప్పఁగాఁ
జాపధరాంబువాహములు సాయకవృష్టులయేపునూప ను
ద్దీపితరక్తవాహినులఁ దెప్పలఁదేలెను భూతసంఘముల్. 96

చ. బలములురెంటఁ జేరుగలబంటులరోషమహానలంబులం
దొలిదొలి ధూమముల్ నిగిడి తోన శిఖావళు లంకురించి ని
ప్పులు ధరమీఁదఁ జేర్చుక్రియ ధూరజముల్ దివిముట్టి రక్తధా
రలు గనుపట్టి తోఁచె సమరస్థలి నెల్లను మాంసఖండముల్. 97

వ. అట్టియెడ నుభయబలంబుల నుభయబలంబులును సేనాముఖంబుల సేనాముఖంబులును
గణంబుల గణంబులును వాహినుల వాహినులును నక్షౌహిణుల నక్షౌహిణులును దలఁప
డి సన్నాహంబుల సముత్సాహంబులు పోషింపఁ గోపంబు లాటోపంబుల భూ
షింప హుంకారంబు లహంకారంబుల ముదలింపఁ జలంబు లచలంబులం బొదలింప న
వార్యంబు లగుశౌర్యంబులు నఖర్వంబు లగుగర్వంబులు నశాంతంబు లగుపంతంబులు
నవరోధంబు లగువిరోధంబులు నఖేదంబు లగుసింహనాదంబులు నద్భుతారంభంబు

లగుసంరంభంబులు నుల్లసిల్లఁ జలంబులు వదలక బలంబులు ప్రిదులక బీరంబు లెడలక బింకంబులు సడలక బిగువులు దక్కక బిరుదులు స్రుక్కక వెలవెలంబాఱక వెన్ను చూపి జాఱక తాలిమి దింపక మాలిమిఁ జెంపక తలఁగక మలఁగక విఱుగక కురుఁగక కేడింపక జోడింపక వెఱవక చేమఱవక, అత్తళంబులఁ గత్తళంబులు సించియుఁ శరంబుల శిరంబులు ద్రుంచియుఁ గుంతంబుల దంతంబులు పొడిచేసియు నారసంబుల నీరసంబుల నేసియు పరిఘంబులఁ గేతనంబు లడిచియు శూలంబుల ఫాలంబులు వొడిచియుఁ గత్తుల నెత్తులు వగిలించియు బల్లెంబుల సెల్లెంబుల నొగిలించియుఁ గుఠారంబులఁ గఠారంబుల మరల్చియు వీరావేశంబుల విహరించునవసరంబునం, బతి యవసరంబు నెఱపం దెఱపి గని వెఱవిడి తలఁపికొన్న విధంబున శిబిరంబు చొచ్చి బలును గలం బరిమార్చి యార్చి పేరువాడి వీరాలాపంబు లాడువారును, బొమ్మలుగాఁడి వీఁపులవెడలి నేలం గీలుకొని యున్నతోమరంబు లాధారంబులుగా నిలిచి గతప్రాణులయ్యును సమీరసంచారంబునఁ జలించుకతంబునఁ జేతనులుంబోలెఁ బరులకు భయంబాపాదించువారును, ద్విరదంబు లరదంబులం బొరలనెత్తనొరగినయీరసంబుననాభీలంబు లగుకరవాలంబులు వెడలి దంతకాండంబులతోడన కండతుండెంబులుగా ఖండించి చిత్రలీలావిలాసనిరవధికు లైనరథికు లని యమరవరులచేతం బొగడు వడయువారును, బహుముఖంబులగుశరముఖంబుల మర్మోద్ఘాటనంబు సేయుతటి వర్మంబులతోడన చర్మంబులు సించినరక్తప్రసిక్తంబు లగుశరీరంబులు చెందిరపుఁగీలుబొమ్మలట్లు చెలంగం గలన నెక్కటికయ్యంపు నెయ్యంబునం బెనంగువారును, గరవాలభిండివాల ప్రముఖప్రహారణంబులు ప్రతిహతంబు లగుటయు రయంబునం బ్రతిభటప్రయుక్తంబు లగునాయుధంబులు గైకొని పరాక్రమించువారును, నెత్తురుల జొత్తిల్లినయంగకంబులు పల్లవితంబు లైనయశోకంబులును బుష్పితంబు లైనకింశుకంబులును శలాటుకీలితంబు లైనవటంబులును ఫలితంబు లైనకింపాకంబులునుం బోలె నుల్లసిల్లం బెల్లగిలక కయ్యంబు సేయువారును, నయిదుపదిసేయక యవక్రవిక్రమంబునం బరాక్రమించి చని దేదీప్యమానంబు లయిన దివ్యవిమానంబు లెక్కి కృతాలింగన లైనసురాంగనలకు హర్షోత్కర్షంబుగాఁ దమచేత వికలాంగంబు లైనచతురంగబలంబులం జూపి శౌరుషంబులు ప్రకటించువారును నై కలహభోజనయనపారణం బైనదారుణరణవిహారణం బొనరించుసమయంబున. 98

ఉ. ఏమియు రెండువాహినుల నెక్కువతక్కువ యింతలేక సం
గ్రామము సేయునప్పుడు పరాక్రమ మొప్పఁగ శాలివాహన
క్ష్మామహిళేశ్వరుండు విలసద్బలసంపదసొంపు చూపినం
దామరపాకనీతిక్రియఁ దల్లడమందెను వైరిసైన్యముల్. 99

క. నిజబలము వీఁగఁబాఱిన, భుజబల మలరఁగ విదర్భభూవరుఁడు మహా

గజ వర్గినిఁ జొచ్చి వగతి, విజిగీషు విదేహ సైన్యవితతిఁ గలంచెన్. 100

చ. అతనిమహోగ్రవిక్రమసమగ్రత సైఁపక శాలివాహనుం
డతిశితశక్తి వైచిన నహంకరణస్ఫురణన్ విదర్భభూ
పతి యతితీవ్రబాణముల భగ్నము సేయుటయు న్విదేహరా
జతులితచాపహస్తుఁ డయి యవ్విభుపై శరవృష్టి నించినన్. 101

చ. కనుఁగవఁ గెంపుసొంపడరఁగా నతఁ డానరనాథుచాపముం
దునిమి హయంబులం జదిపి తోడనె సారథి నేపుమాపి కే
తనము ధరిత్రిఁ గూల్చిన రథంబును డిగ్గి యాతఁడుం
గినుక దలిర్ప సైనికుల గీటణఁగించెఁ గృపాణపాణియై. 102

క. అంత విదర్భేశుఁడు విల, యాంతకుగతి నాక్రమించి యవ్విభు నడిదం
బెంతయు బెడిదపుఁదూపుల నింతింతలుతునియలై మహిం బడ నేసెన్. 103

తే. ఏసి కంఠము గురిచేసి యేయఁ దలఁచి, శరము దొడిగినమాత్ర నచ్చెరువుగాఁగ
నారితోడనకూడ బాణాసనంబుఁ దునిమె నొక్కఁ డమ్మహారథుండు గడఁగి.

వ. ఇవ్విధంబున సురక్షితదేహుండై విదేహుండు తత్సమయసమానీతం బగు నొండురథం
బెక్కి పరాక్రమించుటయును. 105

తే. అమ్మహారథశాలివాహనులమీఁద, భల్లనవకంబు నేసిన భట్టిమేన
వారలును నేసి రన్నేసి వాలుటమ్మ, లాహవమ్మున నీడుజోడాడినట్లు. 106

వ. మఱియును. 107

క. ఆయిరువురు నమ్మెయిఁ దను, నేయుశరావళుల నెల్ల నిసుమంతలుగాఁ
జేయుచు భట్టియుఁ దద్ఘన, కాయనిషంగముల సాయకంబుల నించెన్. 108

క. ఆసమరప్రౌఢికి మది, రోసించి విదేహనరవరుండు చమూపా
గ్రేసరులకుఁ జెయివీచిన, నాసురగతి శకబలంబు లతనిం బొదివెన్. 109

వ. ఇట్లు పొదువుటయును. 110

సీ. మొక్కలంబుగఁ జొచ్చి ముక్కునవ్రయ్యఁగా భటకోటిచట్టలు వాపిపాపి
యారోహకులతోన హయములఁ గబళించి వేమాఱు నేలతో వ్రేసివ్రేసి
భద్రేభములు వీఁపుపడఁ దాఁకఁ గోల్కొని గుండెలు వగులంగఁ గ్రుమ్మిక్రుమ్మి
రథ్యసారథులతో రథము లుద్ధతిఁ బట్టి దిర్దిఱ వినువీథిఁ ద్రిప్పిత్రిప్పి
విమతరాజన్యవరసైన్యకమలషండ, ఖండనోద్దండవిహరణక్రమనిరూఢి
నెదురులేక రణంబులో నేపుమాపె, భట్టి జగజెట్టి దీకొల్పు భద్రగజము. 111

తే. ఆకరీంద్రునియాటోప మపనయించి, మాఱుకొన్న విదర్భేశుఁ బాఱఁదోలి
సాహసాంకక్షమానాథచంద్రు నెదిరి, సిద్ధపురినాథుఁ డిట్లనుఁ జేవ మెఱసి. 112

సీ. అత్యద్భుతము లైనయన్యులసొమ్ములు కుటిలమార్గమునఁ గైకొనఁగవచ్చు
నింద్రజాలప్రవిద్య నేచొప్పటనైనను బయలు పట్టణముగాఁ బన్నవచ్చుఁ
గపటంపుఁగంథచేఁ గలిగినయర్థంబు సకలార్థులకు వెదచల్లవచ్చు
నాకలోకాధీశు నటనమాటలఁ దేల్చి వరరత్నపీఠంబుఁ బడయవచ్చుఁ
గాక పరిపంథిదర్పాంధకారహరణ, సుప్రతాపప్రదీపవిస్ఫురణశరణ
పటుతరాయససుకృపాణపాణి వైన, నను నెదుర్కొని యని నీకుఁ జెనక వశమె.

మ. అని సంరంభవిజృంభణస్ఫురణమై నావిక్రమార్కక్షితీం
ద్రునిపై నంపపరంపరల్ గురియఁగాఁ దోర్దర్పోన్నతిం దన్నియుక్
ఘనశస్త్రాహతిచే నణంచి విలసత్కాండప్రకాండంబులం
దునిమెం గేతనరథ్యసారథిరథస్తోమంబుఁ జిత్రంబుగన్. 114

ఉ. ఒండొకతేరు నైకొని సముద్ధతి సిద్ధపురీశ్వరుండు కో
దండగుణధ్వనుల్ చెలఁగఁ దచ్చతురంగవరాహవక్రియా
పండితమూర్తియై మెఱసి పావక సాయక మేసె నాత్మలో
మండెడుకోపవహ్ని నరిమండలిపైఁ బచరించుపోలికన్. 115

క. ఆపిశిఖశిఖికిఁ దలఁకక, యావంతయు లేక విక్రమాదిత్యధరి
త్రీవరుఁడు వనధివల్లభ, దైవత్యం బైనశర ముదగ్రత నేసెన్. 116

సీ. మెఱుఁగులు గ్రక్కెడుమేఘాస్త్ర మేసినఁ బవనబాణంబునఁ బరిహరించె
విషము లుమియుకాద్రవేయాస్త్ర మేసిన గరుడబాణంబున గర్వ మణఁచె
సముధికోన్నత మైనశైలాస్త్ర మేసిన నింద్రబాణంబున నేపుమాపె
దృష్టిరోధం బైనతిమిరాస్త్ర మేసిన నరుణబాణంబున విరియఁ జేసె
నిత్తెఱంగున శకధారణీశదివ్య, శరపరంపరఁ బ్రతిబాణసమితి నణఁచి
యడరి పుంఖానుపుంఖనానాస్త్రశస్త్ర, వితతి నందంద యతనిపై వెల్లిగొలిపె. 117

వ. ఇట్లు నిరర్గళప్రసారంబు లైనశరాసారంబులకు మిసిమింతుండు గానిశకమహీకాం
తునిం జూచి యాశ్చర్యధుర్యుండై సాహసాంకనృపవరుండు భట్టితో నిట్లనియె. 118

ఉ. ఇంతకుమున్ను నన్ను నెరుఁ డెవ్వఁడు మార్కొని యింతసేపు వి
క్రాంతి వహించి మించి భుజగర్వము చూపినవాఁడు లేఁడు నే
డెంతయు మేటియై శకమహీపతి దివ్యశరప్రయోగదు
ర్దాంతనితాంతనైపుణధురంధరుఁడై యనిసేయు నెట్టొకో. 119

వ. అనిన సుమతినూనుం డిట్లనియె. 120

క. ఉగ్రుం డితఁ డొనరించిన, యుగ్రతపంబునకు మెచ్చి యొసఁగినవరసా
మగ్రి యిది యితని నెయఁడు ర, ణాగ్రంబున నెదిరి గెలుచు టరిది నరేంద్రా. 121

వ. దీనికిం బ్రతివిధానం బొకటి విన్నవించెద నది యవధరింపు మని యిట్లనియె. 122

మ. చరణాబ్జంబులు యోగపాదుకలతో సంధించి యాకాశసం
చరణారంభవిజృంభమాణరణదీక్షాదక్షత న్మించి వా
విరి బ్రహ్మాస్త్రము నిన్నరేశ్వరునిపై వేగం బ్రయోగింపు సు
స్థిరలీలన్ సమకూరు నీకు జయలక్ష్మీనిత్యసాంగత్యముల్. 123

తే. అనిన సౌమతేయునిబుద్ధి కాత్మ నలరి, చరణములఁ బాదుకలు మెట్టి చదల నిలిచి
మంత్రతంత్రానుసంధానమార్గశుద్ధి, వెలయ బ్రహ్మాస్త్రమేసె నవ్విమతుమీఁద. 124

శా. ఆదివ్యాస్త్రము భీషణానలశిఖాహంకారశంకావహ
ప్రాదుర్భూతపటుస్ఫులింగపటలీ ప్రచ్ఛన్నదిగ్భాగమై
యాదార్ఢ్యంబున వాసవాదిసకలాశాధీశహృన్మ్రలముల్
భేదిల్లం జని సంహరించె జగదాభీలున్ శకక్షోణిపున్. 125

వ. ఇవ్విధంబున శకక్షోణీశ్వరుండు హతుం డగుటయు నద్దివ్యబాణంబు నుపసంహరించి హతశేషులైనవిరోధివరూథినీనాథులకు నభయప్రదానంబు దయచేసి ప్రధానపురస్సరుండై వచ్చి శరణంబుసొచ్చిన శకమహీనాథనందనుం గనుంగొని కరుణించి తదీయసామ్రాజ్యంబునం బ్రతిష్ఠించి. 126

సీ. నవరత్నమయభూషణస్ఫారరణభూమి విలసిల్లుకల్యాణవేది గాఁగ
దళితకుంజరకుంభకలితమౌక్తికరాజి కమనీయశేషాక్షతములు గాఁగ
సమరసంక్రీడనసందర్శనాగతసురకోటి పెండిలిదొరలు గాఁగ
బహువిధజయతూర్యపటునిస్వనంబులు రమ్యమంగళవాద్యరవము గాఁగ
నుచితకాలజ్ఞుఁ డగుభట్టి యొజ్జ గాఁగఁ, జటుల మైనప్రతాపాగ్ని సాక్షి గాఁగ
విజయలక్ష్మీసముద్వాహవిలసనమున, సాహసాంకమహీనాథచంద్రుఁ డొప్పె. 127

వ. అప్పుడు తదీయమహనీయపరాక్రమప్రభావంబునకు హర్షించి శతమఖప్రముఖబర్హిర్ముఖులతనిపై దివ్యప్రసూనవర్షంబులు గురియించి తమలో నిట్లనిరి. 128

సీ. పాథోనిధానంబు బాణాగ్రమున నిల్పి గరిమమీఱినచాపధరుఁడు దక్కఁ
బెనుఁగూపమునఁ బడ్డ పృథుకందుకము బాణతతిఁ బుచ్చి యిచ్చినధన్వి దక్క
నఖిలరాజులు చూడ యంత్రమత్స్యము నేసి ప్రౌఢి మించినధనుఃపాణి దక్క
ననిలోనఁ బరశురామునకు మిక్కుటముగాఁ గడిమి చూపినవిలుకాఁడు దక్కఁ
జిత్రకోదండవిద్యావిశేషసహజ, సాహసక్రమవిక్రమోత్సాహలీల
విక్రమాదిత్యవసుమతీవిభునిఁ బోల, నన్యరాజన్యవరులకు నలవి యగునె. 129

వ. అని యనేకప్రకారంబులఁ బ్రశంసించుచు నిజనివాసంబులకుం జనిరి. తదనంతరంబ
పటుపటహభేరీమృదంగాదిమంగళతూర్యనిస్వనంబులును బాఠకపఠనరవంబులును మా

గధగీతికానినదంబులును వందిసంకీర్తనస్వనంబును సముద్భటసుభటపీరాలాపకలకలంబును నభంబు నైసర్గికగుణంబు నాపాదింపఁ ద్రిభువనభవనమోహనాకారరేఖారమానందనుం డైనరాగమంజరీనందనుండు నిజసౌందర్యసందర్శనాలోల లోలలోచనాలోచనకువలయితగవాక్షులక్షితప్రాసాదశోభాకరం బైనవిదర్భానగరంబు ప్రవేశించి, ప్రాగ్ద్వారవేదికానివేశితసముదీర్ణపూర్ణకుంభంబును రంభాస్తంభసంభావనానందనందన మాలికావిలసనంబును భూసురాశీర్వాదమేదురంబును విశాలవిజృంభితజగజ్జేగీయమానగౌరీకళ్యాణగానపరికల్పితకర్ణపారణంబును విదర్భేశ్వరదత్తంబు నైనతదీయప్రధానాగారంబున విడిసి సకలసైన్యంబును సముచితప్రదేశంబుల విడియింప సుమతిసూను నాజ్ఞాపించి విదర్భేశ్వరుని నిజనివాసంబునకుఁ బోవ నియమించిన నతం డిట్లనియె. 130

క. దురమున నెదురై యేరికిఁ, బరిమార్పఁగ రాకయుండఁ బరమేశ్వరుచే
వరములు గాంచినశకవిభుఁ, బోరిగొంటివి నీకు నితరభూపతు లెనయే. 131

చ. కుమతి శకుండు మత్పురముకోటపయిన్ విడియంగ నెంతయుం
గమలదళంబుమీఁదియుదకంబునుబోలెఁ జలించునాఁ డెం
డము భవదీయశౌర్యసముదగ్రతప్రాపున నల్లసిల్లి సిం
హము మెడగంటవోలె నభయంబునఁ బొందె వసుంధరేశ్వరా. 132

చ. హరునివరంబునం గనినయాత్మజఁ బట్టపుదేవి గాఁగ నో
నరవర నీకు నిత్తు నని నామదిఁ గోరిక సంభవింప సు
స్థిరతరకీర్తిసంపదలఁ జెంది సుఖింపఁగఁ గంటి రాజశే
ఖరునకుఁ గూఁతు నిచ్చి నుతి గాంచినశీతనగేంద్రుకైవడిన్. 133

చ. జనవర నీపురోహితుల శాస్త్రరహస్యనిరూపణక్రియా
వనజభవప్రభావు లగువారి ముహూర్తము నిశ్చయింపఁగాఁ
బనుపు శుభస్యశీఘ్ర మనుపల్కు నిజం బొనరింపు మన్న గో
బ్బనఁ బతిచిత్తవృత్తి గని భట్టి విదర్భుఁడుఁ దాను వేడుకన్. 134

క. ఉభయపురోహితసమ్మతి, శుభలగ్నము నిర్ణయించి సొంపుగఁ బురికిన్
విభవోచితశృంగారము, నభినవముగఁ జేయఁ బనుచు నాతఁడమాత్యున్. 135

సీ. కుడ్యభాగంబులఁ గుంకుమంబులు పూసి వేదికాస్థలుల జవ్వాది నలికి
కస్తూరి ముంగిళ్లఁ గలయంపిగాఁ జల్లి నిగ్గుఁగప్పురమున ముగ్గు వెట్టి
కంబాలఁ జీనిచీనాంబరంబులు చుట్టి గోపురంబులఁ బైఁడి కుండ లెత్తి
మేడల ముత్యాలమేలుకట్టులు గట్టి రత్నదీపిక లగారముల నుంచి
కనకకాండరంభాస్తంభకలితముకుర, పట్టపటుపుష్పచామరపల్లవాది

తోరణము లెల్లవీథులఁ దొంగలింపఁ, జేసి కైసేసి రభినవశ్రీలు మెఱయ. 136

వ. అంత. 137

సీ. మెఱుఁగులగతిఁ జూపు మెఱుఁగుఁగన్నులచూపు పసిఁడికమ్మలమీఁదఁ బరిఢవింప
మొలకవెన్నెలనవ్వు మురిపంపులేనవ్వు చెక్కుటద్దములపైఁ జెంగలింప
జక్కవకవ మించుచనుఁగవ నగుమించు మణిహారదీప్తితో మచ్చరింప
హరినీలములఁ గప్పు నలకలనుఁ గొప్పు కస్తూరితిలకంబు గారవింప
నతివ మోహనమంత్రదేవతయొ నాఁ న, నంగవతికాంతుమన్నించుమనుఁగుబోటి
యగుచకోరిక యనుచకోరాక్షి వచ్చి, సాహసాంకమహీపాలచంద్రుఁ గాంచి. 138

తే. ప్రణతి యొనరించి సరససంభాషణముల, రాగమంజరిసుతుమనోరాగ మెఱిఁగి
చిత్త మౌచిత్యవృత్తి వశీకరించి, విన్నవువిూఱ నిట్లని విన్నవించె. 139

క. నినుఁ జూచినచూపులనే, తనుఁ జూడఁగ నవును మదనతాపోపశమం
బనుచు విదర్భేశ్వరుసుత, పనుపఁగ నినుఁ జూచువేడ్కఁ బనివింటి నృపా. 140

వ. ఎట్లనినం దదీయదశావిశేషంబు లవధరింపుము. 141

క. దేవరమోహనలీలా, లావణ్యవిలాసగుణకలాపము లెన్నె
భావింతుగొ యిట్లని నుతి, గావింతు రనంగవతిసకాశమునఁ జెలుల్. 142

సీ. కాంతామనోహరాకారుఁ డౌ మారుండు సర్వజ్ఞకలహానిశ్చయుఁడు గాని
శ్రితపరిరక్షణస్థేముఁ డౌ రాముండు వరపుణ్యజనభయంకరుఁడు గాని
మహితదివ్యాస్త్రసమర్థుఁ డౌఁ బార్థుండు గురుసుతాప్రియగుణకరుఁడు గాని
సంతతవిభవనిస్తంద్రుఁ డౌ నింద్రుండు కులగోత్రభేదనోగ్రుండు గాని
యనుచు వారలగుణముల నపహసించు, సరణి సర్వజ్ఞులును బుణ్యజనులు గురులుఁ
గులనగేంద్రులుఁ గొనియాడఁ గొమరుమిగిలె, విక్రమార్కమహీపాలచక్రవర్తి. 143

ఉ. ఆరసికాగ్రగణ్యుని సమంచితరూపగుణప్రసన్నగం
భీరతఁ గన్నఁ గామినులపేరిటిరాలయినం గరంగు సం
సారఫలంబు గాదె యెలజవ్వని నీకుఁ దదీయనర్మలీ
లారసనర్మకేళిరతిలాలితసౌఖ్యము సంభవించుటల్. 144

వ. అని యిట్లనేకప్రకారంబుల. 145

చ. పలుమఱు నెచ్చెలుల్ సెవులపండువుగా నినుఁ బ్రస్తుతింపఁ ద
త్సలలితసారభాషణసుధారసధారలఁ దొప్పఁదోఁగి తొ
య్యలి హృదయాలవాలమునయం దనురాగలతావితానముల్
మొలచు టెఱింగి యంగజుఁడు మోహనబాణము నారిఁ గూర్చినన్. 146

సీ. నిలువుటద్దము సూడ నెచ్చెలితో నాడ సరసోక్తులకు నవ్వ సరులు గ్రువ్వఁ

జిత్తరువులు వ్రాయఁ జిలుకఁ బెండిలిసేయ సరసాన్నము భుజింప మరు భజింపఁ
దల్లిచిత్తము పట్టఁ దారహారము వెట్టఁ గ్రొవ్విరు ల్వేడఁ గూర్పఁ గురులు దీర్పఁ
గనకసౌధముచేరఁ గమ్మజాజులు గోర నాట్యరంగము ద్రొక్క నటన కెక్క
హంసనడపింప జలకేళి కగ్గలింప, వీణవాయింపఁ బాన్పుపై విశ్రమింప
నెఱుఁగ కిట్లొక్కనాఁడొకయేఁడు గాఁగ, బాల వలవంతఁ జింతించుకీ లెఱింగి.

వ. ఆకాంత యేకాంతంబున నిట్లంటి. 148

ఉ. ఇంతవిచార మేల తరళేక్షణ యెంతటివాని నైన నీ
కాంతునిఁ జేయుదాన రతికాంతునిపాగము లాన నీకు నా
యంతటిబోటి గల్గఁ దగవా వగఁజెందఁగ నీమనోరథం
బింతయుఁ జెప్పవేమిటికి నేనుఁగు నెక్కియు దిడ్డి మాఱఁగన్. 149

క. నావుడుఁ దొంగలిఱెప్పల, క్రేవల నునుసిగ్గు లంకురింపఁగ నాపై
భావానుకూలలీలా, భావితముగఁ జూడ్కి నిలిపి బాలిక తనలోన్. 150

ఉ. చెప్పఁ దలంచు సిగ్గు తనుఁ జెప్పఁగనీమికి సంచలించుఁ దాఁ
జెప్పెడుమాట యెవ్వరికిఁ జెప్పకుమీ యనఁ జూచు నంతటం
జెప్పక యుండ రాదు మఱి చెప్పఁగ రాదని కొంకు నెమ్మయిం
జెప్పక పోదు పొమ్మనుచుఁ జిత్తము నూల్కొనఁ జేసి యిట్లనున్. 151

తే. నిజకరస్పర్శ మొనరించి నీరజముల, నర్కుఁ డలరించునది యెంత యున్నకరణి
వినినయంతన విక్రమవినుతుఁడైన, యర్కుఁ డలరించె నాహృదయాంబుజంబు. 152

వ. అని భావగర్భితంబుగా నిన్నుఁ బేర్కొనుటయు. 153

మ. తలఁపోతల్ దల లెత్తెఁ దాల్మి సడలెం దాపంబు దీపించెఁ జేఁ
తలు డిందెన్ ధృతి వీడుకోలు గొనియెన్ దైవాఱెఁ గన్నీరు కో
ర్కులు గోవావులకోడెలై నిగిడె సిగ్గుల్ దూరమై పోయె న
గ్గల మయ్యెం దమకంబు పద్మముఖికిం గందర్పుచే నెంతయున్. 154

వ. ఆసమయంబునం బ్రదీపించునుద్దీపనవిభావప్రభావంబు భావించి సోపాలంభంబుగా నె
చ్చెలు లిట్లనిరి. 155

సీ. కుంభోదకముఁ బోసి యంభోజముఖి పెంపఁ జూతంబు కొమ్మలు సూపఁ దొణఁగె
ఫలరసంబులు వోసి బాలిక పోషింపఁ జిలుక మోమెత్తఁగాఁ జేసికొనియె
మాలమూలల దాఁచి ముద్దియ పాలింప నలరులు ములుకులై యంటఁ దఱిమెఁ
బ్రాణంబుగా నింతి భావింపఁగా గాలి యంతకుదెసనుండి యాక్రమించె
వెలఁదిచేసినమే లెల్ల వీటఁబుచ్చి, యివి యకారణవైరులై యేఁపఁ జొచ్చె
జలజముఖులార యన్యపుష్టముల కెందుఁ, గొమ్మఁ గొనిపోవు టారయ గుణముగాదె.

వ. అనుచు నమ్మదవతిమదనవికారంబులకుఁ బ్రతికారంబులు శీతలోపచారంబులుగా విచారించి. 157

క. నవమకరందయుతంబై, ప్రవిమలనీహారసలిలపరిమిళితంబై
[1]యువతాళించుజలమ్మున, నువిదకు మజ్జనవిధాన మొనరించి తగన్. 158

తే. జిగి దొలంకెడుచెంగల్వసెజ్జ నుంచి, గంధ మందంద డెందంబునందు నలఁది
తరుణరంభాదళాంభోజతాళవృంత, పవనసంపాదనక్రియాప్రౌఢి మెఱసి. 159

ఉ. కట్టిరి సన్నపుందనుపుఁగావి కటీతటి మేనితీఁగపై
నొట్టిరి కమ్మపుప్పొడి సమున్నత మైనకుచద్వయంబుపైఁ
బెట్టిరి క్రొత్తముత్యములపేరులు కంకణనూపురాకృతిం
జుట్టిరి పాణిపాదములఁ జొక్కముగా బిసకాండకాండముల్. 160

వ. మఱియును. 161

సీ. చంద్రికాంతపుఁగోరఁ జల్లనిపన్నీరఁ దొరఁగెడుకన్నీరు తుడిచి తుడిచి
మంచునఁ దోఁగినమించులేఁజిగురాకు లొయ్యనఁ గరముల నొత్తి యొత్తి
తేఁటి ముట్టనిపువ్వుఁదేనియఁ బుప్పొడి మెదిచి పాదంబుల మెత్తి మెత్తి
సిర మైనపచ్చకప్పురము గందముతోడఁ గలిపి పాలిండ్లపై నలఁది యలఁది
మలయపవనుండు పలుమాఱు మలయకుండ, నలుదెంటిఁగవాక్షంబు లరసి యరసి
యెందుఁ గందర్పతాపంబు డిందుపడమిఁ, జెలువ నీరాక మది నపేక్షించునంత. 162

క. ఆవెలఁదిభాగ్యదేవత, యావిర్భావంబుఁ బొందిన ట్లిచ్చటికిన్
దేవర విజయంచేసిరి, గావునఁ దత్తపముఫలము గానఁగవచ్చెన్. 163

క. ముట్టడి మాన్పి విదర్భకుఁ, బట్టముగట్టితి విదర్భపతి నతనిసుతం
గట్టుము మరురాజ్యమునకుఁ, గట్టిగఁ బట్టం బవశ్యక ర్తవ్య మగున్. 164

క. ననుఁ బాసి యొక్కనిముసము, తనయంతన యుండ దావిదర్భేశ్వరునం
దన నేను నట్లకావున, నను ననుపఁగ నవధరింపు నయతత్త్వనిధీ. 165

వ. అని విన్నవించుచకోరికం గనుంగొని సాహసాంకనరేంద్రచంద్రుం డిట్లనియె. 166

ఉ. నారదమౌనిచేత నొకనాఁడు వినోదముపోలె విన్నమీ
నీరజనేత్రసోయగము నేఁడును నామదిఁ బాయదన్న ని
చ్చారతిఁ గూడిమాడి యనిశంబును నొక్కెడ నున్నయట్టినీ
కారమణీవియోగమున కాత్మ యొడంబడునే చకోరికా. 167

చ. అని సరసప్రసంగముల నమ్మదిరాక్షిని గారవించి కాం
చనమణిభూషణావళు లసంఖ్యము లిచ్చి ప్రియంబు మీఱఁగా

---

1 ఇవతాళించుజలమ్మున = శీతలజలముచే

ననిచి యథోచితక్రియల నమ్మనుజేశ్వరుఁ డంత స
ద్వినయధీయుఁడు భట్టి చనుదెంచి నమస్కృతి చేసి యిట్లనున్. 168

క. పురిశృంగారముఁ జూచిన, నరులకు నెల్లను నవాఙ్మనసగోచరమై
కర మొప్పుచున్న దెల్లియ, పరిణయలగ్నంబు వలయుపను లొడఁగూడెన్. 169

శా. భూపాలాగ్రేసర యుష్మదీయచరు లుద్బోధింప నానావిధ
ద్వీపానీతగజాశ్వరత్నరమణీదివ్యాంబరశ్రేణి చే
నీపాదాంబుజసేవ సేయుటకునై నెయ్యంబుతో వచ్చినా
రాపూర్వాపరదక్షిణోత్తరదిగంతానంతధాత్రీశ్వరుల్. 170

వ. అని విన్నవించి వారలం గానిపించుటయు. 171

క. సకలనృపప్రకరంబును, బ్రకటితముగ సాహసాంకపదపీఠికకున్
మకుటమణిదీపకళికా, నికరము నీరాజనముగ నిర్వర్తించెన్. 172

వ. అప్పు డప్పుడమిఱేఁడు తదానీతంబు లైనపావడంబులు గైకొని యొసంగం దదనుమతి వడసి భట్టియు రాజలోకంబును నిజనివాసంబులకుం జనిరి. మఱునాఁడు శకమర్దనుండు ప్రభాతసమయసముచితకృత్యంబులు నిర్వర్తించి యనంత రక్కడ. 173

చ. హితులఁ బ్రధానవర్గముఁ గవీంద్రుల బంధుల మిత్త్రులం బురో
హితులను దండనాథుల మహీపతులం బరివారముం గళా
వతులను మాగధోత్తముల వందిజనంబు దిగంతరాగత
క్షితిపతులన్ విదర్భపతి శ్రీవెలయంగ సభాంతసీమకున్. 174

వ. ప్రియపూర్వకంబుగాఁ బిలిపించి గంధాక్షతకర్పూరతాంబూలంబు లాదిగా సత్కారంబు లొనరించె ననంతరంబ. 175

సీ. సంప్రీతిఁ గిన్నరేశ్వరుఁడు పుత్తెంచిన రమణీయచీనాంబరములు గట్టి
కడువేడ్క నాకలోకస్వామి యనిపిన మందారకుసుమదామములు దాల్చి
వినయంబున దినేంద్రతనయుండు పంచినబంధురశ్రీగంధపంక మలఁది
భక్తితో భువనాధిపతి దూత తెచ్చిన నవరత్నమయభూషణములు దొడిగి
తనువిలాసంబు కనుఁబాటు దాఁకకుండఁ, గా నొనర్చిరి గాక శృంగార మనఁగ
సతియుఁ బతియును వచ్చి రప్రతిమలీల, సఖులు దోడ్తేర నుద్వాహసదనమునకు.

క. అత్తఱి విదర్భభూపతి, చిత్తంబున సంతసంబు చిగురొత్తఁగ వి
ప్రోత్తములు వేదమార్గా, యత్తంబుగ నాచరించి రౌచిత్యంబుల్. 177

వ. తదనంతరంబ మౌహూర్తిక దత్తశుభముహూర్తంబున. 178

క. సాహోదారసుధారస, ధారాహారానుసారిధరణీదివిజో
దీరితవేదధ్వనితో, గౌరీకళ్యాణముఖగానము మెఱసెన్. 179

ఉ. శ్రీ మెఱయం బురోహితవిశిష్టమతంబున విక్రమార్కధా
త్రీమహీశ్వరుండు సముదీర్ణత నించిన సేసఁబ్రాలు కాం
తామణికేశభారమునఁ దద్దయు నొప్పె మరుండు లీలతోఁ
గోమలనీలగుచ్ఛములఁ గూర్చినముత్తెపుజల్లియో యనన్. 180

వ. తదనంతరంబ. 181

సీ. పసిఁడిగుండల మించుపాలిండ్లనుమించు కరమూలములకాంతిఁ గౌఁగిలింపఁ
గరమూలములకాంతి కడలెత్తి యందంద కేయూరదీప్తులఁ గీలుకొనఁగఁ
గేయూరదీప్తులు గిటికొని నెరసుతోఁ గంకణద్యుతిమీఁదఁ గాలుద్రవ్వఁ
గంకణద్యుతి సోయగము మీఱఁ బలుమాఱు రత్నాంగుళీయకప్రభలఁ జెనకఁ
దనదు మెఱుఁగారు కెంగేలుఁదమ్మి లెత్తి, ప్రాణవిభుమౌళిపైఁ దలఁబ్రాలు వోయు
నపుడు కాంతకు మైపుల్క లంకురించి, కోరకితమల్లికావల్లి కొమరు దాల్చె. 182

ఆ. ఇరువురందు నప్పు డెక్కువ తక్కువ, యింత లేక కూర్మి యెఱుకపడియె
సహజరీతిఁ బుష్పశరుఁడు త్రాసునఁ దూఁచి, ప్రియముతోడఁ బంచిపెట్టినట్లు. 183

క. ఆలో నాలోలేక్షణ, కేలం దనకేలుఁదమ్మి గీలించి మహీ
పాలశిఖామణి లీలా, ఖేలగతి వివాహవేదికిం జనుదెంచెన్. 184

వ. చనుదెంచి హోమకార్యం బనుసంధించి. 185

క. సూరిజనసస్యసమితి న, పారముగా సాహసాంకపర్జన్యుఁడు సొం
పారఁగఁ గంథాబంధుర, ధారాళకరాళకనకధారలఁ దనిపెన్. 186

ఉ. అంత శకాంతకుండును దిగంతనృపాలకులున్ సమస్తసా
మంతులు భట్టియాది యగుమంత్రిజనంబు విదర్భధారణీ
కాంతుఁడు దోడితేరఁ జని గారవ మొప్పఁగ భుక్తిమండపా
భ్యంతరవీథిఁ దత్తదుచితాసనపంక్తి సుఖోపవిష్టులై. 187

సీ. మిం ను కన్నులు గోరగించురాజాన్నంబు నుపమింపరాని సద్యోఘృతంబు
నమృతోపమానంబు లగుపిండివంటలు నుజ్జ్వలం బైయొప్పు నొలుపుఁబప్పు
మది కింపుఁ బెంపు కమ్మనిపదార్థంబులు బహుపాకరుచు లైనపాయసములుఁ
దగువాసనావాసితము లైనపచ్చళ్లు వడియఁగట్టినయానవాల పెరుఁగు
సరసమధురరసావళిసముదయములు, పంచసారసమంచితపానకములుఁ
గమ్మకస్తూరినెత్తావిఁ గ్రైవుచేసి, యూరుఁగాయలుఁ జల్లనియుదకములును. 188

వ. మఱియుఁ బచనరచనారంజితంబు లగుబహువిధమాంసవ్యంజనంబులును రసికరసనాత
పఃఫలంబు లగుపరిక్వఫలంబులును యువతికరనిర్మథితంబు లగుమథితంబులు నుపయో
గించి, రంభోరూకరాంభోజకాతకుంభసంభరితంబులును సుగంధబంధురంబు లగుజలం

బులం గృతావమనులై విదర్భాధీశ్వరుండు ప్రియపూర్వకంబుగా నొసంగుతాంబూలాం
బరమణిభూషణాదిసత్కారంబులు గైకొని వివాహోత్సవస్తుతికథాముఖరులై దిగం
తరాగతులగు మహీపతులును మఱియును దగువారును బాంధవులును దమతమదే
శంబులకుం జనిరి. తదనంతరంబ. 189

మ. జవసత్త్వప్రభవప్రభావధరితాజానేయవాహంబులన్
శ్రవణోత్సారితచంచరీకమదచంచద్వారణవ్రాతమున్
నవరత్నాభరణవ్రజంబు నయనానందారవిందాక్షులన్
నవశస్త్రావలులన్ వధూవరులకున్ వైదర్భుఁ డిచ్చెం దగన్. 190

క. చుట్టములసురభి వీవని, భట్టికిఁ దగఁ బ్రియము చెప్పి పంకజనయనా
పట్టాంశుకమణిభూషా, రట్టజహయగంధసింధురంబుల నొసఁగెన్. 191

క. ఆసమయమునఁ గుమారిం, గైసేసి తదీయజననిఁ గాన్పించి చకో
రీసుదతి సుప్రయాణ, శ్రీసూచన చేసి ప్రణతి సేయించుటయున్. 192

తే. తల్లిపాదంబులకు మ్రొక్కి తలిరుఁబోఁడి, యశ్రుపూరంబు ఱెప్పల నప్పళింపఁ
గలికికన్నులు మకరందజలము గ్రమ్మ, కమ్మతమ్ములతమ్ములై కరము మెఱసె. 193

వ. అత్తెఱం గెఱింగి యమ్మహాదేవి యక్కుమారీరత్నంబు నక్కునం జేర్చి చెక్కుటద్దంబు
లు పుణుకుచు నిట్లనియె. 194

సీ. ఏరాజు నుజ్జయినీరాజ్యపదమున నంబికాదేవి పట్టంబు గట్టె
నేరాజు తనసభ కేతెంచినవిరించి యచ్చెరువంది బ్రహ్మాస్త్ర మిచ్చె
నేరాజు నాట్యవిద్యారసజ్ఞత మెచ్చి భద్రాసనం బిచ్చె బలవిరోధి
యేరాజునకుఁ గల్గె నీశ్వరగరగర్వయుతుని సిద్ధపురీశు నోర్చుకడిమి
యట్టిరాజుపట్టపుదేవి వైననీవు, సకలరాజన్యకాంతలు చరణయుగముఁ
గొలువఁ గొలువుండుదువు గాక కోమలాంగి, నీకు నేలమ్మ కన్నుల నీరునింప. 195

క. పతికనుసన్నల మెలఁగుము, పతిహితు లగువారి నెఱిఁగి పాటింపు మదిం
బతి దైవముగాఁ దలఁపుము, పతియ సుమీ యేడుగడయు భామామణికిన్. 196

వ. అని బోధించి పునఃపునరాలింగనంబు చేసి తదీయనర్మసఖి యగుచకోరికం జూచి
యిట్లనియె. 197

సీ. పతియును నేనును బార్వతీపతిచేత వరముగాఁ గొంటి మీ వాలుఁగంటి
నర్కతేజుఁడు విక్రమార్కక్షమానాథుఁ డల్లుఁ డయ్యెడిభాగ్య మబ్బె మాకు
రమణునితోడ దూరముగాఁగ నేఁగుచోఁ బొలఁతికి నీయట్టిబోటి గలిగె
నేమిటఁ జూచిన నీయింతి తొలుమేన సుకృతంబు సేయుట ప్రకట మయ్యె
నింక నిటమీఁదఁ దగుబుద్ధి యెఱుఁగఁ జెప్పి, విభునిచిత్త ముపార్జించువెరవు గఱపి

పాడయు నీడయుఁ బోలె వీడ్వడక మెలఁగి, యబలకంటికి ఱెప్పవై యరయుమమ్మ.

వ. అని యప్పగించి యనుపుటయుఁ జకోరికాప్రముఖసఖీసహస్రంబు గొలువ నాందోళి
కారూఢయై చనుదెంచిన ప్రియాంగనం గనుంగొని సంతుష్టాంతరంగుండై సాహసాంక
మహీనాథుండు. 199

చ. వినయముతో విదర్భపతి వీడ్కొని దేవియుఁ దాను రత్నకాం
చనరథమెక్కి వందిజనసంస్తుతి మాగధగానమంజుల
ధ్వనులను హృద్యవాద్యనినదంబుల దిక్కులు పిక్కటిల్లఁగాఁ
జనియె రమాసమేతుఁ డగుసారసనేత్రుని గ్రేణిసేయుచున్. 200

వ. అటమున్న సర్వసన్నాహసమేతుండై వెడలి భట్టియుం జనుదేర విదర్భానగరంబు నిర్గ
మించి పయనంబున యోగదండప్రకాండకల్పితానల్పపురనిరూపణంబుల దివ్యపాత్రి
కాపిచిత్రాన్నపానసంతర్పణంబులఁ గంథానుసంధీయమాననానానిష్కవిరచిత ద్రవ్యం
బుల నాత్మనిర్విశేషంబుగా నశేషసైనికులకుం బరితోషం బొనరించుచుఁ జని నిజాగమ
నోత్సవాలంకృతం బైనయుజ్జయినీపురంబుం బ్రవేశించునప్పుడు. 201

క. అన్నరపతిచంద్రుని నొక, కన్నియ మణిసౌధజాలకంబునఁ జూడం
గన్నుల వలఁగన్నులతో, నున్న ట్లున్మీలనయనయుగయై యొప్పెన్. 202

సీ. నెరసుఁజూపులతోన నెయ్యంబు కూర్మికి నెరవైనతియ్యంబు నిగుడుచుండ
విరులగాదిలి యైనవేణీభరముతోన కేలిమై గనయంబు కీలుసడల
హృదయంబులోపల నెసఁగుకోర్కులతోన మేదీఁగెఁ బులకలు మెండుకొనఁగ
విలసితలీలారవిందంబుతోడన చెలిమూఁపుఁ గీల్కొన్న చేయి సడల
మఱపు వేడ్కయు మదిలోన మచ్చరింప, చెమరుఁ గలపంబు గ్రొమ్మేన జిగిఁ దనర్ప
నింపుఁ దమకంబు మనములో నినుమడింప, రమణి యొక్కతె వసుమతీరమణుఁ జూచె.

చ. నెఱవుగ వన్నెవెట్టి రమణీమణి పయ్యెద సంతరింపఁగా
మఱచి నరేంద్రుఁ జూడఁగ నమందగతిం జనుదేర హారమ
య్యెడచనుముక్కునం దగిలి యంతయు నొప్పె రథాంగదంపతుల్
తెఱుఁ గొదవంగఁ బట్టి తరితీపులఁ బెట్టు మృణాళమో యనన్. 204

చ. మలయజకర్దమం బలఁది మౌక్తికభూషణభూషితాంగియై
పొలఁతుక యొర్తు రాచిలుకబోద కరాగ్రమునంద యుండ భూ
తలపతిదర్శనంబునకుఁ దత్పరతం జనుదెంచి నిల్చె ను
జ్జ్వలరుచితో నృపాలునకు శారద సన్నిధి చేసెనో యనన్. 205

ఆ. రాజవరునిఁ జూచు రాజబింబాస్యల, కలికిమెఱుఁగుఁజూపుగములు పర్వ
కలువతోరణములు గట్టినవిధమున, నప్పురంపువీథు లొప్పమిగిలె. 206

చ. సమధికచంద్రికాధవళసౌధసమున్నతచంద్రశాలలం
బ్రమదము మీఱ నిల్చి పురభామలు సేసలు చల్లుక్రొత్తము
త్తెములు దనర్చె నమ్మదవతీమనుజేంద్రులమీఁద వేలుపుం
గొమ్మిరలు కల్పభూజనవకోరకముల్ గురియించిరో యనన్. 207

వ. ఇవ్విధంబున సర్వజననయనపర్వంబు లగునపూర్వవిలాసవైభవంబులు మెఱయం జని రాజమందిరంబు ప్రవేశించి రథావరణంబు సేసి యనంగవతీమహాదేవిని సఖీజనసమేతంబుగా నంతఃపురంబున కరుగ నియమించి యాస్థానమండపంబున మణివిచిత్రద్వాత్రింశత్సాలభంజికాభవ్యంబైనదివ్యసింహాసనంబున నాసీనుండై యున్న యవసరంబున.

సీ. కాంచనమణిముద్రికా ప్రభాజాలంబు పసిఁడిపళ్లెరములమిసిమిఁ జెనకఁ
గలికికెంపుఁగన్నులఁ గప్పుముక్కెంపుమెఱుఁగులు వరదీపకళికల వన్నెవెట్టఁ
గమ్మపువ్వులతావి కర్పూరవర్తికా సౌరభంబులతోడ సరసమాడఁ
గంకణంబులఝణత్కారంబు తోఁగమై యాశీర్విన్నాదంబు నాదరింపఁ
దరళతాటంకమౌక్తికోదారకాంతి, గండదర్పణదీప్తుల గారవింప
రాజముఖులు గావించి రారాజమణికి, రచితరుచి చక్రవాళనీరాజనములు. 209

వ. తదనంతరంబ. 210

తే. సౌమతేయాదిసామంతసముదయంబు, నాత్మసదనంబులకు నేఁగ నానతిచ్చి
యంతిపురమున కేఁగి ధరాధినాథుఁ, డుచితలీలానురక్తుఁడై యుండునంత. 211

చ. అరవిరిదమ్మిఁ దేనియక్రియ న్మది రాగరసంబు గాఢమై
పరఁగ విహారసౌధమణిబద్ధగవాక్షము చేరి వేడ్కఁ బ్రో
ద్ధరయువిదర్భరాజతనయం గరుణించినభంగి దోఁపఁగాఁ
జరమదిశామహీధరముచాటున కేఁగె దినేంద్రుఁ డత్తఱిన్. 212

తే. కణఁక నన్యోన్యసంభోగకాంక్ష నున్న, సాహసాంకవిదర్భరాజన్యసుతల
హృదయరాగంబు పుంజమై యొసఁగెననఁగ, నుదయరాగంబుతోఁ జంద్రుఁ డుల్లసిల్లె.

శా. తత్కాలోచితకృత్యముల్ నడపి రత్నస్నిగ్ధభూషావళీ
సత్కాంతిప్రకరంబు రాగరససాక్షాద్భావముల్ పూనఁగా
నుత్కంఠైకసఖీసహాయుఁ డయి రాజోత్తంసుఁ డుండెన్ సము
ద్యత్కేళీసదనాంతకాంతబహుశిల్పాకల్పతల్పంబునన్. 214

క. అంతఁ జకోరిక మొదలగు, కాంతలు వైదర్భితనయఁ గై సేసి మహీ
కాంతుం డున్నవిహారగృ, హాంతరమున కెలమిఁ దెచ్చు నాసమయమునన్. 215

చ. పదములఁ దొట్రుపాటొదవఁ బ్రాణసఖీజనభాషణంబులన్
మదిఁ దమకంబు లజ్జయును మచ్చరికింప వణంకుమేనితో

మదవతి మందమందగతి మార్దవ మొప్పఁగ వచ్చెఁ బైపయిం
బొదలుచునున్న రాగరసపూరముతో నెదిరించుకైవడిన్. 216

వ. వచ్చి విహారగేహ గేహళీప్రదేశంబున నిలిచి. 217

క. లోపలికి నరుగ నులుకుచుఁ, బైపై మిథ్యారహస్యభాషలఁ గాల
క్షేపము సేయుచుఁ జెలితోఁ, ద్రోపాడుచు నుండె నబల తోరపులజ్జన్. 218

సీ. కలువరేకుల మీఱుకలికికన్నులకాంతి మేల్కట్టుముత్యాల మెఱుఁగువెట్ట
నిండుఁజందురు నేలునెమ్మొగంబు బెడంగు నిలువుటద్దమునకుఁ జెలువు నొసఁగ
నరుణాబ్జముల మించునడుగుల నునుఁజాయ నెలకట్టుకెంపులనిగ్గుఁ జెనకఁ
గారుమెఱుంగుఁ గైకొని తనుదీప్తి కనకకుడ్యప్రభ గారవింప
సాంద్రఘనసారధూపాదిసౌరభంబు, లలఁతియూర్పులనెత్తావి నతిశయిల్ల
మందిరాభ్యంతరము సొచ్చె మ్రానుదేఱి, భీతమృగనేత్ర ప్రియసఖీప్రేరణమున. 219

చ. వలభుజమున్ గపోలమున వంచి మఱంచినమోము లజ్జయున్
లలితకటాక్షమున్ బ్రియవిలాసముఁ జిత్తముఁ జిత్తజాతుఁడున్
దలఁపులుఁ గోర్కులున్ బెరయఁ దద్దయు నొప్పె విహారశయ్యపై
విలసితలీల బాల బొటవ్రేల నిలాతలమున్ లిఖించుచున్. 220

చ. అతులితభావగర్భితము లైనమృదూక్తులచేతఁ గేలికిం
బురిపుత వోవుచున్న నృపపుంగవుచిత్తమెఱింగి నిర్గమో
ద్గతమతి యైననెచ్చెలికిఁ గన్నుల మ్రొక్కు లతాంగి భావమూ
ర్జితరతిరాజరాజ్యపదసీమకుఁ బట్టముగట్టె భూవిభున్. 221

వ. తత్సఖీనిర్గమనానంతరంబున. 222

సీ. మేలంపుమాటల మెచ్చులు పచరించి తోరంపుసిగ్గును దొలఁగఁ ద్రోలి
పరమసౌఖ్యాయత్తపరిరంభణంబునఁ దనువల్లిఁ బులకలు దళముకొలిపి
పారవశ్యదములై పరఁగుచిట్టంటులఁ జవపున గనయంబు సడలఁజేసి
క్రొత్తలయందెల్లఁ గ్రొత్తలై పరఁగెడుకామతంత్రంబుల గరిమ గఱపి
బాలికామణి సుఖవార్ధి నోలలార్చి, కామసామ్రాజ్యలక్ష్మికిఁ గర్తఁ జేసెఁ
బ్రసవశరశాస్త్రమతకళాపారగుండు, సాహసాంకమహీపాలచక్రవర్తి. 223

చ. చిలివిలి వోవుకోరికలు చిత్తములం దల లెత్తి దేహముల్
పులకల నీనఁగాఁ దమకముల్ నిగుడన్ సుఖపారవశ్యతం
దలఁపుల కందగింపఁ బ్రమదంబునఁ బట్టినచోటు లెల్లనుం
గళలను నిక్కలై మెఱయఁగా రతిసల్పిరి వేడ్క దంపతుల్. 224

క. సురతావసానలీలా, పరిరంభము మీఁదరతికిఁ బ్రారంభముగాఁ

దరుణియు వరుఁడు రమించిరి, కర మరుదుగఁ జతురశీతికరణప్రౌఢిన్. 225

సీ. తొంగలిఱెప్పలతుదలు గైవ్రాలినఁ గొసరుఁజూపులయందు మిసిమి దోఁపఁ
దారహారముల వర్తనఁ గళాసించినఁగుచకుంభములు మీఁదఁ గొంతనిక్కఁ
గుంతలంబులఁద్రుళ్లగింతలు సడలినఁ గెమ్మోవిచుంబనక్రీడ కెలయ
మణికాంచివలయంబు మౌనంబు గైకొన్న నురునితంబముకేళి కుత్సహింపఁ
జెమటచిత్తడి మైపూఁత దొమలిచనిన, నెమ్మనంబునఁ దమకంబు నివ్వటిల్ల
నున్న జలజాక్షియొప్పు నృపోత్తమునకు, మదనపునరుద్భవనికారమంత్ర మయ్యె. 226

సీ. సంపూర్ణపూర్ణిమాసాంద్రచంద్రాతప విలసితశశికాంతవేదికలను
మంజరీసంజాతమకరందనిష్యంద మాకందమాధవీమండపముల
శృంగారవనమహాశృంగారమణిశృంగ హాటకశైలశృంగాటకముల
సంఫుల్లహల్లకసహవాసవాసనోజ్జ్వలదీర్ఘదీర్ఘికాసైకతముల
గగనగంగాతరంగిణీగంధవాహ, బంధురోదగ్రసౌధాగ్రభాగములను
నవనవోల్లాసరతికళానైపుణములఁ, బ్రతిదినంబు రమించిరి పతియు సతియు. 227

వ. ఇత్తెఱంగున సాహసాంకమహీనాథుండు చిత్తానందంబుగ విదర్భరాజనందనం దగిలి కందర్పలీలావిలాసంబులం జతురుదధివలయవలయిత మహామహీపరిపాలనఖేలనంబులం బ్రవర్తిల్లుచు మఱియును. 228

శా. నారీచిత్తసరోమరాళ నవనానాగంధసౌగంధ్యవి
స్తారోదారభుజాంతరాళ ప్రతిభాసర్వజ్ఞ సోమాబ్జవి
స్తీర్ణాకారశరన్నిశాకరకరాశ్లేషప్రభాజృంభావుక
స్ఫారక్షీరపయోధిలంఘనకళాజంఘాలకీర్తీశ్వరా. 229

క. భూరిమణిహేమభూషా, ఘోరితకన్యాప్రదానపుణ్యచరిత్రా
పేరయనన్నయవరతన, యారత్నశ్రీమదక్కమాంబాపుత్రా. 230

బంధురవృత్తము.

విలసితబహుధనవితరణకరుణా విశ్రుతవీరగుణాభరణా
జలరుహనవదళసలలితచరణా సత్కవిసన్నుతసంచరణా
కలుషవిమతధగఘనమదహరణా కాంతిసవీనసుధాకిరణా
జలనిధివలయితజగదుపకరణా సారయశోధనతాభరణా.

గద్యము. ఇది శ్రీమదఖిలకవిమిత్త్ర పెద్దయయన్నయామాత్యపుత్త్ర శారదాదయావిధేయ జక్కయనామధేయ ప్రణీతం బైన విక్రమార్కచరిత్రం బనుమహాప్రబంధంబునందుఁ జతుర్థాశ్వాసము.

శ్రీ ర స్తు.

విక్రమార్క చరిత్రము.

పంచమాశ్వాసము.

హారితగోత్రభూషణ
సాహసనవసాహసాంక సంగీతకళా
దోహళ సత్కవిసన్నుత
సాహిత్యరసప్రసంగ జన్నయసిద్ధా. 1

వ. ఇవ్విధంబున ననంగవతీసమేతుండై యున్న యన్నరేంద్రుం డభినవసుఖంబు లనుభవిం
చుచు నుండు నంత. 2

సీ. రాజకీరకుమారరాజి కక్షరశిక్ష యొనరింప వచ్చిన యొజ్జ యనఁగఁ
గలకంఠనికురుంబకములకు వాక్కట్టు విడిపింప వచ్చిన వెజ్జనంగఁ
దరులతాదులకు వార్ధకము మానఁగ మందు సేయంగవచ్చిన సిద్ధుఁ డనఁగ
సంప్రణయక్రోధజంపతీనివహంబుఁ గలుప వచ్చిన చెలికాఁ డనంగ
మందమారుతోద్ధూతమరందబిందు, సిక్తషట్పదజ్యారవశ్రీవిలాస
మకరకేతుప్రతాపసమగ్రమై వ, సంత మేతెంచె సంతతోత్సవ మెలర్ప. 3

క. వలరాజుమూలబల మగు, నలిశుకపికములకుఁ జైత్రుఁ డభిమతభోజ్యం
బులఁ గూర్చె ననఁగఁ దరువుల, నలరులుఁ దలిరులును బండ్లు నక్కజ మయ్యెన్. 4

క. కిసలయకింజల్కరస, ప్రసవశిలాటుప్రభాపరంపర లెసకం
బెసఁగ మకరందవృష్టికిఁ, బొసఁగంగా నింద్రధనువు పొడమినభంగిన్. 5

మ. కనదంభోజముఖీనవీనపదరాగవ్యాప్తిపూర్వంబు గా
నన నుల్లాసముఁ బొందె సంపెఁగలు నానాకాననశ్రీవిలా
సిను లభ్యాగమవేళఁ జైత్రునకు నౌచిత్యంబు గావింప నె
త్తిననీరాజనదీపమాలిక లనన్ దేదీప్యమానంబులై. 6

చ. పరువపుఁబుష్పరేణువులపై మకరందపువెల్లి డొల్లి బం
ధురవనదుర్గమార్గ మతిదుస్తరమై చెలువొంద నెందు న

చ్చెరువుగ మందమందగతిఁ జెందె మహాబలుఁ డయ్యుఁ జాలదు
స్తరమని కన్నె తావు లగుతావుల వ్రేఁగున వాయు వామనిన్. 7

చ. విరహులఁ బట్టి తెచ్చి మనవీట భటావలి నెవ్వరైనఁ బూఁ
దరటులపాలు సేయమియ తప్పు సుఁడీ యని చాటుచున్నకం
బరరిపుఘంటికారవముభంగిఁ జెలంగె నశోకతాడన
స్ఫురితవిలాసినీచరణభూషణఘోషణ మెల్లతోఁటలన్. 8

క. తిలకితవసంతలక్ష్మికి, తిలకములై నిరుపమానతేజోగరిమం
దిలకములు తరళనయనా, తిలకంబులు చూడఁ జూడఁ దిలకము లొప్పెన్. 9

క. కాముకులుఁగామినులునుం, గామాతురు లగుట యరుదె ఘనతరులతికా
స్తోమము ప్రేమము మైకొనె, నామని నబ్జజునకైన నలవియె పొగడన్. 10

సీ. కమలగర్భునిఁ బుత్త్రికాకాముఁ గావించి కౌశికు వెలయాలిఁ గవయఁ బనిచి
నిందిరావిభు గొల్లయిల్లాండ్రఁ దగిలించి రజనీశు గురుసతిరతి కొనర్చి
రుద్రుని నర్ధపూరుషుఁగా నొనరించి శుకుని తాతకుఁ గామసుఖము నేర్పి
కులిశాయుధునిఁ బట్టి కోడాట లాడించి ఋశ్యశృంగుతపస్సమృద్ధి మాన్పి
విషమశరునకు త్రైలోక్యవిజయ మొసఁగె, నిట్టిచరితంబు లెఱిఁగినయట్టినరులు
విజితకాముల మనుమాట విడువుఁడనుచుఁ, బల్కెఁ గళిఁబల్కెఁదోఁటలఁజిల్కగములు

వ. ఇత్తెఱంగునఁ జిత్తసంభవుసామ్రాజ్యలక్ష్మీనివాసం బైనమధుమాసంబు సకలజంతుజం
పతీసంపాదితమనోవిలాసంబై భాసిల్లునంత నొక్కనాఁడు. 12

క. నరపతి యనంగవతితోఁ, వరసతులు భజింపఁ బ్రమదవనమున కరిగెన్
సురసతులు గొల్వ శచితోఁ, హరి నందనవనములోని కరిగినభంగిన్. 13

వ. అంత. 14

మ. అలరుం దేనియ నర్ఘ్యపాద్యములు పర్యాయంబుతో నిచ్చి యిం
పులు మీఱన్ విరవాదిజాదివిరులం బుష్పాంజలుల్ చేసి యు
జ్జ్వలభృంగీనినదంబులం గుశలసంప్రశ్నంబు గావించి భూ
తలనాథున్ భజియించె గంధవహుఁ డుద్యానాంతరాళంబునన్. 15

వ. ఆసమయంబున. 16

క. కాననవసంతలక్ష్మియొ, నా నుపవనపాలబాల నయవినయగతిం
గానుక తెచ్చినగుచ్ఛము, కానుక గావించె విభుఁడు కాంతామణికిన్. 17

ఉ. ఇచ్చిన నిచ్చలో నలరి యింతి దరస్మితకాంతి చెక్కులం
దచ్చుపడం బ్రసన్నవదనాంబుజయై వనపాలబాలికం
బొచ్చెము లేక రత్నమయభూషణభూషితఁ జేసి దానితో

వచ్చిక మీఱఁగా మధురమంజులభాషల నిట్లనున్. 18

సీ. ప్రోదిగాఁ బన్నీరుపోసి పెంచినకన్నెసురపొన్న యున్నదే సుందరాంగి
పాలుపోఁ బచ్చకప్పురపుబాదున నిడ్డ విరజాజి యున్నదే హరిణనయన
గొలిమిఁ గస్తురిబూదిమెదుఁగునఁ బెరిఁగినసంపెంగ యున్నదే చంద్రవదన
క్రొవ్వారుజవ్వాదికుదురునఁ బెరిఁగినచేమంతి యున్నదే కోమలాంగి
సంతతంబును బూఁదేనె జాలువాఱఁ, గమ్మగందపుముద్దలఁ గట్టవెట్టి
కాలువలు దీర్చినపసిఁడికేళకూళి, నిండి తొలఁకాడుచున్నదే నీలవేణి. 19

వ. అనిన నయ్యనంగవతీమహాదేవికిం బ్రమదవనపాలబాలికాలలామం బిట్లనియె. 20

చ. జనవరవంశవారినిధిచంద్రుఁ డనం దగుచంద్రగుప్తనం
దనుకరుణాసుధారసమునం ద్రిజగంబులు పల్లవింపఁగాఁ
బవిపడి ప్రోదిచేసి పెనుపం బెనుపొందినతోఁటలోనినా
తనలతికావలీతరువితానమునొప్పులు చెప్పనేటికిన్. 21

క. నావుడుఁ దదీయవచన, ప్రావీణ్యంబునను ధరణిపతి ప్రముదితుఁడై
యావైదర్భియుఁ దానును, గేవలలీలావనాంతకేలీరతుఁడై.

శా. లీలాశైలము లెక్కుచుం దరుణవల్లీలాస్యముల్ చూపుచున్
డోలాదోహళకేళిఁ దేలుచు మదాటోపాళిగానధ్వని
శ్రీలాలించుచుఁ గీరభాషణములం జిత్తంబులన్ మెచ్చుచుం
గాలోన్మీలితపుష్పభూరుహతతిం గైసేయుచుం జూడ్కులన్. 23

సీ. మంజరీసంజాతమకరందమధుమత్తచంచరీకద్వంద్వసంఘర్షములఁ
గోరకితానేకకోమలవల్లికావేల్లితభూజాతవిలసనముల
సహకారఫలరసాస్వాదనసంతుష్ట శుకసతీపతిరతి ప్రకటనముల
గిసలయాంకురరసగ్రసనసముత్కంఠకలకంఠవిటవిటీకలకలములఁ
గనియు వినియు వసంతసంక్రాంతరాగ, సర్వసామాన్యమహిమ కాశ్చర్యమంది
చెలి కెలంగించి కొనియాడి చెప్పిచెప్పి, ప్రమదవనకేళిఁ దేలిరి పతియు సతియు. 24

చ. అలరులు గోయుచోట నళు లాననసౌరభ మాన మూఁగినం
గలఁగుట గాంచి కొప్పుపయిఁ గమ్మనిసంపెఁగదండ సేర్చి తొ
య్యలి హృదయంబునందుఁ గుసుమాపచయవ్యసనంబు గ్రమ్మఱన్
మొలవఁగఁ జేసినన్ నృపతిముఖ్యునిఁ బ్రాఁతలు మెచ్చి రందఱున్. 25

సీ. అరవిరిపూదండ లఱుత నించెద నని యనువునఁ జనుదోయి నంటి యంటి
పుప్పొడినెర సొయ్యఁ బోవ నూఁదెద నని నయనచుంబనకేళి నడపి నడపి
చిప్పిలుపూఁదేనె జీరువాఱెడు నని పాణిపద్మము గేలఁ బట్టి పట్టి

యలిమోఁతలకు నింత యలుకంగ నే లని చిక్కనికౌఁగిటఁ జేర్చి చేర్చి
నృపకులాగ్రణి మేలపునెపము గాఁగ, నలరుబంతిఁ గళాస్థాన ఎరసి యరసి
రమణి నిబ్బంగి బహుబాహ్యరతులఁ గలఁచి, సరవి సుఖములఁ జాతుర్యసరణి మెఱసి.

ఉ. అంచనిపువ్వుగుత్తిదెసకై యఱుసాఁపఁగ నేల బాల కో
యఁగ దలఁపయ్యె నేని నెగయ న్నిను నెత్తెద నంచు సంతసం
బందఁగ నెత్తియెత్తి విభుఁ డందఱుముందఱ డించుచుండఁగా
నందినకంటె సంతసము నందె లతాంగియు మాటిమాటికిన్. 27

చ. తనరు నశోకభూరుహలతాముకుళంబుల నంతరాంతరం
బున నిడి పొన్నక్రొన్ననల భూపతి మాలిక గా నొనర్చి చూ
పిన గరువంపుఁగెంపు లెడవెట్టినమౌక్తికహారలీల నె
క్కొనఁ జనుదోయిపై నునిచెఁ గోమలి లేనగ నంకురింపఁగన్. 28

సీ. పల్లవంబులయొప్పుఁ బరికించుఁ బరికించి యబ్జాస్యకెమ్మోవి యానఁ దివురు
విరులగుత్తులమించు వినుతించు వినుతించి కామినిచనుదోయి గదియఁ గోరుఁ
గీరభాషణములఁ గీర్తించుఁ గీర్తించి యంగనసరసోక్తు లాస సేయు
నెలదీఁగెపదుదల నీక్షించు నీక్షించి రమణిమైపొందు చిత్తమున నిల్పు
నిత్తెఱంగునఁ జిత్తజాయత్తుఁ డగుచుఁ, జెలువయును దాను బూసెజ్జఁ జేరుటయును
దరుణు లొండొరుఁగనుసన్నఁ దార్చుకొనుచుఁ, జెలఁగి పుష్పాపచయకేళి చేసిరంత.

ఉ. ఆసురపొన్న నాకు నలువందెడి వేగమె పువ్వు లన్నియుం
గోసెద నన్నఁ గైకొనినకోమలిగర్వము సైఁప కాత్మలో
నీ సొదవంగఁ బెల్లు జనియింపఁగఁజేసెఁ బ్రసూనరాజి లీ
లాసరసత్వ మొప్పఁగ విలాసిని యోర్తు దరస్మితంబుచేన్. 30

క. సన్నపుఁ బల్లవములు గని, కన్నియ చనుమిట్ట లనుచుఁ గనుఁగొని ప్రాభుం
మిన్నక యుల్లసమాడెఁ, గన్నెఱికము దొరఁగెఁ జెక్కుగఱచిన దనుమన్. 31

చ. తొలఁగి నికుంజపుంజములు దూఱుచు దాఁగురుమూఁత లాడుచుం
గెలఁకులఁ జొచ్చి నిల్చినసఖీజనము న్నవకంపుఁదీఁగెలం
దెలియఁగ లేనిముగ్ధలకుఁ దెల్లమిగా నెఱిఁగించెఁ దత్సఖీ
సలలితరత్నభూషణవిశాలవిలోచనదీప్తిజాలముల్. 32

చ. బలువిడి ఫాలలోచనునిపైఁ బ్రసవాయుధుఁ డేఁగునప్పు డీ
యళులును గోకిలంబులు శుకాళియు మందసమీరణంబుఁ గెం
దలిరులు వచ్చినం గడుఁ బ్రతాపసమగ్రుఁడు గాఁడె యంచుఁ జె
ల్వలు వనవైభవస్ఫురణ వర్ణనచేసిరి కేలి సల్పుచున్. 33

చ. అరవిరజాజిగుత్తి నరుణాధరదీధితిచే నశోకవాం
జరిని ఘనస్తనప్రభలఁ జంపకగుచ్ఛము నీలకుంతల
స్ఫురణఁ దమాలకందళముఁ బోలఁగఁ జేయుచు నొక్కప్రోడ య
చ్చెరువుగ నైంద్రజాలికవిశేషముఁ జూపు సఖీజనాలికిన్. 34

చ. అలరులతోఁటలోన విరులన్నియుఁ గోసితి రంచు బోటులన్
సొలయఁగ నేల బాల యిటు చూడఁగదే తిలకావనీరుహం
బులదెస ద్రవ్వితండములు పుష్పము లున్నవి యంచుఁ బ్రోడయై
పలుకువయస్య నేర్పు గలభాషిణులెల్లను మెచ్చి రిచ్చలన్. 35

వ. ఇత్తెఱంగున మత్తకాశిను లుత్తరంగితప్రమదవనవిహారం బొనరించి చాలించి. 36

చ. చెదరినకుంతలంబులును జెక్కులఘర్మకణాంకురంబులున్
వదలినకేశపాశములు వాడిననిద్ధప్రమోముదమ్ములుం
బదనెరవైనవాతెఱలుఁ బైకొనునూర్పులు నుల్లసిల్లఁగాఁ
గదిసినయయ్యనంగవతి గాదిలిబోటులతోడ నిట్లనున్. 37

క. *అలఘుతరాంశుకజాలము, కలగొనె నభమందు ఘర్మకాలము చూడన్
జలకేలి యుచిత మనవుడు, నెలఁతుక కిట్లనిరి చెలులు నిపుణత మెఱయన్. 38

చ. లలితవళీతరంగరుచులం దరలేక్షణ మీనలోచనాం
చలవదనాంబుజద్యుతి లసత్కుచచక్రవిలాసరేఖ నే
ర్పలరెడునీతనూసరసియందు నిరంతరమున్ విహారముల్
సలిపెడురాజహంసునకు సైఁచునె తక్కినపద్మినీరతుల్. 39

ఉ. నావుడు నాననాంబుజమునన్ దరహాసము తొంగలింప ధా
త్రీవరముఖ్యుఁ డామదవతీతతి కిట్లను నింతయేల యే
నీవనజాక్షియాజ్ఞ యొకయించుక యైనను మీఱువాఁడనే
సేవకు లైనవారికి విశృంఖలవృత్తిఁ జరింపఁ గూడునే. 40

క. అని సరసవచనరచనలఁ, దనప్రియసతి నలరఁజేసి ధరణీశ్వరుఁ డా
వనితారత్నముఁ దానును, వనజాక్షులు గొలువ వనజవనమున కేఁగెన్. 41

ఆ. అంత నెదురువచ్చి యరవిందమకరంద, కలితసౌరభములు గానుకిచ్చి
యబ్జినీసమీరుఁ డమర యథోచిత, స్థితి నరేంద్రుమనసు చెలఁగఁజేసె. 42

మ. భువనాధీశ్వరుదర్శనోత్సవసుఖంబుం బొంది యానందతాం
డవముం జూపెడుభంగి నాకమలషండం బొప్పె భృంగాంగనా
రవగానంబులతో సరోజదళనేత్రశ్రీవిలాసంబుతో

---

* పా. నులివాల్గువాడుచున్నవి, లలితమహోతరుణదేహలతికలుమనకున్.

నవచిత్రాభినయోర్మిహస్తఘటనానావిలాసంబుతోన్. 43

ఉ. ఆకమలాకరంబున విహారము సల్పఁగ నుత్సహించి శో
భాకరనూత్నరత్నసముదంచితకాంచనదివ్యభూషణా
నీకములం దొలంగ నిడి నీరజలోచన లొప్పి రోలిఁ గా
రాకుల నుజ్జగించి చెలువారెడుమవ్వపుఁదీఁగెలో యనన్. 44

ఉ. ఆ నెలఁతల్ సరోజినికినై దిగునప్పుడు నూత్నరత్నసో
పానములం దదీయతనుబంధురబింబము లుల్లసిల్లెఁ దే
జోనిధియైనయానృపతిసోయగముం దరిసించువేడుకం
బూని జలాధిదేవత లపూర్వగతిం జనుదెంచిరో యనన్. 45

సీ. ఉవిద లందఱుఁ గూడి యొక్కట్టుగఁ జెలరేఁగి కరయంత్రధారలఁ గప్పికప్పి
జలములో మునిఁగినసఖులయిక్కలెఱింగి సలిలంబులోఁ దేలి సలిపిసలిపి
పంచపట్టుల నిల్చి పడఁతు లొండొరులతో నలవునఁ జల్లుఁబో రాడియాడి
సలిలకేలికి నోడి చనుభీరువును బట్టి జలజపరాగంబు చల్లిచల్లి
యొసర నొండొరుభుజము చేనూఁదియూఁది, సరసగతులను జెలఁగి మత్సరము లొర్చి
కినిసి తొడరినయింతుల గెలిచి గెలిచి, జలవిహారము సలిపిరి సంతసమున. 46

చ. మృగమదపంకిలాంగు లొకమే నొకమే ఘనసారచందన
స్థగితలు నైనకామినులు చాటిగ నొండొరుఁ జల్లియాడుచో
సగమున నల్పుదెల్పు లగుచాయలు గెందఁ గళిందకన్యకా
గగననదీసమాగమముకైవడిఁ బద్మిని యొప్పె నత్తఱిన్. 47

చ. నెలఁతలు కంఠదఘ్న మగునీర విహార మొనర్ప నిల్చినం
గొలను తదాననస్ఫురణఁ గ్రొత్తమెఱుంగు వహించెఁ బెక్కుత్రి
ప్పులఁబడి యొక్కచంద్రుని నపూర్వముగాఁ గను టెంత యంచు నా
జలనిధి గెంచి లీల బహుచంద్రులఁ దా నొనరించెనో యనన్. 48

క. చందనము సలిలకేలిని, బొందెడలినయొక్కయింతి ప్రౌఢతనమునం
గందర్పముద్ర లుండెడు, కందువలకు మాటు సేసెఁ గచనిచయంబున్. 49

ఆ. సలిలకేలి సల్పుచాములమోములు, కమలసమితి యనుచుఁ గదిసియలులు
కురులసిరులు చూచి కొన్ని తేఁటులు మున్ను, మూఁగి యున్నవనుచు మొగినిజనియె.

తే. ఆననాంబుజసౌరభ మానునలుఁ, జోపనేరక సఖులలోఁ జొచ్చి నీట
మునిఁగి యవి వారిమోముల ముసురుకొనిన, నవ్వుచును లేచి యొక్కతె నవ్వుచుండె.

ఉ. అంత మహీవిభుండును బ్రియాంగనయుక్ స్వకరావలంబనా
నంతసుఖానురక్తులయి యబ్జిని డగ్గఱఁ దత్కరంబుల

త్యంతము రోమహర్షణసమగ్రత నైకొని నాథుఁడండ వి
క్రాంతి సరోరుహద్వయవికాసవిలాసముఁ జూచె నత్తఱిన్. 52
ఆ. జలముమీఁద నీఁదుసర్వంసహాకాంత, కెలమి మూఁపుఁ దెప్ప యిచ్చినట్లు
జలముమీఁద నీఁదుజలజాతనేత్రకు, నెలమి మూఁపుఁ దెప్ప యిచ్చె విభుఁడు. 53
చ. బిసములపేరులున్ సలిలబిందులకర్ణికలుం జెలంగఁగాఁ
బసిమి మెఱుంగుగాఁగ నవపద్మపరాగము చెందిరంబుగా
లసితపరాగకేసరకలాపసమగ్రత చిన్నిపువ్వుగాఁ
బొసఁగ నమర్చి నూతనవిభూషణఁ జేసెఁ బ్రియుండు ప్రేయసిన్. 54
చ. కరమనురక్తి భూవిభుఁడు కంజదళాయతచారునేత్రపైఁ
బోరిఁబోరిఁ జల్లునీట మయిపూఁత గరంగినఁ జన్నుదోయిపై
నరుసుగఁ గామముద్రలు బయల్పడకుండఁగఁ గప్పె ధారణీ
శ్వరకరనిర్గళత్సలిలసాంద్రసరోజసమాజపత్త్రముల్. 55
చ. అరవిరిదమ్మిఱేకుల నయంబున మైఁ గబళించి యొండొరుల్
పరిపడఁ జల్లులాడునెడఁ జంద్రనిభానన లెల్లఁ జల్లు భా
స్వరశతపత్త్రజాతములు చాల శరీరముఁ బొందిన న్మనో
హరరుచిఁ జూచె భూపతి సహస్రవిలోచనుఁ గ్రేణిసేయుచున్. 56
శా. రాజేంద్రుండు విదర్భరాజతనయారత్నంబుఁ బెన్నుద్దులై
రాజీవాక్షుల నుద్దులుంచుకొని నీరం జల్లుఁబోరాడుచో
రాజీవాకర మొప్పె వాసవశచీరంభాదిదివ్యాంగనా
రాజత్ఖేలన ఘూర్ణమానఖగునీప్రాకామ్యముం బూనుచున్. 57
వ. అయ్యవసరంబున. 58
సీ. రాజాపంపున నొక్కరాము వైదర్భిపైఁ గరయంత్రధారోదకంబు గురిసె
నద్దేవికనుసన్న మద్దియయొక్కర్తు జననాథుపై నించెఁ జల్లునీరు
రమణునియానతి రమణి డగ్గఱి యొకర్తు తమ్మిపుప్పొడిఁ దాను నెమ్మిఁ జల్లె
నయ్యంగవతీకరాబ్జసంజ్ఞ నొకర్తు కువలయాధిపు వైచెఁ గువలయముల
వరుఁడు నీలోత్పలంబుల వైవ నవతి, హల్లకంబుల వైచెఁ దా నాత్మవిభుని
గాంతలును దాను నిబ్భంగి గలసి మెలసి, వనజవనకేళి యొనరించి తనివిఁ బొందె. 59
క. శ్రీరమణీమణిఁ గైకొని, క్షీరాంబుధి వెడలుగరుడకేతనుభంగిన్
నీరజలోచనఁ దోకొని, నీరజషండంబు వెడలె నృపవరుఁ డంతన్. 60
సీ. అళికభాగంబున నంటినకురులతోఁ గరఁగినయంగరాగములతోడ
నరుణిమ వాసినయధరబింబముతోడ దీపించుమదనముద్రికలతోడ,

దళ మైనమవ్వంపుఁబులకాంకురములతోఁ జూపుల ననుఁగెంపు సొబగుతోడఁ
జెదరినమకరికాచిత్రపత్త్రికలతోఁ బరఁగెడునూర్పుఁదెమ్మెరలతోడఁ
దొడల జెడఁగారుసనువల్వతోడ నప్డు, రతికళాసించివచ్చినరమణ మెఱయఁ
గొలను వెలువడి వచ్చి రాజలజముఖులు, వసుమతీనాయకానంగవతుల బలసి. 61

క. చీనాంబరమణిభూషణ, నానాగంధానులేపనవమాల్యముల౯
మానినులును వైదర్భియు, మానుగఁ గై సేసికొనిరి మచ్చరికములన్. 62

చ. అనుపమగత్నభూషణసమంచితవస్త్రముల౯ సుగంధచం
దనవికచప్రసూనములఁ దద్దయు నేర్పలరం బ్రసాధికా
జనము లలంకరించినఁ బ్రసన్నవిలాసవిభాసమానుఁడై
మనుజవరేణ్యుఁ డొప్పె శివుపన్నినఁ గన్నరతీశుఁడో యనన్, 63

క. సమయజ్ఞతఁ బొడసూపిన, సముచితపరివారవందిజనబృందములుం
బ్రమదలుఁ గొలువఁగ భూపతి, ప్రమదముతో నరిగె నాత్మభవనంబునకున్. 64

వ. ఇత్తెఱంగున నవీనచిత్తానందంబున విదర్భరాజతనయాలీలాలాలనంబునఁ జతురుదధివలయవలయితవసుమతీపరిపాలనంబు ఖేలనంబుగాఁ బ్రవర్తిల్లుచు నుల్లసిల్ల సకలమనీషావిశేషపరిగ్రహణచాతురీధురంధరుండై యవ్వసుంధరాధిపసింధురుండు సర్వేశ్వరీప్రసాదాసాదితసామ్రాజ్య నియమితవత్సరసహస్రద్విగుణీకగణపరిణతం బగుసుమతిసుతునిమతంబునం బ్రతివత్సరంబు నాఱేసినెల లన్యదేశపర్యటనం బనుసంధించుతలంపున యోగీశ్వరవేషధరుం డై దివ్యపాదుకాపాదితస్వైరసంచారంబువలనను యోగదండ ప్రకాండప్రకల్పనానల్పనానానగరకల్పనావిహారంబులవలనను విచిత్రమణిపాత్రికాసంజాతసరసాన్నసముచితాభ్యవహారంబులవలనను దుకూలకంథానిష్క్రాంతనిష్కావళీకృతపరోపకారంబులవలనను విచిత్రంబు లగునమానుషచరిత్రంబులం బ్రవర్తిల్లునప్పుడు. 65

సీ. స్తంభనమోహనోచ్చాటనాకర్షణమారణోద్వేజనోన్మాదనములు
వాదవయస్స్తంభవశ్యపురక్షోభ గజకరణాదృశ్యకరణములును
బహుపక్షిమృగముఖ్యబహురూపధారణావిధిపరకాయప్రవేశములును
సర్వాంజనమహేంద్రజాలమాయోపాయమణిమంత్రతంత్రసామగ్ర్యములును
ద్వీపదుర్గాదిదుర్గప్రదీపనములు, నమృతకరభాస్కరోదయవ్యత్యయములు
సకలజంతుభాషాపరిజ్ఞానములును, నాదిగాఁ గలవిద్యల నతిశయిల్లి. 66

క. ఒక్కొకమరి తనయంతన, యొక్కొకమరి సుమతిసూతియుం దానును నై
యెక్కడ నభిమత మైనను, నక్కడ విహరించుచుండు నాఱేసినెలల్. 67

తే. అంత నొకనాఁడు లోకవృత్తాంత మరసి, యరుగుదెంచినవారలయందు నొకఁడు

తాను గనినట్టిచోద్యంబు ధరణిపతికి, వినయ మెసఁగంగ నిట్లని విన్నవించె. 68

క. దేవరపనుపున నేఁ జని, భూవలయము దిరిగి యొకయపూర్వము గంటిం
బావనగతిఁ బ్రవహించును, దైవతనది చిత్రకూటధరశృంగమునన్. 69

తే. సజ్జనంబులు సద్భక్తి మజ్జనములు, సేయ నన్నీరు పన్నీరుచెలువు నొందు
సుకృతహీనులతనువులు సోఁకెనేని, కజ్జలముభావమున నొందుఁ దజ్జలంబు. 70

ఆ. అన్నగంబుపొంతఁ బన్నగాభరణుని, నిలయ మొప్పు వప్రవలయ మొప్ప
గోపురంబుతోడ నేపున రాపాను, గోపురంబుతోడఁ గొమరుమిగిలి. 71

తే. తత్సమీపకాననభూమిఁ దపసియొకఁడు, కలఁడు మౌనవ్రతుండు నాఁ గణఁక మెఱసి
వెదలుసల్లినభస్మంబు వెండికొండ, బోలె నపరిమాణోన్నతిఁ బొలుపుమిగిలె. 72

తే. ఎంతగాలంబు గలదొ ము న్నింక నెంత, కాల మొనరింపఁగలవాఁడొ కణఁగియుపుడు
సలుపుచున్నాఁడు హోమంబు చలముపట్టి, యతనికోరిక లెవ్వరు నరయ రధిప. 73

చ. అన విని విక్రమార్కవిభుఁ డప్పుడు చారుఁడు మున్నుగాఁగ వే
చని కనియెన్ సమాధిగతసంయమిగత్నవినూత్నపేటమున్
ఘనమదహస్తిహస్తపరికంపితసానుగతాగవాటముం
గనదురుగత్న వచ్ఛఖరక్రమకిరీటముఁ జిత్రకూటమున్. 74

క. కని తద్గిరివిశ్రుతవా, రి నియతి సుస్నానము నొనరించి మహాదే
వునిగుడి కరిగి వినతుఁడై, చనె హోమనివాసమునకు సమ్మతితోడన్. 75

క. చని యమ్మునివరు నడిగిన, ననుపమ మగుమౌన ముడిగి యతఁ డిట్లని చె
ప్పెను బెద్దగాలమును నే, నొనరించెద ననుగుణించి హోమం బనఘా. 76

క. నాకోర్కె యొసఁగ దిప్పుడు, నాకోరిక యొసఁగుదనుక నడపుదు హోమం
బీకరణిఁ బ్రతిదినంబును, జేకొని మనుసిక్త మైనశ్రీఫలసమితిన్. 77

ఆ. అనిన సాహసాంకుఁ డంబిక నెల్లని, ప్రముదితాత్మఁ జేయఁ బ్రతినవట్టి
మనునిషిక్త మైనమాలూరసత్ఫల, వితతిఁ దాను నట్ల వేల్వఁ దొణఁగె. 78

క. అత్యంతనియతి వేల్చినఁ, బ్రత్యక్షము గాక యున్నఁ బ్రార్థివుఁడు శిరం
బత్యాశ్చర్యము గాఁ గొని, ప్రత్యయమతి వేల్చి వరమువడయుదు ననుచున్. 79

చ. అడిదము కేలఁ బూని మెడయం దొడఁగూర్చిన దేవి వచ్చి యా
ప్పుడ వెసఁ జేత నున్నయసి పుచ్చి మదిం గడుమెచ్చి యేవరం
బడిగిన నిత్తు నీ వడుగు మన్నఁ గరంబులు మోడ్చి భక్తి యే
ర్పడఁ బ్రణమిల్లి యిట్లనియెఁ బార్థివుఁ డాజగదేకమాతతోన్. 80

క. వర మీవచ్చితి నా కిటు, పరమేశ్వరి నిమిషమాత్రఁ బ్రత్యక్షంబై
వర మొసఁగవు పోడనూపవు, చిరకాలం బితఁడు తపము సేయుచు నుండన్. 81

తే. ఏమికారణ మానతియిమ్ము నాకు, ననిన నంబిక యిట్లను నతనితోడ
నేకభావంబు నాపయి నింతలేదు, జపవిధాన మెఱుంగక జప మొనర్చు. 82

క. మనసాం దైవజపంబును, మునివ్రేళ్లనె యెన్ను జపము మును మేనవిలం
ఘన మొనరించుజపంబును, మునుకొని లెక్కిడనిజపము ముఖ్యం బగునే. 83

వ. అదియునుం గాక. 84

క. దేవుండు లేమి కలిమియు, భావింపఁగ రాదు కనకపాషాణములన్
భావమున నునికి సిద్ధము, గావున భావంబు ప్రథమకారణ మనఘా. 85

క. చిత్తంబు పాపసహితం, బెత్తెఱఁగున నిత్తు నితని కీప్సితఫలముల్
రిత్తకు రిత్త ఫలించునె, యుత్తమఫలసిద్ధి భావ మొందనిక్రియలన్. 86

క. నీసాహసనియతికి వి, శ్వాసమునకు నిచ్చ మెచ్చి వర మిచ్చెద నీ
వాసక్తి నెద్ది వేఁడినఁ. జేసెద నిష్టార్థసిద్ధి చేసెద నీకున్. 87

వ. అనినం బరమదయాలవాలుండును విశిష్టధర్మశీలుండును నైనవిక్రమార్కమహీపాలుం
డద్దేవి నుద్దేశించి యిట్లనియె. 88

ఉ. ఈముని యింతగాలమును నిష్ఠితపం బొనరించుచున్నవాఁ
డేమివరంబు గోరియొ మహేశ్వరి యవ్విధ మిమ్మహీసుర
గ్రామణి కిమ్ము నా కిది వరం బని వేఁడిన నట్ల చేసి యా
భూవిభు వీడుకొల్పి గిరిపుత్త్రి యదృశ్యత నొందె నత్తఱిన్. 89

ఆ. ఇట్టిసాహసంబు నిట్టియౌదార్యంబు, గలుగువున్నఁ గలదె గరిమ యనుచుఁ
బ్రజలు ప్రస్తుతింప నిజరాజధానికి, నుచితలీల నరిగి యొక్కనాఁడు. 90

చ. చిరతరకీర్తి యానృపతిశేఖరుఁ డంచితభక్తియుక్తిసో
వరరుచిఁ జూచి యిట్లనియె వైదికలౌకికధర్మవైభవా
కరుఁడవు సర్వతోముఖముఖప్రముఖంబు లనేకయాగముల్
వరుస నొనర్చితీ వుభయవంశములున్ నుతికెక్కునట్లుగన్. 91

క. మనుజాధీశకులోచిత, మనఁ బరఁగినయశ్వమేధ యాగం బది నే
నొనరించెదఁ దదుపక్రమ, మనఘా యెఱిఁగింపు మనిన నతఁ డిట్లనియెన్. 92

సీ. కాంచనమయములుగా స్రుక్స్రువాదికయజ్ఞసాధనముల నలవరించి
సకలభవ్యద్రవ్యసంపాదనమునకు హితుల నియోగింపు మతులగతుల
శాస్త్రోక్తమతమున సంఘటింపఁగఁ బంపు మతిపవిత్రస్థలి యజ్ఞశాల
షట్కర్మనిర్వాహచాతురీఖని యైనయాజ్ఞికుచేత ననుజ్ఞ వడయు
మర్హలక్షణసంపన్న మైనహయము, భూప్రదక్షిణసంచారమునకుఁ బంపు
భట్టిఁ దద్రక్షణమునకుఁ బాలుపఱుపు, వలయు దేశాల మునులను బిలువఁ బనుపు. 93

వ. మఱియు నలయుచితకరణీయంబులకుఁ దత్తద్విధిజ్ఞుల నాజ్ఞాపింపు మని పనిచినం దదనుజ్ఞాపూర్వకంబుగా సర్వంబునకు నిర్వాహకుల నియమించి యజ్ఞయజనదివసంబు భావించి చైత్రపూర్ణిమాసిగా నిర్ణయించి దీక్షితుండై సుపరీక్షితం బైనయుత్తమాశ్వంబునకు నుచితోపచారంబు లొనరించి దిగంతంబుల సంచారపూతంబులుగా ననుగ్రహించి చనుదెమ్మని ప్రార్థించి యాంగికంబు లైనశుభసూచకంబు లంగీకరించి ప్రమోదాంతరంగుండై భట్టి నవలోకించి. 94

చ. హితుఁడవు కార్యఖడ్గముల కెంతయు మేటివి సర్వశాస్త్రస
మ్మతచరితుండ వార్యుఁడ వమానుషకీర్తివి నాకు శోభనా
న్వితమగుచారుకీర్తు లొదవింపఁగఁ గర్తవు నీవె యంచుఁ ద
త్క్రతుహయరక్షకుం బనిచెఁ గర్మవిధేయుని సోముతేయునిన్. 95

చ. పనిచిన సర్వసన్నహనబంధురుఁడై చనుదెంచి యాతఁడ
జ్జనపతికి న్నమస్కృతి ప్రసన్నతమై నొనరించి నిల్చి యా
జనచరితార్థవిప్రవరసంఘముతోడఁ దదేకనిష్ఠమై
వెడలిన నాహయంబు పృథివీవలయభ్రమణాభిలాషియై. 96

వ. నిర్గమించినకతిపయదివసంబులకు సుమతిసుతసమీపంబున నుండి యొక్కజంఘాలుండు చనుదెంచి పురోపకంఠలీలావనభూమియందు సబలంబుగ నిల్చి భవత్ప్రధానుం డున్నవాఁ డుర్వీశ్వరా తత్పరాక్రమానుసరణత చెప్పం జిత్రం బని యిట్లనియె. 97

సీ. సౌవీరభూపతి శరణుచొచ్చినఁ గాచె గాంధారరాజుచేఁ గప్పముందెఁ
గుంతలాధిపుకూర్మిసుతులఁ గొనివచ్చె సౌరాష్ట్రవిభునిచేఁ బేరుగొనియెఁ
బాంచాలభూపాలుఁ బ్రతికోపితునిఁజేసెఁ గేరళాధిపుసూను గిఱువు గట్టె
యవనక్షమానాథు నాజ్ఞావశునిఁజేసె సంగక్షితీశున కభయమిచ్చె
జయముగైకొన్నపిదప నాసకలనృపుల, నుచితసంభాషణములచే నూఱడించి
యజ్ఞవేళకు రమ్మని యానతిచ్చి, నిగ్రహానుగ్రహక్రియానిపుణుఁ డగుచు. 98

చ. ధనదదిశామహీశ్వరవితానముచేత నుపాయనంబుగాఁ
గొనినవినూత్నరత్నఘనకుంజరఘోటకహారకామినీ
జనకనకాంబరామల నసంఖ్యములం గొనివచ్చినాఁడు పెం
పెనయఁగ నన్యభూపతుల కిట్టిప్రధానులు గల్గ నేర్తురే. 99

సీ. సవనాశ్వరక్షకై సగరనందను లేఁగి కపిలుకోపంబుచే గాసియైరి
క్రతుహయఘనరక్షకర్తయై సౌమిత్రి కుశునిచేఁ దమ్ముని గోలుపడియె
యజనాశ్వరక్షకుం డయి దిలీపసుతుండు వాసవుకుటిలత మోసపోయెఁ
బార్థుఁ డధ్వరహరిపరిపాలనము సేయఁ జని తనూజునిచేతఁ జచ్చిపుట్టె

సరసిఁ జూడంగ నౌరులు నిరంతరాయ, సప్తతంతుతురంగసంచరణకరణ
బహులతరకార్యలంపటబాహుశక్తి, భట్టిఁ బోలంగ నేర్తురే పార్థివేంద్ర. 100

తే. అనిన రోమాంచకంచుకితాంగుఁ డగుచు, నెమ్మనంబునఁ బ్రమదంబు నివ్వటిల్లఁ
గనకమణిభూషణాదులు గట్టనిచ్చి, జాంఘికునిపైఁ గటాక్షవీక్షణము నిగుడ. 101

ఉ. అమ్మఱునాఁడు దంతితురగాదిసమస్తవరూథినీవితా
నమ్ము భజింపఁగా మనుజనాథవరుం డెదురేఁగెఁ బేర్మి నె
య్యమ్ము మనమ్మునం బెరుఁగ నాసుమతిప్రియకారికిన్ జగ
త్సమ్మతసర్వలక్షణసుసమ్మతమేధ్యహయానుపాలికిన్. 102

వ. భట్టియు సాహసాంకునిపాదంబులకు భక్తియుక్తంబుగాఁ బ్రణమిల్లి మఱియుం దగు
వారలకెల్లను సముచితోపచారంబులు నడపి తదనంతరంబ. 103

క. పురజనులెల్లను బ్రమద, స్ఫురణంబున సేస లొలుకుచుం దనుఁ జూడం
దురగానుచరణనియమా, చరణుండై యతఁడు యజ్ఞశాలకుఁ జనియన్. 104

క. చని జనపతి తనకూర్చిన, జనవినుతమఖోపకరణసామగ్రి ప్రియం
బున వేఱువేఱ చూపఁగ, ననురాగముఁ బొంది భట్టి యద్భుతమతియై. 105

వ. అంత మధుమాసపూర్ణమాసి యాసన్నం బగుటయు. 106

క. తమలో నొండొరు మెచ్చక, సమధికవైభవసమగ్రసామ్రాజ్యరమా
రమణీయు లగుచు వచ్చిరి, సమధికశృంగారులైనజగతీనాథుల్. 107

శా. వారలకెల్ల నమ్మనుజవల్లభుఁ డాసనపాద్యముఖ్యస
త్కారములన్ సముజ్జ్వలదగారములన్ రసవచ్చతుర్విధా
హారములన్ రయం బొసఁగునట్టులుగా నియమించె విశ్వధా
త్రీరమణీశవర్ణితమతిం దనమామ విదర్భభూపతిన్. 108

క. పరమజ్ఞాననిరూఢులుఁ, బరమతపోవర్ధితప్రభావులు నగుభూ
సురముఖ్యులు మునిముఖ్యులు, నరుదెంచిరి యజనదర్శనాపేక్షితులై. 109

క. పరమాదరమున వారల, తరతమభావంబు లెఱిఁగి తగఁ బూజింపన్
వరరుచిమాతామహునిం, బరహితమతి విష్ణుశర్మఁ బ్రార్థన చేసెన్. 110

వ. మఱియుఁ బ్రతివాసరసమాగతులైనవారికెల్లనుల్లంబులు పల్లవింప నుచితోపచారంబు
లొనరించుచు నొక్కనాఁడు సకలసేనాధీశ్వరసంయమీశ్వరమంత్రిసామంతపురోహి
తపరివృతుండై పేరోలగం బున్నయవసరంబునం దదీయప్రాణబంధు వయినసుధాసిం
ధువుం బిలువం బోయినహితామాత్యుం డగుమహీసురోత్తముండు చనుదెంచి యన్న
రేంద్రున కిట్లనియె. 111

చ. నరవర యేను మీపనుపునం జని కంటిఁ బయోనిధానముం

దరళతరంగతుంగకరతాడనజాతనవీనఫేనముం
గరిమకరోగ్రతుండశతఖండితశైవలహీనమీనముక్
ఖరకరబాడబానలశిఖాతతిదీధితిదిగ్వితానమున్. 112

సీ. లక్ష్మీసముత్పత్తి లావణ్యసంపత్తి గోత్రరక్షణవృత్తిఁ గొమరుమిగిలి
కవిరంజనాసక్తి ఘనరసోదయయుక్తిఁ బూర్వాపరవ్యక్తిఁ బోలుపుమిగిలి
పటుసత్త్వవిస్ఫూర్తి బంధురతరకీర్తి గంభీరతాపూర్తి గరిమకెక్కి
వాహినీశఖ్యాతి వరరత్నమయభూతిఁ బురుషోత్తమప్రీతిఁ బొగడువడసి
త్రిజగదానందకరకళాదీప్యమాన, రాజసందర్శనోత్సవరసనిరూఢి
నతిశయల్లెడునీకు నయ్యంబునిధికి, మహితసద్గుణసమితిమై మైత్రి యొనరు. 113

వ. ఈదృశాభిరామగుణరత్నాకరుం డైనరత్నాకరుండు భవదశ్వమేధయజనారంభంబున కుం బ్రియం బంది నన్ను సముచితసత్కారంబులం దనిపి యీదివ్యమణిచతుష్టయంబు నాకుం జూపి యిట్లనియె. 114

సీ. ఇది యధ్వరమునకు నిష్టాన్నపానాదు లవ్వారిగా నిచ్చు నద్భుతముగ
నిది యాగరక్షకు మదదంతిహయముఖ చతురంగబలముల సంఘటించు
నిది యజ్ఞదక్షిణ పొదలించునట్లుగా నప్రమేయధనంబు లావహించు
నిది మఖాగతులకు నీఁదగియెడునూత్న బహురత్నభూషణాంబరము లొసఁగు
ననుచు నీనాల్గుమణులను నంబురాశి, పావడంబుగ నాచేతఁ బనిచె మీకుఁ
దాను వచ్చినయట్లుగాఁ దలఁపు మనుచు, విన్నపము సేయుమనుచును వేడ్కతోడ.

క. అని పురుషార్థచతుష్టయ, మన నొప్పెడుమణిచతుష్టయము నిచ్చుటయుఁ
మనుజాధిపుఁ డావిప్రునిఁ, గనుగొని యిట్లనియె వినయగౌరవ మెసఁగన్. 116

ఉ. అప్రతిమానలీల నొకయాగము నీవును నాచరింపు లో
కప్రథమానకీర్తి యెసకంబుగఁ గైకొనుమంచు నిచ్చె న
వ్విప్రకులాగ్రగణ్యునకు విశ్రుతపుణ్యునకుం గృపావిశే
షప్రతిపత్తితో నమృతసాగరదత్తవినూత్నరత్నముల్. 117

క. ఇచ్చిన మునులును నృపతులు, నిచ్చలఁ గడు మెచ్చి మెచ్చి యీయౌదార్యం
బెచ్చటను వినఁగఁ జూడఁగ, నచ్చెరు వని ప్రస్తుతించి రాసమయమునన్. 118

వ. అనవరతాహూయమానాగ్నిభట్టారకుం డైనవరరుచిభట్టారకుండు చనుదెంచి యజనావ సరం బాసన్నం బగుటయుఁ బ్రసంగించి శకాంతకునకు నిట్లనియె. 119

సీ. మున్ను నీభండారమున నున్నబహురత్నకాంచనావళు లసంఖ్యములు గలవు
సతతంబుఁ గంథానుసంధీయమానంబు లగుమాడలు గణింప నలవి గాదు
నృపులచే భట్టి కానికలు దెచ్చినసొమ్ము కొలఁది యెవ్వరికి వాక్రువ్వ రాదు

తగనేత్రములను చింతామణి చేతులఁ బరుసవేదియు నుండు సిరులఁ బెనుప
నీవు జగదేకదానదీక్షావిధాన, గురుఁడ వటు గాన వేదోక్తసరణికంటెఁ
బదియుఱుంగులు దక్షిణ లొదవ నిచ్చి, మేదినీనాథ దాశాశ్వమేధ వగుము. 120

ఆ. అన్నయన్న పలుకు లన్నియు గురుమంత్ర, సరణి నాత్మ నునిచి సాహసాంక
మనుజనాయకుండు మఱునాఁటిపున్నము, జన్నమునకు దొడఁగె సముచితముగ. 121

ఆ. అమరగురుసమాను లైనయాజ్ఞికముఖ్యు, లఖిలసత్క్రియలును నాచరింప
నవభృథంబు సారక యంకురితంబునై, యతిశయిల్లె నమ్మహాధ్వరంబు. 122

క. అనలుఁడు ప్రవర్గ్యవేళను, ఘనదీప్తులతోడ నూర్ధ్వగతిఁ గనుపట్టెన్
మనుజేశ్వరునధ్వరమునఁ, దనహృదయం జలగ మిన్ను దాఁకినభంగిన్. 123

సీ. అమృతోపమానంబు లైనయన్నంబులు కడిమాడ సేయంగఁ గుడుచువారు
బహుధనధాన్యసంపదలసొంపువహించి పేదరిక్కకిని బొమ్మ వెట్టువారు
వరరత్నభూషణాంబరసమగ్రత మించి ప్రతిఁ బ్రొద్దొకవన్నె పెట్టువారు
నాచంద్రతారార్క మైననిర్వాహముల్ గాంచి యుల్లము పల్లవించువారుఁ
గోటికలకంటె సాహస్రగుణితఫలముఁ, బొరసి యవ్విభు వెయినోళ్లఁ బొగడువారుఁ
గాని మిన్నక యుండెడుమానవుండు, మందునకునైన లేఁడు తన్మఖమునందు. 124

చ. వసమలగంగ భూసురసమాజము కోటి ఘటించనేని క్రం
గనఁ దనుఁదాన హోమయుజయాఘుంటిక నన్నిఘువాసరంబులం
దొనర నిమేషమాత్రమును నూఁకయుండక హోమయుండె స
న్మునిజనకోటి నివ్వెర మునుంగ నమందరవంబు నింపునన్. 125

ఉ. ఏచినవాఙ్మయప్రతిభ లెంతయుఁ జిత్రముగా నధీతిబో
ధాచరణప్రచారణసదర్థముగా శ్రుతిశాస్త్రిముఖ్యవి
ద్యాచతురత్వముల్ మెఱయునట్టిమహాత్ముల కాని యుక్త్వనిం
జూచిన నల్పమానవుఁడు నున్న తదీయసదస్యకోటిలోన్. 126

క. సురుచిరమై యష్టాదశ, కరమితమై పసిఁడియిట్టికల నిర్మితమై
యరయఁ జతుస్సీత్యంబై, గరుడాకృతి వేది యొప్పెఁ గడు నద్భుతమై. 127

వ. విధ్యుక్తప్రకారంబుగా మేధ్యాశ్వబంధన బంధురం బైనయూపంబుచుట్టును ఖాదిరంబులుం బాలాశంబులు బైల్వంబులుం గా నాఱేసియు దేవదారుమయంబులు రెండును శ్లేష్మాతకవిరచితం బొక్కటియునుం గా నేకోత్తరవింశతి యూపంబులు నలంకారార్థంబుగా ననేకశాతకుంభయూపంబులుం బ్రతిష్ఠించి యందు జలచరశతంబునుం బక్షిశతంబునుం జతుశ్చరణశతంబునుం గా మున్నూఱుపశువుల నమర్చి తద్విశసనానంతరంబున నశ్వాలంభనం బొనరించి తదీయంబు లగుమాంసంబులలోనం దత్తద్దేవతా ప్రియ

కరంబు లైనయూహుతులు గావించునప్పు డనంగవతీమహాదేవిచేత నర్హంబు లగుహు
తంబులు సేయించి పరిశిష్టంబు లగునవయవంబులు ఋత్విజులు యథోక్తహుతంబులు
గావించిరి. తదీయమహాసుగంధంబు ఘ్రాణతర్పణంబు గావించి శీలవతీసుతుండు సమ
స్తసదస్యయుతుండై యుచ్చైర్ఘననాదం బగునాశీర్వాదంబు చేసె. తదనంతరంబ సా
హసాంకమహీవల్లభుండు. 128

క. ఆక్షీణదానలీలా, దక్షుండై ఋత్విజులకు దశగుణితముగా
దక్షిణ లొసఁగెను నుత్తము, పక్షమున దశాశ్వమేధఫలసంప్రతతన్. 129

క. హాటకములు దక్షిణగాఁ, గోటానఁగోటు లొసఁగి కుంభినియెల్లం
బాటించి ధారవోసెను హాటకగర్భప్రభావుఁ డగువరరుచికిన్. 130

వ. అంతఁ దమ్మహీదానప్రతిగ్రహానంతరంబున నమ్మహీకాంతున కిట్లనియె. 131

ఉ. దానఘనుండ వౌట మనుదక్షిణగా ధరయెల్ల నిచ్చి తీ
వేనది విప్రవర్గమున కిచ్చితి నీవు భుజాగ్రపీఠికం
బూని ధరింమభూతలము భూసురకోటి ధరింప నేర్చునే
యేనుఁగుపల్లనం బిడిన నేడికకున్ వశమే వహింపఁగన్. 132

శా. ఉర్వీమూలము కోటికోటులు ధనం బొప్పించి విప్రాళిచే
సర్వక్షోణియు నీవు గైకొనుట కర్హం బన్న నాయన్నయం
తర్వాణిత్వము మెచ్చి భూవిభుఁడు తద్వాక్యంబు చెల్లించి ముక్
"గుర్వాజ్ఞాం ప్రతిపాలయే" త్తనెడి పల్కుల్ బుద్ధిఁ గీలించుచున్. 133

ఉ. చిత్రతరంబు లైనయవశిష్టధనంబులు రాగమంజరీ
పుత్రుఁడు సత్కృపామహిమఁ బూనినచూపులఁ జూచి దానవై
చిత్రి యెలర్ప నిచ్చుటయుఁ జిత్తములం బ్రియమంది బ్రాహ్మణ
క్షత్రియవైశ్యశూద్రు లొగిఁ గైకొని మోచిరి ద్రవ్యితండముల్. 134

వ. అనంతరంబ యవభృథాభిషేకనిరతిశయతేజోవిరాజితుండై యారాజశేఖరుం డాత్మీ
యమందిరంబుఁ బ్రవేశించి యాస్థానమండపాభ్యంతరంబున నిరంతరమణిమరీచి విలస
దున్నతద్వాత్రింశత్సాలభంజికారంజితం బైనదివ్యసింహాసనంబున నాసీనుండై సముచిత
సంభావనాపూర్వకంబుగా సర్వసంయమిద్విజసర్వంసహాధీశ్వరుల నిజస్థానంబులకుం
జన నియమించి. 135

ఆ. వితరణంబుగని వివేకంబుకందువ, సత్యశౌచములకు జన్మభూమి
సాహసంబు నెలవు శౌర్యంబుపాదవు నా, విక్రమార్కవిభుఁడు వినుతికెక్కె. 136

క. సజ్జనపరితోషకుఁడు జ, గజ్జనజనకుండు శత్రుగణకంఠాస్ప్ర
ద్యజ్జనకాంక్షేయుఁడునై, యుజ్జయనీనగర మేలుచుండెను గడిమిన్. 137

వ. అట్లుండి. 138

శా. ఆభూపాలకుఁ డొక్కనాఁడు మృగయావ్యాపారలీలాగతిన్
శోభాబంధురవాహవారణరథస్తోమంబు దుర్గాటవీ
క్షోభంబుం బొనరింపఁగా మెలఁగ నచ్చో నొక్కచో నొంటిమై
నాభీలం బగుదంష్ట్రివెంట నట డయ్యం బాఱి శ్రాన్తాంగుఁడై. 139

క. ఘనవటవిటపిచ్ఛాయను, జనపతి శయనించి యున్న సమయమున జగ
జ్జనసుతుఁడు దేవదత్తుం, డనుభూసురవర్యుఁ డొక్కఁ డతనిం గాంచెన్. 140

తే. కాంచి యవ్విభుతనుపరిక్లాంతి యెఱిఁగి, చేతికుండికాజలముల సేదఁదేర్చి
యాత్మపురమున కేతేర నవధరింపు, మండలాధీశ యొంటిమై నుండ నేల. 141

చ. అనినఁ బ్రమోద మంది వసుధామరవర్యునిఁ గూడి విక్రమా
ర్కనృపవరేణ్యుఁ డాత్మనగరంబునకుం జనియెన్ ద్విజుండునుం
దనసదనంబుచేరెఁ బ్రమదంబున నమ్మఱునాఁడు పిల్చి య
జ్జనపతి దేవదత్తునకు సమ్మతి నిచ్చెఁ బురోహితత్వమున్. 142

వ. ఇచ్చి యొక్కనాఁడు. 143

తే. కలయఁగాఁ జూచి కొల్వులోఁ గల్గువారు, వినఁగ దేవదత్తుఁడు మున్న విపినభూమిఁ
గోరి నాకుఁ జేసినయుపకారమునకు, మాఱు సేయ నెన్నఁడు సమకూఱు నొక్కొ. 144

వ. అనిన నమ్మాటకు దేవదత్తుండు నృపోత్తమునిదాసన్నవర్తిత్వంబునం జేసి తనవర్తనంబఖి
లజనంబులు పరికీర్తనంబు సేయం బ్రవర్తించుచు నొక్కనాఁడు సర్వాభరణభూషితుం
డైన రాజకుమారుండు ముంగిట నాడ ముద్దాడువాఁడునుంబోలె నెవ్వరు నెఱుఁగకుండ
గూఢవృత్తి నెత్తుకొని నిజనివాసంబునకుం జనియె నంత నక్కుమారు నెల్లవారు నెల్లె
డల వరసి కానక ధాత్రీశ్వరున కత్తెఱం గెఱింగించిన నతండును గుమారాన్వేషణం
బునకుఁ దలవరుల నియోగించిన నయ్యారెకులు చని పురంబు సర్వంబును శోధించి
విపణివీథిం దదీయాభరణమ్ము లమ్ముచున్న మహీసురు మచ్చంబుతోడం బట్టి తెచ్చి సమ్ముఖ
మ్మునం బెట్టిన నమ్మహీపాలుం డుచితాలాపంబుల వెఱపువాపి యడుగుటయు. 145

ఉ. భూసురముఖ్యుఁ డిట్లనియె భూషణసంగ్రహణాభిలాషినై
యాసురవృత్తిఁ బూని భవదాత్మజుఁ జెప్పఁగ రానిచేఁత నేఁ
జేసితి నావుడున్ సభ నశేషజనమ్ములుఁ గ్రూరదండితుం
జేసినఁగాక యీ చెడుగు చేసిన సేఁత సహింపవచ్చునే. 146

క. ఈభూషణంబు లెక్కడ, నాభూపకుమారుఁ డెడ నకటా కృప లే
కేభంగిఁ దెగి వధించితి, వేభూములఁ జెప్పఁ గలరె యిట్టిదురాత్ముల్. 147

వ. అని కలుషించి దండింపం దలంచి. 148

ఆ. కొలువువెడల నీడ్చికొనిపోవ నతిసంభ్రమమున విక్రమార్కమనుజవిభుఁడు
వారి మగుడ బిలిచి వలదని వారించి, యెల్లవారు వినఁగ నిట్టు లనియె. 149

క. ము న్నొకపురుషార్థము మది, నెన్నఁడు మఱవంగ రాని దితఁ డొనరించెన్
నన్నును నేనెఱుఁగక పడి, యున్నెడ వనభూమి శీతలోదక మొసఁగెన్. 150

ఉ. కావున నీతఁ డింతయుపకారము చేసిన సైఁపఁ బాడి యే
నావిపినంబు వెల్వడిక దా పురికిం జనుదెంచి రాజనై
యీవిభవంబునై మనుట యెంతటితప్పిది నాకుఁ దప్పినన్
దైవముసాక్షి యీతనికిఁ దప్ప నొకింతయు మాట లేటికిన్. 151

ఉ. ఆపద చిక్కఁబెట్టి తనయక్కఱ లెల్లను దీర్చి యెయ్యెడం
బ్రాపయినట్టికార్యములపట్టున నిర్వహణంబొనర్పఁగా
నోపి తను న్స్మరించినబుధోత్తము నొప్పరికించునమ్మహా
పాపికి నెన్నిజన్మములఁ బాయునొకో క్రిమికీటజన్మముల్. 152

ఉ. నావుడు రాజుసభ్యవచనంబున కెంతయు సంతసిల్లి భూ
దేవుఁడు మందిరంబునకు దిగ్గనఁ బాఱి కుమారుఁ దెచ్చి ధా
త్రీవరు సంకపీఠి నిడి దీవన లొప్పఁగ నిచ్చి తత్సభా
కోవిదకోటి డెందములకుం బ్రమదంబు జనింప నిట్లనున్. 153

ఉ. దేవర నేఁడు కొల్చిన మదిం గడు నెంతయు సంతసించి సం
భావనమీఱ నాకు నొకప్రత్యుపకారము సేయఁబూనుటే
నావల నీవల న్విని యథార్థ మెఱుంగుటకై యొనర్చితిన్
నా వెడబుద్ధికి న్మనమునం గలుషింపకుమయ్య వేఁడెదన్. 154

క. అనవుడు ధరామరేంద్రుని, కనుపమమణిభూషణాదు లగుసంపదలన్
మనమలరఁ జేసి గృహమున, కనిచె సభాసదులు నిచ్చ నచ్చెరువందన్. 155

వ. ఇత్తెఱంగున విక్రమార్కావనీశ్వరుండు సత్యవచనప్రత్యుపకారపరాయణుండై ధరా
పరిపాలనంబు సేయుచుండె నంత. 156

తే. అన్నరేంద్రుపురోహితుఁ డార్యమతుఁడు, వేదవేదాంతవేదివివేకఘనుఁడు
దత్తనూజుఁడు పావవతీచిత్తహరణ, హారిలీలాకరుఁడు కమలాకరుండు. 157

వ. అక్కుమారుండు విద్యావిమూఢుం డగుట గనుంగొని జనకుం డతని కిట్లనియె. 158

క. శత్రుఁడు చదువనిపుత్త్రుఁడు, శత్రుఁడు ఋణకారి యైనజనకుఁడు మిగులన్
శత్రువు రూపసియగుసతి, శత్రువు దుశ్చరిత యైనజనని తలంపన్. 159

క. కుల ముద్ధరింపు చదువం, దలకొనుము "వచస్సుభాషితపరివ్యక్తం
బల మేవ హి కేవల" మను, పలుకు పురాతనము గాక ప్రశస్తంబే. 160

వ. అని ప్రార్థించినం గమలాకరుం డొక్కింత చింతాక్రాంతుండై యుండి నిశ్చింతాంతఃకర
ణుండై తండ్రి కిట్లనియె. 161

ఉ. వేదపురాణశాస్త్రముఖవిద్యలు సర్వము నభ్యసించి లో
కాదరణీయసారకవితాభ్యసనం బొనరించి మేటి నై
యాదిమునీంద్రవర్తనగుణాఢ్యుఁడనై చనుదెంచి నీకు స
మ్మోదము నొనర్తు నాపలుక మోసపదం బని చెప్పి నమ్రుఁడై. 162

వ. తండ్రి వీడ్కొని మహీమండలమండనం బైన కాశ్మీరమండలంబునకుం జని యందు సర
స్వతీవిహారసదనంబునం బోని యొక్క మహాగ్రహారంబున సన్నిహితచంద్రజూటుం డ
గు చంద్రమౌళుం డను విద్వన్మాన్యుఁడా సుధీపాలికిం జని నమస్కరించి తనయభిలాషంబు
నెఱింగించి దేవతానిర్విశేషంబుగాఁ బరిచర్య సేయుచుండ నతని సేవాతాత్పర్యంబునకు
సంతసిల్లి సిద్ధసారస్వతమంత్రం బుపదేశించె నంతం దదనుష్ఠానవిశేషంబునకు శారద
ప్రత్యక్షంబై యతని సముచితవిద్యావిశారదుం గావించిన లబ్ధకాముండై పిమ్మటన
ప్రీతిగురునియుక్తుండై యుజ్జయినీపురంబునకు వచ్చి నిజమందిరంబు ప్రవేశించి. 163

చ. జనకునిఁ గాంచి భక్తిభయసంభ్రమసంభృతుఁడై నమస్కరిం
చిన నతఁ డెత్తి నందనునిఁ జిక్కఁ గవుంగిటఁ జేర్చి యెక్కుడీ
వన లొనరించె ముత్తెపులకవారము సమ్మదబాష్పపూరముం
దనరఁగ సమ్మదం బొదవఁ దాల్చె సుశీలవికాసలక్ష్మితోన్. 164

వ. అమ్మఱునాఁడు. 165

ఉ. భూవరుసమ్ముఖంబునకుఁ బోయి ప్రసన్నతఁ గాంచి యింపుమైఁ
గోవిదవర్ధనీయ మగుగోష్ఠి యొనర్చిన నవ్విభుండు మో
దావహచిత్తుఁడై యభిమతార్థపరంపర లిచ్చి యమ్మహీ
దేవకుమారచంద్రముని దిక్కుఁ గనుంగొని ప్రీతి నిట్లనున్. 166

తే. ఈవు బహుదేశములఁ జరియించి యచ్చ, టచట నేమేమి చోద్యంబు లనుపరిత
కనినవినినవి క్రొత్తలు గలిగె నేని, నాకుఁ జెప్పుమ యనఁ గమలాకరుండు. 167

క. పరిచితవిద్యానిధినై, గురునాథునిచే ననుజ్ఞఁగొని యిట మిమ్మున్
దరిసించునభిమతంబున, నరుదెంచుమనుండి మండలాధిప యంతన్. 168

తే. కాంచియేలెడు జయసేనుఁ గాంచి యతఁడు, నన్ను మన్నింపఁ గొన్నాళ్ళు నిలిచి
యొక్కనాఁ డేను బొడగంటి నొకవధూటి, నావిలాసిని చెలువ మేమని నుతింతు.

సీ. పొలఁతి వేనలితోడఁ బురినెమ్మి తనపురి ప్రతివచ్చునని పాముఁ బట్టెనేని
యింతి నెమ్మోముతో నెనయుదునని వార్ధిపట్టి విష్ణుపదంబు ముట్టెనేని
చామచన్నులతోడ సరివత్తుమని కోకములు దండగుం డాన మునిఁగెనేని

యతివమై దొరయుదు నని సువర్ణశలాక వహ్నిలోపలఁ జొచ్చి వచ్చెనేని
నిష్కలంబుగ నమ్మంగ నేరక జూఁడు, శుద్ధపట్టంబు గనుటకుఁ జొరక మానె
ననిన నయ్యంబుజాతాయతాక్షి తోడ, నితరవనితల నుపమింప నెట్లువచ్చు. 170

క. ఆయంగనఁ గ్రేఁగన్నుల, నోయారపుఁగలికిచూపు టుములం బడినం
గాయజుని చిత్తమైనను, గాయజసంతాపవహ్నిఁ గరఁగక యున్నే. 171

సీ. చంద్రబింబముఁ గొలసంద్రంబులోఁ దోఁచి కందెల్లఁ బోఁ బులు కడుగకున్నఁ
గామబాణంబులఁ గరసానఁబట్టించి తొలుకారు మెఱుఁగునఁ దోడయకున్నఁ
బసిఁడిసలాకకుఁ బరిమళం బొనఁగూర్చి గరువంపువెన్నెలఁ గరఁగకున్న
జిగికందకుండ లేఁజిగురాకు గొనివచ్చి యొగరల్లఁ బుచ్చి యింపొసఁగకున్నఁ
గాంతనెమ్మోమునకు వాలుఁగన్నులకును, వఱలునునుమేనికిని నొప్పవాతెఱకును
నీడుజోడైనప్రతి యని యెన్నఁ గడిఁది, హస్తిమశకాంతరము సహజైకకాంతి. 172

క. అన్నాతిముద్దుమోమును, దిన్ననినెన్నడుము నగవు దేఱడికన్నుల్
పెన్నెఱివేణియుఁ గ్రొవ్విన, చన్నులుమం గనినఁ బుష్పశరుఁడుం గరఁగున్. 173

వ. అది నరమోహిని యనువారనారీతిలకంబు. 174

ఆ. ఆవధూటితోడ ననుభవకేళికి, నభిలషించి యెవ్వఁ డరిగెనేని
నతఁడు రాక్షసాభిహతుఁ డగు నారాత్రి, యంద దాని కిట్టి నింద గలదు. 173

వ. తన్నిమిత్తంబున. 176

క. పురిలోన నెదురుఁ దెరువై, యరుదెంచిన నవ్వధూటి నంగుళిఁజూపం
గరవార్థిఁ జూడ వెఱతురు, పురుషులు రక్కసుఁడు చంపుఁ బొమ్మని భీతిన్. 177

క. అని విన్నప మొనరించిన, విని వేడ్కను విక్రమార్కవిభుఁ డప్పుడ స
జ్జనహితుఁ డగుకమలాకరుఁ, డనుచరుఁడై యరుగుదేర నరుదెంచి, తగన్. 178

క. కాంచెం గాంచీపురముం, గాంచనమణిసౌధసాలగుణగోపురముం
జంచలనయనానటనస, ముంచితపర్యటనరణితమణినూపురమున్. 178

వ. కాంచి యందు నయ్యిందువదనమందిరంబునకుఁ గమలాకరమహీసురోపదిష్టమార్గంబు
నం జని యజ్జనవరుండు. 180

క. నరమోహనవిలసనముల, మరుమోహనశరముకంటె మధురాకృతియై
నరమోహిని యనఁదగియెడు, నరమోహినిఁ గాంచి మనుజనాథుఁడు మదిలోన్. 181

ఉ. ముప్పిరిగొన్న వేడ్క నరమోహినిపై నెలకొన్నచూపులం
ద్రిప్పఁగలేని యీమదవతీరమణీయతప్రావున న్మరుం
దప్పగమేశపద్మనయనాంబుజగర్భుల నైన వ్రేల్మిడిం
ద్రిప్పులబెట్టు నంచు వినుతించి మదిం దిలకించి వెండియున్. 182

ఆ. ఈవధూటిరూపయౌవనసంపద, కాముకులకు లోచనామృతంబు
చిత్రగతి మృతంబు సేయుచున్నది, కనకపాత్రలోనిగరళమట్లు. 183

వ. అని తలంచుచున్నయవసరంబునఁ గమలాకరుం డాకమలానన కిట్లనియె. 184

ఉ. ధీరుఁడు విక్రమార్కజగతీతలనాథుఁడు నిన్నుఁ జూచి ని
చ్చారతి వీఁడె వచ్చె ననఁ; జాఁగిలి మ్రొక్కి ప్రియోక్తి నిట్లనుం
గ్రూరనిశాచరుం డొకఁడు కూరిమి నాయెడఁ గల్గియుండు సం
హార మొనర్చు వచ్చినవిటావళిఁ దన్నిశ నొక్కత్రేల్మిడిన్. 185

వ. అని తనతెఱం గెఱింగించి మహీవల్లభునకు నప్పల్లవాధర యుచితోపచారంబు లొన
రించి సరసకథాభూషణంబు లగుభాషణంబులం బ్రొద్దుపుచ్చుచున్నయంత సాయం
తనసమయం బగుటయు. 186

చ. మునుకొని దంష్ట్రికారుచులు ముందటిచీఁకటి నెల్లఁ బాపఁగా
వెనుకఁ దమాలనీలనిజవిగ్రహదీప్తులు చిమ్మచీఁకటిం
బెనుపఁగఁ గొమ్ములేనుఁగువిభీషణతం జనుదెంచుకైవడిన్
దనుజవరుండు వచ్చెఁ దనదారుణరూపము భీతిఁ బెంపఁగన్. 187

ఉ. తత్సమయంబునందు వసుధావరుఁ డుద్గతుఁడై యదల్చి యు
ద్యత్సముదగ్రసింహగతి దైత్యుని మార్కొని రోరిదుష్ట ని
న్మత్సరబుద్ధి నీక్షణము మర్దితుఁ జేసి ధరిత్రికెల్ల న
త్యుత్సవ మే నొనర్చెదఁ బయోరుహలోచనకోర్కి దీర్చెదన్. 188

చ. అన విని దానవేశ్వరుఁ డహంకృతి రౌద్రరసంబు మూర్తిగైఁ
కొనినవిధంబునన్ నృపతికుంజరు నేర్తెఱఁ దాఁకి వీఁకమైఁ
బెనఁగి పెనంగి లావఱినఁ బేర్చి నరేంద్రుఁడు కాళ్లుపట్టి నే
ల నడిచి మల్లవిద్య సఫలంబుగఁ బీనుఁగుఁ జేసె దానవున్. 189

తే. ఇట్లు దానవు వెసఁ జంపి యిల్లువెడలఁ, దివిచి వైచిన మేదినీధవునిఁ జూచి
హర్షమున నరమోహిని యల్ల నగుచు, నింపు రెట్టింప నతనితో నిట్టులనియె. 190

క. నరమోహిని నానామము, నరఘాతిని యని జనంబు నను నిందించున్
నరనాథ నింద మాన్చితి, చరితార్థం బయ్యె నాదుజననం బరయన్. 191

తే. ఏను మీపనిచినపని యెట్టిదైనఁ, జేసి మీదాసినై సేవ సేయుదాన
ననిన విక్రమాదిత్యుఁ డట్లైన నీవు, నాకుఁ బ్రియముగ నొకటి యొనర్పవలయు. 192

క. లోకవిలోచనకైరవ, రాకాచంద్రుం డితండు రమణీమణి నీ
వికమలాకరుఁ బ్రియుఁగాఁ, గైకొను మిది నాకుఁ బ్రియము కమలదళాక్షీ. 193

వ. అని యయ్యుదయపురం గూర్చి యజ్ఞనాథుం డుజ్జయినీపురంబునకుం జని దుష్టనిగ్రహ
శిష్టప్రతిపాలనంబులు సహజఖేలనంబులుగా ననయంబును సర్వంసహానిర్వహణదుర్వా
ర భుజాగర్వఖర్వేతరుండై రాజ్యంబు సేయుచుండి జగంబున నత్యాశ్చర్యభరితంబులై
న చరితంబు లెఱుంగ వేఁడి కర్ణావతంసీకృతకౌక్షేయకసహాయుండై చని యొక్కరుండు
ను బెక్కుదిక్కులం జరియించుచు నొక్కనాఁడు. 194

క. పేరడవిలోన రాఁగా, నీరజహితుఁ డస్తమించి నెఱి నఖిలాశా
పూరితమై తమ మెచ్చెను, భూరివదాన్యులవితీర్ణిఁ బోల్పఁగఁ బట్టై. 195

క. ఆచీఁకటి నొక్కంతను, ద్రోచి చనఁగ రాక నతిదూరంబున వా
గ్గోచరము గానియున్నతి, నేచిన వటవిటపినీడ నెలవు వసించెన్. 196

వ. అట్లున్న సమయంబున. 197

క. ఆవిటపి సుచిత్రవచన, ప్రావీణ్యము మెఱయ నున్నపక్షులకుఁ జిరం
జీవి యను విహగముఖ్యుఁడు, కోవిదబహుమాననీయగుణుఁ డిట్లనియెన్. 198

క. మీ రాహారార్థము గాఁ, గోరి చరింతురు సమస్తఘోరాటవులన్
దూరగ్రామంబుల ఫలి, తారామంబులను దశదిశాంతరములలోన్. 199

తే. కన్న చోద్యంబు లేవేని గల్గెనేని, నాకు నెఱిఁగింపుఁ డేను వినంగవలతు
ననిన నందులో నబ్బరికాభిధాన, మొకపక్షి యిట్లనియె నేఁ డుదయవేళ. 200

క. ఏ నొక కొందఱము మహా, గ్రామవనాంతరము లెల్లఁ గడచి చని గ్రహ
స్తోమగతిప్రతిరోధన, భూమాకంప్ర మగు వింధ్యముసమీపమునన్. 201

క. చైత్రరథనందనంబుల, చిత్రస్ఫురణమున నల్లసిల్లుఁ బ్రశంసా
పాత్రమయి యొక్కవిపినము, చైత్రరమాకాంతజన్మసదనం బగుచున్. 202

వ. అవ్వనంబున నన్యఫలాహరణార్థంబు సంచరించుచు నొక్కయెడం గమలకల్హా
రకుముదశోభితంబును గలహంసకారండవక్రౌంచచక్రవాకసారసమదసారంగసంకు
లారావవిరాజితంబును నగు నొక్కకమలాకరంబుతీరదేశంబున ననేకబంధులోక
పరివృతుండును దీర్ఘనిశ్వాసపవనఘూర్ణిధూసరితవదనుండును గళద్బాష్పనయనకమ
లుండును దురంతదుఃఖపరవశుండును నై యున్న కంకాళఖండనుం డను నొక్క
విహంగపుంగవుం గని చేరంజని తన్నెఱిఁగించుకొని దుఃఖకారణం బడిగిన నతం డెట్ట
కేలకుఁ జిత్తంబుకలంక దీర్చుకొని యూరలుంగగన నాతో నిట్లనియె. 203

తే. ద్వాదశగ్రామములకు నధ్యక్షుఁ డొక్క, రాక్షసుఁడు వింధ్యనగగహ్వరమున నుండు
నతని కాయూళ్లవార లాహార మెపుడు, బండిఁ గొనిపోయి పెట్టుదు రొండొకండ.

వ. వాఁ డన్నరమహిషసహితంబుగాఁ దదన్నంబు భక్షించుచుండు. 205

క. ఇలువరుస గాఁగ నీక్రియఁ, గలవారల నెల్లఁ బుచ్చెఁ గాలునిపురికిన్
ఖలుఁ డగు నా రాక్షసుఁ డా, కులపడఁ ద్రిజగంబు నతఁడు కుపితుం డైనన్. 206

ఉ. ఏమని చెప్పుదున్ ఖగకులేశ్వర నా సఖుఁ డొక్క భూసుర
గ్రామణి చావఁగాఁ గలఁడు రాక్షసుచే నది మాన్పఁ ద్రోవ లే
దేమియుఁ జూచినన్ హితులయిష్ట మొనర్పఁగ లేని నా భవం
బేమి భవంబు దీనికిని నే దగఁ బిల్లైవ నేమి సేయుదున్. 207

వ. అనిన నేనిట్లంటి. 208

క. నగులకుఁ బక్షులకును నె, వ్వరుసున సముపాయ మిత్త్రభావం బిది యా
చ్చెరువు వినవలతు నా కిది, పరిపాటి నెఱుంగఁ జెప్పు బంధునిధానా. 209

వ. అనినఁ గంకాళఖండనుం డిట్లనియె. 210

క. నాచుట్టంబులు నేనును, వే చని యశనార్థ మడవి విహరింపంగాఁ
జూచి మముఁ బట్టఁ దిరిగెడు, నీయుఁ డొకఁడు మాచరించె వల వెతఁగి తగన్. 211

క. మచ్చులిడి యురులు బోనులు, నచ్చట వెస నొగ్గి చనిన నది యెఱుఁగక యా
మచ్చుచ్చురులను బడి వగ, నిచ్చను దురపిల్లుమున్న యెడ నచ్చటికిన్. 212

వ. సమిత్కుశార్థంబు దైవవశంబున. 213

క. వచ్చి యొకద్విజకుమారుఁడు, చెచ్చెర మముఁ జూచి కరుణ చిగురొత్తంగాఁ
గ్రచ్చఱ నయ్యురులు లూడ్చిన, నిచ్చల మా మనసికి పట్లు కేఁగితిమి వెసన్. 214

క. అది చనియును నేఁటికి నిరు, వదియేఁడులు గడచె నాఁటఁ బట్టియు నే నా
మది నాతని యాపదసం, పద నాయది గాఁ దలంతు బంధుత్వమునన్. 215

క. అని చెప్పిన విని వచ్చితి, నని చెప్పిన విహగవిభుని యాలాపంబుల్
వినియుఁ జెవియొడ్డి భూరుహ, మున క్రింద వసించి యున్న భూమీశ్వరుఁడున్. 216

క. విని యపుడ కదలి జామె, క్కినయంతకుఁ జనియె నసురకేలీసదనా
వనిభృత్కంధర భూమికిఁ, దన కడియ పరోపకృతికిఁ దటి పొమ్మనుచున్. 217

క. చని వధ్యశిలాస్థలి సజ్జనపతి కూర్చుండె నిర్విశంకత నంతం
గనియె గుహ వెడలి చనుదెం, చి నిశాటుఁడు వధ్యశిల వసించినవానిన్. 218

చ. కని భ్రుకుటీమహోగ్రపరికంపితఫాలభయంకరాస్యసం
జనితనిదాఘవారికణజాలవిజృంభణరౌద్రమూర్తియై
యనిమిషఁ గణంగి ఘోరమనుజాధము నిచ్చలుఁ దెచ్చు వంటకం
బును నులివేఁడికూరలు నపూపములున్ గొనిరా కహంకృతిన్. 219

తే. ఒక్కఁడవ వచ్చి వధశిల యెక్కి నన్ను, నపహసించుచునున్నాఁడ వనుచుఁ దీవ్ర
గమనుఁడై చనుదెంచు రాక్షసునితోడ, నృపతి నిశ్శంక నిటను నిఘాతుఁ డగుచు.

చ. దితిసుత నేఁడు చావనరుదెంచుమహీసురవర్యుమాఱు వ
చ్చితిఁ బరదేశి నా చనవు చేకొని మత్తనురక్తమాంసముల్
ధృతిఁ గొను మంతకంటెఁ బరితృప్తి యొనర్చు మదన్వయక్రమా
గత మగునిప్పరోపకృతికల్పనఁ బారమువొందఁ జేయుమీ. 221

ఉ. నావుడు దానవేంద్రుఁడు మనంబున నచ్చెరువంది సత్కృపా
భావనమం బరోపకృతిభంగికి మెచ్చితి వేఁడు మర్థి నీ
కేవర మైన నిచ్చెదఁ బ్రహృష్టమనస్కుఁడ నైతి నీయెడన్
నావుడు విక్రమార్కనరనాథుఁడు నద్దనుజేంద్రుతోడుతన్. 222

ఆ. ఈవివేకబుద్ధి యీచిత్తసంశుద్ధి, యీకృపారసావసేకసిద్ధి
కలదె యొరుల కెందుఁ గారణజన్ముండ, వగుటఁ జేసి నీక యబ్బెఁ గాక. 223

తే. నాకు వరమిత్తు ననుమాట నైజమేని, మనుజవధ యొనరింపక మాను మనినఁ
దత్పరోపకారైకతత్పరత కలరి, యట్లచేసెద నని పల్కి యసుర చనియె. 224

వ. ఇవ్విధంబున. 225

ఆ. భూపచంద్రముఁడు "పరోపకారార్థమి, దంశరీర" మనినధర్మమార్గ
సరణి దప్పకుండ సకలార్థిరక్షుఁడై, వర్తనమున నిత్యకీర్తిఁ గాంచె. 226

మ. పరమబ్రాహ్మణదేవభక్తినియమప్రజ్ఞారమాలంకృతా
పరుషారాతిమహీశమంత్రిజనశుంభద్గర్వసంరంభసం
హరణప్రౌఢనయోన్నతా కనకదండాందోళికాఛత్రచా
మరముఖ్యోజ్జ్వలరాజచిహ్నమయసమ్యగ్వైభవప్రాభవా. 227

క. భావపరిశుద్ధికలనా, ప్రావీణ్యామృతగిరీశపావనపదరా
జీవయుగభక్తితత్పర, సేవాహేవాకనిరతసిద్ధయపౌత్రా. 228

కాంతవృత్తము.

ధారాధరవాహనధైర్యకృతీ, క్షీరాబ్ధిశబీశ్వరశీతలరు
గ్ధారాధరకల్పకకామగవీ, తారాధిపసన్నిభదాననిధీ.

గద్యము. ఇది శ్రీమదఖిలకవిమిత్త్రి పెద్దయ యన్నయామాత్యపుత్త్ర
శారదాదయావిధేయ జక్కయనామధేయ ప్రణీతంబైన
విక్రమార్కచరిత్రం బనుమహాకావ్యంబునందుఁ
బంచమాశ్వాసము.

శ్రీరస్తు.

విక్రమార్కచరిత్రము.

షష్ఠాశ్వాసము.

క. శ్రీమేళనగుణఖేలన
సామాదికచతురుపాయచాతుర్యనిధీ
స్వామిహితకార్యఘటనా
సౌముఖ్య జగత్ప్రసిద్ధ జన్నయసిద్ధా. 1

సీ. విభవంబుపొలుపున విలువిద్యబలుపునఁ బురుహూతుఁ దత్సుతుఁ బోలు ననఁగ
సత్ప్రభ పెంపునఁ జాగంబుసొంపున మిత్త్రుఁ దత్పుత్త్రు మీఱు ననఁగ
రాజరాజవిభూతి రతివిహారఖ్యాతి ధనదుఁ దత్సూనుని నెనయు ననఁగ
గంభీరతాస్ఫూర్తి ఘనకాంతిమయమూర్తి శరధిఁ దదాత్మజు దొరయు ననఁగ
నిరత సేవాగతాగణ్యనృపవరేణ్య, నుతకిరీటాగ్రకీలితనూత్నరత్న
కిరణనికరారుణాయమానచరణుఁ డగుచు, విక్రమాదిత్యవసుమతీవిభుఁడు మెఱసె. 2

వ. అమ్మహీపతి యొక్కనాఁడు సకలప్రధానదండనాథసామంత మండలేశ్వరసమూహం బును గురుభూసురపురోహితబంధుమిత్త్రపుత్త్రపౌత్త్రప్రకరంబును గవిగాయకపాఠక వైతాళిక సందోహంబును బరివేష్టింప మణిగణభూషణప్రభాపటలజటిలశోభితాంగుం డై మౌక్తిక హారంబునడిమినాయకరత్నంబునుంబోలెఁ దేజరిల్లుచు మణిమయోన్నత భద్రసింహాసనాసీనుండై పేరోలగం బున్న సమయంబున. 3

సీ. ఆదినాథునియపరావతారము పూని మత్స్యేంద్రనాథునిమహిమఁ దనరి
సారంగనాథునిసామగ్ర్యమును బొంది గోరక్షనాథునిగుణముఁ దాల్చి
సిద్ధబుద్ధునిబుద్ధి చిత్తంబునం జేర్చి ఖనిరువిద్యాధికఘనతఁ జేర్చి
మేఖనాథునిమంత్రవైఖరి వహియించి నాగార్జునునికళాశ్రీ గమించి
యావిరూపాక్షుఁ డితఁడన నతిశయిల్లి, యర్థి నవనాథసిద్ధుల కైక్యమైన
మోహనాకృతి యితఁ డనుమూర్తిఁ దనరి, చిన్మయస్వాంతుఁ డగు నొక్కసిద్ధవరుఁడు,

ఉ. పాదములందు బంగరపుఁ బావలు వెట్టి దుకూలకంథ మై
మోదముతోడఁ దాల్చి జనమోహనమంగళధాతువాదయం
త్రాదిసమస్తవిద్యల సమర్థు లనం దగుశిష్యపంక్తి యా
త్మాదరలీల నిర్మ్మయిలుచుండఁ దమం గొలువ న్మహోన్నతిన్. 5

క. వచ్చి తగుచందమున సభఁ, జొచ్చి మహీకాంతుఁ జూచి సుభగాకృతికిన్
మెచ్చి తలయూఁచి కానుక, తెచ్చినరత్నంబుతోడ దీవన లిచ్చెన్. 6

ఉ. ఇచ్చిన సిద్ధవల్లభున కిమ్ముల నాసనపాద్యసత్కృతుల్
హెచ్చుము లేకొనర్చి నృపపుంగవుఁ డెయ్యది మీకుఁ జేయ తా
రిచ్చటు నేను జేయుపని యెయ్యది భాగ్యయుతుండ నైతి మీ
వచ్చుటఁజేసి భక్తజనవత్సల యన్న దరస్మితాస్యుఁడై. 7

క. ఇందందుండుదు ననలే, కందైనఁ జరింపుదుము నిజేచ్ఛ మెయి సదా
నందుఁడు నామము వచ్చితి, నిందులకును నిన్నుఁ జూడ నిష్టం బగుటన్. 8

వ. అని చెప్పి మఱియు నిట్లనియె. 9

సీ. ఏవేళ వేఁడిన నావేళ దివ్యాన్నపానాదు లొడఁగూర్చుపాత్ర గలిగి
యెచ్చోట వ్రాసిన నచ్చోట పుటభేదనములు గావించుదండంబు గలిగి
యెటఁబోవఁ దలఁచిన నట కెత్తుకొనిపోవుసుకుమారయోగపాదుకలు గలిగి
యెపుడు విదల్చిన నపుడు వేలకులు కనకంబు వర్షించుకంథ గలిగి
నిర్మలజ్ఞానవిజ్ఞాననిరుపమాన, రాజయోగీశ్వరత్వవిరాజిమహిమ
తనర మించిననీ కస్మదాదులకును, హస్తిమశకాంతరము గాదె యంతరంబు. 10

సీ. వేయిమోములవాఁడు విషముక్తుఁడైనను బ్రతి యగు నీకు భూధరణశక్తి
వేయిగన్నులవాఁడు విమలవర్తనుఁడైనఁ దర మగు వైభవస్ఫురణ నీకు
వేయిచేతులవాఁడు విగ్రహవ్యథఁ జెంద కున్నఁ దేజమున నిన్నోరయువాఁడు
వేనామములవాఁడు వేఁడనివాఁడైన నిత్యలక్ష్మియుక్తి నిన్నుఁ బోలుఁ
గాక యేతద్గుణంబుల గణన సేయ, నన్యరాజన్యవరులు నీయంతవారె
ప్రసవశరరూప యప్రతీపప్రతాప, దీపితాటోప విక్రమాదిత్యభూప. 11

మ. అని యానందమరందకందళితవక్త్రాంభోజుఁడై యోగిరా
డ్జననాథుండు ప్రశంస సేయుటయు నాసర్వంసహాధీశ్వరుం
డనఘా నీదుకటాక్షవీక్షణము నాయం దందమై చెందెఁ గా
న నవీనప్రథమానభాగ్యమయధన్యత్వంబు నేఁ గాంచితిన్. 12

ఆ. అనుచు శిష్యసహిత మమ్మహాయోగీంద్రు, గారవించి కొలువువారి ననిచి
మనుజనాయకుండు మజ్జనభోజన, క్రియల వారికెల్లఁ బ్రియ మొనర్చె. 13

వ. వారలుం దానును సుఖాసీను లై యున్న యవసరంబున యోగీశ్వరునకు విశ్వంభరా
ధీశ్వరుం డిట్లనియె. 14

క. ఎన్నిక కెక్కిన దేశము, లన్నియుఁ జూచితిరి కరతలామలకముగా
నిన్నిటిలోపలఁ జోద్యము, కన్నది విన్నదియు నొకటి గలిగినఁ జెపుఁడా. 15

వ. అనవుడు. 16

చ. జనవర నీయడం బ్రియము చాలఁగఁ గల్గి యపూర్వపుం బ్రయో
జన మెఱిఁగింతు నన్యులకు సాధ్యము గానిది లాటభూమిఁ గా
ననమునఁ బుట్టమీఁద నొకనాతుక కోమలబాహువల్లి య
త్యనుపమకంకణాంకితసమన్విత మై కనుపట్టు నెప్పుడున్. 17

వ. అనిన నమ్మహీకాంతుం డక్కాంతవృత్తాంతం బాద్యంతం బెఱింగింపుఁ డనిన నాసిద్ధవ
రుం డిట్లనియె. 18

చ. భుజగజగద్విభూషణము పుష్పపురం బది యేలు రాజు చి
త్రజనిభమూర్తి కీర్తివనితారమణుండు ధనంజయాఖ్యుఁ డా
సుజననుతప్రతాపుఁ డతిశోభనగానకళానిరూఢి శై
లజ నలరించి తత్కృపఁ గళావతిఁ గాంచెఁ గళావిశారదన్. 19

వ. అక్కన్యకా జననసమయంబున. 20

సీ. ఎలజవ్వనమున నియ్యిందీవరేక్షణ, భూలోకమున వనభూమిలోన
వల్మీకబిలమధ్యవాసిని యై యుండి, కరపంకజము తదగ్రమున నిల్పి
యాకేలు గేల నెయ్యమునఁ గీలించిన, పురుషునిఁ దనపుష్పపురికిఁ దెచ్చి
యతని మజ్జనభోజనాదుల నలరించి, మేలిపర్యంకంబు మీఁద నునిచి
తాను నొకశయ్య శయనించి మౌనినియతి, నుండ ముమ్మారు పలికింప నూపెనేని
వాఁడు రమణుండు గాఁగలవాఁడు దీని, కనుచు నాకాశవాణి యిట్లానతిచ్చె. 21

చ. లలితకళావిశారద కళావతికేలది దాని నెవ్వఁడేఁ
బొలుపుగఁ బట్టెనేని తనపుష్పపురంబునకుం గరంబు మె
చ్చులుగఁ గరంబు వట్టికొనుచుం జని యాతఁడు తన్ను మూఁడుమా
టలు పలికింపఁ దక్కును దృఢంబుగఁ దక్కఁడు లేక తక్కినన్. 22

వ. అని చెప్పి యోగీశ్వరుండు ధరణీశ్వరున కిట్లనియె. 23

తే. ఆకళావతి సౌందర్య మసమశరుఁడుఁ, ఎసఁగఁ జెప్పినఁ బొసఁగుఁ గా కితరజనులు
మించులావణ్యరస మొకయించుకైన, నెలుకకుండఁగ వర్ణింపఁ గలరె జగతి. 24

సీ. అమృతాబ్ధి జనిత మై యలరుకల్పకలత, యంగనతనులత కనుగొనంబు
పుండరీకాక్షునిపొక్కిటితమ్మికి, సతిమోము నెత్తమ్మి సంగతంబు

కాముసౌధోపరికనకకుంభములకు, రమణియురోజకుంభములు చెలులు
దివిజాధిపతిదంతితిన్ననినడపున, కంగననడపు విహారభూమి
తెలివయాధగంబు పవడంపుఁదీవెయురవు, పడఁతియలకము లళులకుఁ బ్రాణసఖము
లింతిచూపులు మగమీల నేలఁ గోరుఁ, దరుణిపలుకులు కాముమంత్రములగములు.

చ. కలువల గండుమీలఁ దొలుకారుమెఱుంగుల నిండువెన్నెలన్
వలపులరాజుతూపు లగువాఁడిమహాంబుల నొక్కటయ్యునన్
గెలుపుగొనంగఁ జాలు మృగనేత్రయపాంగనిరీక్షణద్యుతుల్
బలువుగ ధైర్యమూలమునఁ బోఁ దగిలింపవె యీశ్వరాదులన్. 26

సీ. ముద్దులుదొలఁకాడుముద్దియపలుకులు, వ్యాసమాస్త్రిమంత్రబీజాంకురములు
క్రొమ్మెఱుంగులనీనుకోమలిచూపులు, యవ్యంగసంభవువాలుటంపగములు
శృంగారరసమొల్కుచెల్వయాకారంబు, కామునివలపులకత్తె కనుఁగు
ఇంపులువెదచల్లునేణాక్షి చెయ్వులు, శంబరాంతకు జయసాధనములు
కాంతమెయికాంతి కంతునిఖడ్గకాంతి, వనజముఖికురుల్ రతిపతివాగురములు
మగువమురిపంబు మరునిసామ్రాజ్యపదము, చెప్పఁ జిట్టలు ఘోఁటబోఁడిమొప్పకలిమి.
తే. సుదతినునుఁబల్కు లమృతంపుసోన గురియుఁ, దరుణిచూపులు మెఱుఁగుమొత్తములనీను
రమణిసేఁత యనంగతంత్రముల నెఱపు, సుదతినడపులు హంసల కొఱపుఁ గఱపు. 28

వ. అదియునుంగాక యానీరజానన నెవ్వండు వరియించె నతండు సార్వభౌముం డగుట సిద్ధంబు గావున నౌదార్యవీర్యభుజశౌర్యసకలకళాచాతుర్యధైర్యసుర్యుండ వైననీకు నమ్మత్తకాశిని పట్టంపుదేవి యైనరత్నకాంచనసాంగత్యంబునుంబోలె నత్యంతశోభితంబగు నని చెప్పిన. 29

ఉ. యోగివరేణ్య మీకృపఁ బయోరుహలోచనచెయ్యి చూడ నే
లాగున నాకుఁ జేకుఱు విలాసినిహస్తము నాకరంబు నే
లాగునఁ గీలితంబగుఁ గళావతిపుష్పపురంబులోని కే
లాగున నేను జేరుదుఁ దలంపఁగ దుర్గమంగు లిన్నియున్. 30

వ. అదియునుంగాక యాబింబోష్ఠి మౌనవ్రతనిష్ఠాగరిష్ఠయై యుండ హృదయపుటభేదనంబుగావించి మూఁడుమాటలు పలికించుట యత్యంతదుర్లభం బని తలంచెద నన్న నమ్మానవేశ్వరునకు సమానుషచరిత్రుం డైనయాసదానందుండు కృపానందకందళితహృదయారవిందుం డై దారుశిలాలోహాదుల కైనను జైతన్యంబు గలిగించి పలికించెడినేర్పు గలుగునట్లుగా విద్యోపదేశంబుచేసి యాశ్రితానేకసిద్ధగణపరివృతుం డై యంతర్ధానంబు నొందె నంత విక్రమార్కుండును దత్కరలతాసందర్శన కుతూహలావేశంబునఁ జిత్తం బుత్తలపడ నిజప్రధానాగ్రగణ్యుండును నాప్తుండును నైనభట్టి మొదలుగాఁగలవారికి ని

వ్వానికి నెఱింగింపక నిజకరకీలితనిశితాసియ సహాయంబుగా నర్ధరాత్రంబున యోగ పాదుకలు దొడిగి కదలి మనోవేగంబున ననేకశైలంబులు నరణ్యంబులు దాటి లాటదేశంబునకుం జని యరణ్యమధ్యంబున. 31

ఉ. శ్రీకరమూర్తి యాన్నృపతిసింహకిశోరము గాంచె నుత్కవ
ల్మీకము సంతతప్రకటలీనవఘూకరకంకణప్రభా
నీకము వేష్టితావటకనింబకదంబతమాలశిద్రుమం
శోకము రంధ్రమార్గపరిశోభితగోచరనాగలోకమున్. 32

తే. కాంచి తిలకించి పులకించి కదియ నేఁగి, సమణికాంచనకంకణసోజ్జ్వలిత నైన
హస్తకమలంబుఁ బలుమాఱుఁ బ్రస్తుతించి, సిద్ధసూత్రము కాశ్చర్యచిత్తుఁ డగుచు. 33

వ. సాహసంబు చేసి సాహసాంకుం డహీనాహిభూషణబహుమాననీయవరారోహానో హరనవరత్నమణిగణఘటితకంకణముద్రికాలంకృతహస్తాంబురుహావిన్యస్తకరారవిందం డైన నానీలవేణి కళాపాకీర్ణ గావున మీఁదటం బాణిగ్రహణంబు గలుగుట కదియ కారణం బన్నకరణి నిఖిలత్రిలోకీసుందరీశోభాకరం బగుకరంబు కరం బనురాగంబున నిజ కరంబునం గీలించి పుష్పపురంబునకుం జని వజ్రవైడూర్యమరకతపద్మరాగాది వివిధ రత్నఖచితగాయమాన మాననీయం బగుకనకమయసంకేతనికేతనంబున నునిచి షడ్రసో పేతం బగుచతుర్విధాన్నపానాదులం బరితుష్టం జేసి కర్పూరపరిమళితం బగుతాంబూ లంబు వెట్టి వినూత్నరత్నపర్యంకస్థునిం జేసి చతురపరిచారికాజనంబును వాకిటనుండ నియోగించి మణికవాటఘటనపాటవంబు నెఱపి తాను వేఱొక్కశయ్యం బసిండి తగడు దెగడు మెఱుంగుగలపఱపుపయి శయనించి పట్టుపుట్టంబు ముసుంగు వెట్టుకొని పలుకకున్న సమయంబున నప్పడఁతి యోర్వక వెఱఁగుపడి తనలో నిట్లనియె. 34

సీ. కురులు కప్పు దనర్చు నెఱయ గ్రమ్మక యున్నె, నగవు వెన్నెలమించు నిగిడెఁ గాక
చన్నుజక్కవదోయి మిన్నుఁబ్రాఁకక యున్నె, పయ్యెదవల యడ్డపడియెఁ గాక
కనుగండుమీలు వే కడచిపోవక యున్నె, చెవు లనుకొలఁకులఁ జిక్కెఁ గాక
యాననాంబుజముపై నళులు పైకొనకున్నె, మేను సంపెఁగతావిఁ బూనెఁ గాక
యొప్పు కనుఁబాటుదాఁకక యున్నె రత్న, భూషణద్యుతు లొక్కటఁ బొదివెఁ గాక
తలఁప నచ్చెరువై నయీతరళనయన, యవయవశ్రీలలీల లేమని నుతింతు. 35

చ. పసిఁడిసలాకవోలెఁ గనుపట్టుతనుం గనుఁగొంచు మన్మథ
ప్రసవశిలీముఖాళి కనిపడ్డమనోగతి నెట్టకేలకున్
వెస గుదియించి చూపులచవిం బులకించుచు నున్నచోటఁ దా
ముసుఁగిడికొన్న దంతి నిజమూర్తిఁ గనుంగొననీని కై కడిన్. 36

వ. అని వెండియు. 37

ఉ. ఇంచుకప్రొద్దుపోకడను నెవ్వరితో నుబుసేమి చెప్పుదుం
బంచశరవ్యథం దలఁకుభావము నేగతిఁ గుస్తరింతు నీ
చంచలచారులోచనఁ బొసంగఁగ నేగతి మూఁడుమాటలా
డించి కవుంగిలింతు నని డెందములోఁ దలపోసి యంతటన్. 38

ఉ. దీనికిఁ జింతయేల యని తెల్వి మనంబునఁ బూని కాంతిరే
ఖానవరత్నదీపకళికం దనరాఁగడుదివ్వెగంబమున్
దా నొకనూత్నయంత్రమున దాఁకి సజీవను జేసి దానితో
శ్రీనెఱయంగ నొక్కకథ చెప్పఁగదే యని గారవించినన్. 39

క. అయ్య యవుఁగాక యంచును, దియ్య మెసఁగ రాజుఁ జూచి దివ్వియగంబం
బియ్యకొని యపూర్వపుఁ గథ, నెయ్యంబునఁ జెప్పఁదలచి నెఱి నిట్లనియెన్. 40

చ. నరవర సావధానముగ నా దొకవిన్నప మాలకింపుము
త్తరకురుభూములందు విశదంబుగ నాగపురం బనంగ న
త్యురుతరలక్ష్మి నొక్కపుర మొప్పు నయోధ్యకుఁ బొమ్మవెట్టి కి
న్నరపతిపట్టణంబు నగి నాకపురంబుఁ దృణీకరించుచున్. 41

మ. విను మాపట్టణ మాదిరాజవిలసద్విఖ్యాతి ధర్మధ్వజుం
డను భూపాలుఁ డేలుచుండును జనాధ్యక్షుండు భూమీశ భూ
జనసంస్తుత్యుఁడు నిత్యసత్యుఁ డురుసౌజన్యుండు ధన్యుండు స
త్త్వనయప్రాభవధీవిధేయుఁడు గుణాధారుండు ధీరుం డిలన్. 42

క. మనునిభుఁ డనఁ దనరినయా, మనుజపతికి సుగుణమధుపమంజరి యనఁగా
జనియించెఁ గామమంజరి, వననిధి జనియించుపద్మవాసినిఁ బోలెన్. 43

సీ. కమ్మనిపసిఁడిటంకంబునఁ గరఁగిన, లాలితనూత్నశలాకవోలె
రమణీయశృంగారరసమునఁ బసనాఱు, గురిపంపువలపుల నొలుకవోలెఁ
గళలమృతంబుచేఁ గరువుగాఁ గట్టి వ, ర్తించి నించినచంద్రరేఖవోలె
మీఱి తళుక్కున మెఱసి నిల్చినయట్టి, సోగక్రొమ్మెఱుఁగు లేఁదీఁగ వోలె
దినదినంబునఁ బెరుఁగుచుఁ దియ్యమొదవ, దల్లిదండ్రులమనము లుత్సవము లొందఁ
గామమంజరి మంజులాకార మెసఁగఁ, బ్రజల కెల్లను గన్నులపండు వగుచు. 44

చ. పడఁతుక దేహవల్లికకుఁ బ్రాయపుసంపద కాపురచ్చినన్
నొడువుల రాజకీరముల నున్నని పల్కులఁ దూలఁదోలె ను
గ్గడువగు మేనికాంతిఁ దొలుకారుమెఱుంగులమించు మించె నె
న్నడుపులచేతఁ గీడ్పఱిచె నాగమరాళమయూరయానముల్. 45

క. ఎవ్వరికైనను గనుఁగవ, యువ్విళ్లూరంగ మునునియున్మదనాస్త్రం

బివ్వనితయొకో నాఁగను, జవ్వనమునఁ బువ్వుఁబోఁడి సన్నుతికెక్కెన్. 46

క. లాలితముసరసుగంధము, గ్రోలఁగ విరిదమ్మిమీఁదఁ గొమరారెడుమ
తాలిశులమొక్క నాఁగను, బాలిక నెన్నుదుటఁ గురులు భాసురమయ్యెన్. 47

తే. ఒప్పులే యేటి మాఱులేకుండ బ్రహ్మ, యంగకంబులు చేసె నం చాత్మ మెచ్చి
యవయవశ్రీలు గనుఁగొనునట్టియిచ్చఁ, దరుణికన్నులు తలచుట్టుఁ దిరిగివచ్చు. 48

తే. బయలఁ గనుపట్టు నొంటికంబంబుమీఁదఁ, బసిఁడికుండలు నిల్పినభంగి దోఁప
నసదుఁగొఁదీఁగెఁ బాలుపారు నారుమీఁద, వలుదనునుగుబ్బలొప్పారు వనజముఖికి.

ఉ. అంతటఁ గూర్మినందనవయఃపరిపాకము చూచి తండ్రి య
త్యంతముదంబునం బొదలి యంగజలక్ష్మియుఁబోలె నున్న యీ
కాంతకు వంశశీలగుణగౌరవయౌవనరూపసత్కళా
వంతుఁడు కాంతుఁడైన గరువంపుఁదపంబు ఫలంబు నొందుఁబో. 50

వ. అని విచారించి సకలలోకవిజయధ్వజుం డగుధర్మధ్వజుండు పాదపదసహ్యారిపుకరటి
సింహుం డగుసింహశీర్ష్యుపమాయుండు హేమాంగదుం డను రూపవిజితమకరధ్వజుం
డగుట మున్న వినియునికిం జేసి తగినవారలం బుచ్చి రప్పించి ప్రియపూర్వకంబుగా
గారవించి శుభముహూర్తంబున నాన్నృపకుంజరునకుఁ గొమరుంజరని వివాహంబుచేసి
మణిగణోజ్జ్వలానేకవిరాజితోపచారంబులం బూజించి యుల్లసిఁ గూఁతు ననర్ఘ్య
రత్నఖచితకనకమయమందిరంబున నుండ నియమించిన. 51

క. రతియును గంతుఁడును శచీ, సతియును నింద్రుండుఁబోలె జలజాక్షియు భూ
పతియుఁ సుఖాంబుధిఁ దేలుచుఁ, జతురత విహరించుచున్న సమయమునందున్. 52

క. హేమాంగదభూపతి తన, భూమికిఁ బోవంగ బుద్ధిపుట్టి విరక్తిః
నేమివిహారమునకుఁ జొర, కేమియు ననకున్న నింతి యిట్లనుఁ దనలోన్. 53

క. ఏకాంతకాంతరూపమొ, యీకాంతునినయనవీథి కిరవైనది గా
కేకాంతంబునఁ గాంతల, కేకాంతులు నెఱపు సడల నిట్లుండుదురే. 54

వ. అని యతనితెఱం గెఱుంగం దలంచి సవినయంబుగా నిట్లనియె. 55

క. ఓనరనాయక భవదీ, యాననమునఁ దెలివి దోఁప దాత్మయుఁ జింతా
దీనం బైనది యీగతి, నానయహీనతనొ మజ్జనకుచేతలనో. 56

వ. అనవుడు. 57

క. నీవలన నప్రియం బొక, యావంతయు లేదు భూతలాధీశుఁడు న
న్నేవలన నుదాసీనత, గావింపఁడు వినుము నామగతి నలినాక్షీ. 58

సీ. ఏను బోత్తునుగాక యెన్నఁడు నారగిం, పనియట్టిభక్తి మజ్జనకుఁ దలఁచి
చెమట నెత్తురుగాఁగఁ జిత్తమ్మునఁ దలంచి, యర్మిలిఁ బెనుచుమదంబఁ దలఁచి

నిమిషంబు ననుఁ బాసి నిలువక యొడఁగూడి, చరియించుమిత్రసఖులఁ దలఁచి
యెయ్యది పనిచిన నయ్యదిఁ జేయుచు నాడ, కనుసన్న మెలఁగుభూజనులఁ దలఁచి
గంధసింధురసైంధవోత్కరముఁ దలఁచి, సతతసేవాగతనరేంద్రవితతిఁ దలఁచి
వనటఁ బొగిలిన నింత యొప్పనివనమున, నున్న బందంబు గాని వేఱొండు లేదు. 59

క. అనిన విని కాముకుం జెక్, యనఘా దీనికి విచార మందఁగ నేలా
జననాథు మెఱిఁగి పోదము, వనభూమికి నతఁడు వినిన మాన్పఁగఁ జాలున్. 60

వ. అనిన నత్తలోదరియు నంతరంబునకుఁ జిత్తం బొసగ నత్త నియ్యకొని హృద్యానవద్యంబు లైన పాణికనకాదిసమస్తవస్తువులు నాయితంబు చేసికొని గమనోన్ముఖుం డైయుండు నంత మార్తాండమండలంబు పశ్చిమాచలప్రాసాదశిఖరంబునకు శాతకుంభకుంభం బై యుల్లసిల్లె నయ్యవసరంబున. 61

క. తమ్మివలు గాక నిగిడెఁ జీ, కమ్మివలు మనంబులోన నల్లడిగొనఁగా
జక్కవలకవలు విరహము, నెక్కువలు దలంచి పరితపింపఁగఁ జొచ్చెన్. 62

క. పగలెల్లను దము నేఁచిన, వగలెల్లఁ దలంచి యిరులుపవుఁజులు దనపైఁ
దెగి యెత్తివచ్చు నని రగి, పగ బెగడినఁ గ్రుంగి నపరవనధి నణంగెన్. 63

క. మెఱుపగ్గలింపఁ జుక్కలు, తఱచై పొడముటయు గగనతల మొప్పారెన్
మెఱుఁగారు ముత్తెములచే, మెఱవడి యగునల్లపట్టుమేల్కట్టుగతిన్. 64

శా. ఉర్వీచక్రమునం జరాచరము లై యొప్పారురూపంబులన్
దుర్వారోన్నతి లోనుచేసికొని చేతోవృత్తి కాశ్చర్య మై
పర్వెం జీఁకటి నీలనిర్మలరుచిన్ భవ్యప్రభావంబునన్
సర్వం విష్ణుమయం జగత్తనుట నైజం బైనచందంబునన్. 65

వ. ఇట్లు క్రమంబునం దమంబు నిగిడి మిన్నుపల్లంబు బయ లోలం బని యేర్పఱుప రాకున్న సమయంబున వటమున్న సాహిణి నడిగి తెచ్చి సన్నద్ధసర్వాయుధం బై యింద్రాయుధం బనుతురంగంబు నంతరంగంబున సంతసం బెసంగ సంగ్రామసహితం బారోహణంబు చేసి పౌరులెల్ల నిద్రించుచుండఁ దలవరులఁ గన్నుఁబ్రామి పురంబు నిర్గమించి నిజపట్టణాభిముఖుం డై యరుగునప్పుడు నిజాన్వయజాతుం డైన హేమాంగదమహీపాలునకు గమననివారణకారణం బైనయంధకారంబు దూరంబు సేయ నుత్సహించు చందంబున. 66

సీ. కై సేసి పూర్వదిక్కామినీమణి మోచు, పద్మరాగంపుదర్పణ మనంగ
వేయికన్నులుగలవేల్పుతొయ్యలిచేతఁ, జూపట్టుచెంబట్టుసురఁటి యనఁగ
విరహులపై దండువెడలంగఁ దమకించు, నసమాయుధునికెంపుటరిగ యనఁగఁ
గల్పకభూజశాఖాశిఖాగ్రంబున, భాసిల్లుపరిపక్వఫల మనంగ

సభ్రమాతంగకులపతియఁ జిత్తమొప్ప, కనకస్ఫటికయనఁగ లోకములకెల్ల
నుదయరాగంబు రాగంబు నొదవఁజేయ, నిందుఁడుదయించె లోచనానందుఁ డగుచు.

వ. తదనంతరంబ. 68

సీ. గంగాప్రవాహంబు గాఁబోలు నని వసి, ష్ఠాను లనుష్ఠాన మాచరింప
నమృతంబు వెల్లువ యని నిలింపాదులు, మునుకొని దోసిళ్ల ముంచి క్రోల
దుగ్ధాంబునిధి యని తోయజాక్షుఁడు శేషు, పర్యంక మింకొని పవ్వళింపఁ
బరమేశుకైలాసరూపం బని బ్రహ్మాదు, లమరు దండప్రణామములు సేయఁ
గలఁప భూనభోంతరములకెల్లఁ దెలిసి, పాసి యమృతదీధిత్కులఁ దొరలి పొరలి
పట్టుముగ నంతకంతకుఁ దనరఁ దనరి, యిట్టులంబుగ వెన్నెల నిట్టవాడెఁ. 69

వ. అంత. 70

సీ. పసగలవెన్నెల మిసిమిపుక్కిటఁ బట్టి, పాసఁగఁ బిల్లలనోర్లఁ బోసి పోసి
నున్ననిక్రియ్యక్కు వెన్నెలతుంపరల్, హుమ్మని చెలులపై నుమిసియుమిసి
కమ్మనివెన్నెల కడుపునిండఁగఁ గ్రోలి, తెలివెక్కి గఱ్ఱఁగ త్రేన్చి త్రేన్చి
కన్నిచ్చలకువచ్చు వెన్నెలక్రొన్నురు, వేటి వే ప్రియురాండ్ర కిచ్చియిచ్చి
తఱచువెన్నెలగుంపులఁ దాటితాటి, యీఱసుగు వెన్నెలలలోనఁ దూఱితూఱి
పలుచనగువెన్నెలలోనఁ బాఱిపాఱి, మెలఁగెఁ బెక్కుచకోరంపుఁబులుఁగుగములు

వ. ఇవ్విధంబున సాంద్రంబైనచంద్రాతపంబున నరేంద్రుం డతంద్రుండై హయంబు రయంబునకు మెచ్చుచు నతిదూరం బరిగి వేకువ యగుటయు నిద్రాలసుండై యొక్కపురోపవన ప్రాంతంబున వటవిటపి నశ్వంబు బంధించి యాతరుచ్ఛాయను నతియంకతలం బుపధానంబుగా శయనించి కన్ను మొగుడ్చునంత. 72

ఉ. రాయిడికత్తెలైన పెనఁ బ్రాయిడియత్తలయింట్లఁ గోట్రముల్
సేయువిలాసినుల్ మునుకు సెందఁగ వేశ్యలప్రక్కదాపులం
బాయనికాముకుల్ వెలుకఁబాఱ కలంగఁగ మ్రోసెఁ గొక్కొరో
కోయని కుక్కుటస్ఫురదసంతతకంఠకఠోరనాదముల్. 73

సీ. శ్రీమదామ్నాయలతామూలకందంబు, పద్మినీమదవతీప్రాణపదము
చక్రవాకానీకసంజీవనౌషధ, మఖిలలోకాలోకనాంజనంబు
ప్రబలాంధకారనిగ్రహరత్నదీపంబు, హరిహరబ్రహ్మవిహారగృహము
కైరవకాననోత్కటకాలకూటంబు, ప్రాలేయవిఘటనాకీలకంబు
రత్నసానుసురక్షణారక్షకుండు, సతతసన్మార్గలంఘునజాంఘికుండు
దివిజకల్లోలినీసపత్నీగురుండు, భానుఁ డుదయించె దేదీప్యమానుఁ డగుచు. 74

వ. అంతనంతవృత్తాంతంబు నెఱింగి ధర్మధ్వజుండు ప్రళయకాలవృషభధ్వజుండునుంబోలెఁ

కోపారుణితలోచనుండై నిజదండనాథుం డగునీతిధ్వజుం బిలిపించి యిట్లనియె.

చ. తగినవరేంద్రసూనుఁ డని తన్నుఁ బ్రియంబున బిల్చి తెచ్చి వ
చ్చిన సుత నిచ్చి పట్టపతిఁ జేసినసింహళరాజసూనుఁ డా
తగవు మదిం దలంపక మదంబున మత్తురగంబు నెక్కి ప్రా
చ్యగతి వసూటిఁ గొంచుఁ బ్రజఁ జొక్కడి పోయినవాఁడు చూచితే. 76

క. చనఁ దలఁచిన మన మనుపఁగఁ, జన నొప్పదె తనకు నిట్టిచలచిత్తునిపై
ననుపను సేనాన్వితముగఁ, జని క్రమ్మఱఁ బట్టి తెమ్ము సమ్ముఖమునకున్. 77

వ. అనిన విని నీతిధ్వజుండు యుద్ధసన్నద్ధాఖిలసేనాసమన్వితుండై యాప్రొద్దె కదలి హేమాంగదుండు చనినజాడ యరసి యతిత్వరితగతిం జని కూడముట్టిన నాభీలంబైన యాకలకలంబాలించి కామమంజరీకాంత పలుదిక్కులుం బరికించి పడగలయడియాలంబులు నిరీక్షించి నిజజనకు సేనాసంకులంబుగా నిశ్చయించి తనపతికి నిద్రాభంగంబు గాకుండ నతని యుత్తమాంగంబున కుపధానంబుగా నొక్కపరిధానంబు చుట్టి పెట్టి తలచీర యాయితంబు చేసికొని సంగరోత్సాహం బంతరంగంబునం బొంగ సన్నద్ధసర్వాయుధం బైన యింద్రాయుధంబు నారోహణంబుచేసి ప్రాణేశ్వరచరణస్మరణపరిణతాంతఃకరణ యగుటను రణవిహరణంబు తృణకణాయమానంబుగా గణించుచు వటవిటపి కనతిదూరంబున వచ్చుచున్న శత్రుబలవాహినిలోనికి నిజవాహనంబు నుఱుకఁ దఱియంబఱపి. 78

మ. మదదంతావళదంతముల్ నఱకు సమ్మర్దంతు లుద్భ్రాంతతన్
బెదరం బల్లము గుఱ్ఱముల్ గవుతునన్ వేటాడుతుండెంబులై
చెదరంగా వడి వ్రేయు వీరరథికశ్రేణిన్ బలౌఘంబులం
గదియం జేయు ఘటాలిఁ ద్రుంచు విలసద్ఘోరాసిధారాహతిన్. 79

చ. ప్రతిబలవార్ధి బాడబముభంగి దహించును రామపోలికన్
శితశరధారపాల్పడుచుఁ జెల్లెలికట్టయుఁబోలెఁ బాఱినీ
కతులితలీల నాఁగు మునియచ్చునఁ బొంకమణంచు మందర
క్షితిధరవృత్తిమైఁ గలఁచుఁ జిత్రముగా లలితాంగి యుక్కునన్. 80

క. సరినాథానము సేయుట, యరిఁబోయుట తివియు ఛేయు టద్భుతకరమై
తరుణిశరంబులు భానుని, కరములగతి రిపులగములఁ గప్పెఁ దఱుచుగన్. 81

క. కప్పిన మదిలో నెంతయు, నుప్పొంగెడు రౌద్రరసమహోగ్రత నింతిం
దప్పక కనుఁగొని కన్నుల, నిప్పులు రాలంగ వాహినీపతి పల్కెన్. 82

క. అక్కున నిడుకొని మక్కువ, పెక్కువమై నేను బెనుపఁ బెరిఁగితి నేఁడుం
జిక్కడిచిన వస రాలేదు, నిక్కము నాకోలుతలకు నిలువఁగఁ గలవే. 83

వ. అనవుడు నక్కాంతారత్నంబు. 84

క. తనయింటిదీప మనుచును, విను ముద్దాడికొనఁగఁ దలఁచుచుఁ జేడె గలఁడే
నను మాఱ్కొనఁగఁ దలంచెదు, మును గెంచినమందె మేలమున నాలమునన్. 85

క. ననుఁ గినియఁ జేసి మగుడం, గనఁ గలవే నీవు పురికి స్వామిహితుఁడ వై
చను మింక నింద్రపురమున, కనినం గోపించి యేసె నతఁ డంపగముల్. 86

క. ఏసిన నవి పొడిచేసి శ, రాసనముం దునిమి వేయ నతఁ డొండొక బా
ణాసనము నెక్కువెట్టి శ, రాసారము గురియఁ దోఁగె నంబుదము క్రియన్. 87

వ. ఇత్తెఱంగున నొండొరులకు వట్రపడక నయ్యిరువురుం బలంబును బలంబును మెఱయ దృష్టిముష్టిలక్ష్యలక్షితశీఘ్రతరశరసంధానాకర్షణమోక్షణనానాపాతనాద్యనేకధనుర్విద్యాకౌశలంబులు మెఱయుచుఁ బెద్దయుం బ్రొద్దు మహాయుద్ధంబు సేయుచున్న సమయంబునఁ గామమంజరి నీవిద్యానిర్ధరధ్వసారథుల నీలవాజుల నాఖిలనల్లంబులు నై త్లెసి పొడిచేసి పేర్చిన నతండు విరథుండయ్యును బోలివోవనివాలిమి నతినిశిత విశిఖంబులు వఱపిన నత్తన్వి కోపమునఁ దలఁచక యయ్యెను గోపావేశంబున నయనాబ్జ పత్త్రి నేత్రయై యతనికోదండంబు ఖండంబులు చేసి నఱికియును. 88

తే. ఎత్తె నెత్తంగఁ జాపంబు లెన్నియేనిఁ, దోమ శోడనె దునుమాడి తోయజాక్షి
తోమరము వైవ నడుమన త్రుంచి వైచెఁ, గుంత మెత్తినఁ బొడిచేసెఁ గుంత మొత్తి.

వ. ఇవ్విధంబున. 90

క. ఆహవమునఁ దరుణీమణి, సాహాటోపమున సైన్యపతిఁ దూలించెన్
సాహసము పద్మిణం బని, యూహింపఁగ సతులకెందు నుచితము కాదే. 91

వ. ఇట్లు వికలసకలాయుధుం డై సేనానాయకుండు. 92

క. కనుకనిఁ బఱచిన నాతని, వెనుకొనుటయు వాఁడు శరణు వేఁడినమాత్రం
గినుక యుడిగి తొయ్యలి మదిఁ, గనికరము జనింప విగిడెఁ గాంతునికడకున్. 93

ఉ. అంతట మేలుకాంచి వికచాబ్జముఖిం దురగంబు గానమిం
జింత జనింప నున్న నృపసింహుఁడు గాంచె మహాగ్రహార్తుఁ డై
సంతసమార వచ్చి నిజప్రియకామిని నుగ్రసంగర
శ్రాంతశరీరిణిన్ మహితసజ్యశరాసనబాణధారిణిన్. 94

చ. కని తురగాధిరూఢగతిఁ గార్ముకబాణకృపాణపాణి వై
చనిననిమిత్త మెయ్యది నిజం బెఱిఁగింపు మనంగ నాథుతో
వనజదళాక్షి యిట్లను నవారణ నన్నును నిన్నుఁ బట్ట మ
జ్జనకుఁడు దాడిమైఁ బనిచె సైన్యయుతంబుగ దండనాథునిన్. 95

చ. పనిచినఁ గూడముట్టినృపాలక సైన్యముఁ గాంచి కొంచెపుం

బనికయి నీదుముద్రకును భంగ మొనర్పఁగ నేల యంచు నేఁ
జని యనిచేసి తత్ప్రబలసైన్యము నెల్లను గూలఁద్రోలి వే
వెనుకొన భీతుఁడై శరణువేఁడినఁ గాచితి సైన్యనాథునిన్. 96

వ. అనివిన్నవించి హయావతీర్ణుండై కృపాణబాణాసనతూణీరంబులం దురంగంబు
పై నెప్పటియట్ల పదిలపఱిచి విజయవినమితోత్తమాంగుండైన యత్తన్విం జిత్తం బిగు
ర్కొత్త సమీపంబున నునిచికొని యతం డిట్లనియె. 97

క. తలఁపఁగఁ గయ్యపువెరవున, నలవును నీ కమ్మపడుట యచ్చెరు విస్త్రీఁ
దలపూనాడక యుండఁగ, బలుసేన జయించి తిట్టిభార్యయుఁ గలదే. 98

తే. అనుచుఁ బ్రియురాలిఁ జేరంగ నల్లఁ దిగిచి, ఘనకుచంబులు విపులవక్షంబుతోడఁ
గదియఁ జేర్చుచు బిగియారఁ గౌఁగిలించి, విజయ మగ్గించి చెవులకు విందొనర్చె. 99

వ. కదళీయచ్ఛోటికనతిదూరంబునఁ దేటనీట నొప్పారునేట సంధ్యావందనాదికృత్యం
బులు నిర్వర్తించి యమ్మేటిబోటియుం దానును ఘోటకంబునుం దత్కాలోచితాహా
రంబులం దృప్తి సలిపి కాలుకొన్న యంత నేల యరిగి యపరాహ్ణసమయంబున నొక్క
పురవరోపాంతంబున నేకాంతంబై శశికాంతోపలరచితంబైన కాళికాస్థానంబున విడి
సి యున్నంత నత్తలోదరి తనమగనిచేతికి నొక్కసౌన్నాటంకం బిచ్చి యప్పట్టణం
బున నాహారం బడిగి తెమ్మనుటయు. 100

క. అన్నరపతి తగులాగున, నన్నగరము చొచ్చి యొల్లయంగళ్లందున్
సౌన్నాటంకం బిచ్చెద, నన్న మిడెదువారు గలరె యని యడుగుతఱిన్. 101

క. విన్న జనము లవ్విభునిం, గన్నారం జూచి యాదిగర్భశుఁ డితం
డెన్నఁడుఁ బ్రయాసమునకుం జన్న తెఱఁగు దోఁప దేల చనుదెంచెనొకో. 102

క. సౌన్నాటంకము నేయఁగ, నన్నము దన కెట్టు వెట్ట నగు గరగరగా
విన్ననువున నని పలుకుచు, నున్నన్ విన్నఁదన మొసఁగ నున్నకుమారున్. 103

క. కనుఁగొని విలాసవతి యనఁ, జనువారవధూటి దాసి చని తద్విధమే
లిసదాని కెఱుఁగఁ జెప్పి త, దనుమతిఁ గొనివచ్చె నింటి కాన్నృపతనయున్. 104

వ. ఇట్లు వచ్చిన హేమాంగదమహీపాలు నయ్యబల యభ్యంతరమందిరంబునకుం దోడ్కొ
నిపోయి సమున్నతకనకాసనంబున నునిచి తత్క్షణంబ. 105

ఉ. మజ్జనభోజనాభరణమాల్యవిలేపనవస్త్రరాజిచే
బుజ్జవమారఁ దృప్తిసనఁ బూజలొనర్చి లతాగృహంబులో
గొజ్జఁగనీటఁ బైచిలికి క్రొవ్విరిజాజులఁ జేసినట్టిపూ
సెజ్జకుఁ దార్చి చిత్తజవిశేషసుఖంబుల నోలలార్చినన్. 106

వ. ఇట్లు వారసీమంతినీకృతనిరంతరలతాంతశరలీలాసంతోషితస్వాంతుండై మైమఱచి

మహాకాంతుండు నిజకాంతవలనిచింత యావంతయు లేక యుండె నంత. 107

చ. ఉదయమునం దలిర్చుదిశ నొల్లక తన్వసుహీనుఁ జేయు మిం
గదిసి ప్రతీచిఁ జెందె దిననాథుఁడు భూరమణుండు సంతతా
భ్యుదయముఁ గోరుచున్నసతి నొల్లక తన్వసుహీనుఁ జేయఁగా
మదిఁ దలపోయు వారసతి మచ్చికఁ జెందినలీల నత్తఱిన్. 108

వ. ఇట్లు సూర్యాస్తమయం బగుటయుఁ దనపతి రామికిఁ గామినియంబుజాక్షి కరంబు సంతాపతాంతఃకరణ యై. 109

చ. ఇరవున దల్లిదండ్రులను నెత్తిన నెంచినవారిఁ బాసితిన్
దురమునఁ దండ్రి సైన్యపతిఁ దోలితి సేనలతోడఁ గూడ నీ
పురుషుని మీఁదిభక్తి మెఱి పోయి యితండును బోక పెక్కు నె
ప్పరుసున నోము నోఁచితినొ ప్రాక్తనజన్మమునందు నక్కటా. 110

వ. అని విలపించుచున్న సమయంబునఁ గాళికానికేతంబునకు నొక్కవృద్ధాంగన చను దెంచి దీపికానికరంబు సమర్పించి మనోహరరూపలక్ష్మియుం బోలె నున్న యత్తన్వి నిరీక్షించి నీ వెవ్వ రెందుండి యేమికతంబున వచ్చి యిచ్చట నుంటి వన్నఁ గాన వనితయుం దన వృత్తాంతంబంతయు నెఱింగించిన. 111

క. అజ్జరఠ దోడుకొని చని, మజ్జనభోజనము లాత్మమందిరమున నా
లజ్జావతి కొనరించి సు, హృజ్జనభావంబు నడపి హృదయముఁ దేల్చెన్. 112

ఆ. మగఁడు చన్నదెసకు మనసు జనియుండఁ, జెయ్వు వెఱఁగుపడినఁ జన్నులు సారని
వృద్ధవనితకథలు వెడవెడ నాఁకొంచు, నుండె వగల నుగిలి యుత్పలాక్షి. 113

క. వేగింపరాని వేదన, వేఁగింపఁగ నంత ప్రొద్దు వేగియు సతికిన్
వేగకయుండెను దైవని, యోగంబున నంతఁ బతివియోగము కతనన్. 114

ఆ. ఎట్టకేల కట్లు హితవచనంబుల, నవిద నూఱడింప నుల్లమునను
లేనిధృతి ఘటించి లేమ యాపూఁబోఁడి, దానిఁ బిలిచి ప్రియము సాఁగఁ జెప్పె. 115

క. క్షోణీనాయకుఁ గానము, ప్రాణములును మీన వెడలఁబాఱం జొచ్చెం
బ్రాణసఖి యేమెరవునఁ, బ్రాణేశ్వరు నన్నుఁ గూర్చి బ్రతికింపఁగదే. 116

క. పతి కలుగకుండె సౌఖ్యము, సతులకు నొండొకటి గలదె చర్చింపంగాఁ
బతిలేమి సర్వశూన్యము, పతి గలిగిన సతికి నిద్రపద మది యేలా. 117

వ. అనినం బూజరిసాని యత్తెఱంగున నైన భూవరోత్తము న్వెదకి తెత్తు నని యరిగిన.

తే. మగనిపోకకుఁ గడలేనిదిగులు వొదవఁ, గామమంజరి యంతయుఁ గళవళించి
యరయఁ బోయినయంగన తెరువు చూచి, వనట నిట్టని తలపోయు మనములోన. 119

సీ. పూర్ణచంద్రాననుఁ బోడగాంచి వచ్చినఁ, గొడిగినతోడవు లాపదఁతి కిత్తు

కమలాప్తతేజుని గన్నార నేఁ గన్నఁ, గాళికాదేవికిఁ గ్రాసమిత్తు
సింహాసనస్థునిపల్కు చెవిఁ జేర్పఁ గల్గిన, దీనావలికి భూరిదాన మిత్తు
రాజశేఖరుపరిరంభణం బబ్బినఁ, గోటిగోవుల విప్రకోటి కిత్తు
ననుచుఁ జింతించుఁ దనలోన నట్టె నవ్వుఁ, జెక్కుటద్దంబు గదియంగఁ జెయ్యి సేర్చు
వెగచు దైన్యంబు వొదలంగ విహ్వలించుఁ, బనవుఁ గొనగోరఁ గన్నీరు పాయ మీటు.

చ. ఎదురఁ జరించినట్లయిన నింపగుపల్కులు పల్కఁజూచుఁ దక్
గదిసిన చంద్రమైన నిఱికౌఁగిటఁ జేర్పఁ గడంగు భీతుఁ డై
పదముల వ్రాలిన ట్లయినఁ బాణితలంబున నెత్తఁ గోరు నే
యదియును లేక రిత్తయిన యంబుజలోచన యార్తిఁ జెందెడున్. 121

ఉ. పట్టణమెల్ల దేవిగుడిభాగమని యాగసి తోడితెచ్చెనో
కట్టెదురన్ నృపాలుఁ గని క్రిమ్మఱ నా కెఱిఁగింప వచ్చెనో
యిట్టును నట్టునుం దిరిగి యెందును గానక తానె వచ్చెనో
యట్టిద యైన నా మనికి కాస్పద మెయ్యదియొక్కొ దైవమా. 122

వ. అని యిట్లు కామమంజరి పురుషవియోగంబున నాతురచిత్త యై తలపోయుచున్న
సమయంబున. 123

ఉ. భూరమణీశుఁ దెత్తు నని పోయెద నిప్పుడు పంతమాడి యే
నూరక యింటికిం జని తలోదరి నే మని చూతునంచు దు
ర్వారవిచారభావమున వట్టుచు మోమున దైన్య మొందఁ బా
జారివధూటి వచ్చి జలజాతవిలోచనఁ జేరి యిట్లనున్. 124

క. పురము గలయంత మేగయు, నరసితి నిల్లిల్లు దప్ప కతిశోధన నీ
వరుఁ డెందుఁ గానఁబడఁ డే, ప్పురుసున నీకరుణపడయు భాగ్యము లేమిన్. 125

చ. అనినఁ దదుక్తి వీనులకు నస్త్రమయంబయి తాఁకి మూర్ఛ వ
చ్చిన ధర వ్రాలి యంతయు నచేతన యై మఱి యెట్టకేలకుం
దనువునఁ దాల్మి దెచ్చుకొని దైవకృతంబులు మానవంబు గ్రి
క్కున ననలప్రవేశమునకుం గృతనిశ్చయ యయ్యె నంతటన్. 126

వ. సర్వసన్నాహంబును మెఱయఁ గాళికానికేతనంబునకుం జని యమ్మహాశక్తికి దండప్రణామం బాచరించి వెడలి తదాలయపురోభాగంబున ఘృతప్లుతమలయజాగురు రక్తచందనదేవదారుపూరితంబును ననలోపేతంబును గర్పూరాదిసుగంధబంధురంబును నైన యగ్నికుండంబునకుఁ బ్రదక్షిణప్రణామంబు లాచరించి ప్రవేశించునప్పుడు జన్మజన్మంబునందును హేమాంగదమహీపతియె నాకుం బతి గావలయు నని కుండమధ్యంబునం బడుటయు నట మున్న తదాలోకనకుతూహలాంగదుం డయ్యును నయ్యబలనిరీక్షింప

వెఱచి విలాసవతీమధురసల్లాపాయత్తచిత్తుం డైన హేమాంగదుండు విని తలంచికొని యదరిపడి తన్నుఁ దాన నిందించుకొనుచు విలాసవతీకరకీలితం బైన కేలు తిగుచుకొని.

క. నా నేరమి వలనఁ బయ్యో, జానన వైశ్వానరునకు నాహుతి యయ్యెన్
దీనికిఁ బ్రాయశ్చిత్తం, బానని తనమేను వహ్ని కాహుతి చేసెన్. 128

క. చేసిన విలాసవతి తన, చేసినదోసమునఁ గాదె శిఖిఁ బడి కీరల్
వాసవపురికిం జని రని, వాసిగఁ దన మేను నిచ్చె వహ్నికి నంతన్. 129

క. అవ్వారాంగన బాసిన, మువ్వురు నీల్గుటకుఁ దాన మానం బనుముక్
నెవ్వగలు వగల నీనం, గ్రొవ్వాతి వెసఁ జొచ్చె నగ్నికుండములోనన్. 130

వ. అంత నమ్మహాకాళి యెల్లవారును వినుచుండ. 131

క. కడచిరి నలువురు వహ్నిని, బడి యొక్కట నేను జూడ బ్రదికింపఁగ ని
ప్పుడు వీరి ననుచుఁ దా నొక, పడఁతుక మేనను వసించి పల్కె సమాత్రిన్. 132

క. వెలఁదియు ధరణీవిభుఁడును, వెలయాలును దాసిఁ గూడి విమలాకృతులై
వెలువడిరి యగ్గిగుండము, జలరుహషండమున నుండి చనుదెంచుగతిన్. 133

వ. తదనంతరంబ ధర్మధ్వజాతనయ తనప్రాణేశ్వరు నింగితం బెఱింగి యిట్లనియు. 134

ఉ. కారణ మేమి నాయుసుఱు గల్గిన సర్వము గల్గు నాక నా
వారవధూటియయ్యె ననివారణ దారుణవహ్నికుండ మి
ధారుణి మెచ్చ మీవెనుకఁ దానును దోడనె చొచ్చెఁ గాన ని
వారజనేత్ర మీకృప కవశ్యముఁ బాత్రము సేయఁగాఁ దగున్. 135

వ. అనినఁ గామమంజరీసముచితాలాపంబులకు సంతుష్టాంతరంగుం డై హేమాంగదుండు విలాసవతిం దోడ్కొని పోవుకౌతుకంబును దానితల్లిదండ్రుల కెఱింగించి వారల నుచితసత్కారంబులఁ బరితోషితులం జేసి యనంతరంబ. 136

క. రమణులు శిబికారోహణ, రమణీయత మెఱసి కొలిచి రాఁగా ధరణీ
రమణుఁడు నిజపట్టణమున, కమరేంద్రాయుధము నెక్కి యరిగెం బ్రీతిన్. 137

క. అని యిట్లు దివియగంబము, జనవినుతరసప్రసంగ సంగతవదనా
జనితకథామధుధారల, మనుజేంద్రుని చెవులఁ జవులు మరగించి తగన్. 138

క. వీరలలో సాహస మె, వ్వారిది యనవుడు నృపాలవర్యుఁడు నగుచున్
వారసతీమణిసాహస, మౌరా యని మెచ్చవచ్చు నని పల్కుటయున్ 139

సీ. మణిమయకర్ణభూషణమరీచులతోడ, వెలఁదిమోముపులుమించు పయ్యెదందఁ
జెక్కుల మకరికాచిత్రరేఖలతోడఁ, జిఱునవ్వువెన్నెల చెలిమి సేయఁ
బయ్యెదకొంగుల బంగారుమెఱుఁగులఁ, జనుదోయితళుకులు చనవు మెఱయ
మంజీరకంకణమంజులధ్వనులతో, మేఖలారావంబు మేలమాడ

ముసుఁగు దొలఁగించి తనులత మోద మడరఁ, బద్మమధ్యంబునం దున్న పద్మవోలె
హంసతూలికాతల్పంబునందునుండి, యాకళావతి మనుజనాయకునిఁ జూచి. 140

క. దీపియుగంబంబునను, జీవము గల్పించి కథలు చెప్పింపంగాఁ
బ్రావీణ్యము గల్గియు నీ, వీవిధమునఁ దప్పఁజెప్పు టిది నిపుణతయే. 141

క. తనపతిఁ గానక యెంతయు, మనికిత్రపడి వచ్చి కాముమంజరి చొరఁగాఁ
గనికరమున నక్కాంతుం, డనలశిఖ లోనఁ జొచ్చె నవ్విధమునకున్. 142

క. కడుఁజోద్య మంది లంజియు, నుడిచినఋణ మెడల నగ్నికుండముఁ జొచ్చెం
గుడువక కట్టిక కానిస, పడుటయు సాహసము గాక సార్థవముఖ్యా. 143

వ. అని పల్కి కళావతీనితంబిని కాదంబినీసమాక్రాంత యైనక్రొమ్మెఱుంగు తెఱంగునం
గృతావకుంఠ యగుట యవలోకించి. 144

ఉ. అష్టమహావిభూతికలనాహవమంత్రజనానువర్తనా
దుష్టవిరోధమంత్రిజనదుర్వహగర్వప్రమోదకర్తనా
యిష్టఫలప్రదానదివిజేశ్వరధేనుసమానకీర్తనా
శిష్టజనప్రమోదకరజీవితవైదికధర్మవర్తనా. 145

క. కుకురు కురు చేర కేరళ, శక మరు కర్ణాట లాట సౌరాష్ట్ర మహా
పకుమంత్రిజనమనీషా, నికషోపలనయకలాప నిగమాలాపా. 146

మందారదామము.

శృంగారరేఖావిశేషస్వరూపా, రంగజ్జనానీకరక్షాదిలీపా
సంగీతసాహిత్యసారస్యలోలా, యంగీకృతాంగీకృతాచారశీలా.

గద్యము. ఇది శ్రీమదఖిలకవిమిత్త్రి పెద్దయ యన్నయామాత్యపుత్త్రి
శారదాదయావిధేయ జక్కయనామధేయప్రణీతం బైన
విక్రమార్కచరిత్రం బనుమహాకావ్యంబునందు
సప్తమాశ్వాసము.

శ్రీరస్తు.

విక్రమార్కచరిత్రము.

అష్టమాశ్వాసము.

శ్రీమహిళాంచితహృదయా
శ్రీమద్వాణీవిలాసజిహ్వాగ్రతలా
క్ష్మామహితదక్షిణభుజా
సీమాద్రిమహారకీర్తి సిద్ధనమంత్రీ 1

వ. ప్రతిపక్షక్షితిపాలశాలపలపర్ణధ్వంసనారంభజృం
భితనిస్త్రింశుండు విక్రమార్కుండు గుణాభిజ్ఞుండు దేవోపవిని
ర్జితదీప్తార్కుండు కాంతిసోముండు సుఖక్రీడాకలాపైకమం
డితుండై మూండవనాటి యత్తరుణి నాడింపంగ నుద్యుక్తుండై. 2

ఉ. చారుసువర్ణపూర్ణకలశంబునకుం దనమంత్రవిద్యచేఁ
గోరి సచేతనత్వమును గూర్చి యపూర్వకళామహోదర
శ్రీ రుచి మీఱ నొక్కకథ చెప్పఁగదే యని యానతిచ్చినం
గూరిమితోడ నాకనకకుంభము సంభ్రమ మొప్ప నిట్లనున్. 3

శా. శృంగారాదిరసప్రసంగములు గాఁ జెప్పంగ నేర్తుం గథల్
సాంగోపాంగముగాఁగ నొక్కకథ సువ్యక్తంబుగా నన్వయిం
పంగాఁ జెప్పెదఁ జిత్తగింపు మని చెప్పం జొచ్చె భూపాలుతో
సంగోత్పాదకవాగ్విశేషరచనాచాతుర్య మేపారఁగన్. 4

సీ. మాణిక్యసుందరమహనీయకందరభరితబంధురవింధ్యగిరిసమీప
మున వివేకనిధాన మనుపట్టణమునందు శుభ్రతవర్మ యనుమహాక్షోణినాయ
కునకుఁ బద్మావతి యనఁగ గుణావతి యనఁగ లీలావతి యనఁగఁ గలరు
ముగురు గూఁతులు జగన్మోహనాకార లనంగశాస్త్రవిదగ్ధ లతివినీల
కుటిలకుంతల లమ్దకుంభికుంభయుగళ, గురుకుచలు వారిఁ దగినట్టివరులఁ గోరి
వరుస మూఁడుమాళ్ల నిలిపె నావసుమతీశుఁ, డంత నాపురి లోకపరిహాసకుండు. 5

ఉ. హారివరాంగనాజనవిహారి విదూషకచక్రవర్తి సం
సారసుఖైకసారఘనసారపటీరవిలిప్తమోహనా
కారుఁ డనూనకాముకశిఖామణి పుష్పకరండకుండు నా
జారుఁ డొకండు వచ్చె నగరస్థితి రెండవమారుఁడో యనన్. 6

సీ. కొదమచందురునిలోఁ గొదమక్రైవడి మించు నటియించుసన్నపునాభి వెట్టి
ములుపడి ప్రావడ్డ వలరాజు డాగుల మీఁద గందపుఁబూఁత మేళవించి
తేఁటిరెక్కలకప్పుఁ దెగడెడుకొప్పున బాగుమీఱఁగ వన్నెపాగ చుట్టి
తనరుజవ్వాదివాసనలచేఁ జెన్నొందుచిన్నిగేదఁగి రేకు చెంపఁ జెరివి
కప్పురపుసోనపలుకులఁ గమ్మఁదావి, గుబులుకొనుచున్న విడియంబుసొబగుతోడ
రమణఁ జూపట్టు పుష్పకరండకుండు, హరునికనుదృష్టి దాఁకనిమరుఁ డనంగ. 7

ఉ. వచ్చి పురంబువాకిట రునారపుఁగోడెతనంబుతోడఁ గ
న్నిచ్చకువచ్చుచేడియల నెచ్చరికించుచు ధూర్తకోటితో
మచ్చరికించుచుం వెకలిమాటలు మాయపుఁగూచిమారపుం
బచ్చలు చూపుచుం జెలువిపాఱఁగ నవ్వుచుఁ గేకరించుచున్. 8

క. కన్నుండెఁగఁ గనుపాపను, గొన్నవిధంబునను సతులఁ గూడకయును దాఁ
గన్నమిడి మనోధనములు, గ్రన్ననఁ గొనిపోవు కన్నకాఁడుం బోలెన్. 9

వ. ఇట్లు వివేకనిధానం బనుపట్టణంబునఁ బుష్పకరండకుండు బహుప్రకారంబు లగు
నిచ్ఛావిహారంబులం జరియించుచుండ నొక్కనాఁడు కామశాస్త్రికళావేదు లైనవిట
విదూషకపీఠమర్దకనాగరకులతోడ బహువిధస్వైరిణీగణప్రసంగంబులం బ్రొద్దుపుచ్చు
చున్నసమయంబున మీదేశంబునఁ గ్రొత్త లగువార్త లెయ్యవి యెవ్వరెవ్వరివలన నే
మేమిచోద్యంబులు గల వెఱింగింపుఁ డనిన వార లిట్లనిరి. 10

ఆ. ఇప్పురంబు చెంత నొప్పుమహాఘోష, పట్టణమున జాగపతులపాలి
భాగ్యలక్ష్మి యనఁగఁ బద్మావతీకాంత, వినుతికెక్కు మూర్తివిలసనముల. 11

చ. తొలుకరివానకాలమునఁ దోఁచుమెఱుంగు పసిండిసీటు తే
టలఁ బలుమాఱుఁ బుల్కడిగి డాఁచినమన్మథమోహనాస్త్రమో
వలపులవన్నెలం దొలఁచి వారిజసంభవుఁ డాఁడురూపుగా
నలవడఁజేసెనో యనఁగ నాకమలానన యొప్పు నెంతయున్. 12

ఆ. కొలను చొచ్చి పుచ్చుకొని తన్ను మదనుండు, రూపు సేయ ముల్లుమూపెఁ గాక
లేకయున్న మీన మాకాంతచూపుల, వలల వటికి వఱతఁ గలయ కున్నె. 18

ఆ. రమణ రాజమండలము నట్టనడుమఁ జా, పట్టఁ బట్టి మిన్నుముట్టెఁ గాక
గాకయున్న హరిణ మాకంజముఖిచూపుఁ, దూపు లడఁగ నడవిఁ దూఱకున్నె. 14

చ. సరసవినూత్నరత్నరుచిజాలముచేఁ దిలకించుచున్నయా
గురుకుచచక్రకొమ్మెలుంగుఁజనుఁగుబ్బలతో సరిసేయవచ్చునే
తొరలి హిరణ్యకుంభములదొడ్డతనంబులు చెప్పనేటికిఁక
గురుతయ దేల కల్గు గుడిగుండములం బడునట్టివారికిన్. 15

చ. వరుఁడు ధనుర్ధరుం డయి దివానిశముల్ వెనుకం జరింపఁగా
వెఱవున మోసపుచ్చి తనవేడుకవచ్చినయట్టివారితో
సరసరతిప్రసంగములు సల్పఁగ నేర్పుఁ దదీయనైపుణ
స్ఫురణము చంద మెందును నపూర్వము చూడఁగఁ బొమ్ము గ్రక్కునన్. 16

వ. అనుటయు. 17

చ. చెలఁగి కటారిబిత్తరము చిమ్ముప్రకారపునవ్వు నవ్వు మీ
సలు వడివెట్టు నారిక ముజా యనుఁ దన్ననయంబుఁ బాఱఁగ
న్నులు వెసఁ ద్రిప్పు కొప్పుపయి నున్నగ దువ్వు బళాలు వెట్టు మూఁ
పులు పలుమాఱుఁ జూచుకొనుఁ బుప్పకగండడుఁ డాత్మ నుబ్బుచున్. 18

ఉ. క్రన్నన వారి వీడుకొని కన్నులఁ ద్రొక్కి వెసం దలారి యై
క్రొన్ననవింటిఁ దేటిగఱికోల యమర్చు మరుండు వెంట రా
మున్నుగ నెమ్మనంబు తనముందటి చక్కిని ద్రోవ వెట్టఁగాఁ
గన్నియయూరి కేఁగెఁ దమకంబునఁ బుష్పకగండడుం డొగిన్. 19

వ. అరిగి మహోఘోషపురవరోపాంతంబున శశికాంతశిలాతలంబునఁ బథశ్రమం బాఱ్చు
కొని తదవసరోచితాలంకృతుం డై యన్నగరంబున కరిగి మానసపద్మసద్మ యగునప్పద్మ
గంధిమందిరంబు పౌరజనంబులవలన నెఱింగి మందమందగతిం జని తన్నికేతనంబు
ప్రవేశించి. 20

ఉ. ప్రాకటహేమరత్నమయపంజరపీఠికలన్ శుకంబు ల
వ్యాకులలీలతో రతిరహస్యవికాసకళావిలాసకో
క్కోకము లర్థితోఁ జదువఁ గూరిమితో వినుచున్ సురూపరే
ఖాకమనీయతామహిమఁ గామునిదీమముఁబోలె ముందటన్. 21

సీ. రంజితమణిసాలభంజికలకుఁ దనభాసురాకృతి మేలుబంతి గాఁగ
రత్నపంజరకీరరాజికిఁ దనవాక్యసమితి గురూపదేశంబు గాఁగఁ
గమనీయకలహంసగతులకుఁ దనగతి యొఱపులు గఱపెడియొజ్జ గాఁగ
ఘనసారగంధవాహానునకుఁ దనయూర్పుఁదనిగాలి నెయ్యంపుదాది గాఁగఁ
దివిరి నడయాడుచుండుపూఁదీవె యనఁగ, నేకతము నగరం జరియించుచున్న
కంబుకంఠిఁ బద్మావతీకాంతఁ గాంచెఁ, బెన్నిధానంబు గాంచినపేద వోలె. 22

తే. కన్ను మనమును దనియ నక్కాంతఁ జూచి, యింతయొయ్యార మగునతి యెందుఁ గలదె
యనుచుఁ బ్రియమును గంపంబు నసఁగి వెనఁగ, నల్లఁ జేరంగ వచ్చినయతనిఁ జూచి.

మ. సుకుమారుం డగుమారుఁడో కళలచే సొంపారుపాంచాలుఁడో
యకలంకుం డగుకూచిమారుఁడో యితం డంచుం బ్రశంసించుచుం
బ్రకటస్నేహ మెలర్ప నాతనిపయిం బద్మావతీకాంత వా
లికక్రొవ్వాఁడి మెఱుంగుఁజూపుల నివాళించెం గువాళించుచున్. 24

క. కనుఁగొనినమాత్ర నొండొరు, మనములు నాఁటఁబడిన వారి మతియుక్కడసుం
జనకుండ నడ్డపెట్టఁగ, మనసిజుఁ డనుకోలుకాఁడు మాటికిఁ దఱిమెన్. 25

క. పూవులవక్కాణంబున, నాపుష్పకరండకాఖ్యుఁ డరుదెంచినమూ
ర్గోపాయపుఁగార్యస్థితి, దీపించినఁ బరిణమించి తిలకించి మదిన్. 26

ఉ. ఈసుకుమారతావిభవ మీదరహాసముఖారవింద మీ
భాసురమూర్తి యీలసదపారకృపారసనేత్రకాంతి యీ
న్యాసము లెందుఁ గంటిమె ప్రియంవదుఁ డీతనియంద కాక నేఁ
జేసినభాగ్య మెవ్వరును జేయరువో యితఁ డేఁగుదెంచుటన్. 27

తే. అనుచుఁ గొనియాడి తిలకించి యావధూటి, చిన్నిలేనవ్వు చెక్కులఁ జీరువాఱ
సిగ్గు నెగ్గించుమధురోక్తి చెవులఁ జిలికి, యెలమి మజ్జనభోజనాదులను దనిపి. 28

వ. తదనంతరంబ వసంతుం డనునిజసఖుం బిలిపించి చౌర్యగతికళావిధేయంబు లగుమా
యోపాయంబు లుపదేశించిన వాఁడును దదుక్తప్రకారంబునఁ బుష్పకరండకుం బురో
పకంఠోపవనాంతరంబునకుం దోకొని యాత్మీయపరిధానసంకేతలతానికేతనంబున నుని
చికొని సముచితసల్లాపంబు లొనరించుచున్నంత నిక్కడ. 29

క. మగఁ డింటికిఁ జనుదెంచిన, మొగమోటము వట్టిమోహమును జిత్తములో
నిగుడొత్తి మెఱుఁగుఁజూపులఁ, జిగురాకుంబోఁడి పూజచేసె న్నగుచున్. 30

ఉ. ఆయన మీఁ దెఱుంగక ప్రియంబు నిజం బని నమ్మి మోహముం
జేయుట చూచి నావలఁ జిక్కె నితం డని కౌఁగిలించి సౌ
ఖ్యాయతకంఠరావమును రాధరపాననఖాంకనక్రియో
పాయములందు మైమఱవఁ బద్మపలోచన యీలవెట్టుచున్. 31

సీ. మకరందములతీపు మగలకుఁ జవిచూపు మధుకరమదవతీమణులయొప్ప
ఫలరసంబులు క్రోల్చి పతుల నిక్కమెఁ బిల్చి కొనిపోవుకీరకామినులబెడఁగు
బిసములఁ దనియించుప్రియులతో విహరించి యలరురాయంచతొయ్యలులచెలువుఁ
బల్లవంబులు దెచ్చి ప్రాణేశ్వరుల కిచ్చి చెలఁగెడుకోకిలస్త్రీలమురువు
నెలమిఁ గొనియాడి యాత్మేశు నియ్యకొల్పి, యతఁడు నతినందుఁ గార్ముకహస్తులగుచు

తోడఁ జనుదేర జారనాథుఁడు వసించు నుపవనాంతరభూమికి నుపిచి చనియె. 32

క. చని యాదంపతు లాత్మల, ననురాగరసంబు నిండి యలువులువారన్
వనకేళీతత్పరులై, వినుతవిహారములఁ నెగిలి విహరించుతఱిన్. 33

క. పదములు తొట్రుపడంగా, వదనంబున లేనిదప్పి వాతెఱ యెండం
గదియఁగ వచ్చి వసంతుఁడు, హృదయమున భయంబు నొంప నిట్లని పలికెన్. 34

చ. కటా వెరవేది నేఁ బ్రథమగర్భవతిన్ సతిఁ బుట్టినింటికిం
దోడుకొనివచ్చుచో నిచట దుస్సహమైన ప్రసూతివేదనం
బడియెడు నియ్యెడం దగినబాసట లేదటుగాన నీకు నే
పడఁతుక చిత్తమాపడఁతిభాగ్యము మాటలు వేయు నేటికిన్. 35

వ. అనుటయు వానిదీనాలాపంబులకు బ్రమసి పద్మావతీరమణుండు పద్మావతిం జూచి
యిట్లనియె. 36

క. జలజేక్షణ యవ్వారకం, గలసంసారము నుపేక్షగాఁ జంట గా
దలసత్త్వ ముడిగి చను మని, పలికిన నది చనియె గాఁగ సతి యున్నెడనన్. 37

క. చని సరసవచనరచనలఁ, జనవులఁ బరిరంభణాదిసంభావనలన్
మనసు కరఁగించి పులకలు, తనువునఁ గల్పించి రతులఁ దగిలించి తగన్. 38

సీ. త్రుళ్లుమించులు వెట్టుతొడలదీప్తులతోన చనుదోయికుంభములు నోకళింప
రాణించుమనం దెలరవళితోడనె కూడ మొలనూలిముత్యాల మ్రోఁత నిగుడఁ
గటిపటంబునఁ దోఁచుకదలు పెక్కులతోడఁ గర్ణభూషణములకదలు మెఱయఁ
గడలేనిసుఖములఁ గరఁగినమదితోడఁ జిత్రకస్తూరి లేఁజెమట గరఁగ
వదలుకొప్పుముడి యలరులవానఁ గురియ, హారవాసిదీప్తి యుయ్యాలలాడుచుండ
మగని పుంభావలీలల మఱువఁగని, కంతుసామ్రాజ్యలక్ష్మికిఁ గర్తఁ జేసె. 39

వ. ఆపుష్పకరండకుండును సంతోషితస్వాంతుండై. 40

చ. పురిఁ బురిఁ దప్పకుండ మొలపూసలు ద్రెవ్వఁగ నాఁడె నుండెడియుం
జరిగితిఁ బెక్కుభామలు సతీరతిసౌఖ్యరసప్రసంగపు
స్ఫురణలతారతమ్యములు చూచితిఁ గాని భవత్సమాన లే
తరుణులుఁ గారు భావభవతంత్రకళాకలనావిదగ్ధతన్. 41

వ. అనవుడుఁ బద్మావతి మదీయచాతుర్యంబునకు నాశ్చర్యంబంద నేల యని యిట్లనియె.

క. చేరువ ధర్మస్థల మను, నూర గుణావతి యనంగ నొకయువ్వలి చె
న్నారు మనోహర మగుశ్రీం, గారరసం బొందుచూపు నైకొన్నక్రియన్. 48

సీ. చందురునెఱవరజాలఁ జేయుట గాక నెత్తమ్మిమీఁద దండెత్తఁ జూచుఁ
బసిఁడిసలాకపైఁ బగలుచాటుట గాక తొలకరిమెఱుఁగులఁ దొడరఁ జూచుఁ

గరికుంభములమీఁదఁ గాలుద్రవ్వుట గాక జక్కవకవతోడ వక్కరించు
మగమీలతో మగమాటలాడుట గాక పువ్వుఁదూపులను బొమ్మవెట్టు
ననఁగ మోముఁ దనువుఁ జనుదోయి కనుదోయి, కనుఁగొనంగ నొప్పుఁ గాముప్రోది
దీమ మగుగుణావతీవధూమణికిని, సరి యనంగ మగువ జగతి గలదె. 44

క. వలపులవదనిక చిలుకల, కొలికి రువారంపుఁగలికిగుబ్బల నవలా
పులుఁగడిగినముత్యముసిరి, పులకిండపుఁబొమ్మ యనఁగఁ బొలఁతుక యొప్పున్. 45

చ. కలువలు గండుమీలుఁ దొలుకారు మెఱుంగులు నిడుగామికిం
జెలువుగ నేపదార్థ మెనసేయుదునో సతికన్నుదోయికిం
దలఁచి పయోజసంభవుఁడు తామరలం బ్రతిసేయఁబోలు నాఁ
బొలుపుగ నెల్లవారుఁ దమపుట్టినయిండ్లను బెద్దసేయరే. 46

క. అట్టి గుణావతి తనపతి, కట్టెదురను మాఱుమగనిఁ గవయఁగ నేర్చున్
నెట్టుకొని యాఁడువారల, దిట్టతనం బెఱుఁగ బ్రహ్మదేవునివశమే. 47

చ. అనుచుఁ దదీయనైపుణగుణాళి నిరాళిగొనంగఁ జెప్పఁ గా
విని యిటువంటి వెన్నఁడును విన్నది కన్నది లేదు మున్ను నా
లును గణుతింప నీయొఱపులో నిజమో తెలియంగఁ జెప్పుమా
యనఁగ లతాంగి నీయడుగులాన నిజం బని నమ్మఁ బల్కినన్. 48

వ. తత్ప్రతీపదర్శనీదర్శనతత్పరుండై తత్పురంబునకుం జని. 49

క. వన్నె మెఱయంగ నాసతి, యున్నగృహం బప్పు డరసి యుచితస్థితితో
విన్ననువునఁ జని యచ్చో, సొన్నాటంకంబువోలు సుదతిని గాంచెన్. 50

తే. మోపి పవడంబుఁ దమలోన ముడివడంగ, నడుము బయలును దమలోనఁ దడఁబడంగ
మేను మెఱుఁగును దమలోన మేళవింపఁ, దెఱవ యొయ్యారముగ వానిదిక్కుఁ జూచె.

తే. కందు వోగయనిపున్నమచందురుండొ, శివునికనుఁబాటు దాఁకనిచిత్తభవుఁడొ
కాక నరమాత్రుఁడే వీఁడు నాకుఁ జూడ, ననుచుఁ దలయూఁచి కొనియాడె వనజగంధి.

క. వేడుకమై నపు డిరుమైఁ, గాఁడంగఁ దొణంగె నతనిఁ గామునిశరముల్
చేడియచూపులుఁ దమలో, నూడించె ననంగ నొక్కసూటిం బెలుచన్. 53

క. మనసిజుఁ డిద్దఱకును గుం, టెనకానితనంబు చేసెడిం గనుఁగొన నాఁ
జనవులు మాటలయనువులు, దనువునఁ బులకలును గలుగఁ దత్తఱపెట్టెన్. 54

క. చెన్నారువచనరచనలు, మున్నాడం గనినవలపు మొలకల తెఱఁగుల్
మున్నాడినమనసులతో, గ్రన్నన వీడ్కొనిరి సిగ్గుఁ గన్నెఱికంబున్. 55

చ. పులకితచిత్రరూపములపోలిక నిద్దఱుఁ గొంతప్రొద్దు చూ
పులఁ బరిణామముల్ దెలిసి పుష్పకరండకురాక యంతయుం

దెలిసి గుణావతిలలన దిగ్గన మజ్జనభోజనాదిపూ
జలఁ బరితుష్టుఁ జేసి తనచల్లనిమాటల గారవించుచున్. 56

సీ. అరవిరివిరవాదివిరుదుపెండెములతో సోలుకోయిలమూకటీలతోడఁ
బూఁదేనెగండాన బ్రుంగుడుపడి యున్న గండుఁదుమ్మెదలంకగములతోడఁ
బరువంపుజాజిపక్కెరలతోఁ జెలరేఁగుచిలుకగుజ్జులపుంజాలజుసీరులతోడ
గుబగుబ వాసన గుబులుకో ముంగల నేఁగెడి చలిగాలి వేగుతోడ
హరిహరబ్రహ్మగాషమూనాపహారి, త్రిభువనధురీణహారపరీక్షకుండు
కమ్మవిలుకాఁడు మెఱయు శృంగారవనము, గోనిగురువెందపొదక్రింద వాని నునిచి.

ఉ. ఇంటికి వచ్చునంత వఱకుఁ డింటికి వచ్చిన నాథ నీవు న
న్నొంటిడి రాక యింతదడ వుండఁగ గారణమేమి యింక న
న్నంటిన నీకు నీ వెఱుఁగు దంచు మొకానొకతప్పవెట్టి వె
న్వెంట నతండు రాఁ జనియె వెండియుఁ దోయ్యలి పువ్వుఁదోఁటకున్. 58

చ. చనునెడ దాని సన్మథపిశాచము సోఁకిన మొత్తెఁరముఁ గా
యని పలుమాఱుఁ గూరడిచి యల్లనఁ బువ్వడి గప్పవెట్టి క్ర
మ్మన నధరామృతంపు బలుమందొకయించుక యిచ్చి మించు మో
హనరిచమాపులం బడిసిపో నటువైచమున గౌఁగిలించుచున్. 59

చ. కనదురుకాంతి కాంతశశికాంతశిలాతలకుట్టిమస్థలిన్
వినుతలతావనీజమున వేదికపై శ్రమమూర్చ దానునుం
దనుగుఁడుం గళాకుశలతావశతం దదుపాంతవిస్ఫుర
ద్ఘనవకుళావనీరుహశిఖాపుణినీడ సుఖానురక్తి గ్రయ్య.

వ. కొంతదడవుండి యాపొంతం గుసుమవిసరభరితం బగుచుఁ జెన్నారుచున్న సురపొన్నఁ గన్నారం గనుంగొని యిందులపువ్వులకుం గలపరిమళం బెందులపువ్వులకుఁ గలదని మునుముట్ట మాయవెట్టం గడకట్టుచేసికొని యప్పటి గదలి యాసురపొన్నక్రిందికిం జనుదెంచి యిట్లనియె. 61

సీ. సేమంతిచవికెలఁ జెలరేఁగి చిలుకలు మదనశాస్త్రింబులు చదువుచుండఁ
గడిమికూటములఁ బికముఖ్యులనంగనైపాళప్రబంధంబు లాలపింప
జాజిమోవరులలోఁ జంచరీకంబులు వలరాజువిరుదాంకములు పఠింప
సంపెంగనాటకశాలలఁ గలహంసలతనుగీతంబుల నాడుచుండ
వేడుకలతోడఁ జూడంగ వినఁగఁగంటి, మిట్టివనములు గలవె యేపట్టణముల
ననుచు మగనిమనంబును వలరఁజేయు, కరణి నుపకాంతు మాటల గారవించె. 62

తే. గురులకప్పన నెలదేఁటియిరులు బెరసి, సరులుగొలుపంగ ముద్దుచేతియుగులు దగిలి

కన్నుఁ గానక మాఱుమొగంబు సాఁగఁడు, బలుపుంజీఁకటి దప్పంగఁ బడి విసువఁగ. 63

సీ. తరుణి యశోకంబు తన్ను నందెలమ్రోఁతఁ గాంచి విరావంబు గడఁ కొదుంగ
లలితాంగి తిలకించి తిలకంబుఁ గనుఁగొనుఁ గనుదోయి మెఱుఁగు లాకసము గప్పఁ
బొలఁతి పుక్కిటికల్లు పొగడపై నుమియు లేఁజెక్కుల చిఱునవ్వు చెక్కులొత్తఁ
గలకంఠి యల్లఁ గ్రోవిఁ గౌఁగిటిలోఁ జేర్చు గంకణఝణఝణత్కారము లిరియఁ
దియ్యవిలుకాని విడిపట్టుదీము సాఁగఁ, గలను మోహనమంత్రదేవత యనంగ
మగని ముందట విరహాగ్నిఁ బొగులు మాఱు, మగని ముందటఁ బ్రోదొర్తు సదముకళిని.

వ. ఇవ్విధంబునఁ బువ్వవిలుకానినవ్వ్రొవ్వ గలయాలజవ్వని మగని ముందట ముద్దుగురి
యుచు సరసంపుసరసవచనల మానంబుకొల్లఁది యాసి గమకంపుపలపుసాలపుల్రిక్కి
రిసి పునఃపునరాలింగనంబులు చేసి యాతనితో నిట్లనియె. 65

ఉ. ఈసురపొన్న యెక్కి నతికెక్కినకమ్మనిపువ్వు లెల్ల నేఁ
గోసెదఁ జూచుచుమీ యనుచుఁ గోమలి యాతరువెక్కి యొక్కపూఁ
గోసి నుతించి మ్రాన్కుమఁ గుత్సితబుద్ధి నిజేశుఁ జూచి నే
నా సిటు లేవఁ జూడఁ బెఱభామినితోఁ గమియింపఁ బాడియే. 66

తే. అనుచు వలవనివలవనికినుక తోడ, మ్రానుడిగ్గినఁ దొయ్యలి మ్రానుపడుచు
సొలయఁగా నేల యిచ్చోట నోటి యాన్న, కాంతఁ జూపుమ వలదింత కటికితనము.

క. అనుచును వెలవెలఁబాఱెను, తనపతి మది మెచ్చ నీవు తరువెక్కి ననుం
గనుఁగొను మే వేఱొకపురుషునిఁ బొందినచంద మగునొ చూత మటంచున్. 68

చ. జిగి దొలఁకాడులేనగవు చిమ్మెడుచూపులు మీఁదఁ జల్లుచున్
మగినలవంటిచన్నుఁగవ జక్కవపిట్టల బైలు వెట్టుచో
నిగిడెడుపేర్మి మీఁద దెఱుఁగ నేక తా సురపొన్న యెక్కెన
మ్మగఁడిల నాఁడు వారిబలుమాయలఁ గాయజుఁ డైనఁ జిక్కఁడే. 69

వ. ఇవ్విధంబునఁ బువ్వుంబోఁడి పిఱుతివ్వనినవ్వూటాలమాటల వాని మ్రానెక్కించి
యొక్కపువ్వుఁగోసి మ్రాన్కునుసమయంబున నతండు చూచుచుండఁ గుసుమరస
విసరలసదహంకారఝంకారలలితశిలీముఖజ్యాటంకారసముద్దండప్రసవకోదండనిర్ము
క్తపుష్పశిలీముఖముఖానలశిఖాసంతప్తమానసుం డగుపుష్పకరండకుం గనుసన్న నాస
న్నుం జేసి తనయధరామృతంబున సేదదేర్చి పరమానందకందళితహృదయుం జేసి
కందర్పక్రీడం దనిపి విస్మయానందకందళితస్వాంతుం డగునతని కిట్లనియె.

క. నను మెచ్చెద విది యచ్చెరు, వన నేఁటికి నాసుధర్మ యనునగరమునన్
జనమోహిని లీలావతి, యనుకామిని యుండు ననుజ యగు మఱి నాకున్. 71

తే. కమ్మనిపదారువన్నె బంగారుకరువు, కామవిద్యారహస్యముల్ గఱపగురువు

సరసజనములు భ్రమయుడి తిరుగుతెరువు, మెఱయులీలావతీకాంత మేనిమెఱుపు. 72

ఆ. ఆలతాంగి చూపు లల్లార్చి చూచిన, నతనుమహిమచేత యతులకైన
తెమలి యనుపకర్పదము లూడిపడు నన్న, నున్నవారి నింక నెన్న నేల. 73

ఆ. అమృతరసము తేట లంగనమాటలు, మరుని చేతియమ్ము లుంగువమరులు
కప్పురంపుఁగ్రోవి కలకంఠికెమ్మోవి, యాలతాంగిఁ బొగడ నలవి యగునె. 74

వ. అలీలావతి మనంబునం దాను నేకశయ్య నుండి యుపనాయకునిం గుసుమసాయక
క్రీడ నలరించు నని వాలలననలనిచోద్యంబులు చూడవలతేనిం జనుమని వీడుకొలిపె.

క. తనవిభుని నగవుఁజూపులఁ, గనుఁగొని నామాట నిజమొ కల్లయొ చెపుమా
యనిన నది యట్లు తప్పద, యొనరఁగ నీమాయతెరువుదో పువ్వుఁబోఁడో. 76

క. అనుచు వెడనగవుతోడను, మనమునఁ గడుఁ జోద్య మంది మాద్రియు దిగి నిజాం
గనయును దానును వీటికిఁ, జనియె విలాసినుల నమ్మఁజన దెవ్వరికిన్. 77

క. అటఁ బుష్పకరండకుఁ డె, క్కటి యరిగె గుణావతీనఖాంలిఖితలతా
స్ఫుటకటకకంధరాతల, నిటలతటవిలాసుఁ డగుచు నెయ్యం బలరన్. 78

వ. ఇట్లు చనుచుఁ దదంగనానంగసంగరసంగతనఖాసిపథాలంకృతం బగునిజాంగంబుఁ
గనుంగొనుచుఁ దనమనంబున. 79

మ. చిగురాకున్న నఁగెంపులేఁదొడవు లిచ్చెం జిత్తజాంగడి చ్చెఁబో
నగు నీలాగుబుజాంబు వీరలక యెన్నం డశ్బె నమ్మా యనం
దగుఁబో వీరికి నాదు సంగమము హా నాపాలిభాగ్యం బనన్
ముగురం గూర్చినముఁడదైవమునకున్ మ్రొక్కెంచు జేజేయనున్. 80

వ. అని యంతస్స్మితసంస్మితవదనుం డగుచు సుధర్మానగరంబునందుం జని లీలావతీమంది
రంబు ప్రవేశించుటయు. 81

సీ. దారపారలుగాఁగఁ దాఁకినములుపచ్చికసపుసవలరావమసలతోడ
నక్కడక్కడ మేన నడ్డపాటులుగాఁగ నైచినగందంపుకలపుతోడఁ
దొలకరించి నటించు మొలకసిగ్గులచేత సుడివడి కడకొత్తుచూపుతోడ
నూరక మంటప్తై యుక్కిఁబవిశ్వాసలపుఖి నెయ్యము నూరుపులతోడ
నెలమిఁ దననారి తనదుకట్టెదుర నిలువ, బడినవిటచక్రవర్తి సౌభాగ్యమూర్తి
రసికజనముఖ్యుఁ బుష్పకరండకాఖ్యుఁ, డెలవకను అప్పవెట్టక మఱిసి చూచె. 82

క. చూచిన వాఁడుఁ దనూదరిఁ, జూచెం బుఁలకించి చూపుఁ జూపును దమలోఁ
దోఁపికొని రాకఁ గ్రీడా, క్రీనతురత మెఱయ సాముచేసె స్మరుమన్. 83

ఉ. ఇందునికందు వేర్పఱిచి యిందునిచే సతిమోము చేసి యా
కందును గుంతలంబులుగఁ గంజభవుం డొనరించెఁ గానిచాఁ

డెందము మోమునుం గురులు నిట్టివి గంటిమె యీతలోదరిం
బొందనియట్టివానిమగపుట్టువు బుట్టువుగాఁ దలంతురే. 84

వ. అనుచు మనోహరాలోల హేలాలలితపాంచాలుం డగునప్పుష్పకరండకుండు లీలావతీ విలాసినీవిలోకనవాగురం దగిలి యల్లల్లనఁ గదియం జనుటయు. 85

మ. వరసౌభాగ్యవిలాసమూర్తి యితఁ డెవ్వండొకో యీరూప మె
వ్వరియందుం గనుఁగొంటిమే యితనిలావణ్యంబుఁ గన్నారఁ గ
న్నరమానందనుఁడైన జిష్ణువడఁటే నాపాలిభాగ్యంబు దా
నరుదేఁ బోలుఁ దలంప నీతఁ డనియుం హర్షించె నక్కాంతయున్.* 86

క. అంతట నిద్దఱు మనసులఁ, గంతునిపను గలసె వింతకనుసన్నలయుక్
మంతనములు పెదవుల నిసి, జింతిలువాఱంగ నగవు లెప్పలు గోరన్. 87

వ. తదనంతరం బాపుష్పకరండకుండు. 88

క. తా వచ్చినకార్యమును గ, ళావతి ఘటియించినట్టినైపుణమును లీ
లావతికిఁ జెప్ప నదియును, భావంబున సంతసంబు బైసుకకొట్టన్. 89

ఉ. ఆసమయంబునం దపనుఁ డస్తగిరీంద్రమునందుఁ బొందె లీ
లాసరసానుకూలగతులం దగ వానికి నాఁడురూప మె
చ్చైచ్చ నొసంగ గారుచుండ వాణిహారవిభూషణరాజిచేతఁ గై
సేసిన నొప్పెఁ గృష్ణిపుఁ జేడియ గ్రుమ్ముకుందుఁడో యనన్. 90

ఉ. అప్పుడు నాథుఁ డింటికి రయంబున వచ్చిన మ్రొక్కి పెంచినం
దప్పక చూచి చీఁకటికతంబున నాఁటకె గాఁ దలంచి యీ
యొప్పులకుప్ప యెవ్వ రని యువ్విళులూరుచు వేడఁ జొచ్చినం
జెప్పఁ దొడంగెఁ దొయ్యలి వశీకృతదుశ్చరితప్రవీణయై. 91

క. ఈయంగన పద్మావతి, మాయక్క ననుం దలంచి మనసూఱటగా
నీయెడకు వచ్చె ననుచును, మాయోపాయంబు గాఁగ మగనికిఁ జెప్పెన్. 92

ఉ. నావుడు సంతసిల్లి వదినం దగులాగుల బుజ్జగించి లీ
లావతితోఁ దలంపనితలంపిట వచ్చిన దీనితాఁకి ప
ద్మావతి దీనికిం దగినమజ్జనభోజనవస్త్రగంధమా
ల్యావలులందుఁ బొందుగఁ బ్రియంబు దలిర్పఁగఁ జేయు మిత్తఱిన్. 93

వ. అని ప్రియానులాపంబులం గలుపుకొని సరసవచనరచనలం బ్రొద్దు పుచ్చుచుం బ్రొద్దు
వోయినపిదప! నమ్మద్దిగుఱి లిద్దఱుం దానును బొత్తుగం గుడిచి పలుకడిగినపసిండిగలంబిం

---

* న్న రమానందనుఁడైన సిగ్గువడఁడే నాపాలిభాగ్యంబుగా
నరుదేఁ బోలుఁ దలంప నీతఁ డనుచున్ హర్షించె నక్కాంతయున్

బరిమళమిళితోదకంబులం జేతులు గడిగికొని వార్చి మడుంగులం దడియొత్తులం
గరంబులు దుడిచికొని కర్పూరతాంబూలంబులు గైకొని సస్మితముఖారవిందులగుచు
దమచిత్తానురంజనసముంజసమంజులాలాపోద్వృత్తవివిధక్రీడారసాయత్తప్రమత్తా
కులచిత్తులై రతిరతీలీలావతి మెత్తనంబు లిగురొత్తు నెత్తమ్మికేళసలేటిపయిం
బఱచిన మెఱుంగుపట్టుపసలు గిలుకొనినహంసతూలికాతల్పంబు మీఁదికిం జని. 94

క. మగఁడును మాఱుమగండును, దగ నిరుదెసఁ బవ్వళింపఁ దా నడుమై యొ
ప్పుగ శయనించె ముదంబున, బిగిచన్నులనడిమిమణులపేరుం బోలెన్. 95

సీ. అంచిచాపుల నఘరాజ్ఞ్యభ మాని తా హృదయేశు చిత్తంబుపద నెఱింగి
చిడిముడిపడి మేను చెమరించె నటుముట్టఁ బొమ్మరి యుపనాథు బుజ్జగించి
కర్ణాభరణహల్లకము వోవ మీఁడెడు తెఱఁగున గొబ్బున దీప మార్చి
యెఱుఁగనియదివోలె నింక నూరకయుమును ఁకటిరాఁ దగఁ జెలఁగి చెలఁగి
లీలఁ జేసన్న బరణి బాగాలు గిలికి, యిద్దఱకుఁ జెట్టి చుట్టి యాకిచ్చి యిచ్చి
మగనిదిక్కు మొగంబుగా మాతనంబు, మాటగా నిట్టు లనియె సమ్మోదయుదోటి. 96

తే. ఇంపు లొదవఁగ నేను నాయింతి గూడి, యాలిపుంగనాట లాడుదు మాదికాల
మిప్పుడిది మాకుఁ గాక నీవెఱుఁగనట్లు, కన్నవాఁడిసవిధముఁగఁ గదలకుండు. 97

వ. అనుచు నాథద్రేభగమన మున్నవెట్టి కపటనిద్రాముద్రితుం జేసి సముద్రాతిశయా
రతితంత్రస్వతంత్ర మర్మకర్మనదీపత్యుపరతులఁ బుష్పకొండవునిఁ బుష్పకోదండక్రీడం
దేల్చిన నతండు లీలావతీవిలాసినీసహానాచాతురీసుకరామ్యంబునకు వెఱఁగుపడియు
నంత నరుణోదయప్రకటసన్కుటకంటకోత్తసర్గళన్నిదర్గళాత్యంతభయంకరారవంబు
వీతెంచిన నుదవపడి లీలావతీకాంత నిజకాంతునికిఁ దెలిపి పద్మావతీప్రియాగం
బెఱింగించి యతనిచేత ననిపించి తాను గొంతదవ్వఁరిగి పునఃపునరాలింగనంబు చేసి
మఱవకుండు మని పద్మావతీనామాభిరామపరిహాసవిహారుం డగునప్పుష్పకరండకునిం
దగులాగున వీడుకొలిపి శయ్యాగారం జని యాశ్చర్యకరుం డైనమగనిమనసు తదవసరో
చితక్రియలం బడసె నని పత్రితాపాయ్యం డైనచక్రియామ్యునకు సువర్ణకుంభంబు వినో
దాకథావిధానంబు పరిపూర్ణంబుగా నెఱింగించి యిట్లనియె. 98

క. ఏ విన్నపంబు చేసిన, యీ వెఁడమలలోన జాణ యవ్వతె యనుచుం
దా వేడుక నడిగినఁ బ, ద్మావతి యని పలికె నతఁడు మందస్మితుఁడై. 99

వ. పలికినం గోపించి. 100

సీ. చెక్కులందు నివాళిసేయుఁ దేసగఘలు తాటంకరుచి కొల్లకోటు సేయ
జిగి ధగద్ధగ యనుబిగువుఁజన్నులమీఁదఁ గ్రొమ్ముత్యముసరులు త్రొక్కిత్రొక్కులాడ
నంటినఁ గందునో యనుమేనిమెఱుఁగాంతి యిరుగెలంకులను నుస్సురను దాఁటఁ

దొంగలిదెప్పలఁ దూఱుదుం గెనలాడు సోలుఁజూపులు మరు మేలుకొల్పఁ
బట్టుగవుసెఁ దీసి సభావభవుని, పసిఁడివిలుకమ్మిగాఁ నాఁగ ముసుఁగు దిగిచి
పఱపుమీఁదను గూర్చుండఁబడి కళాక, తీఁగబోఁడిణి యారాజుదిక్కు సూచి. 101

క. మీమాట కాదనఁగ రా, దేమీ తప్పంగఁ జెప్ప టిది తగ వగునే
భూమిప లీలావతి యను, భామినియు విదగ్ధ గాక పద్మావతియే. 102

వ. అని పలికి నిజప్రభావవిశేషంబున నతని విభ్రమాదిత్యుఁగా నెఱింగి కళావతీముగ్ధ
కళావిదగ్ధయై వికసితస్నిగ్ధాంచితనయనారవిందంబుల నవ్విభుని గనుంగొని. 103

ఉ. చాటున కెక్కినట్టి నెఱజాణతనంబున వాగ్విలాసతన్
మేటివి నీవు నిన్ను నుపమింపఁ ద్రిలోకములందు రాజు లె
వ్వాటను లేరు నామనసుపాఁ తగలించి వెలార్చినట్టియా
మాటలు మూఁడు నంపవగ మానవనాయక నీకుఁ దక్కితిన్. 104

చ. నను వరియింపు కీర్తిలలనాకలనాలలితప్రతాప యా
చనభిజనానురూప జలజాతముఖీసరసానులాప నూ
తనవరపుష్పచాప కవితావ్రదుగానకళాకలాప శో
భనకరరూప సర్వనరపాలకులోచితవర్తనంబునన్. 105

క. అని రాజుచిత్తమునఁ గృప, తనరంగా మాటలాడి తమ కిద్దఱకున్
మనసిజుఁడు పెండ్లిపెద్దగఁ, జనవున వరియించి కేళిశయ్యకుఁ దార్చెన్. 106

ఆ. తార్చి వచనరచనఁ దేర్చి చిత్తము గోసఁ, బుడినవహ్నియార్చి ముద మొనర్చి
యసమరతుల నోలలార్చి కౌఁగిటఁ జేర్చి, మనసుకోర్కి దీర్చి మదిఁ దనర్చి. 107

క. మానిని కరపాశంబుల, చే నీగతిఁ గట్టివైచి జగి దొంగఁ దడ పూఁ
బానుపునఁ బెట్ట వలదా, మానధనం బపహరింప మాగినదొంగన్. 108

క. ప్రియ యగుకళావతి యిటు, కూడి మెలఁగె రాజుమనసుకోలఁడి వె విభుఁడుం
జేడియఁ గూడి చరించెను, నీడయు రూపంబుఁబోలె నెయ్యం బలరన్. 109

వ. అంత నొక్కనాఁడు. 110

సీ. మణిపంజరాంతరమంజుకీరశ్రేణి యాత్మీయవిజయంబు లభినుతింప
సరసవిలాసినీచామరానిలమున నలినీలకుంతలంబులు నటింపఁ
బ్రతిపన్నకామినీప్రౌఢగానక్రియారచనలు కర్ణపారణ మొనర్ప
రత్నసింహాసనస్యూత్నప్రభారాజి తనతనుద్యుతులచే నినుమడింప
నంతిపురిమున మండపాభ్యంతరమున, నంగనలు గొల్వఁ గొలువుండి యానరేంద్ర
సింహుఁ డుజ్జయినీపురశ్రీఁ దలఁచి, యింపుమీఱఁ గళావతి కిట్టు లనియె. 111

సీ. కాంచనపేటికాకర్పూరవీటికాంచితవధూటికావిలసనంబు

నీలశైలస్థూలనిబిడమహాభీలశుండాలఘీంకారశోభితంబు
సలలితాంగకురంగజవతురంగతరంగమంగళహేషాసమంచితంబు
మన్మథసుకుమారమహితశుభాకారకలితరాజకుమారకలకలంబు
వేదశాస్త్రాదివిద్యాప్రవీణవిప్ర, జనమనోహరచిరనిజస్థానకంబు
ఘనతరైశ్వర్యవిజితాలకాపురంబు, నిఖిలఫలసాల ముజ్జయినీపురంబు. 112

ఉ. ఆపుటభేదనంబు సముదాత్తమునఃపుటభేదనక్రియా
లాఘపటుప్రతాపరణలంపటసద్భటకోటీరప్రభ
దీపశిఖాగళత్తిమిరదీప్తి దినానిశ మస్మదీయబా
హాసరక్షావృతంబు మన మక్కడ జేఁగుట యొప్పు నిస్తుటిన్. 113

వ. అనిన విని దరహసితవదనయై కళావతి నిజకళాకౌశలంబు మెఱయఁగరంబు ప్రియం
బున నతనికరంబు కరంబునం గీలించి హృద్యాఖనద్యమందిరోద్యానసముద్యత్తారకాసా
రకనత్కనకమరీచిసముజ్జ్వలత్సారసనాళంబుఁ బ్రవేశించి యుజ్జ్వలోజ్జయినీపురవర
సరసలీలాకుతుకానుకూలకూలావనిమహాకుసుమవిసర సముళ్ళపరాగానురాగ సుఖప
రాయణశిలీముఖపక్షవిక్షేపణోద్ధూతమందమారుతసంచరణాసమంచితసరోజవిరాజితరా
జమార్గంబున నిర్గమించె నంత సైన్యసమేతుండైనభట్టి వనుదెంచి సాష్టాంగసంగతో
ర్వీతలం బగుదండప్రణామం బాచరించిన సాహసాంకమహీపాలుండు పులకకలికా
కంటకితసకలాంగుండును హర్షబాష్పతరంగితనయనాద్వయాంగుండును నై పునఃపున
రాలింగనంబు చేసి యతనితో నిట్లనియె. 114

క. ఎట్టిదొకో సంసారము, నెట్టన నిముసంబుఁ బాయనేరనిమనలం
గట్టిఁడివిధి మాపోపక, కట్టీ యన్నాళ్లు నిన్నుఁ బాయఁగఁ జేసెన్. 115

క. నావుడు సుమతితనూజుఁడు, ప్రాభవ్యము మెఱయ మనుజపతి కిట్లనియెన్
దేవర యుం డరిగిన నా, భావంబునఁ బాయకుంటఁ బాయుట గలదే. 116

వ. అని యిట్లు సల్లాపంబు లొనరించి యనంతరంబ. 117

సీ. ప్రకటదానోన్నిద్రభద్రేభములు గొల్వ నానామణిస్యందనములు గొల్వ
జవసత్త్వసుమహత్త్వచటులాశ్వములు గొల్వ బలసముద్భటవీరభటులు గొల్వ
ధర్మవిధానప్రధానోత్తములు గొల్వ సామంతమండలేశ్వరులు గొల్వ
వరవిలసనచారువారాంగనలు గొల్వ గాయకనాయకోత్కరము గొల్వ
నాత్మతరుణీసమేతుఁడై యరద మెక్కి, శ్రీమదుజ్జయినీసతీశ్రేణి పాణి
తామరసముక్తముక్తాక్షతప్రసక్త, నవ్యమణిమస్తకుండునై నగరు చొచ్చి. 118

క. తనుఁ గొల్చి వచ్చువారల, ననురాగరసార్ద్రహృదయుఁడై గృహమునకుం
జనుఁ డని సతియును దానును, జననాయకుఁ డంతిపురికిఁ జనుసమయమునన్. 119

ఉ. నైజకటాక్షరోచులఁ గనత్కరఘూలపరీచులం గుచ
భ్రాజితకాంతివీచులను బైకొని దీపశిఖాళిఁ బ్రోవఁగా
రాజితకంకణధ్వనుల రాగ మెలర్పఁగ నేర్పుతోడ నీ
రాజన మాచరించిరి పురంధ్రులు దంపతు లిర్వు మెచ్చఁగన్. 120

ఉ. శ్రీయువతీధరాసతులఁ జెంది విహార మొనర్చునాదినా
రాయణురీతిఁ బ్రీతి వెలయంగ ననంగవతీకళావతీ
తోయజపత్త్రలోచనలతోడ నిరంతరసౌఖ్యవైభవుం
డై యఖిలప్రజావనపరాయణతన్ నుతికెక్కె నెంతయున్. 121

ఉ. పాడి సమస్తముం బొగడఁ బాయక యాశ్రమవర్ణధర్మముల్
జాడలు దప్పకుండ మఱి సజ్జనరక్షణదుష్టశిక్షణ
క్రీడలె భూషణంబులుగఁ గీర్తి వహించె ధరిత్రి నవ్విభుం
డేడవచక్రవర్తి పదునేడవరాజును నై మహోన్నతిన్. 122

చ. అతులితసామవాదసుఖితాఖిలబాంధవసత్కవీశ్వరా
శ్రితముగ నిత్య మహామహిమఁ బేర్చి చెలంగెను సిద్ధనార్యుఁ డీ
క్షితి నతిదానవైభవదశేషవిశేషకళాగమప్రభా
సితహితమంత్రిసామ్రగణశిష్టయథోచితదండనైపుణిన్. 123

క. భూరమణామంత్రిభాండాగారసుహృద్దుర్గరాష్ట్రసైన్యబలవిభవో
దార మదమత్సరాదివికారవిదూరప్రకార కవితాకారా. 124

మంగళమహాశ్రీవృత్తము.

శ్రీమదుభయాన్వయవిశిష్టతరకీర్తి బుధశేఖరవిరాజితవివేకా
కామితఫలప్రకరకల్పితవితీర్ణిజితకల్పకసమాజసురరత్నా
స్వామిహితకార్యగతిసంఘటననైపుణవిచారనయమార్గమహనీయా
సామజహయాదిబహుసంపదభిరామగృహసన్నిహితమంగళమహాశ్రీ.

గద్యము. ఇది శ్రీమదఖిలకవిమిత్త్ర పెద్దయ యన్నయామాత్యపుత్త్ర
శారదాదయావిధేయ జక్కయనామధేయప్రణీతం బైన
విక్రమార్కచరిత్రం బనుమహాకావ్యంబునందు
సర్వంబును సప్తమాశ్వాసము.

సంస్కృతగ్రంథములు.

	ప్రతి 1-కి రూ.	అ.
భారతము, నచ్ఛద్వ్యాఖ్యానసహితము	18	0
బాలరామాయణము, సటీక	0	2
అధ్యాత్మరామాయణము ఆంధ్రటీకాతాత్పర్యసహితము	8	0
డిటో మూలము, చిన్నసైజు	0	12
సుందరకాండము, మూలము, చిన్నసైజు	0	12
డిటో ఆంధ్రతాత్పర్యసహితము	1	0
శ్రీమద్రామాయణము, మూలము, చక్కనికూర్పు	1	12
డిటో దళసరికాగితముప్రతి	4	0
మాఘపురాణము సాంధ్రతాత్పర్యము	1	8
పితృతర్పణము, చిన్నసైజు	0	1
యజుర్వేదసంధ్యావందనము, పురుషసూక్తము, శ్రీసూక్తము, ఆంధ్రటీకా తాత్పర్యసహితము, చిన్నసైజుమంచికాగితములు	0	4
మహాన్యాసము, చిన్నసైజు, ఖద్దప్రతి	0	5
రుద్రము, పురుషసూక్తము వగైరాలు, చిన్నసైజు	0	2
పంచోపనిషత్తులు, తైత్తిరీయము, చిన్నసైజు	0	4
ఆపస్తంబగృహ్యసూత్రములు	0	2
ఋగ్వేదసంధ్యావందనము, సటీక	0	2
వ్రతరత్నాకరము, ప్రథమభాగము-వ్రతసంకల్పము మొదలు పూజముగియువఱకు చేయవలసిన విధులుతెల్పి, ప్రాణప్రతిష్ఠ కలశపూజ గణాధిపతిపూజషోడశోపచార శ్లోకములు మొదలగు వానికి తాత్పర్యముగలదు. వినాయక, వరలక్ష్మీ, సరస్వతీ, అనంత, కేదారేశ్వర, గరుడపంచమీవ్రతములు యిందుగలవు	0	6
వ్రతరత్నాకరము, ద్వితీయభాగము-ఋషిపంచమీ, మధనద్వాదశీ, అమావాస్యా సోమవతీ, కృష్ణాష్టమీ, శ్రీరామనవమీ, అముక్తాభరణసప్తమీ, భత్రేశ్వర, శతవర్తి, లక్షవర్తి, త్రిరాత్రి, చిత్రగుప్త, క్షీరాబ్ధిశయన, సావిత్రీగౌరీ, సంపద్గౌరీ, సత్య		

పారాయణ, రథసప్తమీ, సంకటచతుర్థి, ఏకాదశీగురువారము నృసింహజయంతీ వ్రతములు యిందుగలవు	0	14
వ్రతచూడామణి, 360 వ్రతములు, చక్కనికూర్పు	1	4
మంత్రపుష్పము సటీక	0	1
సూర్యనమస్కారము, చిన్నసైజు	0	1
బ్రహ్మయజ్ఞము	0	1
సంధ్యావందనభాష్యము, చక్కనిప్రతి	0	6
మంత్రప్రశ్నములు, మూలము	0	8
దేవతార్చన, చిన్నసైజు	0	1
కాలామృతము,సటీక,చక్కనికూర్పు	0	12
మహూర్తదర్పణము, సటీక, చక్కనికూర్పు	0	8
జాతకచంద్రిక, గోపాలరత్నాకరము, సాంధ్రతాత్పర్యము ...	0	8
హరిమీడేస్తోత్రము, సటీక	0	3
ఆత్మబోధము ,, ...	0	4
సౌందర్యలహరి ,, ...	0	3
ఉత్తరగీతా, సటీక, చిన్నసైజు, మంచికాగితములు	0	6
భగవద్గీతలు, ఆంధ్రటీకాతాత్పర్యసహితము, పట్టుబైండు	1	8
భగవద్గీతలు, ఆంధ్రతాత్పర్యసహితము, చక్కనికూర్పు	1	0
భగవద్గీతలు, ఆంధ్రతాత్పర్యసహితము, చిన్నసైజు	0	6
రఘువంశము 6 సర్గలు, పదచ్ఛేదము, అర్థము, ఆకాంక్షాశబ్దసమాస తాత్పర్య వ్యాఖ్యానసహితము, సాధారణప్రతి	3	8
రఘువంశము 10 సర్గలు సవ్యాఖ్యానము, శుద్ధప్రతి	0	8
మేఘసందేశము, సవ్యాఖ్యానము	0	4
పుష్పబాణవిలాసము, సవ్యాఖ్యానము	0	2
రామకర్ణామృతము, ఆంధ్రపద్యతాత్పర్య సహితము	1	4
కుమారసంభవము, సవ్యాఖ్యానము, చక్కనికూర్పు	0	10
మాఘకావ్యము, సవ్యాఖ్యానము, 6 సర్గలు	0	10
భర్తృహరిసుభాషితము. ఆంధ్రపద్య తాత్పర్యసహితము, మేలుకాగితములు, అట్టబైండు	0	12
శబ్దమంజరి, చక్కనికూర్పు, శుద్ధప్రతి	0	2

	ప్రతి 1_కి	రూ.	అ.
కృష్ణకర్ణామృతము, ఆంధ్రపద్యటీకాతాత్పర్యసహితము	...	1	4
సప్తర్షి స్తోత్రము సటీక, చిన్నసైజు	...	0	1
దేవీమానసికపూజ ,,	...	0	1
దేవీఖడ్గమాల ,,	...	0	1
ఇంద్రాక్షీశివకవచము ,,	...	0	1
మృత్యుంజయమానసపూజ ,,	...	0	1
రామబ్రహ్మమానసపూజ ,,	...	0	1
నవగ్రహస్తోత్రము ,,	...	0	4
పరమేశ్వరస్తోత్రకదంబము, శుద్ధప్రతి, చిన్నసైజు	...	0	6
దేవీస్తోత్రకదంబము, చిన్నసైజు	...	0	4
భగవద్గీతలు, చిన్నసైజు, అనిబిసెంటుగారి ఇంగ్లీషుతర్జుమాతో	...	0	4
విష్ణుసహస్రనామము, నామావళీసహితము	...	0	6
లలితాసహస్రనామము, వగ్గైరాలు	...	0	8
దేవీసప్తశతి	...	0	5
నీతిశాస్త్రము, ఆంధ్రతాత్పర్యసహితము	...	0	2
ప్రాతఃస్మరణ ,,	...	0	2
రామసహస్రనామము, నామావళీసహా, చిన్నసైజు	...	0	4
లక్ష్మీ ,, ,, ,,	...	0	3
శివ ,, ,, ,,	...	0	3
ఆంజనేయ ,, ,, ,,	...	0	3
సుబ్రహ్మణ్య ,, ,, ,,	...	0	3
అన్నపూర్ణ ,, ,, ,,	...	0	3
అమరము, మూలము, 3 కాండలు	...	0	6
అమరము, సటీక, చక్కనికూర్పు	...	0	14
నానార్థరత్నమాల శుద్ధప్రతి	...	0	12
గురుబాలప్రబోధిక, చిన్నసైజున రామాశ్రమీయాద్యనేకగ్రంథముల సహాయముతో సరిచూచి అకారాది అనుక్రమణికతో చక్కగా ముద్రించి కాలికోబైండు చేసినాము	...	2	8

		ప్రతి 1-కి రూ.	అ.
ఉత్తరరామాయణము, కంకంటి పాపరాజప్రణీతము, చక్కనికూర్పు	...	1	0
డిటో మేలుప్రతి, కాలికోబైండు	...	1	8
భాస్కరరామాయణము, చక్కనికూర్పు	...	2	8
రంగనాథరామాయణము, ద్విపద, చక్కనికూర్పు	...	2	8
మొల్లరామాయణము, చిన్నసైజున పెద్దక్షరములతో చక్కగా ముద్రితము	...	0	8
అచ్చతెనుగురామాయణము, శుద్ధప్రతి	...	1	4
ఆంధ్రభాగవతము, పోతనామాత్యప్రణీతము, ఈవఱకు ముద్రితమైన ప్రతులకన్న అన్నివిధముల బాగనున్నది.	...	3	0
డిటో మేలుప్రతి, చక్కనిబైండు	...	4	0
డిటో మేలుప్రతి, 2 వాల్యుములు	...	4	12
డిటో అత్యుత్తమప్రతి, 2 వాల్యుములు	...	5	8
వసుచరిత్ర, సవ్యాఖ్యానము, దళసరికాకితములు, చక్కనికూర్పు	...	2	8
మనుచరిత్ర, సటీక, చిన్నసైజు	...	1	8
ఆముక్తమాల్యద, సటీక, అట్టబైండు	...	2	8
ప్రభావతీప్రద్యుమ్నము	...	0	8
కళాపూర్ణోదయము, దళసరికాకితములు	...	1	8
రాఘవపాండవీయము, సటీక, చక్కనికూర్పు	...	1	8
శృంగారనైషధము	...	0	10
నరసభూపాలీయము, అట్టబైండు	...	0	8
విజయవిలాసము, క్రొత్తకూర్పు	...	0	4
రంగారాయచరిత్ర, దిట్టకవి, నారాయకవిప్రణీతము	...	0	8
ఉత్తరహరివంశము, నాచన. సోమనాథకృతము	...	1	4
రామాభ్యుదయము, అయ్యలరాజు రామభద్రకవి	...	1	4
నీలాసుందరీపరిణయము, తిమ్మకవి	...	0	4
పారిజాతాపహరణము, చిన్నసైజు, చక్కనికూర్పు	...	0	6
రసికజనమనోభిరామము	...	0	8
హరిశ్చంద్రోపాఖ్యానము, శంకరకవి ప్రణీతము	...	0	8
రుక్మిణీపరిణయము, కూచిమంచి తిమ్మకవి	...	0	6
విక్రమార్కచరిత్ర, జక్కనకవి	...	1	0
సారంగధరచరిత్ర, చిన్నసైజు, పెద్దచ్చు	...	0	8

	రూ.	అ.
ప్రతి 1-కి	రూ.	అ.
అనిరుద్ధచరిత్ర, అబ్బయామాత్య ప్రణీతము ...	0	8
రాజశేఖరవిలాసము, కూచిమంచి తిమ్మకవి ...	0	8
పంచతంత్రము, నారాయణకవి ...	0	12
అప్పకవీయము, చక్కనికూర్పు, అట్టబైండు ...	1	6
ఆంధ్రనామసంగ్రహము, ఆంధ్రనామశేషము. సాంబనిఘంటువు టీకానుక్రమణికా సహితము, కాలికో బైండు ...	0	12
సులక్షణసారము, సటీక ...	0	8
వేమనపద్యములు, చక్కనికూర్పు, 1200 పద్యములు ...	0	4
డిటో బ్రౌనుదొరగారి ఇంగ్లీషుతో ...	1	0
మాతృశతకము ...	0	1
అష్టమస్కంధము, సటీక, చిన్నసైజు ...	1	0
సుమతిశతకము, సటీక ...	0	2
కుచేలోపాఖ్యానము,, (భాగవతములోనిది) ...	0	4
డిటో ,, గద్యప్రథమస్కంధము ...	0	6
కుమారీశతకము, సటీక ...	0	2
దాశరథిశతకము ,, ...	0	4
మానసబోధశతకము ,, ...	0	2
భాస్కరశతకము ,, ...	0	3
కలువాయిశతకము, సటీక ...	0	2
కవిచౌడప్పశతకము ...	0	2
నృసింహశతకము ...	0	2
చంద్రశేఖరశతకము ...	0	1
రామలింగేశశతకము, అడిదము సూరకవి ...	0	2
కాళహస్తీశ్వరశతకము, ధూర్జటికవి ...	0	2
భోగినీదండకము, బమ్మెర. పోతరాజప్రణీతము ...	0	1
కుక్కుటేశ్వరశతకము, కూచిమంచి తిమ్మకవి ...	0	2
గజేంద్రమోక్షము, సటీక, చక్కనికూర్పు, మంచికాకితములు ...	0	6
రుక్మిణీకల్యాణము, సటీక, చక్కనిప్రతి ,, ...	0	6
ఆంధ్రవచనభాగవతము, ద్వాదశస్కంధములు, శ్రీశనసంపుటము, వేంకటరంగశాస్త్రి కృతము. ...	6	8
ఆంధ్రవచనవిష్ణుపురాణము, శ్రీనుపావుల అనంతభూపాలకృతము (అచ్చగుచున్నది)		
శ్రీశంకరాచార్యచరిత్ర, ప్రతిమతో ...	0	2
రామకృష్ణపరమహంసచరిత్ర ,, ...	0	2
బాలగంగాధరతిలకుగారి చరిత్ర ...	0	2
దాదాభాయినౌరోజీచరిత్ర, ప్రతిమతో ...	0	1

		ప్రతి 1-కి రూ.	అ.
అనిబీసెంటుచరిత్ర, ప్రతిమతో	...	0	1
శ్రీకృష్ణదేవరాయచరిత్ర ,,	...	0	2
కన్యాశుల్కము, హాస్యరసభరితమగు నాటకము	...	0	12
ఆనందమఠ, నవల	...	0	12
కపాలకుండల ,,	...	0	12
ఐవన్హో ,,	...	0	6
మాదాలస ,,	...	0	10
సుజనరంజని ,,	...	0	6
తారాభాయి, చక్కనినవల	...	0	12
టిప్పుసుల్తాన్, నూతనకవితాశైలిని శ్రీఅక్కిరాజు ఉమాకాంతముగారిచే విరచితము		1	4
సీతారామము, శ్రీతల్లాప్రగడ సూర్యనారాయణరావుగారిది	...	1	0
నీతిచంద్రిక, చిన్నయసూరిగారిది, చిన్నసైజు, పెద్దచ్చు	...	0	6
పంచతంత్రము, వచనము, సులభశైలి, పెద్దచ్చు	...	0	6
చక్కనిపూర్వకథలు, కొత్తకూర్పు	...	1	0
రామదాసచరిత్ర, చక్కనికూర్పు	...	0	8
నలచరిత్ర, సటీక, చిన్నసైజు	...	0	6
అధ్యాత్మరామాయణకీర్తనలు, చక్కనిప్రతి, చిన్నసైజు	...	0	6
బాలవ్యాకరణము	...	0	12
ఆంధ్రశబ్దచింతామణి, సటీక, శుద్ధప్రతి	...	0	6
ఆంధ్రభాషాభూషణము	...	0	2
ఆంధ్రభాషార్ణవము, చక్కనికూర్పు	...	0	12
ఆంధ్రచంద్రాలోకము, సటిప్పణము	...	0	6
శబ్దార్థచంద్రిక, శ్రీమహాకాళి. సుబ్బారాయకృత అకారాదినిఘంటువు	...	2	8
శ్రీగురుజాడ శ్రీరామమూర్తిగారి ఆంధ్రకవిజీవితములు. ఇందు పూర్వకవుల చరిత్రలే గాక నాధునికకవుల చరిత్రలుకూడ వర్ణింపబడినవి. దీనిలో దొరకు కవులచాటు పద్యములు చిత్రకథలు అపూర్వచరిత్రాంశములు మఱియొకచోట నెందునుగాన రావు. కాలికోబైండు కట్టబడ్డపూర్తిగ్రంథము	...	2	8
విచారసాగరము, శ్రీజనార్దనచైతన్యస్వామిగారిది	...	5	0

ఇవి మొదలగు సంస్కృతాంధ్ర గ్రంథములు అనేకములు మావద్దగలవు. క్యాటలాగులు చూడకోరినాము.

వావిళ్ల. రామస్వామిశాస్త్రులు అండ్ సన్స్,

192, ఎస్ప్లనేడ్, చెన్నపురి. ఈ.